

# ఇందిరా గాంధీ

ఇందర్ మల్హోత్ర

అనువాదం: డా. జె. భాగ్యలక్ష్మి

# ఇందిరా గాంధీ

జాతీయ జీవిత చరిత్ర గ్రంథమాల

# ఇందిరా గాంధి


ఇందర్ మల్హోత్ర

అనువాదం

డా. జె. భాగ్యలక్ష్మి



నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా

954.051
మల్హోత్ర-ఇంది
C. 17516

AC 90967
హైదరాబాద్-500 044

ముఖచిత్రం ఉమా వాసుదేవ్ సౌజన్యంతో

ISBN 978-81-237-5285-3

ప్రథమ ముద్రణ 2008 (*శక 1930*)

మూలం © ఇందర్ మల్హోత్ర
అనువాదం © నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

Original Indira Gandhi (English)

Indira Gandhi (*Telugu*)

**రూ. 70.00**

డైరక్టర్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
ప్లాట్ నెం 5, ఇన్స్టిట్యూషనల్ ఏరియా, ఫేస్-II,
వసంత్ కుంజ్, న్యూఢిల్లీ - 110070 ద్వారా ప్రచురించబడింది.

అమెరికాలో పుట్టి
నాలుగేండ్ల వయస్సులోనే
ఇందిరాగాంధి గురించి
నన్ను మొదటి ప్రశ్న అడిగిన
నా మనుమరాలు
**ఆయేషా కు**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | కృతజ్ఞతలు | తొమ్మిది |
| | ముందుమాట | పదకొండు |
| 1 | ప్రారంభం | 1 |
| 2 | తన తండ్రి పక్కన | 17 |
| 3 | శాస్త్రి ప్రవేశం | 32 |
| 4 | అగ్రస్థానానికి ఆరోహణ | 39 |
| 5 | ఆధిపత్యంవైపు మందగమనం | 52 |
| 6 | ఆమెకు అత్యంతశ్రేష్ఠమైన సమయం | 72 |
| 7 | కిందికి దిగజారటం | 90 |
| 8. | ఎమర్జెన్సీ సమ్మెటదెబ్బ | 107 |
| 9 | ఇందిర నిష్క్రమణ, జనతా ప్రవేశం | 131 |
| 10 | ఇందిరమ్మ మళ్ళీ రావటం | 149 |
| 11 | ఉపసంహారం | 185 |

# కృతజ్ఞతలు

ఇందిరాగాంధి జీవితానికి సంబంధించిన సంఘటనల గురించి సమాచారమిచ్చి, వాటిని వివరించి ఎన్నో ఏండ్లుగా ఎందరో నాకు సాయం చేశారు. వారందరినీ పేర్కొనటం సాధ్యం కాదు కాకపోయినా వారిలో కొందరు తమపేర్లు చెప్పవద్దన్నారు. కాని తమ విలువైన సమయాన్ని వెచ్చించి ఆమె జీవిత కథను నేను కొత్తగా మళ్ళీ వ్రాయటానికి ఎంతగానో సాయపడినవారికి నా కృతజ్ఞతలు తెలుపుకోకపోతే నా కర్తవ్యం నేను నిర్వహించలేదనిపిస్తుంది ఆమె ప్రధానమంత్రి పదవిని స్వీకరించిన రోజునుండి ఆమెకు సమాచార సలహాదారుగా (ఇన్ఫర్మేషన్ అడ్వయిజర్) ఉన్న హెచ్.వై శారదాప్రసాద్ రాత్రి, పగలు అని చూడకుండా, వాస్తవాలా కాదా అని తెల్సుకోటానికి నేను అడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబిచ్చారు. కొన్ని కీలకమైన అధ్యాయాలు కె సుబ్రహ్మణ్యం, ఆంద్రె బెటియిల్ చదివి అమూల్యమైన సలహాలిచ్చారు. చాలా ఏండ్లు ఇందిరకు విజ్ఞానవిషయాల సలహాదారు (సైంటిఫిక్ అడ్వయిజరు) గా ఉన్న అశోక్ పార్థసారధి ఇంకా ప్రజల్లోకి రాని కొన్ని కొత్త విషయాలు తెలియ జెప్పారు నేషనల్ బుక్‌ట్రస్ట్ ఛేర్మన్ ప్రొఫెసర్ బిపన్ చంద్ర, నా ఎడిటర్ శ్రీరంగ్ ఝా ఎంతగానో ప్రోత్సహించారు ఓపిగ్గా ఉన్నారు.

తొలిరోజుల్లో ఇందిరాగాంధి జీవితకథ, ఆ తర్వాత ఆమె గురించి మరి రెండు పుస్తకాలు వ్రాసిన ఉమావాసుదేవ్ కూడా నాకెంతో సాయం చేశారు నాతో వివాదాస్పదమైన విషయాలెన్నో చర్చించి తన వద్ద ఉన్న ఇందిర ఫోటోగ్రాఫులనిచ్చారు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ప్రిన్సిపల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసరు దీపక్ సంధు, బ్యూరో ఫోటో విభాగంలోని ఆమె సిబ్బంది ఎన్నో ఫోటోగ్రాఫులు అందజేశారు ఈ పుస్తకంలో వాడిన పి ఐ.బి ఫోటోల సంఖ్యే ఆ విషయం తెలియజేస్తుంది

## - కృతజ్ఞతలు -

పైన పేర్కొన్న మిత్రులందరికీ హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను పాకిస్థానుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికయిన మాజీ ప్రధానమంత్రి, ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న బేనజీర్ భుట్టోకు నేను ఎంతో ఋణపడి ఉన్నాను ఇందిరాగాంధి గురించి నేను ఇ – మెయిలు ద్వారా అడిగిన ప్రశ్నలకు ఆమె ఎంతో ఓపిగ్గా, మర్యాదగా, స్పష్టంగా జవాబులిచ్చారు భారతదేశపు "సిల్క్, స్టీల్, స్త్రీ" ని మొదట 1972 జూన్‌లో నవయువతిగా బెనజీర్ షిమ్లాలో కలిశారు అప్పటినుండి గొప్ప నాటకీయంగాను, హృదయ విదారకమైన విషాదంతోను ఉన్న ఆమె జీవనవృత్తిని గమనిస్తూ వచ్చారు

ఇందర్ మల్‌హోత్రా

# ముందుమాట

ప్రఖ్యాతి చెందిన తన తండ్రి జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఎక్కువ సంఖ్యలో ఇందిరాగాంధి గురించి పుస్తకాలు వచ్చాయి ఇంకా వస్తున్నాయి అంటే దానికి కారణాలున్నాయి ఆమె జీవితకాలంలో, పదవీకాలంలో గొప్ప నాటకం, హృదయవిదారకమైన విషాదము మిళితమయ్యాయి అవి ఆమె తండ్రి జీవితంలో కంటె, మిగిలిన వారి జీవితాలలో కంటె ఎక్కువగా ఉన్నాయి తీక్షణమైన ఈ ఎగుడు, దిగుడులు, మెలికలు, మలుపులు, సంతోషాలు, దుఃఖాలు సూచన ప్రాయంగా తెలియ జేసినా చాలు ఈ విషయం అర్ధమవుతుంది ఉదాహరణకు, మొదట ప్రధానమంత్రి కాగానే మూగబొమ్మ అనుకొన్న వ్యక్తి, 1971లో సార్వత్రిక ఎన్నికలలో గొప్ప విజయాన్ని సాధించినందుకు, ఆ సంవత్సరం చివరలో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘనవిజయాన్ని సాధించి, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి దారితీసినందుకు ఆమెను హిందూ దేవతలలో అజేయమైన దుర్గగా కొనియాడారు మరో ఐదు సంవత్సరాలలో పేరు అధఃపాతాళానికి వెళ్ళిపోయింది ఏడవ దశకం మధ్యలో ఆమె విధించిన ఎమర్జెన్సీ ఫలితంగా ప్రజలు ఆమె పట్ల క్రుద్ధులయ్యారు మార్చి 1977లో ఆమె ఏర్పాటు చేసిన ఎన్నికలలో ఆమె చిత్తుగా ఓడిపోయి పదవిని పోగొట్టుకొంది ముప్పయి మూడు నెలలలోనే మూడింట రెండు వంతుల మెజారిటీతో ఎన్నికలలో విజయం పొంది, "చరిత్రలోని చెత్త డబ్బాలో పడిపోయింద"ని అనుకొన్న వారందరినీ స్తబ్ధులను చేసింది రెండో విజయం పొందిన వెంటనే ఆమెను విషాదం అలుముకొంది ఆమెకు ప్రియమైన చిన్న కొడుకు సంజయ్ ఒక విమానాన్ని విన్యాసాలు చేయిస్తూ ప్రమాదానికి గురయి మరణించాడు ఈ క్రూరమైన దెబ్బనుండి ఆమె పూర్తిగా కోలుకోలేక

పోయింది పైకి మాత్రం నిబ్బరంగా భారతదేశ సేవలో ముందుకు సాగింది నాలుగేండ్ల తర్వాత ఆమె స్వయంగా హత్యకు గురయింది

ఆమె జీవితం పట్ల నిరంతరం పెరుగుతున్న ఆసక్తికి కారణం, ఇందిరాగాంధి తన తర్వాత కూడా దేశం మీద మిగిల్చిన ప్రభావం, ప్రపంచమంతటా కూడా ఆమె పేరుకున్న గౌరవం అని చెప్పవచ్చు. స్వాతంత్ర్య సమరంలో దేశాన్ని నడిపించి, రూపొందించిన గొప్పవారిలో, ఆ తర్వాత ఆరు దశాబ్దాలలోను భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన మహాత్మాగాంధి చాలా గొప్పవాడు అందరికంటె ఎంతో ముందున్నాడు. ఆయనకు ఎన్నో అడుగులు వెనక ఆయన రాజకీయ వారసుడు, స్వతంత్ర భారత దేశానికి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నాడు ప్రారంభ దశలో దేశం రూపు దిద్దుకొంటున్నప్పుడు నిరాటంకంగా 17 ఏండ్లు అధికారంలో ఉన్నాడు ఆయన భారతదేశాన్ని ఆధునిక దేశంగా చేశాడు సామాజిక న్యాయంతో మేళవించిన ప్రజాస్వామ్యాన్ని పాటించాడు ఇందిరకు అతను "పాపూ" ఈ ప్రఖ్యాత వ్యక్తులలో స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూతో పాటు పాల్గొని ఆ తర్వాత స్వతంత్ర భారతదేశ ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులున్నారు వీరిలో ముఖ్యంగా రాజ సంస్థానాలను ఏకం చేసి దేశ సమైక్యతకు కారణమైన సర్దార్ పటేల్‌ను చెప్పుకోవాలి తన దీర్ఘమైన పదవీ కాలంలో ఎన్ని వివాదాలు, తగాదాలు, విషమ పరిస్థితులున్నా, ఆ తర్వాత ఉన్నత స్థానం ఇందిరాగాంధీదే గడచిన శతాబ్దంలో అరవ దశకం మధ్యలో నుండి సుమారు రెండు దశాబ్దాలు, ఆమె పదవిలో ఉన్నా లేకపోయినా, దేశ రాజకీయ రంగంలో ఇందిరాగాంధీ అత్యంత ప్రముఖంగా ఉంది. ఆమెకు అన్వయించుకొని తక్కినవారు ఆనాటి వ్యవహారాలలో తామేస్థానంలో ఉన్నదీ నిర్వచించుకొన్నారు

ఈ పృష్ఠ భూమి దృష్ట్యా ఇందిర గురించి అధిక సంఖ్యలో నిరంతరం వస్తున్న పుస్తకాలు తమ కథ గురించి తామే చెప్పుకొంటాయి ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశాలలో రెండవ స్థానంలోను, ప్రజాస్వామ్యాలలో కెల్లా పెద్దది అయిన భారతదేశంలో ఆమె ప్రధానమంత్రి పదవిని స్వీకరించటం ప్రపంచానికంతటికీ ఆసక్తికరంగా, ఉత్సాహ జనితంగా ఉన్నప్పటికీ మొదట్లో ఆమె గురించి కొద్ది పుస్తకాలే వచ్చాయి కొన్ని తొందరపడి వ్రాసిన జీవిత కథలు.

మరికొన్ని వార్తాపత్రికలలో వచ్చిన వ్యాసాల సంకలనాలు "ఇందిర పుస్తకాలు" రెండు సందర్భాలలో అత్యధికంగా వచ్చాయి ఏడవ దశకం ప్రారంభంలో ఆమెను పొగుడుతూ వ్రాసిన జీవిత కథలు వెల్లువలా వచ్చాయి వాటిలో ఆమెను ప్రశంసలతో ఆకాశానికెత్తేశారు ఏ మాత్రం లోటు, తప్పులేని వ్యక్తిగా తీర్పు చెప్పారు అదే దశాబ్దంలో ఆమె పతనం తర్వాత మరో వెల్లువ వచ్చింది ఈ పుస్తకాలలో ఆమె చాలా చెడ్డదయినట్లు చిత్రించారు చిత్రమేమిటంటే ఆమెను ప్రశంసిస్తూ పుస్తకాలు వ్రాసినవారే ఆ తర్వాత నిందిస్తూ పుస్తకాలు వ్రాశారు

1980లో ఇందిరాగాంధి ప్రజల సమ్మతితో అధికారంలోకి తిరిగి వచ్చినప్పటికీ పరిస్థితిలో కొద్దిగానే మార్పు వచ్చింది ఆమె గురించి పరస్పర విరుద్ధమైన రెండు భావాలు స్థిరంగా ఉన్నాయి అవిడను దేవతగానో, రాక్షసిగానో చేశారు ఆమెను ఆరాధించారు లేదా నిందించారు తటస్థమైన అభిప్రాయమంటూ ఏదీ లేదు దీనికి కారణం స్పష్టంగానే ఉంది ప్రజా బాహుళ్యం ఆమెను క్షమించారు ఎమర్జెన్సీ గురించి ఇతర తప్పుల గురించి మరచి పోయి ఉత్సాహంగా ఆమెకు ఓటు చేశారు వదరుబోతు వర్గాలు మాత్రం ఓటు చేయలేదు కాకపోయినా, ఎన్నో ఏండ్లుగా రాజకీయ వర్గం ఆమెకు సుముఖంగానో, వ్యతిరేకంగానో విభజింపబడే ఉంది విద్యారంగంలో ఉన్నవారు, ప్రసార మాధ్యమాల్లో పనిచేస్తున్నవారు, పెద్ద కంపెనీలలో అధికార్లు, ప్రభుత్వాధికారులు, అటువంటివారే మరి కొందరు ఆమెలో ఏమాత్రం మంచిని చూడలేకపోయారు ఆమె హత్య తర్వాత కలిగిన అపారమైన సానుభూతివల్ల ఆమె వారసుడు, కొడుకు అయిన రాజీవ్ గాంధి 1984 డిసెంబరులో లోక్‌సభలో ఐదింట నాలుగు వంతుల మెజారిటీ పొందటం కూడా వారినేమాత్రం కదిలించలేదు ఇందిరాగాంధీకి అల్ప సంఖ్యాకులైన శిక్కులంటే అభిమానమున్నప్పటికీ అమృత్‌సర్‌లోని స్వర్ణమందిరం టెర్రరిస్టుల కోటగా మారినపుడు ఆ పవిత్రమైన మందిరంలోకి సైన్యాన్ని పంపినందుకు పంజాబులో జరిగిన భయంకరమైన సంఘటనలకూ ఆమెనే నిందించారు.

ఈ వాతావరణంలో ఆమె గురించి మొదటి జీవిత కథ వ్రాయాలని నిర్ణయించాను దైవత్వాన్ని, రాక్షసత్వాన్ని కలుపుతున్న ఈ వలయాన్ని ఛేదించి

ఆమె గురించి నిష్పక్షపాతంగా, మానవత్వంతో వ్రాసిన పుస్తకం "ఇందిరాగాంధి ఎ పర్సనల్ అండ్ పొలిటికల్ బయోగ్రఫీ" (హొడర్ అండ్ స్టౌటన్, 1989) ఇందులో నేనెంత సాఫల్యం పొందానన్నది ఇతరులు చెప్పాలి

పుస్తకాన్ని సమీక్షించిన భారతీయ, విదేశ సమీక్షకులు "చాలా సానుభూతితో వ్రాశాన'ని కొందరు, ఆమె వైఫల్యాలను, లోపాలను చాలా గట్టిగా విమర్శించాన"ని, ఆమె విజయాలను, గుణాలను పొగడటంలో "పిసినారితనం చూపించాన"ని విమర్శించటం నాకు తృప్తికరంగానే ఉంది ముఖ్యంగా చదువుకొన్న మధ్యతరగతి వారు కలిసి నా పుస్తకం చర్చించినపుడు ఇందిర గురించి ఒక మంచి మాటయినా అనటం అసాధ్యం కావటం నన్ను ఆశ్చర్యపరచింది ఇప్పుడు హఠాత్తుగా ఈ చిత్రమైన పరిస్థితి మారింది ఇందిర భారతదేశానికి చేసిన అపూర్వసేవ ఆమె పొరపాట్లకంటె ఎంతో ఎక్కువని ఆమె దేశస్థులు గుర్తించసాగారు ఆమె గురించి సుహృద్భావం పెరిగింది కానీ ఇప్పటికీ చెక్కు చెదరని విమర్శకులు కొందరు ఆమెను ప్రతి దానికీ విమర్శిస్తుంటారు

వారి సంఖ్య కూడా ఇప్పుడు తగ్గుతోంది ఈ మార్పుకు కారణాన్ని ఈ పుస్తకంలో మరో చోట చర్చించటమయింది ఈ దేశంలో సమకాలీన చరిత్రను చదివే విద్యార్థులు ఇందిరాగాంధి జీవితం గురించి, ఆమె నాయకత్వం గురించి మరోసారి ఆలోచించవలసిన అవసరం ఈ గొప్ప మార్పు కలిగిస్తోంది ఆమె జీవిత కథను, ఆమె చరిత్రలో కలిసిన 21 సంవత్సరాలకు పునఃపరిశీలిస్తూ వ్రాయటంలో నా ఉద్దేశం అదే అత్యున్నతమైన నిష్పక్షపాత వైఖరితో న్యాయం చేకూర్చటమే నాకు ప్రముఖాంశంగా ఉంటుంది

ఈ సందర్భంలో ఇదివరకటి జీవితకథలో కొత్త మార్పులు చేయటం, సంక్షిప్తం చేయటమన్నది సరయినది కాదు ఇదివరకు ఆమె గురించి చెప్పిన అసంఖ్యాకమైన మాటలకు కొత్తగా చేర్చవలసిందేమీ లేదు అనునిత్యం వర్గీకరింపబడుతున్న పత్రాలలో ఎంతో సమాచారం ఉండవచ్చు అది తొందరగా ప్రజల దృష్టికి వస్తుందనుకోవటం అనుభవాన్ని అధిగమించి ఆశించటమవుతుంది అధికారంలో ఉన్నవారు ఆమె స్నేహితులకు, అపరిచితులకు వ్రాసిన వేలాది ఉత్తరాలను కూడా విడుదల చేయటం లేదు వాటిలో అధికార సంబంధమైన రహస్యాలు గాని,

భద్రత విషయాలు గాని ఏమీ లేవు  ఆమె వ్యక్తిత్వం గురించిన అవగాహనకు ఇవి ఎంతో తోడ్పడుతాయి  ఇదెంతో విచారించదగ్గ విషయం  అయినా ఇప్పటివరకు బహిర్గతంగాని కొన్ని ముఖ్యమైన సంఘటనలను, అంతరార్థాలను నేను ఈ పుస్తకంలో చేర్చినందుకు సంతోషిస్తున్నాను

ఇక్కడ వెలిబుచ్చిన అభిప్రాయాలకు, నిర్ణయాలకు పూర్తి బాధ్యత నాదే  పాఠకుడు దీనిని ఒప్పుకోవచ్చు లేదా తిరస్కరించవచ్చు  వాస్తవ విషయాల మాటకొస్తే, ఇందిర నాతోను, ఇతరులతోను వ్యక్తిగతంగా చెప్పిన విషయాలు సరయినవా కావా అని మరీ మరీ సంప్రదించి నిర్ధారించుకొన్నాను. పాఠకుడు నా మాటను విశ్వసిస్తాడనుకొంటాను  ఇంత చిన్న పుస్తకంలో కథనాన్ని అంకెలతో, మూలగ్రంథాల వివరాలతో చిక్కున పడవెయ్యలేదు  చాలా అవసరమైన చోట మూలాలను కథనంలోనే చేర్చాను కాని తరచూ ఈ విధంగా చేయటానికి వీలుపడలేదు  వీటి తథ్యాన్ని గురించి నేనివ్వగలిగిన హామీ జర్నలిస్టుగా, “ది స్టేట్స్‌మన్” కు పొలిటికల్ కరస్పాండెంటుగా, రెసిడెంట్ ఎడిటర్‌గా, టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఢిల్లీ ఎడిటరుగా, “ది గార్డియన్” (లండన్, మాన్‌చెస్టర్) కు ఇండియా కరెస్పాండెంటుగా, ఆ తర్వాత రచయితగా నా రికార్డు చెపుతుంది

ఇందిరాగాంధి పేరు తరచు ఇందిరగా వాడటం గురించి కూడా నేను వివరణ ఇవ్వాలి  ఇది వ్రాయటానికి అనువుగా ఉంటుందనే కాని చెప్పటానికి కాదు  సాధారణంగా వాడుకలో ఉన్నట్లు, గాంధి లేక శ్రీమతి గాంధి అని వాడటం కొంచెం గందరగోళం సృష్టించేది  గాంధి అంటే  ఆమె ఇద్దరు కొడుకుల సంగతి అటుంచి మహాత్మాగాంధీగా కూడా పొరపాటు పడే అవకాశముంది  శ్రీమతి గాంధి అంటే ఆమె ఇద్దరు కోడళ్ళు సోనియాగాంధి, మేనకాగాంధి పేర్లతో పొరపడవచ్చు  సోనియా గాంధి అంటే ఇందిరకు చాలా ఇష్టం  ఆమె తన భర్తకు, ఇందిరకు వారసురాలయింది  రెండో కోడలు ఇందిరతో విడిపోయింది  అది ఈ కథనంలో చోటు చేసుకొంది

ఈ క్లుప్తమైన పీఠికతో నేను మన జీవిత కాలంలో వివాదాస్పదం, క్లిష్టం, పరస్పర విరుద్ధం, అన్నిటికీ మించి తెలుసుకోవాలనే కుతూహలం కలిగించే గొప్ప భారతీయురాలి విశిష్టమైన జీవితకథను చెప్పటానికి ఉపక్రమిస్తాను

## —1—



# ప్రారంభం

ఇందిరా నెహ్రూ గాంధి చాలా అదృష్టవంతురాలు జన్మస్థాన విషయంలో నేమి, తాను జన్మించిన కుటుంబం విషయంలో నేమి ఆమె అదృష్టమే అదృష్టం దురదృష్టవశాత్తు ఇప్పుడు అంత గొప్ప నగరంగా పరిగణనలోకి రాకపోయినా 19 నవంబరు 1917న ఇందిర జన్మించే నాటికి అలహాబాదు ప్రముఖ నగరంగా ఉండేది అమె పితామహుడు, మోతీలాల్ నెహ్రూ పొడవుగా, హుందాగా సింహంలా ఉంటూ న్యాయవాదిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు, ధనము ఆర్జించాడు. ఆ నగరంలో ఆయన ప్రముఖ పౌరుడు పరిపాలనకు, న్యాయానికి, రాజకీయాలకు, విద్య వాణిజ్య విషయాలకు కేంద్రమయిన అలహాబాదు ప్రముఖమైన యాత్రాస్థలం అది ఇప్పటికీ ప్రముఖమైన యాత్రాస్థలమే ఇక్కడ దేశంలోని మూడు పవిత్రమైన నదులు - గంగ, యమున, అదృశ్యంగా ఉండే సరస్వతి సంగమిస్తాయి మోతీలాల్ కాశ్మీర్ పండితుల (పండిట్) కుటుంబానికి చెందినవాడు ఆయన పూర్వీకులు ఉన్నత పర్వతాలనుండి గంగా మైదానానికి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు మోతీలాల్ 1861 లో తన తండ్రి చనిపోయిన ఆరునెలలకు జన్మించాడు అతని జ్యేష్ఠసోదరుడు అతనిని పెంచి పెద్ద చేశాడు మోతీలాల్ రెండు సంస్కృతుల బిడ్డ ఒకటి భారత్ - పర్షియన్ కాగా ఇంకొకటి పాశ్చాత్య సంస్కృతి ఆయన స్వయం శక్తితో పైకి వచ్చినవాడు అకస్మాత్తుగా తన జ్యేష్ఠ సోదరుడు మరణించగా సమష్టి కుటుంబం బరువు బాధ్యతలు పైన వేసుకొన్నాడు.

తన రాజ భవనంలాంటి భవనానికి తగ్గట్టుగా దానికి ఆనంద భవనమనే పేరు పెట్టాడు దీనిని ఆ తర్వాత దేశానికి కానుకగా ఇచ్చాడు మోతీలాల్. ఈ

భవనంలో తన కూతుళ్లయిన స్వరూప్ (విజయలక్ష్మి పండిట్‌గా పేరు ప్రఖ్యాతులు పొందింది ), కృష్ణలకు ఆంగ్ల గవర్నెస్‌లను ఏర్పాటు చేశాడు మోతీలాల్ తన కొడుకయిన జవహర్‌లాల్‌ను విద్యాభ్యాసానికి హారో, కేంబ్రిడ్జిలకు పంపించాడు అందమైన తన కోడలు ప్రసవానికి, తన మొదటి మనుమరాలు పుట్టడానికి అన్నీ సవ్యంగా ఉండాలని తను ఎంత ఖర్చుకైనా వెనకాడలేదు తన వైభవానికి తగినట్లే స్కాట్ డాక్టరును నియమించాడు బిడ్డ పుట్టగానే "అందమైన బిడ్డ" అని డాక్టరు ప్రకటించాడు ఆతురతతో, ఆందోళనతో ఎదురుచూస్తున్న నెహ్రూ పరివారానికి ఈ వార్త అందజేశాడు జవహర్‌లాల్ చాలా ఆనందించాడు ఇతరులకేమంత ఆనందంగా లేదు కానీ ఎప్పుడు మౌనంగా ఉండాలో వారికి తెలుసు "అబ్బాయి అయితే బాగుండేది" అని పురుషాధిక్యతగల సంఘం భావాన్ని జవహర్‌లాల్ నెహ్రూ తల్లి స్వరూపరాణి ప్రకటించింది దానితో ఆమె భర్త మండిపడ్డాడు దర్పంతో కోప్పడటానికి ఆయనది పెట్టింది పేరు అదే తన వారసులకు వారసత్వంగా వచ్చినట్లనిపిస్తుంది

"మనమెన్నడయినా మన కొడుకుకూ, ఇద్దరు కూతుర్లకు మధ్య భేదభావం చూపించామా?" అని కోపంగా తన భార్యనడిగాడు "నువ్వు మన పిల్లలందరినీ సమానంగా ప్రేమించటం లేదా? జవహర్ కూతురు వెయ్యి కొడుకుల కంటే మెరుగని ఋజువు చేస్తుందేమో ఎవరికి తెలుసు?" భవిష్యవాణి పలికినట్లు అటువంటి మాటలు అరుదుగా వినిపిస్తాయి అటువంటి అరుదైన మరో విషయం వేలకొద్దీ వచ్చిన అభినందనల పరంపరలలో సరోజినీ నాయుడు పంపినది ప్రత్యేకంగా చెప్పుకోవాలి ఆమె రాజకీయాల, కవిత్వాల అపురూపమైన కలయిక "దేశానికి కోకిల"గా పేరుపొందింది ఆమె పంపిన తంతిలో "భారతదేశపు నవ్యాత్మ" అని ఉంది ఆ పసికందు తండ్రి రచయిత, చరిత్రను సృష్టించినవాడు, సగర్వంగా తన కూతురిని "విప్లవశిశువు" అని భావించాడు రష్యాలో బోల్షెవిక్ విప్లవం వచ్చిన పన్నెండు రోజులకు ఈమె జన్మించింది

మోతీలాల్ తన మనవరాలికి ఇందిర అని తన తల్లి ఇందిరాణి పేరుకు గుర్తుగా పెట్టాడు ఇందిరాణి తన జీవితంలో ఎంతో ప్రాబల్యంతో ఉండేది ఆ

ప్రాబల్యం ముందు ముందు ఇందిరకు కూడా వచ్చింది ఇందిర తల్లిదండ్రులు చూడటానికి అందమైనది అనే అర్థంతో "ప్రియదర్శిని" అనే మరో పేరు జోడించారు. మొదటిరోజు నుండి ఇందిరకు అందరి నుండి ఎంతో ప్రేమ అనురాగాలు లభ్యమయ్యాయి అందరికంటె ఎక్కువగా మోతీలాల్ ఆమెను చాలా ముద్దుచేశాడు ఆమె కోరిన కోరికలన్నీ తీర్చాడు మొత్తం ఇంటిలో ఈమె ఒక్కతే తన తండ్రిగారి కోపానికి గురికాలేదు తండ్రి ఆమెను కాస్త అదుపాజ్ఞలలో పెంచాలని ప్రయత్నిస్తే తను "దాదూ (తాత)" కు చెప్పుకొనేది "ఆయనెప్పుడూ నా పక్షమే" అని ఇందిర స్వయంగా చెప్పుకొంది

కాని తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గుర్తించటం మొదలు పెట్టినప్పటి నుండి ఇందిర కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది తన తల్లి కమల పట్ల నెహ్రూ చూపిన వైఖరే అందుకు కారణం ముఖ్యంగా జవహర్‌లాల్ ఇద్దరు చెల్లెళ్ళలో పెద్దదయిన విజయలక్ష్మి ఏవేవో అంటూ ఉండేది ఇప్పటిలాగే అప్పుడూ చాలా కుటుంబాలలో ఇటువంటి తగాదాలు, ఎత్తిపొడుపులు సామాన్యమైన విషయాలే

కాని కమలకు తన ఆడపడుచుల వల్ల ఇబ్బందులు ఎక్కువగానే ఉండేవి దీనికి కారణం కూడా అసాధారణమైనదే కమల కుటుంబం కూడా కాశ్మీర్ పండిట్‌ల కుటుంబమే వంశం విషయంలోనేమి, సంపద విషయంలోనేమి వారికి వీరు ఏ మాత్రం తీసిపోలేదు కాని పాశ్చాత్య పద్ధతుల ప్రభావమేమీలేకుండా చాలా ఆచారవంతంగా ఉండేవారు ఇది కమల విషయంలో పెద్ద లోపమయింది ఆంగ్లేయుల పద్ధతిలో జీవిస్తున్న నెహ్రూ కుటుంబంలో కమలకు కష్టమయింది తన కూతుర్లకు పాఠాలు చెప్పే గవర్నెస్‌ను కమలకు కూడా ఇంగ్లీషు నేర్పమని మోతీలాల్ కోరాడు కాని దీనివల్ల ఏమీ లాభంలేకపోయింది కమల ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడలేకపోయిందని కాదు కాని కమలకు నాగరీకమైన పద్ధతులు అలవడలేదని విజయలక్ష్మి, ఇతరులు ఎత్తి పొడుస్తుండేవారు జవహర్‌లాల్ తల్లి తన ప్రియమైన కొడుకుకు కమల తగిన భార్య కాదనే భావాన్ని వెలిబుచ్చుతూనే ఉండేది

తన భార్య గాయపడ్డ హృదయానికి ఊరట కలిగించటానికి జవహర్‌లాల్ ఏమీ చెయ్యలేదు దీని ఫలితంగా తన కూతురు కూడా బాధపడింది "తాను భార్య విషయమై అంత పట్టించుకోలేదని, తన వివాహం అంత గొప్పగా సఫలంకాలేదని" చాలా ఏళ్ళ తర్వాత జవహర్‌లాల్ కొంచెం పశ్చాత్తాప పడుతున్నట్టుగా ఒప్పుకొన్నాడు

చిన్నారి ఇందిర తన తల్లితోపాటు బాధపడటంగాక స్వయంగా చేయగలిగిందేమీ లేకపోయింది ఆ తల్లి కూడా 1936లో తన 37ఏండ్ల వయసులో, ఇందిర 19 ఏండ్లవయసులో ఉన్నప్పుడు స్విట్జర్లాండు శానిటోరియంలో క్షయవ్యాధితో మరణించింది కమల తనలో తానే ముడుచుకుపోతూ పూజాపునస్కారాలలో మునిగి ఉండేది అమె తలుపులు మూసిన గదిలో ఉండగా ఇందిర మౌనంగా ఆమె పక్కన కూర్చుని తన సానుభూతిని వెళ్ళబుచ్చేది ఈ మౌనాన్ని అమె ఐదు దశాబ్దాల తర్వాత భంగం చేసింది "నేను (నా తల్లిని) ఎంతో ప్రేమించాను ఆమెకు అన్యాయం జరిగిందనుకొన్నప్పుడల్లా నేను ఆమె కోసం ఇతరులతో పోట్లాడాను " ఈ మాటలు ఒక వార్తాపత్రికకు తనకు తానుగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇందిర చెప్పింది తన తల్లిని అవమానించినట్లు తనను ఎవ్వరూ అవమానించటానికి వీలులేకుండా తనని తాను దృఢపరచుకొన్న విషయం ఆమె చెప్పలేదు కానీ అది అప్పటికే అందరికీ స్పష్టమయింది ఏకైక సంతానమైనందున, చాలా ఒంటరిగా ఉన్నందున, తనమటుకు ఒకే ఒక సంతానంతో తృప్తిపడే పొరపాటు చేయకూడదనుకొంది

ఇందిర తన తండ్రిని చాలా ప్రేమించింది తన తండ్రి వద్దనుండి ఎంతో నేర్చుకొంది "ఆదిమ మానవుని నుండి నేటి నాగరికత వరకు" అని చరిత్ర పాఠాలు ఉత్తరాల ద్వారా నేర్చుకోటమే కాదు ఈ విశిష్టమైన ఉత్తరాలను "గ్లింప్సస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ"గా ఆ తర్వాతి తరాల వారు చదువుకొన్నారు అయినా చాలాకాలం బాధలు పడ్డ తన తల్లి ప్రభావమే ఇందిరమీద ఎక్కువగా ఉండేది

మోతీలాల్ గృహంలోని వ్యక్తుల, వ్యక్తిత్వాల తగాదాలు కాకుండా మరింత శక్తిమంతమైన విషయాలు ఇందిర జీవితాన్ని రూపొందించసాగాయి ఇందిర

పసిపాపగా ఉన్నప్పుడే భారతదేశ స్వాతంత్ర్య పోరాటం సాహసవంతమైన నూతనదశకు చేరుకొంది జవహర్‌లాల్ నెహ్రూకు, అతని తండ్రికి మధ్య తరచూ జరిగే ఉద్రేక భరితమైన వాగ్వాదాలు ఆమెకు అర్థమయ్యేవి కావు 1912లో ఇంగ్లాండునుండి తిరిగివచ్చినప్పటినుండి 1885లో స్థాపితమైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చాలావరకు మితవాదుల నియంత్రణలో ఉంది మోతీలాల్ వారిలో ఒకరు న్యాయశాస్త్రంలో నిపుణుడైన మోతీలాల్‌కు నెమ్మదిగా రాజ్యాంగ బద్ధంగా రాజకీయాలలో పనిచేయటం నచ్చిన పద్ధతిలో ఉంది బ్రిటన్‌లో ఫేబియన్ సోషియలిస్టుల ప్రభావానికి లోనైన జవహర్‌లాల్‌కు ఈ పద్ధతి "అమితమైన మితవాదం"గా కనిపించింది ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యంలో కామన్‌వెల్త్‌లో ఇండియాకు డొమినియన్ స్థాయి కల్పిస్తామని ఇచ్చిన మాట తప్పి, రౌలట్ చట్టాన్ని ముందుకు తెచ్చిన సందర్భంలో జవహర్‌కు మితవాదం నచ్చలేదు

తన తండ్రిని తన పద్ధతిలో ప్రపంచ దృక్పథాన్ని ఏర్పరచుకోటానికి మార్చలేక పోయినందుకు, దేశరాజకీయాల ప్రగతిని వేగవంతం చేయటానికి ఒప్పించలేనందుకు జవహర్‌లాల్‌కు కోపం, చిరాకు కలిగాయి కుటుంబమంతా తండ్రీకొడుకుల వాగ్వివాదాలు గమనించారుగాని వాళ్ళకూ ఏమార్గమూ తోచలేదు అప్పుడే సన్నగా, మధ్య వయస్సులో ఉన్న మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధి అలౌకిక శక్తితో రాజకీయాలలో ప్రత్యక్షమై ఒక నెహ్రూ కుటుంబాన్నే కాదు, అప్పటి వరకు నిద్రాణమై ఉన్న, విశాలమైన ఉపఖండంలోని ప్రతి ఇంటినీ, ప్రతి పల్లెనూ ఒక కుదుపు కుదిపాడు ఆ ఆఘాతం 'సూర్యుడు అస్తమించని గొప్ప బ్రిటిష్ సామ్రాజ్యాని'కి అవగతమైంది గాంధీజీ వచ్చిన తర్వాత ఆనంద్ భవన్‌లో ప్రతీదీ "అద్భుతం"గా మారిపోయింది "ఆయన వచ్చాడు మేము చూశాం, ఆయన జయించాడు" అని విజయలక్ష్మి పండిట్ పేర్కొంది

ఆ రోజుల్లో ఒక నిర్దిష్టమైన అపఖ్యాతి పొందిన సంఘటన పవిత్ర నగరమైన అమృతసర్ లోని జలియన్ వాలా బాగ్‌లో జరిగింది 13 ఏప్రిల్ 1919 న నిరాయుధులైన ప్రజలను సామూహికంగా కాల్చివేయడం జరిగింది ఇది బ్రిటిష్ పాలనలో హేయమైన, ఘోరమైన కృత్యం అనడంలో సందేహం లేదు భారతదేశం

స్వాతంత్ర్య పథంలో ముందుకు సాగడంలో అంతిమదశకు ఇది ప్రారంభమనవచ్చు. రాబోయే కాంగ్రెస్ సమావేశం 1919 ఆఖరిలో అమృతసర్‌లో జరుగుతుందని నిర్ణయించటం గాంధీజీకే చెల్లింది మోతీలాల్ అధ్యక్షుడుగా ఉన్నాడు కాని మహాత్మా ఆ సమావేశానికి ఉత్తేజమయ్యాడు మౌనంగా, మరీ ప్రముఖంగా కనిపించకుండా జవహర్‌లాల్ కూడా ఆ సమావేశంలో ఉన్నాడు కానీ, ఒక బ్రిటిష్ జర్నలిస్టు పేర్కొన్నట్టు వీరు "జాతీయ త్రిమూర్తులు - తండ్రి, కొడుకు, పవిత్రాత్మ" అని స్పష్టమయింది

## రాజకీయాల సుడిగుండంలో

నెహ్రూ కుటుంబంలోని ఇతర సభ్యుల్లా రాజకీయ సుడిగుండంలోకి వచ్చేసరికి ఇందిర ఇంకా పసిపాపే. మహాత్మాగాంధి ఇంద్రజాలం పనిచేసింది మోతీలాల్ తన కొడుకు దృక్పధానికే మళ్ళాడు గాంధీ చెప్పిన సత్యాగ్రహాన్ని (హింసారహితమైన సహాయ నిరాకరణ) ఇదివరకు "గ్రీష్మకాలపు ఉన్మత్తత" గా నిరసించినప్పటికి, ఇప్పుడు తానే దానిని మనసారా స్వీకరించాడు ఆనందభవనం ఇప్పుడు ఆనందాల భవనంకాదు జాతీయోద్యమానికి అది ప్రధాన కేంద్రమయింది అప్పటివరకు విలాసవంతంగా గడిపిన జీవనశైలిలో కొన్ని నియమనిష్ఠలు చేరాయి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు అక్కడ జరగసాగాయి ఈ ప్రత్యేకమైన సమావేశాల సమయంలో ఇందిర మాత్రం స్వేచ్ఛగా లోపలికి, బయటకు తిరుగుతుండేది అంతేగాక దేశంలోని అన్ని ప్రాంతాలనుండి ఎందరో ఆ భవనానికి నిరంతరం వస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు గాంధీజీ అక్కడ మజిల చేసేవాడు ఇందిర గాంధీని "గొప్ప నాయకుని" గా గాక "కుటుంబానికి పెద్ద" గా భావించేది తన సమస్యలు, ఇబ్బందులు ఆయనకు చెప్పుకొనేది ఆ తర్వాత ఎప్పుడో ఇందిర చెప్పినట్లు ఆయన "ఆ పెద్ద కళ్ళపాప తీసుకొన్నంత గంభీరంగా ఆ సమస్యలను తీసుకొనేవారు " రాజకీయాలకు సంబంధించిన మరోజ్ఞాపకం గాంధీ తన దేశవాసులకు చేసిన విజ్ఞప్తి ననుసరించి ఆనంద్ భవన్ డాబామీద కుటుంబంలోని విదేశీ వస్త్రాలను తగలబెట్టటం. "ఖరీదైన వస్త్రాలు, ఆకర్షణీయమైన రంగుల్లో" ఉన్నవాటిని తగులబెట్టటం ఆమె

జీవితాంతం జ్ఞాపకముంది ఆ తర్వాత ఇందిర రాజకీయ కార్యకలాపాలలో బల్లపై కెక్కి ఇంట్లో పనిచేస్తున్న వాళ్ళకు, ఉపన్యాసాలివ్వటం, "వానరసేన"ను ఏర్పాటు చెయ్యటం, పోలీసులను తప్పించుకొని కాంగ్రెసు నాయకులకు చిన్న చిన్న పనులు చేసిపెట్టటం, పోలీసుల లారీ ఛార్జీలలో గాయపడ్డవారికి సేవలు చెయ్యటమనేవి అందరికీ తెలిసిన విషయాలే వీటిని తిరిగి చెప్పనవసరం లేదు

కానీ ఇవన్నీ 1921 నాటికి ఎంతో దూరాన ఉన్నాయి అలహాబాదు కోర్టులో, బోనులో తాత ఒడిలో కూర్చుని, తన తండ్రిని, తన తాతను ఆరు నెలలు జైలుకు పంపించిన విచారణను నాలుగేళ్ళ ఇందిర అర్థం చేసుకోటానికి ప్రయత్నించింది బ్రిటిష్ పాలన తన సందేశాన్ని తెలియజెపుతోంది సత్యాగ్రహం చేస్తే జైలుకు వెళ్ళక తప్పదు ఆ తర్వాత జైలుకు పోవటం సామాన్యమయి పోయింది వాస్తవానికి అదొక తీర్థయాత్ర అయింది ఒకో సందర్భంలో ఇందిర ఇంటికి వచ్చినవారికి "అందరూ జైలుకు వెళ్ళారు" అనే మాటతో స్వాగతం పలుకవలసి వచ్చేది. దేశం కోసం జైలుకు వెళ్ళటం ఎంతో గర్వ కారణమనటంలో సందేహం లేదు కాని దానికి మరో పక్షం కూడా ఉండేది తనకు రక్షణగా ఉండే పెద్దలు లేకపోవటం ఒంటరిగా, దుఃఖంగా ఉన్న బిడ్డకు మరింత బాధాకరంగా ఉండేది దాదూ, పాపూ (తాత, తండ్రి) తిరిగివచ్చినా మళ్ళీ పోలీసులు ఎప్పుడొచ్చి వీళ్ళను తీసుకుపోతారో అని భయంగా ఉండేది

ఇన్ని ఆందోళనలు, ఇబ్బందుల మధ్య తన క్లేశ ప్రపంచంలో ఒక కాంతి పుంజం ఉండేది తండ్రి, తాత మాత్రమే జైలుకు వెళ్ళేవారు కాని మూడవ దశకం ప్రారంభంలో గాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు కుటుంబంలోని స్త్రీలు కూడా వారితో చేరారు మొదట కమలా నెహ్రూ జైలుకు వెళ్ళింది ఇందిర తన తల్లి ధైర్యానికి ఎంతో సంతోషించింది తన తండ్రి కూడా సంతోషించాడు తన భార్యను, "రాజకీయ మిత్రురాలిగా, సమర్థకురాలిగా" భావించసాగాడు కాని ఈ విషయమై ఇందిర ఆనందం చాలా రోజులు నిలవలేదు కమల అనారోగ్యం తీవ్రమయింది తన భర్తను, కూతురిని దుఃఖ సాగరంలో ముంచి ఆమె ఫిబ్రవరి 1936లో మరణించింది

జవహర్‌లాల్ నెహ్రూ తరచూ జైలుకు వెళ్తున్నందున ఈ సమస్య జటిలమయింది గాంధీ మొదటి సత్యాగ్రహం తర్వాత ఇరవై ఐదేండ్లకు వచ్చిన స్వాతంత్ర్యమప్పటికి ఆరు సార్లు జైలుకు వెళ్ళటం, మొత్తం తొమ్మిదేండ్లకు పైగా జైలులో గడపటమయింది ఇందుకే ఇందిర బాల్యంలో ఆ తర్వాత పెరుగుతున్న వయస్సులో తనకు తండ్రి తోడు ఎంతో అవసరమయినపుడు, ఆ సంవత్సరాలన్నీ ఎంతో క్లిష్టంగా గడిచాయి తన ఒంటరితనం, అస్థిర జీవితం, అప్పుడప్పుడు నిరాశ, తను చేయవలసిన గొప్ప పనుల గురించి ఆమె ఊహలు అన్నీ కలిసి ఆమె వ్యక్తిత్వాన్ని రూపొందించసాగాయి. అత్యంత ఉన్నతంగా తను చేయవలసిన పని చేయాలనే దృఢనిశ్చయం ఉన్నప్పటికీ ఇంకెవ్వరికీ అంతుదొరకని లోతుల్లోకి తనలో తాను ముడుచుకు పోయింది ఈ లక్షణాలు తన జీవితాంతం ఉన్నాయి దీని ఫలితంగా చాలా వ్యక్తిగతమైన మనిషి ప్రజలతో ఎక్కువగా కలిసి ఉండే పదవిలో ఉండవలసి రావటమనే విరోధాభాసం కనిపిస్తుంది

ఇందిర ఎదుర్కొన్న పరిస్థితులలో ఆమె చదువు కుంటుపడటంలో అశ్చర్యం లేదు ఆ చదువు దఫాలు, దఫాలుగా, అసమానంగా, పలుప్రాంతాలలో జరిగింది ఒక బడి నుండి మరో బడికి, ఒక ఊరినుండి మరో ఊరికి మారవలసి వచ్చింది కొన్నాళ్ళు పూనా (ఇప్పుడు పూణే అంటారు) లోని ఒక ప్రయోగాత్మక పాఠశాలలో కొన్నేళ్ళు గడిచాక, శాంతినికేతన్‌కు వచ్చింది శాంతినికేతన్‌ను నోబెల్ బహుమతి పొందిన గొప్పకవి, దార్శనికుడు అయిన రవీంద్రనాధ్ ఠాగూరు ప్రశాంత వాతావరణంలో నెలకొల్పాడు ఆయనకు జవహర్‌లాల్ నెహ్రూ అంటే అభిమానం ఉండేది

ఇందిర శాంతి నికేతన్‌కు రాకముందు నాలుగేళ్ళక్రితం చారిత్రాత్మకమైన ఒక మార్పును చూడగలిగింది కలకత్తాలో 1928లో ఉద్రిక్తమైన కాంగ్రెస్ సమావేశం జరిగింది మోతీలాల్ అధ్యక్షత వహించాడు మోతీలాల్ డొమీనియన్ స్థాయికి ఒప్పుకొనే స్థితిలో ఉండగా అతని కొడుకు సంపూర్ణ స్వరాజ్యంవైపే పట్టుదలగా ఉన్నాడు గాంధీ కలుగజేసుకొన్నందున ఈ నిర్ణయం మరో సంవత్సరం దాకా వాయిదా వేశారు. ఆ గడువు గడిచేసరికి కాంగ్రెస్ ఈ కొత్త దృక్పధంవైపే మొగ్గు చూపింది డిసెంబరు 1929లో అప్పుడు పంజాబుకు రాజధాని, ప్రస్తుతం

పాకిస్థాన్‌లో ప్రముఖ నగరమైన లాహోర్‌లో కాంగ్రెస్ వార్షిక సమావేశం జరగవలసి ఉంది మోతీలాల్ సూచించగా, గాంధీ పూర్తిగా సమర్థించగా జవహర్‌లాల్ లాహోర్ కాంగ్రెస్ సభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు తండ్రి తర్వాత కొడుకు ఈ ఉన్నత పదవికి రావటమనేది అదే మొదటిసారి 26 జనవరి 1930న లాహోర్‌లో ప్రవేశించే రావి నది ఒడ్డున తన తండ్రి నాయకత్వంలో వేలాది ప్రజలు సంపూర్ణ స్వరాజ్యం వచ్చే వరకు తాము విశ్రమించమని ప్రమాణం చేయటం ఇందిర ప్రత్యక్షంగా చూసింది ఇప్పుడు మోతీలాల్ కొడుకుకు ముందర గాక వెనక నిలబడ్డాడు అప్పుడు ఉత్తేజితమైన ఆ ఒక్క పాపకు రాజకీయాల వారసత్వం తాను చూస్తున్నానని అనిపించిందా?

ఇందిరకు శాంతినికేతన్ ఎంతో నచ్చింది అక్కడ చాలాకాలం ఉండవచ్చు ననుకొంది కాని విధి మరో మలుపు తిప్పింది తన తల్లి అనారోగ్యం మరింత తీవ్రం కావటంతో ఇందిరకు తల్లితో పాటు స్విట్జర్లాండుకు వెళ్ళవలసి వచ్చింది కమలానెహ్రూకు అది ఆఖరి ప్రయాణమయింది వారి జీవితాలలో చిమ్మ చీకటి కమ్ముకొన్నప్పుడు ఇందిరకు, ఆమె తండ్రికి ఒకరినొకరు ఊరడించుకోటానికి కూడా తగినంత సమయం దొరకలేదు నెహ్రూను స్వదేశంలోని కర్తవ్యం పిలిచింది ఇందిరకేమో బాగా నిర్లక్ష్యం చేయబడిన తన చదువును కొనసాగించవలసి వచ్చింది తండ్రి అమెరికాకు వెళ్ళమని సూచించాడు కాని ఇందిర ఇంగ్లాండుకు వెళ్తానంది తన తండ్రికూడా అక్కడే చదువుకొన్నాడు కదా! కాని దానికంటే ముఖ్యకారణం అలహాబాద్‌లో విద్యార్థిగా ఉన్న ఫిరోజ్ గాంధి నెహ్రూ కుటుంబానికి పరిచయస్థుడయిన వ్యక్తి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చదువుతున్నాడు స్వాతంత్ర్య సమరంలో యువయోధునిగా ఆనంద్ భవన్‌కు తరచుగా వస్తూ ఉండేవాడు. తన కుటుంబ సభ్యులకంటే ఎక్కువగా ఇందిరకు అతనితోనే బాగా పరిచయముంది జబ్బుతో ఉన్న తల్లికి తాను సేవ చేస్తున్నప్పుడు అతను ఎంతో సాయం చేసేవాడు ఇప్పుడు కమల మృత్యుముఖంలో ఉన్నప్పుడు కూడా ఎంతో సేవ చేశాడు ఇందిర అతనిని ఆరేళ్ళ తర్వాత పెళ్ళి చేసుకొంది

### ప్రపంచం కోరికకు వ్యతిరేకంగా

బ్రిటన్‌లో ఇందిర మొదట బ్రిస్టల్‌లో ఉన్న బాడ్మింటన్ స్కూలుకు వెళ్ళింది తర్వాత ఆధునిక చరిత్ర చదవటానికి ఆక్స్‌ఫర్డ్‌లో సోమర్‌వీల్ కాలేజీకి వెళ్ళేది ఆమె తరచూ లండన్‌కు వెళ్ళేది అక్కడ ఫిరోజ్, ఇతర భారతదేశ విద్యార్థులు వి కె కృష్ణమీనన్ ఆకర్షణలో ఉన్నారు ఆయన నెహ్రూ సహచరుడు ఎంతో తెలివైన వాడు కాని ముక్కోపి ఇండియా లీగ్‌ను స్థాపించాడు దానికి అధ్యక్షుడుగా ఉన్నాడు స్వాతంత్ర్య భారతదేశానికి లండన్‌లో మొదటి హై కమిషనర్ ఆ తర్వాత నెహ్రూకు విదేశాంగ నీతిలో అతి నమ్మకమైన సహోద్యోగి వివాదాస్పదమైన రక్షణ మంత్రి మూడవ దశకంలో చాలా మందిలా ఇందిరా, ఫిరోజ్‌లు కూడా వామపక్ష భావజాలాన్ని ఒంటబట్టించుకొన్నారు ఫాసిస్టుల వ్యతిరేక ఉద్యమం బలంగా ఉండటం, లెఫ్ట్‌బుక్ క్లబ్బు దీనికి ప్రముఖ కారణాలని చెప్పవచ్చు

ఇందిరకే ఆక్స్‌ఫర్డ్ అంటే శాంతినికేతన్ మీద ఉన్నంత అభిమానం ఉంది కాని ఆమెకు అక్కడ ఉండాలని లేదు తల్లి పోయిన తర్వాత ఒంటరిగా ఉన్న తన తండ్రి వద్ద ఉండి ఆయన బాగోగులను చూసుకోవాలని ఆమెకుంది దానికి తగినట్టు ఆమె ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే ఉండేది వీటన్నిటివల్ల ఆమె సోమర్‌వీల్ లాటిన్ పరీక్షలు సరిగా వ్రాయలేదనిపిస్తుంది ఏమైనా స్వదేశానికి వచ్చెయ్యాలని ఆమె నిర్ణయించుకొంది కాని అప్పుడు రెండవ ప్రపంచయుద్ధం కొనసాగుతోంది భారతదేశానికి ప్రయాణమేమంత సులభంగా లేదు ఇందిర తాను ఇంటికి వెళ్ళదలచుకొన్నట్టు చెప్పగానే ఫిరోజ్‌గాంధీ తానుకూడా ఇంటికి వెళ్ళదలచినట్లు చెప్పాడు సిటీ ఆఫ్ పారిస్ అనే ఓడపై వీళ్ళిద్దరికీ రెండు బెర్తులు దొరికాయి మధ్యధరా సముద్రంలో జర్మను - బోటులను తప్పించుకొని ఆ ఓడ దక్షిణాఫ్రికాలోని గుడ్‌హోప్ అగ్రహాన్ని చుట్టుకొని రావలసి వచ్చింది

డర్బాన్‌లో నాలుగు రోజులు ఆగినప్పుడు అక్కడ భారత సముదాయం నెహ్రూ కూతురికి స్వాగత కార్యక్రమం ఏర్పాటు చెయ్యాలనుకొన్నారు ఇందిర ఒప్పుకొంది కాని తాను ఉపన్యాసమివ్వననే షరతు పెట్టింది లండనులో ఒక మీటింగులో

ఒక తాగుబోతు, "ఈమె మాట్లాడదు కీచుగా అరుస్తుంది" అన్నమాట ఆమెను బాధిస్తోంది కాని దర్బాన్‌లో ఉపన్యాసమిస్తానని చెప్పి తనకు ఆతిధ్యమిచ్చిన వాళ్ళను ఆశ్చర్యపరచింది నగరంలో ఆమె, ఫిరోజ్ కలిసి తిరుగుతున్నప్పుడు జాతి విచక్షతలోని భయంకర విషయాలను వాళ్ళు కళ్ళారా చూశారు. ఇందిర తన ఉపన్యాసంలో తన క్రోధాన్ని వెళ్లగక్కింది దక్షిణాఫ్రికాలో జాతి వివక్షతగల పాలకులు నాజీల కంటె భిన్నంకాదని చెప్పటమే గాక, భారతీయ వర్తకులు కూడా దురాశాపరులని, తెల్లవారికి బానిసలని, నల్లవారిని పట్టించుకోరని చెప్పింది తనకు ఆతిధ్యమిచ్చినవారు ఈ ఉపన్యాసానికి సంతోషించలేదు కాని ఇందిరకు తాను బహిరంగంగా ఉపన్యాసమివ్వగలననే నమ్మకమయితే కుదిరింది

మార్చి 1941లో ఇందిర అలహాబాద్‌లోని ఇల్లు చేరుకొంది ఆమెకోసం గొప్ప స్వాగతమేమీ ఏర్పాటు కాలేదు తన తండ్రి ఇంకా జైల్లో ఉన్నాడు దేశంలో క్రోధం, నిరాశ చోటు చేసుకొన్నాయి 3 సెప్టెంబరు 1939లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైనప్పుడు వైస్‌రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గో ఇండియా కూడా జర్మనీతో యుద్ధానికి దిగిందని ప్రకటించాడు కాని భారతీయుల అభిప్రాయమేమిటో తెలుసుకోటానికి ప్రయత్నించలేదు నెహ్రూ వైస్రాయి గురించి "భారీ శరీరం, ఆలోచన తక్కువ, రాయిలా స్థిరంగా ఉంటాడు, రాయిలాగే ఏమీ పట్టదు" అని అన్నాడు రెండేళ్ళక్రితం ఎన్నికలలో గెలిచి ఏడు ప్రావిన్స్‌లలో ఉన్న కాంగ్రెస్ రాజుకోసం పోరాడటానికి ఇరవై ఐదు లక్షలమంది భారతీయులు ముందుకు వచ్చి ఉండవచ్చుకాని వారి దేశస్థులు బ్రిటన్ భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వటానికి సమ్మతించటం లేదని అసంతృప్తితో ఉడికిపోయారు లిన్‌లిత్‌గోకు, భారతదేశ నాయకులకు మధ్య జరిగిన సంప్రదింపులు నామమాత్రంగా, నిష్ఫలంగా మారాయి గాంధీ ప్రారంభించిన వ్యక్తిగత సత్యాగ్రహంలో భాగంగా వేలకొద్దీ కాంగ్రెసు సభ్యులు జైలుకు వెళ్ళటం ప్రారంభించారు

ఇందిర దేశంలో లేనప్పుడు జరిగిన రెండు ప్రముఖ సంఘటనలు ఉపఖండం భవిష్యత్తుపై తమ ప్రభావాన్ని చూపాయి మొదటిది, కరినమనస్కుడు, వస్త్రధారణలో

అతిజాగ్రత్తగా ఉండే మహమ్మద్ ఆలీ జిన్నా నాయకత్వంలో ఉన్న ముస్లిం లీగ్‌కు, కాంగ్రెస్‌కు మధ్య అభిప్రాయ భేదం తీవ్రమైంది. ఒకప్పుడు "హిందూ ముస్లింల రాయబారి" గా భావింపబడిన.వ్యక్తి 1942 నాటికి రెండు దేశాల సిద్ధాంతానికి ఏమాత్రం రాజీపడని వ్యక్తిగా ఆవిర్భవించాడు ఉపఖండంలోని ముస్లింలకు పాకిస్థాను "స్వదేశమ"ని చెప్పాడు రెండో అంశం సుభాష్ చంద్రబోస్‌కు సంబంధించింది ఈయన ప్రముఖ జాతీయ నాయకుడు. మునుపు కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నాడు ఒకసారి ఆయన గాంధీనే సవాలు చేశాడు. ప్రజల్లో ఆయన గురించి నెహ్రూ కంటె ప్రబలమైన అభిప్రాయముండేది తన జైలర్ల కనుగప్పి జర్మనీకి పారిపోయాడు. ఆ తర్వాత జలాంతర్గామిలో జపాన్ చేరుకొన్నాడు చివరకు జపాను ఆక్రమించిన సింగపూర్‌లో జపాన్ సమర్థనతో ఇండియన్ నేషనల్ ఆర్మీ (భారతీయ జాతీయ సైన్యం) ని సమకూర్చాడు. వాళ్ళలో చాలామంది జపాను యుద్ధ బందీలుగా తీసుకొన్న భారతీయ సైనికులే ఈ సైన్యాన్ని ఢిల్లీ దాక నడిపించి ఇండియాకు బ్రిటిష్ పాలన నుండి విముక్తి కలిగిస్తానన్న ఆయన ప్రకటన ఎంతో ప్రశంసాత్మకమయింది నెహ్రూను మినహాయిస్తే చాలామంది భారతీయులు బ్రిటిషు పాలనకు బదులు జపాను సంరక్షణ కోరటం పెనం మీద నుండి నిప్పులోకి దూకటమేనని గమనించలేదు

ఈ నిరాశాజనకమైన పరిస్థితులలో 24 ఏండ్ల ఇందిర తాను ఫిరోజ్ గాంధీని పెళ్ళి చేసుకోదలచినట్టు తండ్రికి చెప్పింది ఫిరోజ్ గాంధి పార్శీ మతస్థుడు. ఎంతో నాగరికత, ఉదార స్వభావంగల నెహ్రూకు మరో మతమన్నది అభ్యంతరం కాకూడదు కాని తన ప్రియమైన కూతురి విషయం వచ్చేసరికి అది అభ్యంతరమయింది. అయినా మరి కొందరు యువకులను చూసిన తర్వాత నిర్ణయం తీసుకోమని ఆయన కూతురికి సలహా ఇచ్చాడు

ఏమైనా తనకు కాబోయే అల్లుడి గురించి తనకు ఏమంత గొప్ప అభిప్రాయం లేదు అంతకు ముందు ఫిరోజ్ తాను ఎంతో నైపుణ్యంతో తీసిన ఇందిర ఫోటోలను నెహ్రూకు చూపించాడు "ఈ ఫోటోగ్రాఫులు నీవే తీసి ఉంటే నిన్ను అభినందించక తప్పదు" అని పెద్దాయన అన్నాడు నెహ్రూ తన స్వభావానికి విరుద్ధంగా ఫిరోజ్

"పృష్టభూమి మరోవిధంగా ఉంది" అని అన్నాడు అంటే ఆ యువకుడు అంత ఉన్నవాడు కాడు అని మర్మంగా చెప్పటమన్నమాట ఇందిర ఈ మాటలేవీ పట్టించుకోలేదు తన నిర్ణయం మారదని గట్టిగా చెప్పింది. తండ్రి ఇలాగే మాట్లాడితే "తనతో మాట్లాడటం మానేస్తాన"ని చెప్పింది ఇదివరకు ఇందిర ఈ విధంగా చేసినపుడు నెహ్రూ ఎంతో బాధపడ్డాడు అందుకే ఈసారి కూతురిమాటను ఒప్పుకొన్నాడు తండ్రీకూతుళ్ళ అభిమతాలు ఢీ కొనటంలో ఇది మొదటి సంఘటన కానీ చివరిది కాదు ఇందులో ఇందిరే గెలిచింది

నెహ్రూ ఒప్పుకోగానే ప్రళయమే వచ్చింది నెహ్రూ కుటుంబ వ్యవహారాలు ఇప్పుడు దేశ వ్యవహారాలయిపోయాయి ఈ "సంకర వివాహాన్ని" అందరూ నిరసించారు ఇందులో హిందువులు, పార్శీలు ఉన్నారు ఇక నెహ్రూ కుటుంబంలో, ఫిరోజ్ కుటుంబంలో అసమ్మతి గురించి చెప్పనవసరమే లేదు. ఈ వివాహాన్ని గురించి కోపంగా వ్రాస్తున్న ఉత్తరాలు అందుకొంటున్న మహాత్మా కలగజేసుకొన్నా ఈ వ్యతిరేకత ముగియలేదు గాంధి యువజంట పక్షం వాదించాడు ఫిరోజ్‌తో తన వివాహానికి "మొత్తం ప్రపంచం వ్యతిరేకిస్తున్నట్టుంది" అన్న ఇందిర మాటలలో అతిశయోక్తి లేదు

26 మార్చి 1942న వీరి వివాహం జరిగింది వారి కళ్యాణ యాత్రకు సహజంగా కాశ్మీరును ఎన్నుకొన్నారు గుల్‌మార్గ్ పర్వతప్రాంతం నుండి కొత్త దంపతులు నెహ్రూకు టెలిగ్రాం పంపారు "ఇక్కడ నుండి మేము కొంచెం చల్లగాలి పంపగలిగితే ఎంత బాగుండేది" అని దానికి "పాపం మీకు మామిడి పండ్లు లేవు కదా" అనే జవాబు అందుకొన్నారు

అలహాబాదుకు వచ్చిన తర్వాత ఆనంద్ భవన్‌కు దగ్గరగా ఫిరోజ్ ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు ఇన్సూరెన్స్ ఏజెంటుగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనోపాధి పొందాలని ప్రయత్నించాడు తను, తన భార్య సుఖంగా కుటుంబజీవితంలో స్థిరపడుతామని అనుకొని ఉంటే అది పొరపాటే అనుకోవాలి వాళ్ళ ఆశలు, పథకాలు అన్నీ దేశంలోని ఇతర విషయాలలాగే ఎన్నాళ్ళుగానో బ్రిటిష్ పాలనకు, పెరుగుతున్న భారతీయ జాతీయతకు మధ్య బలాబలాల

పెనుగులాటలో వెనుకబడి పోయాయి బ్రిటిష్ పాలనలో సామ్రాజ్యవాది విన్‌స్టన్ చర్చిల్ కీలకపాత్ర వహిస్తూ తాను "మహారాజుగారి మొదటి ప్రధానమంత్రిగా బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిన్నతికి అధ్యక్షత వహించటానికి" రాలేదని గర్వంగా ప్రకటించాడు భారత జాతీయత అనే శిఖరాగ్రం మీద గాంధి ఉన్నాడు.

## బ్రిటిష్ రాజ్యానికి అటకట్టు

ఇందిర ఫిరోజ్ వివాహసమయమప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం జాతీయత అంటున్న భారతదేశం యుద్ధంలో పోరాడటానికి బ్రిటన్‌తో చేరుతుందేమో కనుక్కోమని యుద్ధకాలపు మంత్రివర్గం నుండి ఒక అనుభవజ్ఞుడైన మంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపింది దానికి బదులుగా అతను ప్రతిపాదించింది మొదటి ప్రపంచ యుద్ధంలో చేసిన ఉత్తుత్తి వాగ్దానాలను గుర్తుకు తెచ్చింది గాంధీ ఈ ప్రతిపాదనలను "ముందురానున్న తారీఖు వ్రాసిన చెక్కు" గా తిరస్కరించాడు "స్వేచ్ఛా భారతదేశం జపాను, జర్మనీలతో పోరాడటానికి బ్రిటన్‌తో చేరుతుంది స్వేచ్ఛలేని భారతదేశం బ్రిటన్‌తో పోరాడుతుంది" అని మహాత్మా అన్నాడు. వ్యక్తిగతమైన సత్యాగ్రహం స్థానంలో దేశవ్యాప్తంగా సివిల్ డిస్ ఒబీడియెంట్ మూవ్‌మెంట్ (పౌర ఆజ్ఞోల్లంఘన ఉద్యమం) తీసుకొని రావాలని గాంధీ ఆలోచించాడు దీనితో బ్రిటిష్‌వారు భారతదేశాన్ని వదిలిపోవలసి వస్తుందని దానిని "అయోమయస్థితి" లో వదిలి వెళ్తారని భావించాడు నెహ్రూకు మిత్రరాజ్యాల లక్ష్యమంటే సానుభూతి ఉన్నందున, ఫాసిజమంటే అసహ్యమయింది మొదట "క్విట్ ఇండియా" ఉద్యమాన్ని వ్యతిరేకించాడు కాని ఎప్పటిలాగే గాంధీ మాటకు తల ఒగ్గాడు ఇంకొక కాంగ్రెస్ నాయకుడు, రాజాజీగా ప్రసిద్ధికెక్కిన సి రాజగోపాలాచారి మహాత్మాగాంధీ ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించాడు. కాని ఆయన మాట ఎవరూ పట్టించుకోలేదు

7 ఆగస్టు 1942లో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ బొంబాయి (ముంబయ్)లో సమావేశమయినప్పుడు నెహ్రూ క్విట్ ఇండియా తీర్మానాన్ని ప్రతిపాదించగా ఎంతో ప్రశంసాత్మకంగా దీనిని అంగీకరించారు గాంధీ తన అనుయాయులకు

"కర్తవ్యమో లేక మరణమో" అనే నినాదాన్ని ఇచ్చాడు అన్ని విధాలా ఇరుకున పడ్డ బ్రిటిష్ ప్రభుత్వం బెదిరిపోయింది అణచివేతకు సిద్ధపడగా దానికి విపరీత పరిణామాలు కలిగాయి ఆగస్టు 9, 1942 ఉదయాన్నే గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను నిర్బంధంలోకి తీసుకొన్నారు

గాంధీని పూనాలోని ఆగాఖాన్ పాలెస్‌లో నిర్బంధించారు నెహ్రూ, ఇతర ప్రముఖ నాయకులను అహమ్మద్‌నగర్ కోటలో బంధించారు ఇది దక్షిణాన ఎన్నో మైళ్ళ దూరంలో ఉంది గాంధీ నాయకత్వ ప్రభావాన్ని తగ్గించిన సమయంలో వామపక్షాలు తమ పునరుద్ధరణకు ప్రయత్నించాయి 1857 తర్వాత బ్రిటిష్ ఇండియాకు గొప్ప సవాలుగా మారిన "ఆగస్టు విప్లవం" చివరకు అదుపులోకి వచ్చింది

చరిత్రాత్మక కాంగ్రెస్ సమావేశంలో ఫిరోజ్, ఇందిర ఉన్నారు ఇంటికి వెళ్ళేటప్పుడు తెలివిగా విడివిడిగా బయలుదేరారు ఆ తర్వాత ఫిరోజ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు ఇందిర అలహాబాద్‌కు ట్రైన్‌లో వెళ్ళింది అక్కడ చేరినరోజే ఆమె మేనత్త విజయలక్ష్మి అరెస్టయింది తన ఇంటి సంగతి వదిలేసి ఇందిర ఆనంద్ భవన్‌ను చూసుకోటానికి వచ్చింది తనకు కూడా నిర్బంధం తప్పదని తెలిసినపుడు ఇందిర పోలీసుల కోసం ఇంట్లో ఎదురు చూడకుండా అప్పటికే చాలా మంది సమావేశమయిన చోటికి వెళ్ళింది దీనివల్ల పోలీసులు మరింత విజృంభించారు ఫిరోజ్ దూరంగా ఒక భవనం నుండి ఇదంతా చూస్తున్నాడు ఒక్కసారిగా గుంపులోకి జొరబడ్డాడు అతని భార్యతోపాటు అతనినీ నిర్బంధంలోకి తీసుకోవటమయింది వాళ్ళిద్దరినీ వేరు వేరు జైళ్ళలో ఉంచారు

విజయలక్ష్మి పండిట్ 11 సెప్టెంబరు 1942లో తన డైరీలో ఈ విధంగా వ్రాసుకొంది "లాకప్‌లోకి వెళ్ళిన అరగంటలో బయటద్వారం వద్ద విపరీతమైన అలజడి వినిపించింది మేట్రన్ వచ్చి ఉద్రిక్తంగా "శ్రీమతి గాంధి ఇక్కడుంది అని చెప్పింది " విజయలక్ష్మి తన ఇద్దరు కూతుర్లతో ఉన్నగదిలోనే ఇందిర ఉండసాగింది అక్కడే ఆమె తన 25వ జన్మదినం జరుపుకొంది ఆ రోజు ఫిరోజ్‌ను అక్కడికి రావటానికి అనుమతించారు భార్యాభర్తలు విడుదలైన సంవత్సరానికి

వారి మొదటి కొడుకు 20 ఆగస్టు 1944న పుట్టాడు నెహ్రూ అప్పటికి ఇంకా జైలులోనే ఉన్నాడు యూరప్‌లో యుద్ధం ముగిసి అహమ్మద్ నగర్ కోట తలుపులు తెరచుకొని, కాంగ్రెసు నాయకులంతా బయటకు వచ్చినపుడే నెహ్రూ తన మనవడిని చేతుల్లోకి తీసుకోగలిగాడు ఇదివరకే మహాత్మా తన భార్య కస్తూర్‌బా మరణం తర్వాత విడుదలయ్యాడు వెంటనే భారతదేశానికి అధికారాన్ని ఇవ్వటానికి సంప్రదింపులు తీవ్రమయ్యాయి ఇవి సుదీర్ఘంగా, బాధాకరంగా, నిరాశాజనకంగా, కోపం తెప్పించేటట్లు కొనసాగాయి కాని "రాజకిరీటంలో ధగధగలాడే రత్నాన్ని" బ్రిటిషువారు తమతోనే పెట్టుకోగలిగే మార్గమేదీ లేకపోయింది త్వరలోనే బ్రిటిష్ విధానం విభజించి పాలించటం నుండి విభజించి విడిచి పెట్టే విధానంగా మారిపోయింది చిట్టచివరికి, బేరసారాలతర్వాత, 1940లో ప్రత్యక్ష చర్యకు జిన్నా పిలుపునిచ్చిన ఫలితంగా జరిగిన భయంకరమైన హింస తర్వాత, 3 జూన్ 1947లో దేశాన్ని ఇండియా పాకిస్థానులుగా విభజించాలనే నిర్ణయం తీసుకోటమయింది. దీనికి ముందే వైస్రాయి మంత్రివర్గానికి ఉపాధ్యక్షుడుగా నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వానికి ఆధిపత్యం వహించవలసి వచ్చింది.

దీనివల్ల ఇందిరకు లక్నోలోని తన ఇంటికి, తన తండ్రి అధికారగృహానికి మధ్య తిరగవలసి వచ్చింది. నెహ్రూ కుటుంబ యాజమాన్యమున్న పత్రిక నేషనల్ హెరాల్డ్‌కు ఫిరోజ్ మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్నాడు తండ్రి భార్యను పోగొట్టుకొని పదేళ్ళపైనే అయింది. ఆయనను చూసుకోవలసిన అవసరం కూడా ఎంతో కనిపించింది ఫిరోజ్‌కు ఇదంతా చికాకనిపించింది కాని ఇందిరకు మరో మార్గమే లేదు కాకపోయినా ప్రపంచంలో ఐదవ వంతు మానవాళి ఉన్న భారత ఉపఖండం భవిష్యత్తు గురించి ఎన్నో మార్పులు సంభవిస్తుండగా ఒక చిన్న కుటుంబాన్ని ఎవరు పట్టించుకొంటారు?

—2—

# తన తండ్రి పక్కన



వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు అధిపతిగా అయిన తర్వాత నెహ్రూ 17 యార్క్ రోడ్డులో ( ఆ తర్వాత అది మోతీలాల్ నెహ్రూ మార్గ్‌గా మారింది) ఉన్న చిన్న బంగళాలోకి మారాడు మొదట్లో ముస్లింలీగ్ ఈ తాత్కాలిక ప్రభుత్వాన్ని బహిష్కరించింది ఆ తర్వాత "లోపలినుండి దీనిని పడగొట్టాలనే" లక్ష్యంతో చేరి త్వరలోనే విజయం పొందింది జిన్నా ఉద్బోధించిన ప్రత్యక్ష చర్యతో ప్రారంభమైన కలకత్తాలోని హింస దేశంలోని వివిధ ప్రాంతాలలో రగులు కొంటూనే ఉంది ఉపఖండం భవిష్యత్తు గురించి త్వరగా నిర్ణయించక పోతే పరిస్థితి అదుపుతప్పుతుందేమోనని అందరికీ దిగులుగానే ఉంది

ఎన్నో బాధ్యతలు, పెరుగుతున్న మారణహోమం మధ్య తనను, తన ఇంటిని చూసుకోటానికి, తన ఇంటికి వచ్చిన వారికి ఆతిధ్యమివ్వటానికి నెహ్రూకు ఇందిర అవసరం ఎంతగానో పెరిగింది అందుకని ఇందిర ఇంచుమించు లక్నో నుండి ఢిల్లీకి తన రెండేండ్ల కొడుకు రాజీవ్‌తో తరలి వచ్చిందనుకోవచ్చు ఫిరోజ్ లక్నోలో ఉన్నాడు మనసులో బాధ పడుతున్నాడు దీని ప్రభావం ఇందిర వివాహం మీద పడింది ఫిరోజ్ 1950లో ఢిల్లీకి పార్లమెంటు సభ్యునిగా వచ్చిన తర్వాత కూడా పరిస్థితులు బాగుపడలేదు పార్లమెంటు సభ్యునిగా ప్రైవేటు సంస్థలలోను, ప్రభుత్వ ఏజెన్సీలలోను ఉన్న అవినీతిని బయటకు తెస్తూ నిర్మొహమాటంగా, స్పష్టంగా మాట్లాడేవాడు తీన్‌మూర్తి భవనంలోని ప్రధానమంత్రి ఇంటికి, పార్లమెంటు సభ్యునిగా తను ఉంటున్న ఇంటికి మధ్య తను రాకపోకలు సాగించేవాడు ఏండ్లు గడిచే కొద్దీ ఈ రాకపోకలు తగ్గిపోసాగాయి చివరకు ఆ వివాహం విడాకులతో ముగియకపోయినా విచ్ఛిన్నమయినట్లే లెక్క యార్క్‌రోడ్డు ఇంటికి వచ్చిన మూడు

వారాల తర్వాత ఇందిరకు రెండవకొడుకు సంజయ్ 14 డిసెంబరు 1946న పుట్టాడు రాజీవ్ పుట్టినప్పటి కంటె భిన్నంగా ఈ కాన్పు "కష్టము, బాధాకరము" అయింది ముందు రాబోయే దానికి, ముఖ్యంగా ఇందిర జీవితంలో ఆఖరి దశాబ్దంలో జరగబోయే దానికి ఇది సూచన అనుకోవాలా?

లక్షలాది ప్రజలు పోరాడి, త్యాగాలు చేసిన తర్వాత చివరకు స్వాతంత్ర్యం 15 ఆగస్టు 1947న వచ్చింది దానితోపాటు పాకిస్థాన్ కూడా ఉద్భవించింది దురదృష్టవశాత్తు రెండు వైపులా నరహత్యలు జరిగాయి, ఊచకోతలయ్యాయి శాంతి సమయంలో ఇంత పెద్ద ఎత్తున జన సమూహాలు తరలిపోవటమన్నది చరిత్రలోనే అరుదు కానీ స్వాతంత్ర్యం వచ్చినందున ప్రజల ఉత్సాహాన్ని ఏది కూడా అణచి వేయలేకపోయింది ఇప్పుడు ప్రధానమంత్రి అయిన నెహ్రూ అర్ధరాత్రి "విధితో సమావేశం" (ట్రైస్ట్ విత్ డెస్టినీ) ఉపన్యాసాన్నిచ్చాడు ఇరవయ్యవ శతాబ్దంలో గుర్తుంచుకోదగిన ఉపన్యాసాలలో ఇది ఒకటి అప్పుడు ఇందిర నెహ్రూ పక్కనే ఉంది రాబోయే 17 సంవత్సరాలలో అదే విధంగా తండ్రిపక్కనే ఉంది ఇది తన "విధి నిర్వహణ" అని చాలా ఏండ్ల తర్వాత ఇందిర చెప్పింది తన తండ్రికి తన సహాయం "ఎంతయినా అవసరమ" ని ఆమె గ్రహించింది తన తండ్రి "కేవలం ఉద్యోగులు, ఇంట్లో పనిచేసే వారితో ఒంటరి జీవితం గడపటం" గురించి తాను భయపడింది

స్వాతంత్ర్యం వచ్చిందంటే మౌనంగా ఉన్న ఇందిర భుజాలమీద మరింత భారమే త్వరలోనే నెహ్రూ పెద్ద భవనంలోకి తరలి వెళ్ళాడు అది ఇదివరకు బ్రిటిష్ కమాండర్-ఇన్-ఛీఫ్ నివసించిన గృహము ఇప్పుడది నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీగా మారింది ఇంతగా విస్తరించిన పెద్ద భవనాన్ని మళ్ళీ అలంకరించి నివాస గృహంగా మార్చటమన్నది అతి కష్టమైన పని దానికి తగినట్లు ప్రధానమంత్రి ఇంటికి వచ్చే అతిధుల సంఖ్య తక్కువేమీ కాదు నెహ్రూ ఇంటికి "శారీరకంగా, మానసికంగా గాయపడి" వరదలా వస్తున్న శరణార్థుల బాధ్యత కూడా ఇందిరమీద పడింది యార్క్ రోడ్డులో కూడా రెండు

గదులను శరణార్థుల కోసం కేటాయించటమయింది ఈ పెద్ద భవనంలో వారికి మరింత స్థలం కేటాయించటమయింది

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కూడా మతకలహాలు కొనసాగుతూనే వచ్చాయి భయభ్రాంతులై ఇక్కడా, అక్కడా దాక్కుని లేదా శరణార్థుల శిబిరాలలో తలదాచుకొన్న ముస్లింలకు ఊరట కలిగించటానికి గాంధి ఇందిర సహాయాన్ని కోరాడు ధైర్య సాహసాలు గల కొందరు కాంగ్రెస్ మహిళల సహాయంతో ఇందిర ఈ పనిని సాధించింది ఈ సమయంలో తాను మహాత్మాకు చాలా దగ్గరయింది తరచు ఆయన దగ్గరకు వెళ్తుండేది ఆయన, కాంగ్రెస్ పక్షం వహించే పారిశ్రామిక వేత్త జి డి బిర్లాకు చెందిన విశాలమైన ఇంటిలో ఉంటూ ఉండేవాడు 29 జనవరి 1948లో అనుకోకుండా మహాత్మాను కలుసుకోటానికి ఇందిర వెళ్ళింది అయన వెచ్చగా చలికాలపుటెండలో గడ్డితో అల్లిన టోపీ పెట్టుకొని హాయిగా విశ్రాంతి తీసుకొంటున్నాడు ఇరవైనాలుగు గంటల తర్వాత ఈ శాంతి దూతను ఒక హిందూ మతోన్మాది "ముస్లింలను నెత్తి కెక్కించుకొంటున్నాడ"ని, పాకిస్థాన్ సృష్టికి "కుట్ర" పన్నాడని నిందించి హత్యచేశాడు "చాలామంచికి పోతే ఇలాగే జరుగుతుంద"ని ఎంతో దూరంలో బ్రిటన్‌లో ఉన్న జార్జి బెర్నార్డ్ షా వ్యాఖ్యానించాడు ఈ విషాదంతో, ఆఘాతంతో అమితమైన దుఃఖానికి గురయిన నెహ్రూ బిర్లా గృహంలోని ఉన్నతమైన ద్వారమెక్కి మూగపోయిన దేశాన్ని ఉద్దేశించి ఈ విధంగా ప్రకటించాడు "మన జీవితాలనుండి వెలుగు పోయింది ఎక్కడ చూసినా చీకటి కమ్ముకుంది మీకు ఎలా చెప్పాలో, ఏమి చెప్పాలో నాకు తెలియటం లేదు "

"ఆ బోసినవ్వు మాయమవటం" గురించి దుఃఖపడుతున్న ఇందిర మహాత్మా హత్య తన తండ్రికి కలిగించిన క్షోభగురించి కూడా చాలా బాధ పడింది గాంధీ పోవటంతో తండ్రి తన మీద మరింతగా ఆధారపడ్డాడని తను "గ్రహించింది "

తన తండ్రి ఇంటిలో ఆతిథ్యమిస్తూ తన విధులను నిర్వహించిన ఇందిర ఆహారం విషయంలో తన దేశస్థుల విచిత్ర పద్ధతుల గురించి ఎంతో చమత్కారంగా, విపులంగా వ్రాసింది, మాట్లాడింది "ఇంచుమించు ఉపద్రవాలైన పరిస్థితులనుండి

ఏ విధంగా తప్పించుకొన్నదీ" ఆమె ఎంతో హాస్యయుతంగా చెప్పింది ఉదాహరణకు, బౌద్ధుల నాయకుడైన దలైలామా భోజనానికి ఆమె చక్కటి శాకాహారం తయారు చేయిస్తే ఆయన చక్కటి మాంసాహారంకోసం ఎదురుచూస్తున్నట్టు కబురంపించాడు

ఇందిర కేవలం ఆతిధ్యమిచ్చి, ఇంటిని చూసుకోటానికే పరిమితం కాలేదు ఢిల్లీలో నివసించటం ప్రారంభించినప్పటినుండి ఆమె ఎన్నో కార్యకలాపాలలో ముఖ్యంగా పిల్లల సంక్షేమ విషయంలో నిమగ్నమయింది ఆమె "బాలసహయోగ్" అనే సంస్థనొక దానిని స్థాపించింది అదే ఇప్పుడు బాలభవన్‌ల సమూహంగా పిల్లలకోసం పని చేస్తోంది అమెరికాకు ఉపన్యాసాలివ్వటం కోసం వెళ్ళిన ఇందిర అక్కడ మెదడు పక్షవాతానికి గురయిన వారికి చికిత్స చేసే కేంద్రాన్ని చూసింది. తిరిగి వచ్చిన ఇందిర భారతదేశంలో కూడా అటువంటి కేంద్రం ప్రారంభమయ్యేటట్లు చూసింది దేశంలోని వివిధ సంక్షేమ సంస్థల పనిని సమన్వయ పరచటానికి సెంట్రల్ సోషియల్ వెల్‌ఫేర్ బోర్డు స్థాపించేటట్లు ప్లానింగ్ కమిషనును అనునయించింది మొదట్లో ప్రచ్ఛన్నంగా ఆ తర్వాత స్పష్టంగా ఆమె పాత్ర విస్తారమవుతూ వచ్చింది తన తండ్రికి అంతరంగిక వ్యక్తిగా, ఆ తర్వాత ఫ్రెంచిలో చెప్పినట్లు షాటిలేన్ లేదా సలహాదారుగా మారింది నెహ్రూ విదేశ యాత్రలన్నిటిలో ఆమె వెంట ఉండేది దీనివల్ల దౌత్య వ్యవహారాలలో ఈమెకు చక్కటి శిక్షణ లభించింది ప్రపంచ నాయకులతో సౌహార్ద్రత పెరిగింది వారితో ప్రత్యక్షంగా వ్యవహరించవలసిన సమయం వచ్చేటప్పటికి ఈ అనుభవం బాగా ఉపయోగపడింది భవిష్యత్తులో జరిగిన సంఘటనలు తెలియజేసినట్టు తన తండ్రి పని చేయటం చూసిన ఇందిర సునాయాసంగా రాజ్య వ్యవహారాలు నడపటం నేర్చుకొంది.

పదహారు గంటలు నిర్విరామంగా పనిచేసే నెహ్రూకు కావలసిన విశ్రాంతి దొరికేటట్లు చూడటం కూడా ఇందిర బాధ్యతలలో ఒకటయినందున, తమ విషయాలు నెహ్రూ చెవిన వేద్దామని వచ్చిన పార్టీ కార్యకర్తలు ఇందిరతో తమ బాధలు చెప్పుకొని తృప్తి పడేవారు వాస్తవానికి ప్రధానమంత్రే తమ పార్టీలోని

సహచరులతో "ఇందు" తో మాట్లాడమని చెపుతుండేవాడు తన తండ్రికి, పార్టీ కార్యకర్తలకు మధ్య ఇందిర వారధిగా మారింది ఐదవదశకం మధ్యలో ఆమెను పార్టీలోని ముఖ్యమైన సమితులలోకి తీసుకోటం జరిగింది ఇది ఏ విధంగా జరిగిందో జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది ఎందుకంటే ముందు ముందు నెహ్రూ తనకు వారసురాలుగా కూతురికి "శిక్షణ నిచ్చాడ"ని అన్యాయంగా ఆరోపణ లొచ్చాయి అసలు వాస్తవమిది 1951లో శిశిరంలో కాంగ్రెస్ అధ్యక్షుడయిన పురుషోత్తమ్ దాస్ టండన్‌ను నెహ్రూ తొలగించవలసి వచ్చింది ఆయనంటే గౌరవమున్నప్పటికీ అతని మత ధోరణి తనకు నచ్చలేదు తనను అభ్యర్థిగా నిలబడవద్దని టండన్‌ను నెహ్రూ కోరాడు కాని అతను ఈ మాట వినకుండా ఎన్నికలలో పోటీ చేశాడు టండన్ గెలిచాడు గాని ప్రజాదరణ వల్లకాదు ఉప ప్రధాన మంత్రి అయిన సర్దార్ పటేల్ నాయకత్వంలో పార్టీలో కుడిపక్షం టండన్‌ను సమర్థించింది పటేల్ ఒకడే నెహ్రూకు సమానమైన స్థాయిలో నిలబడగలిగినవాడు ఈ పెద్ద వారిద్దరి మధ్య సంబంధం ప్రత్యేకంగా ఉండేది దేశహితం విషయంలో మాత్రం ఇద్దరికీ ఏకాభిప్రాయముండేది చిన్న చిన్న పరిపాలన విషయాలలో ఇద్దరికీ భేదాభిప్రాయాలుండేవి టండన్ భావాలతో పటేల్ అంగీకరించేవాడు కాని కొన్ని నెలలకే పటేల్ మరణించాడు టండన్ తన పద్ధతి మార్చుకోకుండా ప్రధాన మంత్రి విధానాలను వ్యతిరేకించటం కొనసాగించేసరికి "టండన్ ప్రతీకగా నిలిచిన దృక్పధాన్ని కాంగ్రెస్ నుండి తొలగించాల"ని నెహ్రూ నిర్ణయించాడు ఢిల్లీలోని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ తన సమావేశంలో టండన్ రాజీనామాను స్వీకరించి నెహ్రూను కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉండమని కోరింది అప్పటివరకు తాను కట్టుబడిన "ఒక వ్యక్తి ఒకే పదవి" సూత్రాన్ని ఇది ఉల్లంఘించినా నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని స్వీకరించాడు

తానుగాక మరెవరయినా కాంగ్రెస్ సంస్థకు అధ్యక్షుడయితే బాగుండునని 1954 నాటికి నెహ్రూకు గట్టిగా అనిపించింది ఈ గౌరవం యు యన్ ధేబర్‌కు దక్కింది ఈయన అప్పుడు సౌరాష్ట్రకు, అంటే పశ్చిమ భారత దేశంలో ఇదివరకు



90967

రాజుల రాజ్యాలుగా ఉంది ఆ తర్వాత గుజరాత్‌లో కలిసిన ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉండేవాడు చాలా గౌరవనీయుడు కాని అంత ప్రభావశీలి కాదు

ధేబర్ ఇందిరను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో సభ్యురాలుగా ఆహ్వానించాడు. ఈ కమిటీ పార్టీ విధానాలను రూపొందిస్తుంది ఇందిర అంగీకరించింది కాని అధ్యక్షుడు ప్రతిపాదించిన వ్యక్తిగా కాకుండా ఎన్నికలతో సభ్యురాలయింది రెండేండ్ల తర్వాత పార్టీలో అత్యున్నతమైన పార్లమెంటు బోర్డు మెంబరయింది ఇంకెన్నో మార్పులు రానున్నాయి కాంగ్రెస్ అధ్యక్షుని పీఠం నాలుగేళ్ళు అధిష్ఠించాక 1959లో ధేబర్ ఆ స్థానం ఖాళీ చేశాడు .పార్టీ పెద్దలు, ముఖ్యంగా నెహ్రూ మంత్రివర్గంలో గృహ వ్యవహారాల మంత్రిగా ఉన్న గోవింద్ వల్లభ్ పంత్ సమర్ధనతో ఇందిర కాంగ్రెస్ అధ్యక్షపదవికి పోటీ లేకుండా ఎన్నికయింది ఆమె వృత్తిలో, ఒక విధంగా చెప్పాలంటే ఆధునిక భారతదేశ చరిత్రలో ఇది చెప్పుకోదగిన మార్పు. ఇది చాలా వివాదాస్పదంగా కూడా మారింది నెహ్రూకు తాను సహజమైన వారసుణ్ణని అనుకొంటున్న మొరార్జీదేశాయ్, ఇందిర పార్టీ అధ్యక్ష పదవిని పొందటం, నెహ్రూ ఇందిర తన వారసురాలు కావాలని పన్నిన మొదటి పన్నుగడ అని చాలా ఏళ్ళ తర్వాత తన మనసులోని మాట బయట పెట్టాడు కాంగ్రెస్‌లో చాలా మందికి ఈ భావముంది కానీ ఎవరూ బయటకు చెప్పలేదు ఈ భావం ఎంతమందికున్నప్పటికీ ఇది సరయిన దృక్పధం కాదు

ఇందిర నెహ్రూ కూతురు కాకపోతే 1966లో ఆమె ప్రధానమంత్రి కాలేకపోయేది అని వాదించవచ్చు కాని నెహ్రూ తన కూతురి గురించి ఏమనుకొన్నా, ఏ ఆశలు పెట్టుకొన్నా ఆమెను ఏదైనా పదవిలోకి తీసుకొని రావాలనిగాని, ప్రధానమంత్రిగానో లేదా కాంగ్రెస్ అధ్యక్షురాలిగానో చేయాలని ఏ ప్రయత్నమూ చేయలేదు అంతేగాక ఇందిర కాంగ్రెస్ అధ్యక్షురాలయినపుడు ఒక విలేకరుల సమావేశంలో "నేను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నా కుమార్తె కాంగ్రెస్ అధ్యక్షురాలవటం అంత మంచిది కాదు" అని చెప్పాడు అయినా ధేబర్ ప్రయత్నాన్ని తాను కాదనలేదు నెహ్రూ తన మరణానికి ముందు తన

తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి అని స్పష్టం చేసిన సంగతి గుర్తించవలసి ఉంది ఈ విషయమై సముచితమైన చోట ఈ కథనంలో చెపుతాను నెహ్రూపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వేసే నిందను ఖండిస్తూ నేనిదివరకు "డైనాస్టీస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్ (హార్పర్ కోలిన్స్ ఇండియా, 2003) లో కొంచెం వివరంగా వ్రాశాను

ఇందిర తన 41వ యేట కాంగ్రెస్ అధ్యక్షురాలయింది సరిగా మూడు దశాబ్దాల క్రితం ఆమె తండ్రి నలభై ఏండ్ల వయస్సుకే.కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు రెండేండ్ల పదవీకాలానికి ఎన్నికయినా ఇందిర ఒక సంవత్సరమే ఆ పదవిలో ఉంది తన ఆరోగ్యం ఒక కారణం కాగా, రాష్ట్రాలలో పార్టీనాయకులు పనిచేసే పద్ధతులు ఆమెకు రోత కలిగించాయి కానీ ఆ ఒక్క సంవత్సరంలో ఎంతో ఉత్సాహంగా, దృఢంగా, హుందాగా తాను చేయవలసిన పనులు చేసింది ఆమె జీవిత కథ వ్రాసిన మొదటి రచయితలలో ఒకరయిన ఉమా వాసుదేవ్ ఇందిర సాధించిన వాటిలో ఈ విషయాన్ని నొక్కి చెప్పింది ఇందిర తాను పనిచేస్తూ కాంగ్రెస్‌లో మహిళా విభాగం చేత పనిచేయిస్తూ దేశంలోని సగం జనాభా అయిన స్త్రీలలో పటిష్ఠమయిన స్థానాన్ని సంపాదించింది

చాలామంది ఈ విషయం గుర్తించలేదంటే దానికి కారణం అప్పుడు రాజకీయపరంగా అతి ముఖ్యమైన రెండు నిర్ణయాలను ఆమె ఆమోదింపజేయటమే అనవచ్చు వీటిలో ఒకటి ఆమెను చాలా ప్రశంసలతో ముంచెత్తింది రెండవది చాలా వివాదాస్పదమై ఆమెకు, ఫిరోజ్‌కు మధ్య మరింత దూరాన్ని సృష్టించింది

భారత రాజకీయాల పటాన్ని భాషా ప్రాంతాలుగా చూడాలని కాంగ్రెస్ గాంధీ కాలం నుండి అనుకొన్న విషయాన్ని బట్టే ఈమె నిర్ణయం వచ్చింది భారతదేశంలో 14 ప్రముఖ భాషలు, లెక్క లేనన్ని చిన్న చిన్న భాషలున్నప్పుడు పరిపాలనను ప్రజల మాతృ భాషలో కొనసాగించటమే మంచిదని గాంధీ భావించాడు స్వాతంత్ర్యం, దేశ విభజన తర్వాత వచ్చిన ఉపద్రవం దృష్ట్యా నెహ్రూ భాషా రాష్ట్రాలనే ఇబ్బందుల పెట్టెను తెరవదలచుకోలేదు అయితే ప్రజల భావోద్రేకాన్ని నిలిపే మార్గమే లేకపోయింది

1953లో మద్రాసు (ఇప్పుడు తమిళ్‌నాడు) రాష్ట్రంనుండి తెలుగు మాట్లాడే ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఒత్తిడి తట్టుకోటం కష్టమై పోయింది రాష్ట్రాల పునర్వ్యవస్థీకరించే సమితి (స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిషన్) చేసిన సిఫారసుల ప్రకారం భాషల ఆధారంగా చాలా రాష్ట్రాల సరిహద్దులు మార్చుకో వలసి వచ్చింది అయితే ఈ నియమానికి రెండు మినహాయింపు లున్నాయి ఆ రెండూ ఎంతో ఘర్షణకు, రక్తపాతానికి కూడా దారి తీశాయి

కేవలం పంజాబీ మాట్లాడే శిక్కుల రాష్ట్రానికి నెహ్రూ ప్రభుత్వం అంగీకరించలేదు ఆ రాష్ట్రం శిక్కులు అధిక సంఖ్యాకులున్న రాష్ట్రమవుతుంది దేశ విభజన తర్వాత మతం స్ఫురింపజేస్తూ ఇండియా పాకిస్థానుల సరిహద్దుకు దగ్గరగా రాష్ట్రం ఏర్పడటం ఇబ్బందికరమైనందున నెహ్రూకు నచ్చలేదు

ఇంకొక మినహాయింపు రెండు భాషల రాష్ట్రమయిన బొంబాయి మరాఠీ భాషవారు గుజరాతీ భాషవారు కూడా తమ తమ రాష్ట్రాలు కోరుకొంటున్నా బలవంతాన కలిసి ఉన్నారంటే కారణం మహానగరమైన ముంబయ్ ఇది దేశానికి వాణిజ్య, ఆర్థిక రాజధాని భౌగోళికంగా ఇది మహారాష్ట్రలో ఒక భాగం ఈ నగరం వాస్తవంగానే సార్వజనీనం ఇది సుసంపన్నం కావటానికి కేవలం గుజరాతీ పారిశ్రామికుల పెట్టుబడులు, వ్యాపారాలు మాత్రం కారణం కాదు ఇతర ప్రాంతాల వ్యాపారస్థులు కూడా పెట్టుబడులు పెట్టారు బొంబాయి తన స్వాభావికతను పోగొట్టుకోటం వీరికి కూడా ఇష్టం లేదు ముంబయ్‌ను నగర - రాష్ట్రంగా చెయ్యాలనుకొన్న ప్రతిపాదన ఎంత హింసాత్మకమైన నిరసనకు దారి తీసిందంటే దీని మూలంగా పోలీసుల కాల్పులలో వందమందికి పైగా చనిపోయారు

మూడేండ్ల తర్వాత కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన ఇందిర రెండు భాషల ముంబయ్ ప్రయోగం ఆచరణ సాధ్యం కానందున ప్రయోజనం లేకపోయిందని గుర్తించింది ఇదివరకు తీసుకొన్న నిర్ణయాన్ని మార్చివేయవలసిందని తీర్మానించింది ముంబయ్‌ని మహారాష్ట్రలో చేర్చటానికి గుజరాతీ వ్యతిరేకతను ఎంతో నైపుణ్యంతో ఆగిపోయేటట్లు చేసింది 1 మే 1960 న మహారాష్ట్ర, గుజరాత్‌లు వేరు వేరు రాష్ట్రాలుగా ఏర్పడినపుడు ఆ ఉత్సాహంలో ఇందిర కాంగ్రెస్

అధ్యక్షురాలు కానప్పటికీ అందరూ ఆమెను ఎంతో ప్రశంసించారు. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్నప్పుడు మహారాష్ట్ర, గుజరాత్‌లు ఏర్పడటం కంటె గంభీరమైన విషయంపై ఇందిర ముద్ర మరింత గాఢంగా ఉంది. ఇది కూడా చాలా వివాదాస్పదమయింది. ఆమె ప్రశంసలు, విమర్శలు కూడా స్వీకరించవలసి వచ్చింది.

ఈ సుదీర్ఘమైన, బాధాకరమైన నాటకానికి భారత ద్వీపకల్పంలో దక్షిణాగ్రంలో ఉన్న కేరళ రాష్ట్రం రంగమయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటె ఈ రాష్ట్రంలో, అప్పటికీ, ఇప్పటికీ అక్షరాస్యత ఎక్కువ. ఇక్కడ ఎప్పుడూ రాజకీయ అస్థిరతే కనిపిస్తుంది. రాష్ట్ర జనాభాలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు సమంగానే ఉన్నారు. క్రైస్తవ చర్చికి ఎంతో ప్రభావం ఉంది. ముస్లిం లీగ్ కూడా అంతే. హిందూమతంలో వెనుకబడిన కులాలకు సంబంధించిన సామాజిక మత సంస్థల ప్రభావమూ ఎక్కువే. కమ్యూనిస్టు పార్టీ అనుయాయులూ ఎక్కువే. 1957లో రెండవ సార్వత్రిక ఎన్నికల సమయంలో స్వేచ్ఛాయుతము న్యాయసమ్మతమైన ప్రజాస్వామ్య ఎన్నికలలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎన్నుకొని గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించిన ఘనత ప్రంచ దేశాలన్నిటిలో కేరళకే దక్కింది.

దేశంలోకంటే విదేశాలలోనే ఎక్కువ ఆందోళన వ్యక్తమయింది. కేరళలోవలె భారతదేశమంతా కమ్యూనిస్టులకు ఓటు చేస్తే ఏమవుతుందని పత్రికా విలేకర్ల సమావేశంలో విదేశీ విలేకర్లు అడిగారు. దానికి నెహ్రూ ఈ విధంగా సమాధానమిచ్చారు. "ఆ దురదృష్టకరమైన సమయం వచ్చినపుడు మేము దానిని ఎదుర్కొంటాం." కేరళ "ఇండియాకు యేనన్" అయిందని కొందరు దుఃఖపడ్డారు. అంటే చైనా కమ్యూనిస్టులు అక్కడినుండి మొత్తం చైనాలో వ్యాపించిన తీరు గుర్తు చేయటమన్న మాట. ఈ పోలిక అర్థహీనమే. కాని త్రివేండ్రంలో మంత్రి పదవులలో ఉన్నవారి అభిమతాల గురించి ఎన్నో అనుమానాలుండేవి. కేరళ కమ్యూనిస్టులు ఆమోదించిన రెండు చట్టాలు కూడా పెద్ద ఆందోళనకు దారి తీశాయి. ఒక చట్టం కౌలుకు పని చేస్తున్న రైతుల హక్కుల రక్షణకు సంబంధించింది కాగా మరొకటి ప్రైవేటు విద్యా సంస్థలను నియమితం చేసే చట్టం. ఈ సంస్థలు

కూడా అసంఖ్యాకంగా అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి. క్రైస్తవ చర్చి, ముస్లింలీగ్, హిందూ నాయర్ సొసైటీ ఎన్నో సంస్థలను తమ అధ్వర్యంలో నడుపుతున్నాయి. అమితమైన భూసంపద ఉంది వీరందరూ కలిసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని వెంటనే తొలగించవలసిందిగా సామూహిక ఆందోళన ప్రారంభించారు రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ఉద్యమంలోకి జొరబడింది

న్యూఢిల్లీలో ఉన్నత కాంగ్రెస్ నాయకత్వంలో ఏకాభిప్రాయం లేదు ప్రజాస్వామ్య నియమాలను నిష్ఠగా ఆచరించే నెహ్రూ, పద్ధతి ప్రకారం ఎన్నికయిన ప్రభుత్వాన్ని ఒక రాష్ట్రం నుండి తొలగించటానికి కేంద్రం అసాధారణమైన అధికారాలు ఉపయోగించకూడదని భావించాడు. కేరళ ముఖ్యమంత్రి అయిన ఇ.యమ్ యస్ నంబూదిరిపాద్ తో చర్చించి ఆ రెండు వివాదాస్పదమైన చట్టాల విషయంలో ప్రజల ఓటు కోరమని అడిగాడు నంబూదిరిపాద్ ఈ ప్రతిపాదనకు అంగీకరించ లేదు కాంగ్రెస్ సంప్రదాయ వాదులు సమర్థించగా ఇందిర కమ్యూనిస్టు ముఖ్యమంత్రితో మాట్లాడటం వ్యర్థమని తన తండ్రికి తెలియ జేసింది కాబట్టి నంబూదిరిపాద్ ప్రభుత్వాన్ని తొలగించమనికోరింది నెహ్రూ ఎంతవద్దనుకొన్నా ఈమె అభిప్రాయానికే సమర్థన లభించింది రాబోయే ఎన్నికలలో కమ్యూనిస్టులను ఓడించటానికి ఇతర పార్టీలతో ఇందిర మంతనాలు జరిపింది విజయం సాధించింది ముస్లింలీగ్ ఆ పార్టీలలో ఒకటయినందున కాంగ్రెస్‌కు కొంచెం ఇబ్బందికరమైంది

1950 నుండి 1984 వరకు ఇందిర తన అమెరికన్ స్నేహితురాలు డోరతీ నార్మన్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేది ఆమె ఇందిరకంటె 12 ఏండ్లు పెద్ద ఆమెను ఇందిర పూర్తిగా నమ్మింది మొదట్లో వ్రాసిన ఒకానొక ఉత్తరంలో "ఇతరులకెవరికీ చెప్పటానికి సాహసించని విషయాలు నీకు చెప్పగలను" అని వ్రాసింది కేరళ సంక్షోభం పతాకస్థాయిలో ఉండగా ఇందిర డోరతికి వ్రాసిన ఉత్తరం తనకు తన భర్తకు ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని తెలియజేస్తుంది తాను "ఇబ్బందుల సముద్రంలో" ఉన్నట్టు, అది తనను "ముంచి వేస్తున్నట్టు" వ్రాసిన ఇందిర ఈ విషయాలు కూడా వ్రాసింది "ఇక ఇంటి విషయానికి వస్తే,

ఫిరోజ్‌కు నేనంటే పడనేపడదు నేను (కాంగ్రెస్) ప్రెసిడెంటు అయిన తర్వాత తను చూపిస్తున్న శత్రుత్వం గాలినే విషపూరితం చేస్తుందనిపిస్తుంది దురదృష్ట వశాత్తు తను, తన స్నేహితులు కొందరు మా మంత్రులలో కొందరితో స్నేహంగా ఉంటారు అతికష్టమైన పరిస్థితులు సృష్టిస్తున్నారు . " ఇందిరకు అతనంటే ఎందుకు కోపమో, దీనివల్ల తెలుస్తుంది కేరళలో తొందరపాటు చర్యను తన తండ్రి వ్యతిరేకించాడు భేదాభిప్రాయాలను తండ్రీ కూతుళ్ళు వేరుగా చర్చించుకొనేవారు కేరళ విధానం గురించి ఆమె భర్త పోరాటం బహిరంగంగా జరిగేది తోటి యం పి లతో, మంత్రులతో, పత్రికలతో ఏదో పూనకం వచ్చినట్లు వ్యతిరేకంగా ప్రచారం చేయసాగాడు

విస్ఫోటకమైన కేరళ సంఘటన తర్వాత 13 నెలలకే ఫిరోజ్ చనిపోయాడు ఫిరోజ్ జీవించి ఉండగా సాధించలేనిది మరణంలో సాధించాడు అతని మరణం "హృదయాన్ని బద్దలు చేసే" ఆఘాతంగా ఇందిర గుర్తించింది తనని "స్తబ్దం చేసిన దుఃఖాన్ని" గురించి ఆమె డోరతికి చాలా సార్లు వ్రాసింది ఏదేమైనప్పటికీ "కష్టాలు, ఒత్తిడి వచ్చినపుడు ఫిరోజ్ ఎప్పుడూ నాతోనే ఉండేవాడు" అని కూడా వ్రాసింది సుమారు రెండు దశాబ్దాల తర్వాత తన చిన్న కొడుకు మరణం ముందు ఇందిర "నా జీవితంలో ముఖ్యమైన మృత్యువు నా భర్త మరణం" అని రచయిత డౌమ్ మొరాయిస్‌తో చెప్పింది ఫిరోజ్‌కు తన ఇద్దరు కొడుకులంటే ఎంతో ప్రేమని, ఆయన లేని లోటు వాళ్ళిద్దరికీ ఉందని ఇందిరకు తెలుసని ఆమె గురించి తెలిసిన వాళ్ళకు తెలుసు

ఇందిరకు తన తండ్రితో గల సంబంధంలో కూడా సంక్లిష్టత ఉంది ఒకరి మీద మరొకరికి ప్రేమ ఉండేది కాని తండ్రి చేస్తున్నది సరికాదని, లేదా ఆయనను ఇతరులు తమ ప్రయోజనానికి వాడుకొంటున్నారని అనుకొన్నప్పుడు ఇందిర తండ్రితో తీవ్రంగా వాదించేది 1990లో ఇందిరాగాంధి పెద్దకోడలు సోనియా గాంధి తండ్రీ కూతుళ్ళ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను రెండు పుస్తకాలుగా ప్రచురించినపుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది (ఫ్రీడమ్స్ డాటర్ అండ్

టు అలోన్, టు టుగెదర్ – హోడర్ అండ్ స్టౌటన్, 1990) ఇందిర అవిరామంగా ఉత్తరాలు వ్రాసేదని అందరికీ తెలుసు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు ఎన్నో కార్యకలాపాల వల్ల సమయం లేకపోయినప్పటికీ తను స్వయంగా ఎన్నో ఉత్తరాలకు జవాబిచ్చేది అసలు ఏమాత్రం పరిచయం లేనివారికి కూడా వ్రాసేది ప్రతి ఉత్తరంలో తానే సంతకం చేసేది అమెరికా అధ్యక్షుల్లా అచ్చయిన తన సంతకం ఉపయోగించటానికి ఆమె ఒప్పుకోలేదు. ఇందిర తండ్రి నుండి దూరంగా ఉన్నప్పుడే కాకుండా ఒకే ఇంట్లో ఉంటున్నప్పుడు కూడా తండ్రికి ఉత్తరాలు వ్రాసేదని ఆ తర్వాత చాలా ఏళ్ళకు తెలిసింది ఎదురెదురుగా వాదించుకోటం ఇష్టం లేని పరిస్థితులలో చాలావరకు ఆమె ఈ విధంగా చేసేది

ఉదాహరణకు 1958 మే నెలలో నెహ్రూ బల్లమీద ఆమె ఒక ఉత్తరం పెట్టింది అప్పుడు నెహ్రూ రాజీనామా ఇవ్వదలచుకొన్నాడు కాని తన కాంగ్రెస్ పార్టీ అలా చేయవద్దని ఆయనను కోరింది ఇందిర ఉత్తరంలో మర్యాదగా "మీకు సలహా ఇచ్చే అంతటిదానను కాను" అని చెప్తూ నిర్మొహమాటంగా ఈ విధంగా అడిగింది "ఒకసారి ప్రధాన మంత్రి పదవికి రాజీనామా ఇస్తానని సూచించి ఆ తర్వాత వెనక్కి తగ్గటం సబబేనా?" కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించే విషయంలో వారిద్దరి మధ్య వచ్చిన తీవ్రమైన భేదాభిప్రాయాలు వచ్చినపుడు ఆమె వ్రాసిన ఉత్తరం మరింత తీవ్రంగా ఉంది "(కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా) జరిగే ఆందోళనను మతపరమని అనకూడదు కమ్యూనిస్టులతో పాటు కేరళలో అంతా మతపరమైనందునే ఇది మతపరమనుకోవచ్చు "

1953 నుండి 31 ఏండ్లు ఇందిరాగాంధీతో పనిచేసిన ఉషాభగత్ (అప్పుడప్పుడు ఇందిర 'మనసు మారినపుడు' అవరోధాలొచ్చాయి) తన తండ్రితో ఇందిర కోపంగా మాట్లాడటం, తాను ఇతర సిబ్బంది ఒకసారి వినినట్టు చెప్పింది. దీనికి కోపం తెచ్చుకోకుండా నెహ్రూ "నవ్వుతూ" పద్మజానాయుడుతో జరిగినదంతా చెప్పాడు అప్పుడు పద్మజానాయుడు కొన్నాళ్ళుగా ప్రధానమంత్రి ఇంట్లోనే ఉంటోంది. ఇందిర ఎందుకు కోపగించిందో భగత్ తన పుస్తకం ఇందిరాజీ (పెంగ్విన్, 2005)లో చెప్పలేదు.

**ఉన్నత హిమాలయాలపై యుద్ధం**

ఇందిర కేరళ విషయమై పోరాడి గెలుపొందుతున్న సమయంలో దేశంలో ఆ చివర ఉన్నతమైన హిమాలయాలల్లో మరింత భీకరమైన పెద్ద పోరాటానికి బీజాలు పడుతున్నాయి హిందీ–చీనీ భాయి భాయి (భారతీయులు – చైనీయులు సోదరులు) అనే ఉత్సాహ భరితమైన రోజుల్లో కూడా ఆసియా ఖండంలో పెద్దవైన ఈ రెండు రాజ్యాల సంబంధాలలో నిబిడీకృతమైన ఉద్రిక్తత ఉంది ఆ తర్వాత పరిస్థితులు మరీ అధ్వాన్నమయ్యాయి దీనికి ఎన్నో కారణాలున్నాయి. మార్చి 1959లో టిబెట్‌లోని తిరుగుబాటు వల్ల దలైలామా భారతదేశానికి పారిపోయివచ్చాడు భారతదేశం వెంటనే అతనికి ఆశ్రయమిచ్చింది ఇది ఒక కారణంకాగా దీనికంటే మించిన కారణం చైనా సోవియెట్‌లు విడిపోవటం సోవియెట్ యూనియన్ చైనా కంటె భారతదేశం పట్ల మొగ్గు చూపించింది ఇంతలో చైనా మొదట్లో ఏమాత్రం చర్చించకుండా ఒక్కసారిగా భారతదేశంలో పెద్ద పెద్ద భూభాగాలు తనవని ప్రకటించింది ఇది మావోజెడోంగ్ నాయకత్వంలో ఉన్న చైనా నాయకులకు యుద్ధ కారణాన్ని సృష్టించింది చైనా విషయాల్లో విశేషజ్ఞుడు, రోడిరిన్, మాక్‌ఫార్‌ఖుహార్ దీనిని "మావో భారతయుద్ధమ"ని సరిగా చెప్పాడు

ఈ క్రూరమైన సరిహద్దు యుద్ధం ఉన్నత హిమాలయాలమీద ఒకనెలపాటు జరిగింది వెనక్కి తిరిగి చూసుకొంటే ఇది చిన్న యుద్ధమే ఎందుకంటే రెండు సైన్యాలలోను చిన్న దళాలుమాత్రమే యుద్ధంలో పాల్గొన్నాయి కాని ఆ సమయంలో యుద్ధానికి తలపడటమన్నది సైనికంగా, రాజకీయంగా అవమానకరమైన ఓటమిగా తోచింది "చైనా మోసం చేస్తుంద"ని భారతదేశం ఎన్నడూ అనుకోలేదు సరిహద్దులలో తగాదాలు, పోరాటాలు ఉన్నా అవి అక్కడి రక్షణ దళాల స్థాయిలో ఉన్నాయని, చైనా "పెద్దగా ఏదీ చెయ్యద'ని నెహ్రూ భావించాడు సివిలియన్, మిలిటరీ సలహాదార్లెవరూ ఆయన అభిప్రాయాన్ని కాదనలేదు. దీని ఫలితంగా సైనికదళాలను పరిస్థితులు బాగలేని ఉన్నత హిమాలయాల వైపు పరుగెత్తించవలసి వచ్చింది అన్నీ చక్కగా అమర్చుకొని, చక్కగా శిక్షణ పొంది, వాతావరణానికి

బాగా అలవాటు పడ్డ చైనాదళాలు పై నుంచి త్వరగా కిందకు రాసాగాయి వెనక్కి తిరగటం ఓటమికి దారి తీసింది ఒక్కసారిగా జాతీయ స్థాయిలో మనోధైర్యం సడలింది నెహ్రూ జీవితకధను అధికారికంగా వ్రాసిన యస్ గోపాల్ ఈ విధంగా అంటాడు "పరిస్థితులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయంటే నిజంగా ఆవిధంగా జరగకపోతే జరిగాయని ఊహించటం కూడా కష్టమయ్యేది " భారతదేశ అధ్యక్షుడు యస్ రాధాకృష్ణన్ ప్రభుత్వం "ఎక్కువగా నమ్మి, నిర్లక్ష్యం చేసింద"ని నిందించాడు "మనమై సృష్టించుకొన్న ఒక కృత్రిమ ప్రపంచంలో మనం ఉంటూ వచ్చాం " అని నెహ్రూ స్పష్టంగా ఒప్పుకొన్నాడు చైనీయులు లెక్కప్రకారం వేసుకొన్న పధకాన్ని అనుసరించి ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించి వివాదగ్రస్తమైన సరిహద్దు నుండి ఉత్తరానికి తరలిపోవటం ప్రారంభించారు

ఇంత దుఃఖభరితమైన వాతావరణంలో ఇందిర నాయకత్వం విషయంలో తన శక్తి సామర్ధ్యాలు చూపించుకొంది కాని దీనికి ఎక్కువ గుర్తింపురాలేదు తన తండ్రి అనుమతికోసం ఎదురుచూడకుండా ఈశాన్య భారతదేశంలో ఉన్న తేజ్‌పూర్‌కు బయలుదేరింది అక్కడ విచలితులైన ప్రజలకు, గాయపడ్డ సైనికులకు సానుభూతి తెలిపి, ఆసరాగా నిలిచి, అవసర వస్తువుల సరఫరా చూడటానికి వెళ్ళింది ఒకసారి తేజ్‌పూర్ నుండి ఢిల్లీకివచ్చి కేవలం ఎనిమిది గంటలు గడిపింది ఉత్సాహం కలిగించేటట్లు రేడియోలో మాట్లాడింది ఆ తర్వాత విమానంలో పర్వతాలవైపు వెళ్ళింది యుద్ధం తర్వాత పరిస్థితిని ఎదుర్కోటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పౌరుల సమితికి ఇందిర ఉపాధ్యక్షురాలయింది.

చైనాతో సరిహద్దు యుద్ధం భారతదేశ గౌరవాన్ని, భౌతికంగా నెహ్రూ ఆరోగ్యాన్ని భంగపరచింది వాస్తవానికి ఈ దెబ్బనుండి నెహ్రూ కోలుకోలేకపోయాడు 1963 లో ఆయన పార్టీ ప్రతిష్ఠాత్మకమైన మూడు పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పాత సహచరులు అతనిని రాజీనామా చెయ్యమని అడిగారు దానికి ఆయన గట్టిగా జవాబు చెప్పగా "ఓటమి తన తలకెక్కినట్టుంది" అని కొందరు ఆయనను విమర్శించారు. 1962లో యుద్ధం తర్వాత ఆయన మరణానికి

ముందు రెండు సంవత్సరాలు విషాదభరితంగా, సంధ్యా సమయంగా కనిపించాయి.

జనవరి 1964లో ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో నెహ్రూ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొంటున్నప్పుడు ఆయనకు పక్షవాతం వచ్చింది ఢిల్లీకి చక్రాల కుర్చీలో రావలసి వచ్చింది కాని ఆయన ప్రభుత్వ పదవి వదలలేదు కాని బరువైన బాధ్యతలు నిర్వహించటానికి ఇదివరకటి కంటె ఎక్కువగా ఆయనకు సహాయం కావలసి వచ్చింది. ఆయన ఎంచుకొన్న ఇద్దరు కాబినెట్ మంత్రులు, ఇందిర కావలసిన సహాయం అందజేశారు అనిర్వచనీయమైనా, నిస్సందేహంగా ఆమె ప్రభావం ఎక్కువకావటం స్పష్టంగా కనిపించసాగింది

నెహ్రూ మే 27, 1964న మరణించాడు ఆ రోజు చాలా ఎండగా, ధూళిభరితంగా ఉంది బుద్ధుని 2508 వ జయంతి, జ్ఞానోదయం, వర్ధంతికూడా ఆ దినమే జీవితమంతా బుద్ధుని భక్తుడైన వ్యక్తి నిర్గమించటానికి అది సరయిన తరుణమే ఇందిర ఒక్కతే అనాధ కాలేదు సుమారు 600 మిలియన్ల (60 కోట్ల) ప్రజలు కూడా అదే విధంగానే బాధపడ్డారు ఆమె ఎంతో దుఃఖ భారంతో ఉన్నప్పటికీ, తన భావాలను అణచుకొని కళ్లను పొడిగా ఉంచుకోగలిగింది ప్రపంచంలోని నలుమూలల నుండి ప్రముఖులు ఢిల్లీకి వస్తున్నందున నెహ్రూ అంత్యక్రియలు మరుసటి రోజుకు వాయిదా వేయవలసి వచ్చింది తండ్రి పార్థివ శరీరం ప్రజల దర్శనార్థమై పెట్టినపుడు ఇందిర ఆయన పక్కనే కూర్చుంది అంత్య క్రియలు జరిగే రోజు ఉదయం నెహ్రూ వ్యక్తిగత సిబ్బంది ఆయన చుట్టూ చెదిరిన తలలతో, పెరిగిన గడ్డాలతో కూర్చుని ఉండటం చూసి ఇందిర వారినందరినీ ఇంటికి వెళ్ళి, గడ్డం చేసుకొని, స్నానం చేసి, బట్టలు మార్చుకొని రమ్మని పంపింది "మా తండ్రికి శుభ్రత అంటే ఇష్టం ఈ రోజు ఆయన చుట్టూ అపరిశుభ్రత పనికిరాదు" అని చెప్పింది



## —3—

# శాస్త్రి ప్రవేశం

నెహ్రూ చరిత్రలోకి వెళ్ళకముందే భారతదేశము, బయటి ప్రపంచము "నెహ్రూ తర్వాత ఎవరు?" అనే ప్రశ్నతో సతమతమవుతూ వచ్చింది  కొందరు "నెహ్రూ తర్వాత ఏమిటి?" అని కూడా అడుగుతూ వచ్చారు  నెహ్రూ తర్వాత భారతదేశం ఒకటిగా ఉంటుందా? అని వారి ఉద్దేశం అయి ఉంటుంది  కాని నెహ్రూ మరణించేటప్పటికి అటువంటి ప్రశ్నలన్నీ నిరర్థకమయ్యాయి  ఇదివరకు చెప్పినట్లు నెహ్రూ తర్వాత ఎవరనే విషయం తేలిపోయింది  నెహ్రూ పదవీభారం లాల్ బహదూర్ శాస్త్రి భుజాలమీద పడుతుందన్నది స్పష్టమయింది  పొట్టిగా, అచ్చమైన భారతీయునిగా అందరి గౌరవానికీ పాత్రుడైన శాస్త్రి వయస్సు యాభై ఎనిమిది  చాలా ఏండ్లుగా పార్టీలో పనిచేశాడు  మంత్రి పదవులు నిర్వహించాడు  పరస్పరం రాజీచెయ్యటానికి ఈయనది పెట్టింది పేరు  ఈ అత్యున్నత పదవికి లాల్ బహదూర్ శాస్త్రికి ఏ విషయంలోను అసలు పోలిక లేదు

దేశాయికి అప్పుడు దగ్గరదగ్గరగా డెబ్బయి ఏండ్లు  ఆ తర్వాత ఆయన ఇంచుమించు నూరేండ్లు వచ్చేవరకు ఉన్నాడు  ఆయన సీనియర్ పార్టీ నాయకుడు  అనుభవజ్ఞుడైన పరిపాలకుడు  ప్రధానమంత్రి కావటానికి ఆయనకు తగిన అర్హతలున్నాయి  నెహ్రూ మరణానికి రెండేండ్ల ముందువరకు దేశాయిని "సహజమైన వారసుని" గా అందరూ భావించేవారు  దానిని దేశాయ్ కంటె ఎక్కువగా నమ్మినవారు లేరు  కాని ఆయన మొండిపట్టుదల, అసలు సహనం లేకపోవటం, కొన్ని విచిత్రమైన ధోరణులవల్ల ఆయన పట్ల వ్యతిరేకభావం పెరిగింది  మద్యపాన నిషేధం పట్ల ఆయనకు గల పట్టుదల వల్ల ఆయనకు "అసలు మద్యం ముట్టని మతస్థుడు" అని పేరు వచ్చింది  తనను మించి పై

ఎత్తులు వేసిన అందరిపైనా, తన స్థానంలో శాస్త్రిని కోరుకొన్న నెహ్రూ పైన ఆయనకు చాలా కోపం వచ్చింది కాని అనివార్యమైన విషయాలకు తలవంచక తప్పలేదు

దేశాయిని పోటీకి లేకుండా చేసి నెహ్రూ నుండి శాస్త్రికి అధికారం సంక్రమించేటట్లు చేయటం కాంగ్రెస్ పార్టీ నాయకులు జాగ్రత్తగా వేసిన పథకం ప్రకారం జరిగింది దీనికి బాధ్యత వహించింది నిపుణుడైన తమిళనాడు ముఖ్యమంత్రి కె కామరాజ్ ఈ సముదాయానికి "సిండికేట్" అన్న పేరు చక్కగా కుదిరింది ఇందులో ఇతర సభ్యులు పశ్చిమ బెంగాలుకు చెందిన అతుల్యఘోష్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంజీవరెడ్డి, కర్ణాటకకు చెందిన యస్ నిజలింగప్ప, ఒరిస్సాకు చెందిన బిజూ పట్నాయక్, ముంబయ్‌కి చెందిన యస్ కె పాటిల్ ఆగస్టు 1913లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని కామరాజ్ తన పథకం ప్రవేశ పెట్టటానికి ఉపయోగించుకొన్నాడు ఆ తర్వాత దీనిని ఆయన పేరుతోనే పిలవటం జరిగింది "పార్టీని బలపరచటానికి" పనిచేయటం కోసం తాను తమిళనాడు ముఖ్యమంత్రి పదవినుండి వైదొలగుతున్నానని, అదే విధంగా చాలా కాలం మంత్రి పదవుల్లో ఉన్నవారు అవిధంగానే చేయాలని ఆయన సూచించాడు నెహ్రూ ఈ అభిప్రాయానికి స్వాగతం పలికాడు తాను "కామరాజ్ పథకాన్ని" అవలంబించేవారిలో మొదటి వాడినని ప్రకటించాడు దీనికి ఎవ్వరూ ఒప్పుకోలేదు ఆయన పదవిలో కొనసాగాలని అందరూ కోరారు మొత్తానికి కామరాజ్ పథకం సారాంశాన్ని అందరూ అంగీకరించారు ముఖ్యమంత్రులు, యూనియన్ కాబినెట్ మంత్రులు తమ రాజీనామా సమర్పించారు ప్రతి వర్గంలోను ఆరు చొప్పున రాజీనామాలను నెహ్రూ స్వీకరించాడు

కామరాజ్ పథకం అసలు నెహ్రూ "పథకమే" నని దేశాయ్ ఆ తర్వాత అన్నాడు (అప్పుడు సిండికేట్ మెంబరు ఆ తర్వాత 1977-79 లో దేశాయ్ మంత్రి వర్గంలో మంత్రి అయిన బిజూ పట్నాయక్ ఇది నిజం కాదని గట్టిగా వాదించాడు) మంత్రి పదవులనుంచి తొలగించినవారిలో దేశాయ్ మొదటివాడు ఈ పట్టికలో ఆశ్చర్యకరమైన పేరు శాస్త్రిది యస్ గోపాల్ మాటల్లో శాస్త్రి ఒక విధంగా "వలపన్నటానికి ఉపయోగపడిన ఏనుగు దీనితో నెహ్రూ తాను

వద్దనుకొన్నవారిని తొలగించటానికి, తన వ్యక్తిగత కారణాల వల్ల ఆ విధంగా జరగలేదని కనిపించటానికి వీలుపడింది." శాస్త్రిని మళ్ళీ పదవిలోకి ఏదో ఒక నెపంతో తీసుకురావటం జరుగుతుందని చాలామందికి తెలుసు త్వరగానే శాస్త్రి పదవిలోకి వచ్చాడు దీనికి ఏ నెపమూ వెతుక్కోనవసరం లేకపోయింది భువనేశ్వర్‌లో నెహ్రూ ఆరోగ్యం దెబ్బ తిన్నాక, ఏ మంత్రిత్వ శాఖా లేని మంత్రిగా శాస్త్రి నియమింపబడ్డాడు ప్రధానమంత్రికి ఆయన సహాయం కావలసి వచ్చింది నెహ్రూ మరణం తర్వాత సర్వసమ్మతితో జూన్ 9, 1964న శాస్త్రిని తమ నాయకునిగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఎన్నుకొంది వెంటనే ప్రధానమంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశాడు

వాస్తవాలు ఈ విధంగా ఉండగా నెహ్రూ తన ప్రియమైన కూతురు తన తర్వాత పదవిని పొందాలని కోరుకొన్నాడని అనుకోటానికి తావేముంది? శాస్త్రి కావాలని, దేశాయి వద్దని ఆయన అనుకోటం స్పష్టంగా తెలుస్తోంది ఇందులో ఇందిర ప్రసక్తే లేదు ఒకవేళ నెహ్రూ ఆమెకు పదవి రావాలని అనుకొని ఉంటే దాని విషయమై ఏదైనా ప్రయత్నం చేసేవాడు కదా! అసలు ఆమెను పార్లమెంటు ఎన్నికలలో పాల్గొనమని కూడా ఆయన ప్రోత్సహించలేదు. అంతకు ముందు సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, రాజాజీ (సి రాజగోపాలాచారి) కొడుకులు పార్లమెంటుకు ఎన్నికయ్యారు ఎవరూ బంధుప్రీతి గురించిగాని, వంశపాలన గురించిగాని మాట్లాడలేదు ఢిల్లీలో ఉన్న అమెరికన్ జర్నలిస్టు వెల్స్ హాంగెన్ వ్రాసిన "నెహ్రూ తర్వాత ఎవరు?" అనే పుస్తకంలో ఆయన వారసులుగా దేశాయి, శాస్త్రి, ఇందిర పేర్లు వరుసగా పేర్కొన్నాడు నెహ్రూ ప్రతిక్రియ ఆయన దృక్పథాన్ని తెలియజేస్తుంది నెహ్రూ ఈ ప్రకటన పట్ల చికాకు వ్యక్తపరిచాడు "ఆ అమెరికన్" కు ఇంటర్వ్యూ ఇచ్చినందుకు ఇందిరపై కోపగించాడు. వంశపారంపర్యంగా వారసత్వం అనేది "మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తెలియదు పైగా నా మనసుకే జుగుప్స కలిగిస్తోంది" అని బహిరంగంగా ప్రకటించాడు అయినా నెహ్రూ తన స్థానం తన కుమార్తె పొందాలని కుట్ర చేసినట్లు దేశాయి అప్పుడు నమ్మాడు. తన జీవితాంతం నమ్ముతూ వచ్చాడు. కామరాజ్ పథకాన్ని నెహ్రూ

ఆమోదించినందున ప్రత్యక్షంగా లాభం పొందిన శాస్త్రి కూడా "పండిట్‌జీ తన హృదయాంతరాళంలో తన కూతురు తన వారసురాలు కావాలనుకొంటున్నారు" అని నమ్మాడు "ఆయన (నెహ్రూ) ఆమాట బయటకు ఎందుకు చెప్పరు?" అని కూడా అన్నాడు

ఈ ఆత్మాశ్రయమైన అంచనాలను కాదనటానికి కావలసినంత సాక్ష్యముంది నెహ్రూ తన కూతురుని ముందుకు తీసుకురావాలని ఏమాత్రం ప్రయత్నించకపోగా, అసలు ఇందిర కూడా తన తండ్రి వారసత్వం తనకు రావాలని ఏమాత్రం అనుకోలేదు ఆమె దుఃఖభారంతో ఉంది శాస్త్రి మంత్రి వర్గంలో మంత్రిగా కావాలని కూడా ఆమెకు లేదు కాని శాస్త్రి చాలా పట్టుబట్టాడు ఆమె అప్పుడు డోరతీనార్మన్‌కు వ్రాసిన ఉత్తరం లండన్‌కు వెళ్ళి "కనీసం ఒక సంవత్సరమైనా" తాను అక్కడ ఉండాలనుకొంటున్నట్టు తెలియజేస్తుంది ఆమె కొడుకు లిద్దరూ అప్పుడు బ్రిటన్‌లో ఉన్నారు రాజీవ్ కేంబ్రిడ్జిలో ఉన్నాడు సంజయ్‌కు కార్లంటే అప్పటికే తగని పిచ్చి క్రూవ్‌లో రోల్స్‌రాయ్స్ ఫ్యాక్టరీలో తాను పనినేర్చుకొంటున్నాడు ఏది ఏమైనా శాస్త్రి ఇందిరను తన మంత్రివర్గంలో చేరమని కోరాడు తనకు ఏదైనా "తేలికైన మంత్రిత్వశాఖ" ఇవ్వమని ఆమె సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను కోరింది

## ఇబ్బందికరమైన సమీకరణ

ఇందిర తన మంత్రి వర్గంలో చేరాలని పట్టుబట్టటంలో శాస్త్రి ఉద్దేశాలు మిశ్రమంగా ఉన్నాయి తనకున్న ఎన్నో గుణాలవల్ల తాను ప్రధానమంత్రి అయ్యాడు అయినా అది నెహ్రూ తనకిచ్చిన కానుక తాను కృతజ్ఞతలేని వాడుగా కనిపించకూడదన్నది తన అభిమతం నెహ్రూ కూతురు తన మంత్రులలో ఉంటే తనకు కొంత శక్తి ఉంటుందనికూడా అనుకొన్నాడు చాలా మంచివాడు, మర్యాదను పాటించేవాడు అయిన శాస్త్రి దృఢమయిన, తెలివైన రాజకీయవేత్త తన హితాన్ని ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసు తన మంత్రివర్గంలో తనకు పోటీగా ఎవరూ ఉండకూడదని కూడా ఉంది అందుకే మొదటినుండి శాస్త్రి–ఇందిర సమీకరణలో కొంచెం వైరుధ్యం ఉంటూ వచ్చింది త్వరలోనే పరిస్థితి దిగజారిపోయింది

అసలు ఏమవుతున్నదో ఇందిర త్వరగానే గ్రహించింది. శాస్త్రి ఆమె పట్ల వినయంగా ఉంటున్నాడు ముఖ్యమైన కాబినెట్ కమిటీలలో ఆమెకు స్థానం కల్పించాడు. కాని విధానం రూపొందించటంలో ఆమె కేమంత ప్రాముఖ్యమివ్వలేదు.

కీలకమైన పదవులలో నియామకం జరుగుతున్నప్పుడు ఆమెకు ఆ విషయాలేవీ చెప్పలేదు లండన్‌లో కామన్‌వెల్త్ ప్రధాన మంత్రుల సమావేశానికి ప్రధానమంత్రి తరఫున ఇందిర వెళ్ళింది అప్పుడు ఆమెను సంప్రదించకుండా విదేశ వ్యవహారాల మంత్రిని నియమించినపుడు ఆమె బాధపడింది. ఆమె తిరిగిరాగానే జూనియరు మంత్రులు కొందరు ఆమెను చుట్టుముట్టి శాస్త్రి ఆమె తండ్రి విధానం నుండి ఎలా వైదొలగుతున్నాడో చెప్పారు ఆమె తన అలవాటు ప్రకారం ఏమీ మాట్లాడలేదు కాని ఆమె చర్యలు మాత్రం మాట్లాడాయి

1965 ప్రారంభంలో దక్షిణాన తమిళనాడులో భాష విషయమై అల్లర్లు జరిగాయి శాస్త్రి ప్రభుత్వం హిందీకి చెందని ప్రజలపై హిందీ రుద్దుతోందనే భావన కలిగింది. నెహ్రూ ఆవిధంగా జరగదని ఇదివరకే హామీ ఇచ్చాడు. పరిస్థితి క్లిష్టంగా ఉంది శాస్త్రిగాని, అప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న కామరాజ్‌గాని కల్లోల భరితమైన ఆ రాష్ట్రానికి వెళ్ళాలనుకోలేదు. ఇందిర దొరికిన మొదటి విమానమెక్కి ఆ తుఫాను నెదుర్కోటానికి వెళ్ళింది ఆందోళన చేస్తున్న వాళ్ళతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది ఇది శాస్త్రికి ఏమాత్రం నచ్చలేదు. అయన సహోద్యోగులు ఆమె "ప్రధానమంత్రి తలను దాటి వెళ్ళటానికి" ప్రయత్నించిందని ఆయనతో చెప్పారు ఈ విషయం ఆమెకు తెలిసినపుడు ఆమెకు చాలా కోపం వచ్చింది. తమిళనాడు విషయంలో జరిగినట్లు, అవసరమైన చోటల్లా తాను చేస్తానని ఆమె గట్టిగా చెప్పింది

ఆ తర్వాత కొన్నేళ్ళకు నాకు తెలిసింది ఆమె అప్పుడు జి పార్థసారథిని సంప్రదించిందని. ఆమె చివరిరోజువరకు ఆయన ఆమెకు సలహాదారుగా ఉన్నాడు తాను ప్రభుత్వం నుండి రాజీనామా ఇవ్వటమే గాక రాజకీయాల నుండే విరమించుకొని తనకు నచ్చిన కళలు, వాస్తు శిల్పము, గృహాలంకరణ వంటి

విషయాలలో శ్రద్ధ చూపించాలను కొంటున్నట్టు ఆమె జి పార్థసారథితో చెప్పింది "జి పి " శాంతంగా ఉంటూ క్లుప్తంగా మాట్లాడే మనిషి. ఆమెను ఆవిధంగా చేయవద్దని సలహా ఇచ్చాడు "భవిష్యత్తులో ఏముందో మనకు తెలీదు" అన్నాడు ఆ మాటల ప్రాముఖ్యం జి పి గుర్తించాడా అనేది అనుమానమే

అగస్టు 1965లో పాకిస్థాన్ కాశ్మీరులోకి చాలామంది సాయుధులను తరలించింది అక్కడ తిరుగుబాటు కలిగించటం దాని ఉద్దేశం కాశ్మీరును భారతదేశం నుండి ఎలాగైనా లాక్కోవాలని పాకిస్థానుకు ఉంది తను ఇదివరకే చెప్పినట్టు ఇందిర వెంటనే అక్కడికి ప్రయాణమయింది చీరలో ఉన్న ఈ సన్నటి వ్యక్తి దాడి చేస్తున్న వారితో వ్యవహరిస్తున్నవారికి గొప్పస్ఫూర్తి దాయకమయింది. ఆమె ఢిల్లీకి రాగానే పాకిస్థాన్ దుస్సాహసం భారత్-పాకిస్థానుల మధ్య యుద్ధానికి దారి తీసింది

చొచ్చుకు రావటం విఫలమయ్యాక జమ్ము, కాశ్మీరులో కీలకమైన అఘ్నూర్‌వద్ద పాకిస్థాన్ సైనికదాడి ప్రారంభించింది ఈ రాష్ట్రాన్ని మిగతా భారతదేశం నుండి వేరు చెయ్యాలన్నదే వారి ఉద్దేశం. శాస్త్రి దీనికి బదులిచ్చాడు తాను కాశ్మీరులో గాక పాకిస్థాన్ కేంద్రమైన లాహోర్‌పై దాడి జరుపుతానని తానిదివరకే హెచ్చరించాడు. కొద్ది రోజులలోనే పాకిస్థాన్ మిలిటరీ నియంత ఫీల్డ్ మార్షల్ అయూబ్ ఖాన్‌కు ఓటమి అంగీకరించటమో లేక ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ చెప్పినట్లు కాల్పుల విరమణో తేల్చుకోవలసి వచ్చింది ఆయన కాల్పుల విరమణకే అంగీకరించాడు

యుద్ధంలోని అదృష్టం శాస్త్రి రాజకీయ అదృష్టంతో ముడిపడి ఉంది 1962 లోని ఓటమికి ఇంకా బాధపడుతున్న దేశం ఇప్పుడు గెలిచినట్లు భావించింది శాస్త్రి పరువు ప్రతిష్ఠలు పెరిగాయి ఇప్పుడు ఆయనను దేశనాయకునిగా, వీరునిగా భావించసాగారు ప్రభుత్వంలో, పార్టీలో, దేశంలో ఆయన బలం పుంజుకొన్నాడు ఇందిర కూడా ఆయనను కదిలించలేకపోయింది ఆమె నిరాశ పెరిగింది ఆయన ఆత్మ విశ్వాసం పెరిగింది

ఈ నేపధ్యంలో 1965 ఆఖరిరోజున శాస్త్రి తన మంత్రివర్గం నుండి చాలా పలుకుబడిగల ఆర్థిక మంత్రి టి టి కృష్ణమాచారిని తొలగించాడు కృష్ణమాచారి

నెహ్రూకు, ఇప్పుడు ఇందిరకు చాలా దగ్గర. ఈ వార్త సాయంకాలం ఆలస్యంగా తెలిసింది ఇందిరకు బాగా కోపం వచ్చింది ఆ విషయం ఆమె దాచుకోలేదు. "ఈసారి నన్ను తొలగిస్తారు" అని ప్రకటించింది "ఈ మంత్రి వర్గంలో ఉండటం అర్థహీనం" అని కూడా చెప్పింది మళ్ళీ లండన్‌లో నివసించటం గురించి మాట్లాడ సాగింది

ఆమెకు తెలుసో లేదో గాని శాస్త్రి మనసులో కూడా ఇటువంటి ఆలోచనలు వస్తున్నాయి రెండురోజుల తర్వాత తాను తాష్కెంటుకు వెళ్ళవలసి ఉంది ఈ మధ్య ఆసియా నగరం సోవియెట్ యూనియన్‌లో ఉంది. సోవియెట్ ప్రధానమంత్రి అలెక్సీ కోసిగిన్ ఆధ్వర్యంలో అయూబ్‌తో శాంతి చర్చలు జరగనున్నాయి తాను తిరిగి వచ్చాక ఇందిరను లండన్ హైకమిషనర్‌గా నియమిస్తానని తన దగ్గరి సలహాదార్లతో శాస్త్రి చెప్పాడు ఈ ప్రస్తావనను ఆమె కాదనదన్న నమ్మకం ఆయనకుంది కాని తాష్కెంటు నుండి శాస్త్రి శవపేటికలో తిరిగి వస్తాడని ఎవరికి తెలుసు? కోసిగిన్ సాయంతో శాస్త్రి, అయూబ్‌లు రెండు దేశాల మధ్య శాంతికి అంగీకరించారు. ఈ విజయం పొందిన కొన్ని గంటలకే విషాదం అలుముకొంది అరవై ఏండ్ల వయస్సున్న శాస్త్రి, హృద్రోగి, హఠాత్తుగా మరణించాడు.



# 4

# అగ్రస్థానానికి ఆరోహణ

నెహ్రూ మరణంలా గాక, శాస్త్రి మరణం అనుకోకుండా హఠాత్తుగా జరిగింది 'ఆయనకు వారసుడెవరు' అనే మాట అటుంచి అంత త్వరగా ఆయన తర్వాత వచ్చే వ్యక్తిని వెతకవలసి వస్తుందని ఎవరూ అనుకోలేదు సిండికేట్ మళ్ళీ వ్యవహారంలోకి జొరబడింది వీరిలో కీలకమైన వ్యక్తి కామరాజ్ ఇందిరను ఎన్నుకోటం ఉత్తమమని భావించాడు. ఆయన సహచరులందరూ దానికి ఒప్పుకోలేదు ఉదాహరణకు యస్ కె.పాటిల్ కామరాజ్‌నే ఆ పదవిని స్వీకరించమని కోరాడు మౌనంగా ఉండే ఈ బలమైన వ్యక్తి "ఇంగ్లీషు రాదు హిందీ రాదు ఎలాగ?" అని క్లుప్తంగా అన్నాడు ఒక విషయంలో మాత్రం సిండికేట్ ఒకటయింది దేశాయ్‌ని మాత్రం రానివ్వ కూడదనుకొన్నారు. ఈసారి ఉన్నత పదవికి తన అర్హత విషయంలో ఆయన పట్టుపట్టాడు ఇదివరకు ఈ విషయంలో ఆయన పట్టుపట్టాడు. ఇది వరకు ఈ విషయంలో తనను "మోసగించట మయింద"ని అన్నాడు. కాబట్టి సిండికేట్ అభిప్రాయం ఇందిరవైపు మొగ్గ సాగింది

ఆమె తల్లి దండ్రులవల్ల ఆమెకు గొప్ప విలువ ఉంది కాని అదే ముఖ్యమైన కారణం కాదు పదమూడు నెలలలో సార్వత్రిక ఎలెక్షన్లు రానున్నాయి అంతటా తానుగా ఉంటూవచ్చిన నెహ్రూ తర్వాత ఈ ఎన్నికలు రానున్నాయి దానితో ఈ విషయం తేల్చటమయింది కాంగ్రెస్ నాయకులందరిలోకి ఈమెకు కొంత తండ్రి ఆకర్షణ, జనామోదం ఉన్నాయి పల్లెటూర్లకు వెళ్ళటం శాస్త్రికి ఏమాత్రం నచ్చేదికాదు ఈ పర్యటనలలో పై విషయం స్పష్టమయింది తక్కినవారి కంటె ఈమె ఎక్కువ ఓట్లు సంపాదించగలదు సిండికేటు, ఎనిమిదిమంది ముఖ్యమంత్రులు కలిసి సలహా సంఘమయ్యారు ఇందిరకు కూడా తన తండ్రిలాగ

ముస్లింలు, హరిజనుల (ఇప్పుడు వీరిని దళితులంటున్నారు) మధ్య ప్రజాదరణ ఉంది తన తండ్రి లాగే ఇందిర కూడా భారత సమాజాన్ని, రాజకీయాలను విడదీసే కులము, జాతి, మతము, ప్రాంతము చివరకు మురాలకు అతీతంగా ఉంది బహిరంగం చేయకపోయినా సిండికేట్ ఇందిరను ఎన్నుకోటంలో భావం ఆమె తమ మాట వినే ప్రధానమంత్రిగా ఉంటుందన్న అపోహే. ఆమె పదవిలో ఉన్నా పాలించేది తామేనని వాళ్ళనుకొన్నారు

ఎవరికీ తెలియని ఆమెకున్న సుగుణం ఒకటి ఆమె ఈ సమయంలో ప్రదర్శించింది ప్రధాన మంత్రి పదవికి తానే అర్హుడనని దేశాయ్ గట్టిగా నొక్కి చెపుతుండగా, ఇందిర హుందాగా, మౌనంగా, ఏ మాత్రం ఆర్భాటం లేకుండా ఉండిపోయింది తన స్థానమేమిటో నిర్వచించమని ఒత్తిడి వచ్చేకొద్దీ "కాంగ్రెస్, పార్టీ ప్రెసిడెంటు కామరాజ్" సూచించిన మేరకు చేస్తానని వినయంగా చెప్పింది త్యాగానికి ఎంతో విలువిచ్చే సమాజంలో ఈ మాటలకెంతో ప్రభావం కనిపించింది. ఆమె కోడలు సోనియా మే 2004 లో తనకు హక్కుగా లభించవలసిన కిరీటాన్ని కాదని ప్రజల మన్ననను పొందటం దీనిని స్పష్టంగా తెలియజేస్తుంది

19 జనవరి 1966న పార్లమెంటు భవనంలో, బురుజున్న సెంట్రల్ హాలులో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకత్వానికి పోటీ జరిగింది ఓట్లు నెమ్మదిగా పడ్డాయి అందరిలో ఉద్రిక్తత పెరిగింది విశ్రాంతిగా, స్నేహపూర్వకంగా ఉండే ఆ రోజులలో సెక్యూరిటీ గురించి ఎవరూ పట్టించుకోలేదు జనం గుంపులు గుంపులుగా భవనం చుట్టూ చేరారు

అనుకొన్నట్టుగానే దేశాయికి 169 ఓట్లు రాగా ఇందిర 355 ఓట్లతో గెలిచింది ఆమె భవనం బయటకు రాగానే ప్రజలు ఆమెను చుట్టుముట్టారు ఇందిరాగాంధి జిందాబాద్ అని, లాల్‌గులాబ్ జిందాబాద్ అని నినాదాలు చేశారు ఎర్రగులాబీ జిందాబాద్ అనే నినాదం భావపూరితంగా, ఉద్రేక పూరితంగా ఉంది నెహ్రూ ఎప్పుడూ తన గుండీవద్ద ఎర్రగులాబి పెట్టుకొనేవాడు "ఎర్రగులాబీ తిరిగి రావటంగా" ప్రజలు ఇందిర విజయానికి స్వాగతం పలికారు

ప్రజల సంతోష ప్రకటనవల్ల ఒక కిలోమీటరు కూడా దూరంలేని రాష్ట్రపతి భవన్‌కు కారులో వెళ్ళటానికి ఇందిరకు బాగా ఇబ్బంది అయింది. అక్కడ రాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆమెను కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచమని కోరాడు. ప్రెసిడెంటుకు చెందిన లిమోసిన్ కారు ఆమెను తన అధికార నివాసమైన 1, సఫ్దర్‌జంగ్ రోడ్డుకు తీసుకొని వచ్చింది ఆ అందమైన తోటలో ఒక విషాదభరితమైన ఉదయం, ఆమె ప్రాణాలు హరించేవరకు ఇది ప్రధానమంత్రి నివాస గృహమయింది. ఆమె లోపలికి రాగానే అత్యధిక సంఖ్యలో ప్రజల గుంపులు, ప్రపంచంలోని ప్రసారమాధ్యమాలు ఎదురు చూస్తూ కనిపించాయి. ఉత్సాహ భరితమైన ఆ దృశ్యాన్ని చూస్తూ ఆమె నిలుచుంది "గుంపులో ఒంటరిగా" అనే భావాన్ని మొదటిసారిగా నేను గ్రహించాను. ఆమె కొడుకులిద్దరూ స్వదేశంలో లేరు కుటుంబ సభ్యులెవరూ ఆమె పక్కన లేరు ఆమె వ్యక్తిగతమైన సిబ్బంది, ఇంట్లో పనివారు అందరూ గుంపులో కలిసిపోయారు.

ఒక విధంగా నిస్సహాయంగా సన్నటి గొంతుతో "దయచేసి ఎవరైనా ఒక గ్లాసు నీళ్ళిస్తారా?" అని ఆమె అడిగింది సంశయాత్మకమైన ప్రారంభం ఇందిరాగాంధి అధికారంలోకి రావటం త్వరితంగా, అద్భుతంగా జరిగింది. తన తండ్రి, లేదా శాస్త్రి మొదట ప్రధానమంత్రి అయినప్పటికంటే, నలభై ఎనిమిదేండ్ల వయసులోనున్న ఈమె పన్నెండేండ్లు చిన్నదే ఆమె పదవిలోకి రావటానికి దేశం స్వాగతం పలికినతీరు హృదయానందకరంగా ఉంది అయితే ఈ గౌరవం ఆమెకు అతి క్లిష్ట పరిస్థితిలో దొరికింది

మూడేండ్లలోనే రెండు యుద్ధాలు జరిగాయి అంతకంటె సగం కాలంలో ఇద్దరు నాయకులు మారారు ఇంకా స్వతంత్ర రాజ్యంగా రూపొందే స్థితిలో, భిన్నత్వం గల ఈ విశాలమైన దేశానికి అవి గడ్డురోజులే రెండేండ్లు, 1965, 1966 లలో వానలు బొత్తిగా లేవు ఇది పరిస్థితిని మరింత ఇబ్బంది కరంగా మార్చింది. చాలావరకు పంటలు పాడయ్యాయి ముఖ్యంగా బీహారులో కరువు తాండవించింది. విదేశమారక ద్రవ్య నిధులు తగినంతగా లేవు అంటే ప్రపంచ విపణి నుండి ఆహారాన్ని కొని తెచ్చుకొనే మార్గం లేదు అప్పటికే భారతదేశం

పబ్లిక్ లా 480 కింద అమెరికా నుండి రాయితీ ధరలకు ధాన్యం దిగుమతి చేసుకొంటూ ఆ దేశం మీద ఎంతో ఆధారపడి ఉంది ధరలు పెరిగే కొద్దీ ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. రానున్న సార్వత్రిక ఎన్నికల మూలంగా రాజకీయ సంక్షోభాలు పరిస్థితిని మరింత క్లిష్టం చేశాయి పశ్చిమ బెంగాలులో ఆహారం కోసం జరిగే కలహాల వల్ల సైన్యాన్ని పిలవవలసి వచ్చింది ఇందిర ప్రధానమంత్రి అయిన ఒక నెలలోపే జయపూర్‌లో సమావేశమైన అఖిలభారత కాంగ్రెసు సభలలో ఆహార కొరత ఇబ్బందికరంగా మారింది. ఆహార ధాన్యాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు, ఆహార ధాన్యాల కొరత ఉన్న రాష్ట్రాలకు ధాన్యం అమ్మటానికి నిరాకరించాయి అంతేకాదు, వ్యూహం రీత్యా కీలకమైన ఈశాన్య ప్రాంతంలో అప్పటివరకు నాగా ప్రాంతాలకు పరిమితమైన ఆదివాసుల తిరుగుబాటు మిజోలకు కూడా వ్యాపించింది శాస్త్రి పాలనలో దక్షిణాన భాషకు సంబంధించిన అల్లర్లు అణచటానికి తాను ప్రయత్నించినప్పటికీ అవి ఇంకా రగులుతూనే ఉన్నాయి నిర్హేతుకంగా పంజాబీ హిందువులు వ్యతిరేకిస్తున్నా పంజాబీ మాట్లాడే రాష్ట్రం కావాలని సిక్కులు చేస్తున్న అలజడి మళ్ళీ ప్రారంభమైంది దీనిని ప్రముఖంగా కోరుతున్నవారు 1965 వేసవి కాలంలో పాకిస్థాన్ యుద్ధం ముందు ఈ కోరికను కొన్నాళ్ళు వాయిదా వేయటానికి అంగీకరించారు దీనికి బదులుగా శాస్త్రి ఇందిర ఆధ్వర్యంలో కాబినెట్ కమిటీని ఒకదానిని ఏర్పాటు చేసి తగిన సిఫారసు చేయమన్నాడు ఇప్పుడు ఇందిర ఆ పరిస్థితి ఎదుర్కోక తప్పలేదు పంజాబీ మాట్లాడే రాష్ట్రాన్ని ఏర్పాటు చేయటానికి ఈమె ధైర్యంగా నిర్ణయం తీసుకొంది. అందరూ ఆమెను ప్రశంసించారు కాని దేశ ఆర్థిక వ్యవస్థ బాగాలేనందున ఈ ప్రశంస మరుగున పడింది ఈ ఆర్థిక వ్యవస్థవల్ల ప్రణాళికలు ప్రారంభమైనప్పటి నుండి ఎన్నడూ జరగని విధంగా బడ్జెటు కేటాయింపు తగ్గించవలసి వచ్చింది. పార్లమెంటులో ఆమె స్పష్టంగా మాట్లాడేది కాదు ఒక విధంగా భయపడుతున్నట్టుండేది. కానీ కొంతకాలానికి ఈమె ధారాళంగా మాట్లాడటమే గాక తీవ్రంగా వాదించగలగటం ఆశ్చర్యకరమే అయింది నెహ్రూ అంటే పడని సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియా అవకాశాన్ని అందిపుచ్చుకొని

ఆమెకు "గూంగీగుడియా" (మూగబొమ్మ) అని పేరు పెట్టాడు ఇది కొన్నాళ్ళు ప్రచారంలో ఉండేది.

ఈ ఉత్సాహరహితమైన వాతావరణంలో ఆమె అమెరికాను సందర్శించదలచింది. ఆమె కంటె వారం ముందు అమెరికాకు వెళ్ళాలని నేను అనుకొన్నాను ఆమెను ఏవైనా సూచన లివ్వమని కోరాను ఆమె తనదైన శైలిలో ముక్తసరిగా చెప్పింది "ఇది ప్రచురించకండి. నేను వెళ్తున్నది అమెరికానుండి ఆహారము, ఆర్థిక సహాయము కోరటానికి కాని ఆవిధంగా కనిపించకూడదనే నా ప్రయత్నం ." ఆమె బహిరంగంగా ఇచ్చే ఉపన్యాసాలలో అమెరికాకు "సుహృద్భావంతో" వెళ్తున్నట్టు, తానేమీ ఆశించనట్టు చెప్పింది కొన్నేళ్ళకు "ఇందిరశైలి" గా గుర్తింపబడే శైలిని అప్పుడు నేను మొదటిసారిగా చూశాను. రెండవ ఉదాహరణ, ఆమె అమెరికా ప్రయాణంలో సాధారణంగా నాయకులు ఆగే లండన్‌లో గాక పారిస్‌లో ఆగాలనుకోవటం వల్ల ఆమె కొడుకులు జలసంధి దాటివచ్చి ఆమెను ఫ్రాన్స్ రాజధానిలో కలిశారు దీనిలో రెండు స్పష్టమైన సందేశాలున్నాయి మొదటిది, బ్రిటిష్ ప్రధానమంత్రి అయిన హెరాల్డ్ విల్సన్‌ను చిన్నబుచ్చటం అతను 1965లో భారతదేశం యుద్ధం ప్రారంభించిందని నిందించి ఆ తర్వాత తన సలహాదారులు తనను "తప్పు మార్గం" పట్టించారని విశదీకరించటానికి ప్రయత్నించాడు రెండవది, ప్రెసిడెంట్ డిగాల్‌ను స్నేహ పూర్వకంగా కలిసి, అతనికి ఫ్రాన్స్ పట్ల ఉన్న అకాంక్షే తనకు భారతదేశం పట్ల ఉందని తెలియజెప్పటం ఆమె ఫ్రెంచి నాయకుని కలిసినంత సేపు, ఆ తర్వాత భోజన సమయంలో చక్కగా ఫ్రెంచి భాష మాట్లాడింది. అంత గొప్ప ఛార్లెసు ఎంతగానో ముగ్ధుడయ్యాడు

**అమెరికాతో ముఖాముఖీ**

ఇందిర అమెరికాకు కొత్త కాదు తరచుగా తన తండ్రితోను, తనంతట తానుగాను అమెరికాకు వెళ్ళింది న్యూయార్క్‌లో డోరతీనార్మన్ ఇంట్లో కళలు, సంగీతం, విజ్ఞానం, సాహిత్యం వంటి రంగాలలో ప్రముఖులైన వారినెందరినో కలిసింది వీరిలో బక్‌మిన్‌స్టర్ ఫుల్లర్, ఛార్లెస్ ఈమ్స్, బార్బారు కార్ట్‌లాండ్, అలెన్

జింగ్స్‌బర్గ్‌లాంటి వాళ్ళున్నారు కాని మార్చి 1966లో అమెరికాకు వెళ్ళటం వీటన్నిటికంటె భిన్నమైంది ఇప్పుడు ఆమె ప్రధానమంత్రిగా రాష్ట్రపతి లిండన్ జాన్సన్‌తో చర్చలు జరుపుతోంది రెండు దేశాలకు ముఖ్యమైన హితాలు, సమస్యలు చర్చల్లో ఉన్నాయి

పైకి మాత్రం ఇందిరాగాంధి అమెరికా యాత్ర చాలా సఫలమయినట్లే కాని వాస్తవానికి అది విఫలమయింది భ్రమ స్థానంలో వాస్తవం చోటు చేసుకోటానికి కొంత సమయం పట్టింది

ఆతిధ్యం ఇచ్చిన దేశంలో ఇదివరకు ఎన్నడూ లేనంతగా ప్రసారమాధ్యమాలు ఈ యాత్ర గురించి తెలియజెప్పాయి. ప్రెసిడెంట్ జాన్సన్ ఇందిరాగాంధీ ప్రశంసలో "అభిమానవంతురాలు, సమర్థవంతురాలు అయిన ఈ అందమైన వనిత" అని అంటూ ఆమెకు అన్ని విధాలా సాయం చేస్తానని బహిరంగంగా ప్రకటించాడు. జాన్సన్ చేసిన కొంచెం సహాయానికి ప్రతిఫలంగా ఇందిర ఎన్నో విషయాలకు అంగీకరించిందని స్పష్టం కాగానే అందరినీ ముంచెత్తిన ఆనందం వెనక్కి మళ్ళింది

భారతదేశ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, విద్యా వంతులు తీవ్రమైన వ్యతిరేకత తెలియ జెయ్యటం అశాంతికరమైన మొదటి చిహ్నం భారత దేశానికి పి.యల్ 488 కింద ఓడల కొద్దీ అమితంగా పంపిన గోధుమకు చెల్లించవలసిన రూపాయల మొత్తం ఎంతగానో ఉంది దానిని ఫోర్డు ఫౌండేషన్ రీతిలో మలచుకొనే ఇండో-అమెరికన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఏర్పాటు చేస్తామని అమెరికా చేసిన ప్రతిపాదనను అంగీకరించటం దీనికి కారణమయింది. ఈ విధంగా జరిగితే దేశంలోని ఉన్నత విద్యపై అమెరికాకు అవాంఛితమైన, అమితమైన ప్రభావం ఉండేది

చివరికి ఈ ఒప్పందాన్ని రద్దు చేయటమయింది వియెత్నాం యుద్ధంలో అమెరికా పాత్ర గురించి విమర్శ భారత అధికార వర్గంలో తగ్గటం అందరూ గమనించారు. కాని ఈ విమర్శించేవారికి ఒక విషయం తెలీదు. జాన్సన్‌తో చర్చలకు వెళ్ళేముందు ఇందిర ముఖ్య సలహాదారులు "వియెత్నాంకు

సంబంధించిన అమెరికా "బాధ"ను భారత దేశం పంచుకొంటోందని చెప్పమన్నప్పుడు ఇందిర నిరాకరించింది. అమెరికా బాధను భారతదేశం "అర్థం" చేసుకొందని మాత్రమే ఇందిర చెప్పగలిగింది ఇది కూడా చాలా పెద్దమాటేనని ఆమె ఆ తర్వాత గుర్తించింది దేశానికి తిరిగి వస్తూ మాస్కోలో ఆగినపుడు ఆమె వియెత్నాంకు సంబంధించి చేసిన ప్రకటనలపట్ల ప్రధానమంత్రి కోసిగిన్ తన అసంతృప్తి వెల్లడించాడు.

వాషింగ్టన్‌లో చేసుకొన్న ఆర్థిక సంబంధమైన ఒప్పందం కూడా ఇబ్బందులు కలిగించింది ఇందిరకు అప్పుడు అనుభవం తక్కువైనా ఆమె చక్కగా ఆలోచించే యధార్థవాది ఆ తర్వాత ఇది ఆమె గొప్ప గుణంగా అందరికీ తెలిసింది. భారతదేశానికి అమెరికన్ సహాయం అవసరమని ఆమెకు తెలుసు ఈ సహాయం 1965లో యుద్ధ సమయంలో నిలిపివేయబడింది ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ యమ్ యఫ్ ) కోరినట్లు భారత ఆర్థిక విధానాలను రూపొందిస్తే ఇప్పుడు మళ్ళీ ఆ సహాయం కొనసాగుతుంది ఆమె అందుకు అంగీకరించింది ఇదే విధమైన చర్యలు తీసుకోటానికి శాస్త్రి అంగీకరించినపుడు ఈమె వ్యతిరేకించింది.

### పేలిన మూల్య న్యూనీకరణ బాంబు

ఇందిర – జాన్సన్ చర్చలలో తీసుకొన్న అతి ముఖ్యమైన నిర్ణయాన్ని ఇరుపక్షాలూ రహస్యంగా దాచిపెట్టాయి అది బహిరంగమైనప్పుడు బాంబు పేలినట్టయింది 5 జూన్ 1966 సాయంకాలం ఇందిర ప్రభుత్వం రూపాయిని 35 శాతం మూల్య న్యూనీకరణ చేసింది ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించటం చూసి ఇందిర ఆశ్చర్యపోయింది చైనా దాడి సమయంలోగాక మరెన్నడూ ప్రజాభిప్రాయం ఇంతగా ఉద్రిక్తం కాలేదు. ఇది చాలదన్నట్టు మూల్య న్యూనీకరణను ఖండిస్తూ అమెరికన్ "ఆజ్ఞల"కు "లొంగిపోవటం" అంటున్నవారికి కామరాజ్ నాయకుడయ్యాడు.

అతనికి ఎంత కోపం వచ్చిందంటే ఇందిరను అధికారంలోకి తాను తీసుకురావటం తన "తప్పు"ని బహిరంగంగా పశ్చాత్తాపపడ్డాడు. "ఒక పెద్దమనిషి

కూతురు, ఒక చిన్న మనిషి పొరపాటు" అని అతనన్నాడు. అతని కోరికపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తమ పార్టీ ప్రభుత్వానికే వ్యతిరేకంగా తీర్మానం చేసి ఒక విధంగా చరిత్ర సృష్టించింది. ఎన్నికలు కేవలం ఏడు నెలలలోనే జరగవలసినందున "ఇందిరను తొలగించండి" అనే ప్రచారాన్ని ఆయన ప్రారంభించలేదు. 1967 ఎన్నికల తర్వాత ఆమె పదవిలోకి తిరిగి రావటమనేది "నిశ్చితమ"ని ఎవరూ అనుకోకూడదని ఆయన స్పష్టంగా తెలియజేశాడు. ఇది మురార్జీ దేశాయికి ఎంతో సంతోషదాయకమయింది

ఇందిర అనుచితంగా ఈ చిక్కు సమస్యను తానే భరించవలసి వచ్చింది. వాస్తవానికి ఇది ఎంతో కాలంగా ఉన్న సమస్య ఎవరు ప్రధానమంత్రి అయినా ఈ విధంగా జరగక తప్పేది కాదు శాస్త్రికి ఎంతో ముఖ్యమైన ఇద్దరు సలహాదార్లు – బి.కె. నెహ్రూ, యల్.కె ఝా మూల్య న్యూనీకరణ గురించి నొక్కి చెపుతూ వచ్చారు. బి.కె. నెహ్రూ అమెరికా రాయబారే గాక ఆర్థిక పాలనలో కూడా చాలా అనుభవమున్నవాడు యల్ కె ఝా ఇదివరకు ఆర్థిక వ్యవహారాల సెక్రటరీగా ఉన్నాడు వీళ్ళిద్దరినీ శాస్త్రి ప్రత్యేకంగా ఎంపిక చేశాడు. అదే కార్యాలయం ఇందిరకు వచ్చింది వీరి సలహాతీసుకోటానికి శాస్త్రి సంసిద్ధమైనా ఆర్థికమంత్రి టి.టి. కృష్ణమాచారి అడ్డు తగిలాడు శాస్త్రి తాష్కెంటుకు వెళ్ళేముందు అతనిని తొలగించాడు ఈ నిర్ణయం తీసుకోవలసిన సమయానికి ఇందిర మంత్రులిద్దరు – సి.సుబ్రహ్మణ్యం, అశోక్‌మెహతా రూపాయి విలువను తగ్గించటమే మంచిదని ఝా, బి కె నెహ్రూలతో పాటు సలహా లిచ్చారు

మూల్యు న్యూనీకరణ విషయమై ఇందిరపై జరిగిన దాడుల ఫలితంగా ఇందిర "మూగది" అనే మాటను కాదని ఋజువు చేయటం జరిగింది తన బిడియాన్ని అధిగమించి, తనను విమర్శించేవారు విమర్శించినంత తీవ్రంగానూ వారినెదుర్కొంది ఆమె, ఫిరోజ్ లండన్‌లో ఉండగా గురుతుల్యుడు, తన తండ్రికి దగ్గరివాడు అయిన కృష్ణమీనన్ చేసిన వ్యాఖ్యలు ఆమెను మరింత రెచ్చగొట్టాయి. ఆమె కూడా శాస్త్రిలాగే తన తండ్రి విధానాల నుండి వైదొలగిందనే అభాండానికి తీవ్రంగా జవాబిచ్చింది. "జవహర్‌లాల్ నెహ్రూ దేశనాయకుడు కాని నాకు తండ్రి,

స్నేహితుడు ఆయన విధానాలతో నేను పెరిగాను . ఆయన విధానాలనుండి వైదొలగలేదని నాకు తెలుసు కాని దేశం కోసం అవసరమైతే నేను తప్పక ఆ విధంగానే చేస్తాను " (ఉమావా సుదేవ్ పుస్తకం "ఇందిరాగాంధి కరేజ్ అండర్‌ఫైర్ - రూప, 2003" లో ఉదాహరింపబడింది )

## ఎడమవైపు మొగ్గు

మూల్య న్యూనీకరణను, ఆర్థిక విధానంలోని మార్పులను బహిరంగంగా సమర్థిస్తున్నప్పటికీ ఆమె మనసులో మరో విధంగా ఆలోచించ సాగింది రూపాయి విలువ తగ్గించే విషయంలో తనను మోసగించారని నమ్మింది ఇప్పుడు యల్.కె ఝా, సుబ్రహ్మణ్యం, అశోక్ మెహతా విషయంలో జాగ్రత్తగా ఉండ సాగింది ఆమె వారిని నమ్మటం లేదని వారికి తెలిసి పోయింది నెహ్రూ ఎంతో తెలివిగా మలచిన మధ్య మార్గానికి ఎడమవైపు విధానాలకు ప్రాధాన్యమిచ్చింది లిండన్ జాన్సన్ ఈ మార్పుకు దోహదం చేశాదనవచ్చు ఇందిర ఈజిప్టు, యుగొస్లోవియా, సోవియెట్ యూనియన్లకు వెళ్ళినపుడు అమెరికా వియెత్నాంలో, హనోయి, హైపాంగ్‌లపై బాంబుల దాడి నిలిపి వెయ్యాలని కోరింది. ఇది వైట్‌హౌస్‌లో నసాళానికి అంటింది

జాన్సన్ అమెరికన్ సరఫరాలను నియంత్రించి తన కోపం తీర్చుకొన్నాడు. భారతదేశం నిజంగానే ఓడనుండి నోటిదాకా అనే పద్ధతిలో ఆహారధాన్యాలు వస్తేగాని తిండి గడవని స్థితిలో ఉంది అమెరికన్ ఆహారం తింటూ అవమానాన్ని కూడా దిగమింగుతూ వచ్చింది భారత దేశానికి అమెరికా రాయబారి అయిన చెస్టర్ బౌల్స్ ఇందిర ప్రకటనలు పోప్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ చేసిన ప్రకటనలకంటె భిన్నం కాదని తమ ప్రెసిడెంటు దృష్టికి తెచ్చినపుడు "పోప్‌కు, ఉథాంట్‌కు మన గోధుమలు అవసరం లేదు" అంటూ జాన్సన్ గుర్రుమన్నాడు దీనితో ఇందిరను విమర్శించేవారు ఆమె "అమెరికా ఆహారం తిరస్కరించాల" ని పట్టుబట్టారు మళ్ళీ ఆమె బహిరంగంగా చెప్పినదానికి, వ్యక్తిగతంగా అనుకొన్నదానికి తేడా ఉంది ఒకవేళ ఆహారం రావటం ఆగిపోతే "ఈ గొప్పగా

మాట్లాడే మహిళలు, పెద్ద మనుషులు పస్తులుండరుగాని లక్షలాది పేద ప్రజలు పస్తులుంటారు" అని బహిరంగంగా ప్రకటించింది

మనసులో మాత్రం జాన్సన్ చేసిన అవమానం లాంటి అవమానం తన దేశం ఇంక ఎన్నటికీ ఎదుర్కొనే పరిస్థితి రాకూడదని ఆమె తీర్మానించుకొంది ఆ మాట నిలబెట్టుకొంది ఆమె హరిత విప్లవం తీసుకొని వచ్చింది భారతదేశం తన ఆహారం తాను పండించుకోటమే గాక విదేశాలకు ఎగుమతి చేసే స్థితికి చేరుకొంది ఇది ఆమె సాధించిన ప్రశంసార్హమైన విజయాలలో ఒకటి అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

ఇంతకూ జాన్సన్ భారతదేశానికి 900 మిలియన్ డాలర్ల సహాయం చేస్తానన్న మాటను నిలుపుకోలేదు అందువల్ల "ఏ షరతులూ లేకుండా సహాయం చేస్తామని మాట ఇచ్చారు ఇప్పుడు సహాయం లేదు గాని షరతులు మాత్రం మిగిలాయి" అనే వ్యాఖ్యానం వినవచ్చింది

నవంబరు 1966లో ఇందిర వ్యవసాయ శాస్త్రజ్ఞులతో ఆహార ఉత్పత్తి ఎలా ఎక్కువ చెయ్యాలనే చర్చలలో నిమగ్నమై ఉండగా, హిందూ అతివాదులు గోవధను రాబోయే ఎన్నికలలో ఉద్రేకాలు రెచ్చగొట్టటానికి ఉపయోగించుకోవచ్చని "గోవును, దాని సంతానాన్ని" వధించటాన్ని నిషేధించమంటూ తమ ఆందోళనను పార్లమెంటు ద్వారం దాకా తెచ్చారు సాధువుల ఊరేగింపు, కొందరు నగ్న సాధువులతో సహా, త్వరగా విషపూరితమైన కలహంగా మారింది దహనకాండ, కొల్లగొట్టటంతో పాటు ఏడు మరణాలు కూడా సంభవించాయి. గోవుకు సంబంధించిన వివాదం పరిష్కరింపబడలేదు కాని ఇబ్బందికరమైన తన గృహ వ్యవహారాల మంత్రి గుల్జారీలాల్ నందాను ఇందిర తొలగించింది. గుల్జారీలాల్ నందా సాధువుల పక్షమే నెహ్రూ, శాస్త్రిల మరణాల తర్వాత నందా తాత్కాలికంగా ప్రధానమంత్రిగా ఉన్నందున అతనికి పేరొచ్చింది నందా కామరాజ్ దగ్గరకు వెళ్ళి తాను "బలి పశువును" అయ్యానని మొరపెట్టుకొన్నాడు. కాని కామరాజ్, అతని సహచరులు ఈ తొలగింపును సమర్థించారు ఇందిర ఆర్థిక మంత్రి సచిన్ చౌదరిని, విదేశ వాణిజ్య మంత్రి మనుభాయ్‌షాను తొలగించాలనుకొన్నప్పుడు



1 మహాత్మాగాంధీ, సరిహద్దు గాంధీ, తన తండ్రి జవహర్‌లాల్ నెహ్రూలతో
నవయువతి ఇందిర
*సౌజన్యం* ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో–పి ఐ బి



2 "పాపూ" తో సౌజన్యం పి ఐ బి



3 తండ్రి, తల్లి కమలానెహ్రూలతో సౌజన్యం పి ఐ బి



4 1974లో అణుపరీక్ష జరిగినచోట, పోఖరాన్ సౌజన్యం పి ఐ బి



5 ప్రజానీకంతో పేదలకు సులభంగా అందుబాటులో ఇందిర

సౌజన్యం పి ఐ బి



6 పరిస్థితులు బాగున్నప్పుడు పూలమాలవేస్తున్న మొరార్జీదేశాయ్ *సౌజన్యం* పి ఐ బి



7 బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం తర్వాత ప్రధానమంత్రి మిలిటరీ అధిపతులతో

*సౌజన్యం* పి ఐ బి



8 అండమాన్ ద్వీపంలో సముద్రతీరంలో గవ్వలు ఏరుకొంటూ

*సౌజన్యం ఉమావాసుదేవ్*



9 మొక్కజొన్న రుచిచూస్తూ                సౌజన్యం పి ఐ బి



10 ఎనిమిదవదశకం ప్రారంభంలో ఆదివాసులైన స్త్రీలతో                సౌజన్యం పి ఐ బి



11 సిక్కింలో తండ్రి, కూతురు — సౌజన్యం పి ఐ బి

వీళ్ళందరూ గట్టిగా వ్యతిరేకించారు ముందు ముందు పరిస్థితులు మరింత దిగ జారనున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేయటంలో సిండికేట్ ఇందిర కోరికలను, దృక్పధాలను పట్టించుకోలేదు "తన తప్పులేవైనా" కృష్ణమీనన్‌కు సంప్రదాయంగా వస్తున్న సీటును ఆయనకు కేటాయించమని ఇందిర అడిగినప్పటికీ, ఈ చిన్న కోరికను కూడా వీళ్ళు తిరస్కరించారు అంతేకాదు ప్రధానమంత్రి పట్ల విశ్వాసం గల చాలా మంది కాంగ్రెస్ వారిని కూడా పార్టీ నాయకులు మినహాయించారు ఎన్నికల కోసం నిధులు సిండికేట్ పూర్తిగా తన నియంత్రణలో పెట్టుకొని పంచిపెట్టే విధానంలో పక్షపాత వైఖరి చూపించటం మరీ స్పష్టంగా కనిపించింది

ఇందిర నిరాశ చెందింది కాని చలించలేదు రాజకీయంగా నిలదొక్కు కోవలసిన ఆవశ్యకత ఆమె గుర్తించింది ఒకప్పుడు శత్రువులుగా ఉన్న సిండికేటు, దేశాయి ఇప్పుడు మిత్రులయ్యారని, తనను పదవి నుంచి తొలగించదలచారని ఆమెకు తెలుసు పరిస్థితులు వారికి వ్యతిరేకంగా చేయటానికి నిర్ణయించి 1966 క్రిస్మస్ పండుగనాడు ఆమె ఒక వ్యూహాన్ని బయట పెట్టింది అప్పటికి ఆమె ప్రధానమంత్రి అయి పదకొండు నెలలే అయింది ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో యధాలాపంగా మాట్లాడుతున్నట్టు ఈ విధంగా చెప్పింది "పార్టీ ఎవరిని కోరుకొంటుంది, ప్రజలు ఎవరిని కోరుకొంటున్నారు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది ప్రజలలో నా స్థానానికి పోటీ లేదు " ఆమె సందేశం స్పష్టంగా ఉంది పార్టీ నాయకులను కాదని ప్రజలకే ఆమె స్వయంగా విజ్ఞప్తి చేసింది ఎన్నికల ప్రచార సమయంలో వాళ్ళు తమ పార్టీ యంత్రాంగాన్ని ఎంతో నేర్పుతో తిప్పుతుండగా ఆమె ప్రజల ఆదరణకు ప్రాముఖ్యమిచ్చింది తుఫానులా దేశమంతా తిరిగింది తన దేశ ప్రజలు ఎంతమంది తనను చూస్తే అంత మంచిదనుకొంది

ఏమైనా ఆర్థికమైన ఇబ్బంది రాజకీయ సంఘర్షణ వాటి ప్రభావం చూపసాగాయి దేశంలోని వాతావరణం ఉద్రిక్తంగా ఉంది పరిస్థితి హింసాత్మకంగా ఉంది సాధారణంగా ఆమెకు స్వాగతం పలికి జేజేలు కొట్టినా, అక్కడక్కడా నల్ల జెండాలు, అవరోధాలు ఎదురయ్యాయి మూడేళ్ళ క్రితం తన తండ్రి పక్షవాతానికి గురయిన భువనేశ్వర్‌లో ఆమె మీద రాళ్ళు రువ్వారు ఒకరాయి

ఆమె ముక్కుకు తగిలింది ఎవరైనా బెదిరిస్తే బెదరకుండా ధైర్యంగా ఉండటం ఆమెలోని గొప్ప గుణం పోలీసు తన బలాన్ని ఉపయోగించటానికి ఆమె అనుమతించ లేదు తన ఉపన్యాసం కొనసాగించింది తన ఉపన్యాసం ముగిసిన తర్వాతే డాక్టర్లు తన గాయానికి చికిత్స చేయగలిగారు. తన ముక్కు చాలా పొడవని ఆమె ఎప్పుడూ అనుకొంటూ ఉండేది ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తన ముక్కును సరిదిద్దమని ఆమె సర్జన్లను అడిగింది వారు ఆమె మాటలు శ్రద్ధగా విన్నారు గాని ఆమె కోరిక తీరే ప్రయత్నం చేయలేదు 17 ఏండ్ల తర్వాత, ఆమె అంత్య క్రియల సమయంలో, జీవితంలో లాగే మరణంలో కూడా ఆమె ముక్కు తన ముఖంలో ప్రస్ఫుటంగా ఉండటం లక్షలాది శోకతప్తులైన ప్రజలు గమనించారు

భువనేశ్వర్‌కు వెళ్ళకముందు ఇందిర బరేలీకి వెళ్ళింది దివంగతుడైన ఆమె భర్త ఒకప్పుడు ఈ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పుడామె దానిని తన నియోజక వర్గంగా చేసుకొంది ఇక్కడ పేదరికం, ఆకలి వంటి సమస్యలనన్నిటినీ పక్కకు పెట్టి ఎంతో నేర్పుగా దేశ ప్రజలకు తాను "రాజకీయ పార్టీలకు, రాజకీయాలకు అతీతమ"ని కేవలం భారత ప్రజల సంక్షేమమే కాంక్షిస్తున్నానని చెప్పింది "వీళ్ళందరూ నా కుటుంబ సభ్యులే" అంది. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. మొదటిసారిగా ఆమెను "మదర్ ఇండియా" (భారతమాత) అన్నారు అప్పటికి ఆమెకు యాభై ఏండ్లు కూడా లేవు ఈ విధంగా తన జీవితాంతం తనను అంటిపెట్టుకొని ఉన్న ప్రసిద్ధ గాధ అవతరించింది కొంత వ్యవధిలోనే "మదర్ ఇండియా" మరింతగా భారతీయతను తెలియజేస్తూ "ఇందిర అమ్మ" గా మారింది

## ఎన్నికల అఘాతం

ఎన్నికల ప్రచారమప్పుడు ప్రజలు ఇందిరకు స్వాగతం పలికిన తీరు, చూపించిన ప్రేమాభిమానాలు ఎన్నికల ఫలితాలలో ప్రతిఫలించలేదు నిజానికి అవి కాంగ్రెస్ పార్టీకి, ప్రధానమంత్రికి కూడా అఘాతమయ్యాయి. తన తండ్రి నాయకత్వంలో 1962 లో పార్టీకి నలభై ఐదు శాతం ఓట్లు రాగా అవి ఇప్పుడు నలభై ఒకటికి పడిపోయాయి అంటే కాంగ్రెసుకు లోక్‌సభలో ఉన్న సీట్లలో ఐదవ భాగం

తగ్గిపోయాయి పార్లమెంటులో ఉన్న 520 సీట్లలో వీరికి 283 సీట్లే ఉన్నందున మెజారిటీ చాలా తక్కువగా ఉంది అంత సురక్షితంగానూ లేదు ముఖ్యంగా రాష్ట్రాలలో పార్టీ ఓటమి స్పష్టంగా కనిపించసాగింది దక్షిణాన తమిళనాడులో ప్రాంతీయ పార్టీ అయిన ద్రవిడ మున్నేత్ర కఝగం (డి యమ్ కె) కాంగ్రెసును నిశ్చయంగా ఓడించింది ఉత్తరాన పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది అప్పటి వరకు దేశమంతటా ప్రముఖంగా ఉన్న పార్టీ ఎనిమిది రాష్ట్రాలలో నియంత్రణ పోగొట్టుకొంది. తూర్పున ఉన్న కొలకటా నుండి పడమట నున్న అమృతసర్ వరకు ప్రయాణం చేసినా "కాంగ్రెస్ ప్రభుత్వమున్న ప్రాంతాన్ని ఒక అంగుళం కూడా దాటనవసరం లేదు" అని నేను "ది స్టేట్స్‌మన్" వారం వారం వ్రాసే ఒక వ్యాసంలో పేర్కొన్నాను

దీనితో చాలా బాధపడినా ఇందిరకు గొప్ప స్వాంతన దొరికింది సిండికేటు మొత్తం తుడుచుకుపోయేటట్లు ఓట్లు పడ్డాయి యస్ కె పాటిల్, అతుల్య ఘోష్ ఇద్దరూ ఓడిపోయారు కామరాజ్ ఓడిపోవటం అసమాన్యమైన విషయం అంతవరకు తన రాష్ట్రంలో "కిరీటం లేని మహారాజు" గా ఉన్న కామరాజ్ తన రాష్ట్రంలో ఓడిపోవటమే గాక సీటు కూడా పోగొట్టుకొన్నాడు ఇది తప్పనిసరిగా పార్లమెంటరీ పార్టీలో ఇందిర స్థానాన్ని బలపరచింది అమూల్యమైన ప్రధానమంత్రి పదవికి పోటీ చెయ్యాలనుకొన్న దేశాయ్ పథకం నీరుగారిపోయింది కాంగ్రెస్ దెబ్బ తిని ఉండొచ్చు కానీ తనను తాను రక్షించుకొనే శక్తి మాత్రం పోలేదు తాను చిత్తుగా ఓడిపోవటం నుండి కోలుకోని కామరాజ్ నాయకత్వానికి "ప్రమాదం కలిగించే పోటీ ఉండదు" అన్న వారికి నాయకత్వం వహించాడు వాస్తవానికి "ఐకమత్యం" అప్పుడు అత్యంత అవసరమైన విషయం నిజానికి తనే తగువుల్లో ఉన్న ఇద్దరు పోటీదార్ల మధ్య రాజీ కుదిర్చాడు

ఇందిర ఏకగ్రీవంగా నాయకత్వానికి ఎన్నికయింది మొరార్జీ దేశాయి ఆమె మంత్రివర్గంలో ఉపప్రధాన మంత్రిగా చేరాడు ఆర్థిక మంత్రిత్వ శాఖను చేపట్టాడు ఆమె తండ్రి కాలంలో కూడా 1958 నుండి 1963 లో "కామరాజ్ పథకం" వరకు ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నాడు



# 5

# ఆధిపత్యంవైపు మందగమనం

ఇందిరాగాంధీకి, మొరార్జీ దేశాయికి మధ్య సిండికేట్ కుదిర్చిన రాజీ ఫాస్టియన్ బేరమని (ఆత్మనమ్ముకోవటం) ఎవరూ అనలేరు కాని అది చాలా పెళుసైనది ఆచరణీయం కాదు ఈ విషయం అందరికంటె బాగా ఇందిరకే తెలుసు ఉప ప్రధానమంత్రి "సిండికేట్‌కు ట్రోజాన్ గుర్రమని" ఇందిరకు, ఆమె సమర్ధకులకు అర్ధమయింది ప్రభుత్వంలోని ఆంతరంగిక సభలలో ఆమెను ప్రోత్సహిస్తున్నట్లుగా మాట్లాడి దేశాయి తన కోపాన్ని వ్యక్తం చేసేవాడు ఇందిర గురించి ఇతరులేమనుకొన్నా ఆమె మాత్రం వాస్తవ వాది చాలా జాగరూకతగల వ్యక్తి,

ఆమెకు వ్యతిరేకంగా ఐక్యమైన సిండికేటు, దేశాయిలతో ఆమె ప్రత్యక్షంగా ఘర్షణకు దిగదలచుకోలేదు ఒక విషయం తర్వాత మరో విషయంలో తన మాట గెలిపించుకొని,. తన స్థానాన్ని స్థిరపరచుకొన్న తర్వాతే ఈ తగాదాను పరిష్కరించుకోవాలనుకొంది చాలా క్రమ పద్ధతిలో తన పని ప్రారంభించింది

ఇంతలో తాను సిండికేట్ ప్రభావానికి లోనుగాకుండా స్వంతనిర్ణయాలు తీసుకొన్నట్టు అందరికీ సూచన ప్రాయంగా తెలియజేసింది గడచిన సంవత్సరంలా కాక, ఈ సారి తన మంత్రి వర్గంలో ఎవరుంటారనే విషయం కామరాజ్‌తో చర్చించలేదు సిండికేట్ అభ్యర్థులలో ఎన్నికైన ఒకే ఒక వ్యక్తి నీలం సంజీవ రెడ్డిని తన మంత్రి వర్గంలో చేర్చుకో లేదు కాని అతనిని లోక్‌సభ స్పీకరుగా చేసి ఉపశమింపజేసింది ఆ తర్వాత ఆమె చేసే పోరాటాలలో అతను ప్రముఖంగా కనిపించాడు.

ఇందిర సిండికేట్ నుండి తన స్వతంత్రాన్ని ప్రకటించుకొన్న తర్వాత కొత్తగా ఆమె సలహాదార్లవర్గం ఏర్పడటం, ఆమె చుట్టూ తిరిగేవారు ఉండటం అనివార్యమే

దానిని వెంటనే "వంటింటి మంత్రివర్గం" (కిచెన్ కాబినెట్) అన్నారు. దీనిలో చాలావరకు శాస్త్రి పాలన కాలంలో ఈమెను "నెహ్రూ విధానాలనుండి వైదొలగటాన్ని" అపటానికి "ఏదైనా" చేయమని ఇందిర వద్దకు చేరినవారే వీరిలో చిన్న మంత్రులు కూడా ఉన్నారు

అప్పుడు రాష్ట్రపతిగా ఉన్న యస్ రాధాకృష్ణన్ పదవీకాలం మే 1967లో ముగుస్తున్నందున, కొత్త రాష్ట్రపతిని ఎన్నుకొనే విషయమై ఇందిరకు, ఆమె విరోధులకు మొదటి తగాదా వచ్చింది రాధాకృష్ణన్ ఇందిర తండ్రి కంటె ఒక సంవత్సరం పెద్దవాడు వాళ్ళిద్దరూ సన్నిహితంగా ఉండేవారు నెహ్రూ జీవిత గాధను వ్రాసిన యస్ గోపాల్ మాటలలో ఇందిరపట్ల రాష్ట్రపతి దృక్పధం "అభిమానంగా, సమర్ధింపుగా, అంత తీవ్రంగా లేకుండా" ఉండేది యస్ గోపాల్ రాధాకృష్ణన్‌కు కొడుకు అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన తత్త్వవేత్తకు ఆమె "మరీ చిన్న పిల్ల" కాకపోయినా తన స్నేహితుడి కూతురుగా మాత్రమే తోచేది అటువంటి రాష్ట్రపతి మరో ఐదేళ్ళ పాటు రాష్ట్రపతిగా ఉండాలని ఏ ప్రధానమంత్రి కూడా కోరుకోడు డాక్టర్ రాధాకృష్ణన్ మళ్ళీ రాష్ట్రపతి కావాలని దేశాయి సమర్ధనతో సిండికేట్ కోరుకొని దానికై ఒత్తిడి తీసుకొచ్చింది. ఉపరాష్ట్రపతి జాకీర్ హుసేన్ ఇందిర అభ్యర్ధి. ఈయన ఎంతో పేరుగల విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు రాష్ట్రపతి భవనానికి రాకముందు రాధాకృష్ణన్ కూడా ఉపరాష్ట్రపతిగా ఉండేవాడు

సాధారణంగా తగాదాలలో ఉండే ప్రతిపక్షాలు, కాంగ్రెస్‌కు ఎన్నికలలో వచ్చిన నష్టాలు గమనించి, వారిలో అభిప్రాయ భేదాలు చూచి ఈ పరిస్థితిని మరింత చిక్కుల్లో పడేశారు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కె సుబ్బారావును తమ అభ్యర్ధిగా ఉండమని కోరారు అయన వెంటనే అంగీకరించి తన పదవికి రాజీనామా ఇచ్చాడు కాకపోయినా కొన్ని నెలలలో ఆయన పదవీ విరమణ జరిగేది ఇది వాస్తవానికి అసాధారణ విషయమే దీనిని మరింత వివాదాస్పదంగా మార్చింది మరో విషయం కొన్ని రోజుల క్రితమే సుబ్బారావు ఒక న్యాయ పీఠానికి అధ్యక్షత వహిస్తూ రాజ్యాంగాన్ని సవరించటానికి పార్లమెంటుకు గల అధికారానికి పరిమితి

విధించాడు ముగ్గురు కాదనగా, నలుగురు అవుననటంతో ఈ తీర్పు నివ్వటం జరిగింది దీనినను సరించి పార్లమెంటు రాజ్యాంగంలో పౌరులకు ప్రాధమిక హక్కుల విషయం గాక, మరే విషయమైనా సవరించవచ్చు ఈ హక్కులను సవరించటానికి కొత్తగా రాజ్యాంగ సభను ఏర్పాటు చేయవలసి ఉంటుంది దీనికి ఇందిర సమ్మతించలేదు ఆ విషయం ఆమె స్పష్టం చేసింది. గడచిన పదిహేను ఏండ్లలో జరిగినట్లు ప్రజలు ఎన్నుకొన్న పార్లమెంటు ద్వారా ప్రజల అభీష్టం చెల్లుతుంది ఇక్కడ పార్లమెంటుకు, న్యాయసభకు మధ్య వివాదం మొదలయింది ఆ తర్వాత దీని పరిమాణం మరింతగా విస్తరించింది ఇది రాష్ట్రపతి ఎన్నికలలో మిళితమయింది

ఈ అనిశ్చితమైన, వివాదాస్పదమైన వాతావరణంలో రాధాకృష్ణన్ తప్పక గెలుస్తాడని, అయితే ఉపరాష్ట్రపతి ఎన్నికవటం అనుమానాస్పదమని సిండికేటు, దేశాయి అనుయాయులు ప్రధానమంత్రికి చెప్పారు "జాకీర్ సాహెబ్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రజలడిగితే మీరేమి సమాధానం చెపుతారు?" అని గట్టిగా అడిగి ఆమె వారిని మళ్ళీ మాట్లాడనివ్వకుండా చేసింది జాకీర్ హుసేన్ చక్కటి మెజారిటీతోనే ఎన్నికయ్యాడు భారత రిపబ్లిక్‌కు మొదటి ముస్లిం రాష్ట్రపతి అయ్యాడు భారత దేశంలోని సెక్యులరిజానికి, ఇందిరాగాంధీకి కూడా దీనిని విజయంగా భావించటం జరిగింది

అత్యధిక సంఖ్యలో ఉన్న ఇందిర అనుయాయులకు వారి విరోధులకు మధ్య పోరాటం ఇప్పుడు ఆర్థిక విధానానికి మళ్ళింది ఢిల్లీలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో కొత్త అధ్యక్షుడు ఎన్నికవగానే అది ఈ తగాదాకు రంగంగా మారింది ఇందిర ఈ విషయమై ఎక్కువ పట్టుపట్టలేదు. రూపాయి విలువ తగ్గించగానే ఆమె వామపక్షం వైపు మొగ్గటం మనం చూశాము అయినా ఎ ఐ సి సి లో ఆమె 10 సూత్రాల కార్యక్రమాన్ని రూపొందించింది సిండికేటు, దేశాయి వర్గం కూడా దీనికి ఒప్పుకొన్నారు కాని కాంగ్రెస్‌లో సమూలమైన మార్పులు కోరేవారు కొందరు దీనితో తృప్తిపడలేదు వీరిని "యంగ్‌టర్క్స్"లని పిలవటం జరిగింది. ఎన్నికలలో వెనుకబడినతనం "పెద్ద వాళ్ళు, కుడిపక్షానికి

చెందిన" నాయకుల వల్ల జరిగిందంటూ, ఆ స్థితినుండి త్వరగా మార్పురావాలని కోరారు వారి దృష్టిలో ప్రముఖాంశం వాణిజ్య బ్యాంకులలో ప్రముఖమైన వాటిని జాతీయీకరణ చేయటం. ఆర్థికమంత్రి అయిన దేశాయి దానికి వ్యతిరేకి అని తెలిసీ వీరు ఆ విషయమై ఒత్తిడి తెచ్చారు జాతీయీకరణ విషయమై గట్టిగా వాదిస్తున్న వారికి సమానంగా దేశాయి కూడా ఈ ప్రతిపాదనను గట్టిగా తోసిపుచ్చారు మౌలికంగా మార్పులు కోరుతున్న వారిని ఆశ్చర్యపరిచే విధంగా ఇందిర దేశాయిని సమర్థించింది బ్యాంకుల విషయంలో "సామాజిక నియంత్రణ" ఉండాలని, ప్రతి వ్యక్తీ దీనిని రెండేళ్ల పాటు "నిష్పక్షపాతంగా ప్రయత్నించాల"ని చెప్పింది అంటే ప్రైవేటు బ్యాంకుల పనిని పరిశీలించటానికి ఫర్యవేక్షణ కమిటీలు ఏర్పరచటమన్నమాట

ఇందిరను విమర్శించలేక, విమర్శించటానికి ఇష్టం లేక "యంగ్‌టర్కులు" ఇబ్బందిపడినప్పటికీ, బ్యాంకులను జాతీయీకరణ చేయించటంలో తాము విఫలులైనందుకు తమ నిరాశను వ్యక్తం చేశారు. ఇప్పటికే అసమ్మతితో తగాదాలతో సతమతమవుతున్న పార్టీని వీరి ప్రతిఘాతం ఒక ఊపు ఊపింది ఇది వరకు రాజ సంస్థానాధీశులు వాళ్ళ రాజ్యాలను భారతదేశ ప్రభుత్వంతో విలీనం చేసినపుడు వారికి ప్రీవీపర్సులు విశేషాధికారాలు ఇవ్వటమయింది ప్రీవీపర్సుల వేతనాలు శాశ్వతమైనవి కానీ ప్రతి తరంతో ఈ మొత్తాన్ని ప్రభుత్వం తగ్గిస్తూ పోవచ్చు విశేషాధికారాలలో ఈ సంస్థానాధీశులు తమ బిరుదులుంచుకోటానికి వీలయింది తమ పతాకాలు ఎగరెయ్యవచ్చు తమ కార్లమీద తమ స్వంత నంబర్లు వాడుకోవచ్చు ప్రత్యేక సందర్భాలలో జాగ్రత్తగా వర్గీకరించిన తీరుల తుపాకుల వందన స్వీకారం చేయవచ్చు

స్వాతంత్ర్యం వచ్చిన పదిహేనేండ్ల వరకు ఎవరూ ఈ విషయం పట్టించుకోలేదు ఎందుకంటే ఇదివరకటి రాజులు కాంగ్రెస్‌లోనో ప్రతిపక్షాలలోనో చేరిపొయ్యారు కాని 1967లోని సార్వత్రిక ఎన్నికలలో పరిస్థితులు చాలా మారిపొయ్యాయి రాజకీయాలపట్ల మొగ్గు చూపిన చాలామంది సంస్థానాధీశులు కొత్తగా రూపొందిన, సంప్రదాయబద్ధమైన స్వతంత్ర పార్టీలో చేరి పోయారు ఈ పార్టీ

ఇందిర వ్యతిరేకి. ఆ అభ్యర్థులందరూ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి ఎన్నికయ్యారు

ఈ సంస్థానాధీశుల పట్ల వ్యతిరేక భావాలు పార్టీలో కలగటంలో ఆశ్చర్యం లేదు వాళ్ళకు "తగిన స్థానంలో" వాళ్ళ నుంచాలని గట్టిగా కోరటమయింది నెహ్రూ ప్రభుత్వం చేసిన హామీలు, రాజ్యాంగంలో పొందుపరచిన విషయాలు ఉల్లంఘించటమవుతుందని పార్టీ నాయకులు వెనుకాడారు అందరూ అంగీకరించిన పది సూత్రాల కార్యక్రమంలో సంస్థానాధీశుల "విశేషాధికారాలు తొలగించటం" కూడా చేర్చారు కాని ప్రీవీపర్సుల గురించి ఏమీ మాట్లాడలేదు. సమూలంగా మార్పు కోరుకొంటున్నవారికి ఇందులో ఒక అవకాశం కనిపించింది రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత ఇందిర, దేశాయి ఇండ్లకు వెళ్ళిన తర్వాత "యంగ్‌టర్క్‌లు" తాము సవరణ చేసినట్లు ప్రీవీ పర్సులు, విశేషాధికారాలు తొలగించటం విషయమై ఓటు చేయవలసిందిగా ఒత్తిడి తెచ్చారు వారి సవరణకు పదిహేడు ఓట్లు వచ్చాయి కాదన్న ఓట్లు ఆరు కాని ఇది ఇందిర ప్రభుత్వానికి ఎ ఐ సి.సి. ఇచ్చిన ఆదేశమయింది. ఉన్నత స్థాయిలోని నాయకత్వంలో ఏమాత్రం ఐకమత్యం లేకపోవటం కూడా ఇది బహిరంగం చేసింది కామరాజ్ మార్పును కోరే తన వ్యక్తిత్వం ప్రకటించటానికి తనకు అలవాటైన మౌనం పాటించాడు ఎ ఇ.సి సి "చాటుగా యుక్తి"తో తెచ్చిన నిర్ణయం "కేవలం పిచ్చితనం" అని యస్ కె.పాటిల్ దీనిని గర్హించాడు దేశాయి కూడా "విశ్వాసఘాతుకం" గా ప్రకటించాడు. అతుల్యఘోష్, మొదటిసారి, ఆఖరిసారిగా సిండికేట్‌ను కాదని ఎ.ఐ-సి సి తీర్మానానికి స్వాగతం పలికాడు ఈ విషయమై తగిన చర్య తీసుకోవలసిన గృహ వ్యవహారాల మంత్రి వై బి చవాన్ తనకు ఈ విషయంలో ఏమీ అభ్యంతరం లేదన్నాడు ఇందిర తనకు సాధారణమైన అంతుచిక్కని తీరులో "సవరణ ఆమోదించబడినతీరు" పట్ల "వ్యాకులత" మాత్రం వెళ్ళబుచ్చింది

దీని తర్వాత పార్టీలో చాలా విభేదాలొచ్చాయి. ఇరుపక్షాల తగాదాలు కేవలం క్రమ శిక్షణనే గాక ఔచిత్యాన్ని కూడా ఉల్లంఘించాయి ఇందిరను సమర్థించేవారి

విమర్శలకు నిరంతరం గురవుతున్న దేశాయి కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ ఎగ్జిక్యూటివ్‌లో మెజారిటీ పొంది, తన అనుయాయి అయిన తారకేశ్వరి సిన్హాను, ఇందిరను విమర్శించటానికి వదిలాడు. తారకేశ్వరి సిన్హా అందమైన వ్యక్తేగాక చాలా వాగ్ధాటిగల వ్యక్తి మరోవైపు "యంగ్‌టర్క్‌ల" లో ప్రముఖుడైన చంద్రశేఖర్, దేశాయి కొడుకైన కాంతి దేశాయి అవినీతికి పాల్పడ్డాడని పార్లమెంటులో ఆరోపించాడు క్రుద్ధుడైన దేశాయి "చంద్రశేఖర్‌ను మందలించటాని" కి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ద్వారా ఇందిరకు "అధికారమి" చ్చాడు ఆమె అటువంటి దేమీ చెయ్యలేదు. ఆరేండ్ల తర్వాత, ఎమర్జన్సీలో ఇందిర చంద్రశేఖర్‌ను జైలుకు పంపింది ఆ తర్వాత ఆయన జనతాపార్టీకి అధ్యక్షుడయ్యాడు ఆ పార్టీ తరపున మొరార్జీదేశాయి 1977-79 లో ప్రధానమంత్రి అయ్యాడు ఆ తర్వాత ఒక దశాబ్దానికి చంద్రశేఖర్ స్వయంగా నాలుగు నెలలపాటు ప్రధానమంత్రి అయ్యాడు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో వాస్తవానికి అంతర్యుద్ధం జరుగుతుండగా పార్టీ స్థితికూడా ఏమంత మెరుగ్గా లేదు కాంగ్రెసు అధ్యక్షుడుగా కామరాజ్ పదవీకాలం పూర్తి కాగానే అప్పుడు కర్ణాటకకు ముఖ్యమంత్రిగా ఉన్న యస్ నిజలింగప్ప, అధ్యక్షుడయ్యాడు అతను ముందు నుండీ సిండికేట్ మెంబరే అయినా ఇందిరాగాంధీ ఈ ఎంపికకు ఒప్పుకొంది ఎందుకంటే వీళ్ళిద్దరి మధ్యా విరోధమేమీ లేదు ఆమెకు, కామరాజ్ నడిపిస్తున్న సిండికేట్‌కు మధ్య తటస్థంగా ఉండటానికి ప్రారంభంలో చాలా ప్రయత్నించాడు కార్యవర్గంలో ఇరు పక్షాలకు ప్రాతినిధ్యం ఉండేటట్లు చూశాడు ఇందిరను తొలగించటానికి కామరాజ్, దేశాయి కలిసి ఈయన సమర్థనను కోరితే నిజలింగప్ప కాదన్నాడు అయన తన డైరీలో వ్రాసుకొన్నట్టు ప్రధానమంత్రి చేత బలవంతాన రాజీనామా ఇప్పిస్తే అది "పార్టీని విభజిస్తుంది మొత్తం దేశం అల్లకల్లోలమవుతుంది " ఆ తర్వాత ఇందిర పార్టీ అధ్యక్షునిగా తనకు సంబంధించిన విషయాలు "చర్చించకపోవటం లేక చర్చించటానికి నిరాకరించటం" తనకు కోపం తెప్పించింది "పదవిలో కొనసాగటానికి ఆమె తగదు" ని తన డైరీలో వ్రాసుకొన్నాడు అతను హృదయం

మార్చుకోవటం, రెండేండ్ల తర్వాత కామరాజ్, యస్ కె.పాటిల్ ఇద్దరూ పార్లమెంటుకు ఎన్నికయి రావటం ఒకేసారి జరిగాయి.

ఢిల్లీకి దగ్గరగా ఉన్న ఫరీదాబాద్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో నిజలింగప్ప తన అధ్యక్షోపన్యాసాన్ని ఇందిర ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించటానికి వాడుకొన్నాడు ఆమె అతనికి తగిన సమాధానం చెప్పే లోపుగా కొందరు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు "విసుగుతో" బయటకు నడిచారు చాలామంది "యంగ్‌టర్క్‌లు" నిజలింగప్పపై అభిశంసన తీర్మానం తీసుకొచ్చారు. ఆయన దానిని తిరస్కరించారు ఇంకా పరిస్థితులు విషమించకముందే, సమావేశం జరుగుతున్న పందిరికి నిప్పంటుకొంది వాస్తవంగా ఫరీదాబాద్ పోరాటం ఆవిరైపోయింది

ఈ పరిస్థితులలో ఇందిర ప్రభుత్వం స్తంభించిపోవటంలో ఆశ్చర్యం లేదు ఇదే సమయంలో దేశంలోని సమస్యలు అధికమవుతూ వచ్చాయి పాత సమస్యలను పట్టించుకోనందున అవి మరింత తీవ్రమయ్యాయి కొత్త సమస్యలలో "భూమిని ఆక్రమించటం" చాలా రాష్ట్రాలలో ఉద్యమమయింది. భారతదేశంలో మొదటిసారిగా మావోయిస్టు పార్టీ, ది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్ - లెనినిస్టు) ప్రారంభింపబడింది. ఉత్తర బెంగాల్‌లో నక్సల్‌వాడి అనే గ్రామంలో దాని మొదటి సమావేశం జరిగింది అప్పటినుంచి ఈ పార్టీ అనుయాయులను నక్సలైట్లని పిలుస్తారు

"యంగ్‌టర్క్" లే గాక, పార్టీలో ప్రముఖ వ్యక్తులైన వారు, ప్రధానమంత్రి అనుయాయులు ఆమెను సిండికేటు, దేశాయ్‌ల పట్ల తన పోరాటానికి సరయిన ముగింపునివ్వమన్నారు కాని ఆమెకు ఏమి చెయ్యాలో అందరికంటె బాగా తెలుసు అధికార పార్టీలో ఉన్న విరోధులతో తలపడేముందు తీర్చవలసిన బయటి సమస్యలు ఎన్నో ఉన్నాయి

ఉత్తర రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ స్థానంలో వచ్చిన సంకీర్ణ ప్రభుత్వాలు అనుకొన్నట్లే పడిపోయాయి కాని వాటి స్థానంలో మరెన్నో కూడికలు మరింత అవకాశవాదంతో, తాత్కాలికంగా వచ్చాయి ప్రతి వర్గం, ప్రతి చీలికా అధికారంలోని

లాభాలు పొందాలనుకొన్నాయి మంత్రి పదవులు లేదా డబ్బు ఆశించి శాసన సభ్యులు తమ పార్టీలు త్వరత్వరగా మారుస్తున్నందున వారికి “అయారాములు, గయారాములు” (వచ్చిపోయేవారు) అని పేరొచ్చింది మొత్తం రాజకీయ ప్రక్రియకే అపఖ్యాతి కలిగింది

ముఖ్యంగా ఇందిరాగాంధీకి, ఆమె పార్టీవారికి పశ్చిమ బెంగాలులో వామపక్షాల ప్రభుత్వం రావటం ఇబ్బందికరమైంది దాని ముఖ్యమంత్రి అజయ్ ముఖర్జీ. ఇదివరకు కాంగ్రెస్‌లో ఉండేవాడు. తన నిజాయితీకి పెట్టింది పేరు కానీ రాజకీయంగా అంత బలమైనవాడు కాదు నిరంకుశ భావం గల అతుల్యఘోష్ . మూలంగా ఇతను పార్టీ వదల వలసి వచ్చింది ముఖర్జీ కొత్త పదవి నామ మాత్రమే అధికారం నిజానికి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) చేతిలో ఉంది పేరొందిన జ్యోతిబసు వీరి నాయకుడు సి పి ఐ (యమ్)తో తగాదాపడే భారతీయ కమ్యూనిస్ట్ పార్టీకి వామపక్షాల ప్రభుత్వంలో తక్కువ భాగస్వామ్యం ఉంది భారత దేశంలో కమ్యూనిస్ట్ ఉద్యమం అరవదశకం ప్రారంభంలో రెండుగా విడిపోయింది చైనా రష్యాల మధ్య చీలిక దీనికి కొంత కారణమనవచ్చు

ప్రధానమంత్రి ఇందిర నవంబరు 1967లో తాను జులై 1959లో కాంగ్రెస్ ప్రెసిడెంటుగా కేరళకు చేసినట్లే పశ్చిమ బెంగాలుకూ చేసింది వామపక్షాల ప్రభుత్వాన్ని తొలగించి, ఆ ఫ్రంట్ నుండి విడిపోయిన కొందరికి కాంగ్రెస్ పార్టీ “బయట” నుండి సమర్ధన ఇచ్చేటట్లుగా వారిని ప్రమాణ స్వీకారం చేయించటానికి పశ్చిమ బెంగాల్ గవర్నరుకు ఆమె అధికారమిచ్చింది ఈ యుక్తి ఫలించకుండా వామపక్షాలు వీధినపడి ఆందోళన చేశాయి రాష్ట్ర అసెంబ్లీ పనిచేయటం కష్టమయిపోయింది పశ్చిమ బెంగాలులో అసెంబ్లీ రద్దు కావటంతో పాటు, డి యం కె ప్రభుత్వమున్న ఒక తమిళనాడును మినహాయించి, కాంగ్రెస్ ప్రభుత్వంలేని రాష్ట్రాల అసెంబ్లీలన్నీ రద్దయ్యాయి అన్నింటిలో మళ్ళీ ఎన్నికలు ప్రకటించబడ్డాయి ఈ ఎన్నికలు ఫిబ్రవరి 1969లో జరిగాయి

ఈ "చిన్న జనరల్ ఎలెక్షన్" లో ఇందిరను ఆనందపరచేటట్లు ఉత్తర ప్రాంతం రాష్ట్రాలలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది వీటిలో రాజకీయంగా కీలకమైన ఉత్తరప్రదేశ్, బీహారుకూడా ఉన్నాయి. కాని పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు మళ్ళీ విజయం సాధించటంతో తక్కిన ఆనందమంతా మరుగున పడింది వామపక్షాల ఫ్రంట్ 1967 కంటె అధికంగా మెజారిటీ తెచ్చుకొంది కాంగ్రెస్ సమూలంగా ఓడిపోయింది అజయ్ ముఖర్జీ ఇప్పుడూ ముఖ్యమంత్రే కాని పేరుకు మాత్రమే ఉన్న పదవి ఇప్పుడు హాస్యాస్పదమయింది మార్క్సిస్టు సభ్యులు "చట్టవిరుద్ధం"గా తమ ప్రభుత్వాన్ని తొలగించినందుకు కోపంగా, మళ్ళీ పదవిలోకి వచ్చినందుకు ఎంతో ఆనందంగా విధానాలలో మౌలికమైన మార్పులు చెయ్యటానికి సిద్ధపడ్డారు అసలే ఉద్రిక్త భరితమైన రాష్ట్రంలో పోరాటం, హింస ప్రబలిపోయాయి. నమ్మశక్యం కానంత వైపరీత్యం జరిగింది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి నిరసన దీక్ష పట్టాడు. ఇందిర వెంటనే పశ్చిమ బెంగాల్‌లో తిరిగి రాష్ట్రపతి పాలన తెచ్చింది.

### కాంగ్రెస్ విభజన

ఇందిర ఇన్నిరోజులుగా తప్పించుకొంటూ వచ్చిన తగాదా పైన పేర్కొన్న నేపథ్యంలో ముందుకు రానే వచ్చింది ఫరీదాబాద్‌లో పేలబోయి తుస్‌మన్న సంఘటన తర్వాత కొన్నాళ్ళకే 3మే1969న రాష్ట్రపతి జాకీర్ హుసేన్ అకస్మాత్తుగా మరణించటం జరిగింది సిండికేట్ ఉత్సాహంగా ఎదురుచూస్తున్న అవకాశం రానే వచ్చింద తమలో ఒకడైన సంజీవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్రపతి పదవి పోటీకి నిలబెట్టాలని నిర్ణయించుకోటమయింది అతను రాష్ట్రపతి భవన్‌లో ఉంటే ఇందిరను అధికారం నుండి తొలగించటం సులభమనుకొన్నారు ఆమె సిండికేట్ ఆటను పసిగట్టి, దానిని ఆపటానికి తన వ్యూహాలు తయారు చేసుకోసాగింది. జులై మధ్యలో మూడు రోజులు అఖిలభారత కాంగ్రెసు సభలు బెంగుళూరులో జరగవలసి ఉంది రాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎన్నుకోటానికి అతి ముఖ్యమైన పార్లమెంటరీ బోర్డు సమావేశం మూడు రోజుల తర్వాత జరగాలి.

1967 జనరల్ ఎలెక్షన్ల తర్వాత ఇందిరా గాంధీ ప్రధానమంత్రి కార్యదర్శి పదవినుండి యల్ కె. ఝాను తొలగించింది అదే స్థానంలో పి యన్ హక్సర్‌ను తీసుకొంది ఆమె విద్యార్థిగా లండన్‌లో ఉన్నప్పటినుండి పి యన్ హక్సర్ ఆమెకు తెలుసు "గులాబీ రంగు ముప్పయిల" భావజాలం గల ఈ వ్యక్తి నెహ్రూ అనుయాయి ఆమెకు ఇతని పట్ల పూర్తి నమ్మకముంది ఆధునిక భారతదేశ చరిత్రలో క్లిష్టమైన సందర్భంలో అతను "చాలా అధికారం గల ఉన్నతోద్యోగి మాత్రమే కాదు దేశంలోనే అత్యధికమైన అధికారం గలవారిలో రెండవవ్యక్తి" అని హక్సర్‌ను గురించి సరిగానే చెప్పటమయింది. ఇందిరకు ఇన్‌ఫర్మేషన్ అడ్వయిజరుగా ఆమె పదవీ స్వీకారం చేసినప్పటినుండి ఆఖరి రోజువరకు చేసిన ఎచ్ వై. శారదాప్రసాద్ సూక్ష్మంగా ఈ విధంగా వ్యాఖ్యానించారు హక్సరు "తన అధికారాన్నంతా ఇందిరాగాంధి నుండే పొందలేదు ఆమె ఆధిక్యానికి కూడా ఆయనెంతో దోహదం చేశారు "

బెంగుళూరులో ఎదుర్కోనున్న సవాలు విషయంలో ఆలాగే జరిగింది హక్సర్‌ను సంప్రదించి సిండికేట్, దేశాయిలతో తన పోరాటం వ్యక్తిగతమైన అధికారానికి సంబంధించినది కాక, ఆదర్శాలకు సంబంధించినదిగా దేశ ప్రజలు గమనించేటట్లు ఇందిర నిర్ణయించుకొంది వామపక్షం వైపు మొగ్గిన తన అనుయాయులు, ఆర్థిక విధానం గురించి ఫరీదాబాద్‌లో తలపడిన తర్వాత అధిక సంఖ్యలో ఉన్న వీరు, "అభివృద్ధి నిరోధకులైన కొందరిని ఎదుర్కొని చిత్తుగా ఓడించాల"ని తహతహలాడు తున్నారు. కాని ఇందిర శైలే వేరు అది చాలా తగ్గు స్వరంలో ఉంది

ఆరోగ్యం బాగాలేదని వర్కింగ్ కమిటీ మీటింగ్‌కు ఈమె వెళ్ళలేదు. ఆర్థిక విధానం గురించి ఒక పత్రం పంపింది "తొందరగా వ్రాయించిన చెదురుమదురు ఆలోచనలు" అని దానికి చిత్రమైన పేరు పెట్టి "పూర్తిగానైనా, పాక్షికంగా నైనా అంగీకరించటానికి" అని జోడించింది ఆమె పేర్కొన్న భావాలు కొన్ని పాతవి. కాంగ్రెస్ ఎప్పటినుండో వాటి గురించి మాట్లాడుతోంది కాని ఏమీ చేయలేదు. కాని బ్యాంకు పరిశ్రమ భవిష్యత్తు గురించి చెప్పిన మాట మాత్రం ఎంతో ఉద్రిక్తత

కలిగించే అవకాశముంది. "యంగ్‌టర్క్" లు గట్టిగా అడుగుతున్న పెద్ద వాణిజ్య బ్యాంకుల జాతీయాకరణ గురించి ఆమె అడగక పోవటంలో ఎంతో నైపుణ్యముంది. బ్యాంకులపై సామాజిక నియంత్రణకు రెండేళ్లు గడువు ఇచ్చినప్పటికీ తాను "బ్యాంకుల జాతీయాకరణ గురించి మళ్ళీ ఆలోచించటాని" కి సిద్ధంగా ఉన్నట్లు ఎంతో అస్పష్టంగా సూచించింది

సిండికేట్ ఆమె కోపంగా ఉన్నట్టు భావించి దానిని తమ వంతు కోపంతో తిప్పికొట్టాలనుకొంది సిండికేట్ మార్గదర్శకత్వంలో వర్కింగ్ కమిటీ ఆమె "విధానానికి సంబంధించిన పత్రాన్ని" పూర్తిగా ఆమోదించింది కొంచెం వ్యంగ్యంగా దీనిని అమలు జరుపవలసిన బాధ్యత ఆమె ప్రభుత్వానిదని చెప్పింది. మరుసటి రోజు అఖిల భారత కాంగ్రెస్ సమావేశం వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది సమావేశమైన ప్రతినిధులందరికీ దానిని అంగీకరించమని ప్రతిపాదించటం దేశాయి వంతు కావటం ఒక చిత్రమైన వ్యంగ్యమే

ఆమె చవాన్‌కు వ్యతిరేకంగా చర్య తీసుకొంటుందని చాలామంది అనుకొన్నారు ఆ విధంగా చేయకుండా వాళ్ళందరినీ ఆమె ఆశ్చర్య పరచింది. మొరార్జీ దేశాయి తన పదవికి రాజీనామా ఇచ్చాడని తెలియగానే ఈ ఆశ్చర్యం కలకలంగా మారింది ఇందిర అతని నుండి ఆర్థికశాఖ తీసుకోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది ఆయనను ఉప ప్రధానమంత్రిగా కొనసాగమని కోరింది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆమోదించిన ఆర్థిక కార్యక్రమం అమలు జరిపే "భారం" ఆయనకు అప్పజెప్పటం "ప్రాథమిక విషయాల పట్ల ఆయనకు భిన్నాభిప్రాయం ఉన్నందున" "అన్యాయమ"వుతుందని ఆమె వివరించింది "చప్రాసీ (ప్యూన్) తో వ్యవహరించినట్లు వ్యవహరించినందుకు" అప్రతిభుడైన దేశాయి, ఇందిర "అమర్యాదగా" ప్రవర్తించిందని నిందించి పదవికి రాజీనామా చేశాడు పరిస్థితులు ఈ విధంగా మారినందుకు ఆమె విచారిస్తున్నట్టు వ్యక్తిగతంగా కొందరితో ఆమె చెప్పింది దేశాయి "నేరుగా" చేశాడని, చవాన్ "కుతంత్రంగా". చేశాడని ఆమె అభిప్రాయపడింది కాని అతనికి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకొన్నా అది "వ్యక్తి గతమైన ప్రతీకారం" గా కనిపిస్తుంది

చొరవ తీసుకొన్న తర్వాత ఇందిర తన శత్రువులకు దేశాయిని తొలగించినా ఏది ఏమైనా పక్కన జరుగుతున్న ఈ నాటకాన్ని ఎవరూ అంతగా పట్టించుకోలేదు. "అసలు విషయం" పైన అందరి దృష్టీ ఉంది ఎనిమిది మంది సభ్యులున్న పార్లమెంటరీ బోర్డు రాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎన్నుకోవలసి ఉంది. బిగుసుకుపోయినట్లు ప్రారంభమైన సమావేశంలో ఇందిర జగజ్జీవనరామ్‌ను రాజీ అభ్యర్థిగా ఎన్నుకోటానికి ప్రయత్నం చేసింది హరిజన్ రాష్ట్రపతి భవన్‌లో ఉండాలని మహాత్మా కన్న కల నిజమవుతుందని వాదించింది అధిక సంఖ్యాకులు ఎన్నుకొన్న సంజీవరెడ్డినే అభ్యర్థిగా నిలబెట్టాలని సిండికేటు పట్టు పట్టింది. ఇందిర సిండికేట్ ధోరణికి స్తబ్ధురాలు కాలేదు కాని తానిదివరకు విన్న విషయాలను వమ్ము చేస్తూ ఆమె దేశ వ్యవహారాల మంత్రి చవాన్ సిండికేట్‌తో కలిసి ఓటు చెయ్యటానికి ఆమెను "వదిలిపెట్టాడ" ని అప్రతిభురాలయింది. ఆమె తండ్రి మాటను కూడా ఒకసారి పార్లమెంటరీ బోర్డు రాష్ట్రపతి పదవికి అభ్యర్థి విషయంలో నిరాకరించింది కానీ ఆయన దాన్ని సహజంగానే తీసుకొన్నాడు ఎందుకంటే ఆయన పదవి సురక్షితమే కాదు దృఢంగా కూడా ఉంది ఇందిర పరిస్థితి వేరు ఆమె అన్నట్టు సిండికేట్ చర్య ఆమె పదవిపై ఆమె విధానాలపై, ఆమెపై చేసిన "దాడి", "గాయపడ్డ సివంగి" లా ఆమె తిరుగుదాడి చేయవలసి ఉంది సంఘటన నుండి తేరుకొనే అవకాశమివ్వలేదు పద్నాలుగు వాణిజ్య బ్యాంకులను జాతీయాకరణ చేసి వాళ్ళను అదరగొట్టింది పార్లమెంటు రాబోయే సోమవారం సమావేశం కాబోతున్నప్పటికీ ఈమె జాతీయాకరణ శనివారం ఆర్డినెన్సు ద్వారా చేసింది ఈ చర్య "రాజకీయ ప్రేరితం" అని ఆర్థిక సంస్కరణకు సంబంధించింది కాదని సిండికేట్ చేసిన నినాదాలలో కొంచెం నిజముంది కాని జాతీయాకరణ ఆర్డినెన్సుకు దేశమంతా ఆనందోత్సాహాలతో స్వాగతం పలకటంతో సిండికేటు మాట ఎవరూ పట్టించుకోలేదు

బ్యాంకు జాతీయాకరణ ప్రభావం గురించి దానిని ప్రత్యక్షంగా చూడని యువత, ముఖ్యంగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ యుగంలో, నమ్మటం చాలా కష్టం కాని వాస్తవంగా దేశంలో ఈ చివర నుండి ఆ చివర దాకా అధిక సంఖ్యలో

ప్రజలు ప్రధానమంత్రి చర్యను ప్రశంసించారు. ఢిల్లీ జనసమూహాలు ఆనందోత్సాహాలతో నాట్యం చేశాయి. వీరిలో చాలా మంది ఎప్పుడూ బ్యాంకులోకి వెళ్ళి ఉండరు ఇకముందు వెళ్తారన్న నమ్మకమూ లేదు అయితే పేదప్రజల కోసం ఏదో చేస్తున్నారని, ధనవంతులకు తమ స్థానమేమిటో తెలియజేస్తున్నారని వాళ్ళు ఉత్సాహపడ్డారు ప్రధానమంత్రి ఇంటి బయట అసంఖ్యాకంగా జనం ఊరేగింపులు జరిపారు. వీటన్నిటినీ ఎవరో ఏర్పాటు చేశారన్నది నిజమే కాని ప్రజల ఉత్సాహం వాస్తవంగా తనంతట తానుగా ఉప్పొంగింది

ఇందిర పట్ల ప్రజల అభిమానం చూసి సిండికేటు చేయగలిగినదల్లా స్వతంత్ర, జనసంఘ్ (ఈనాటి బి.జెపి కి ఒకనాటి రూపం) వంటి ప్రతిపక్షాలతో చేరి, ఆమె "రాజకీయాలను వీధుల్లోకి తీసుకుపోవటంలోని ఔచిత్యాన్ని" గురించి తమ "ఆందోళన" వ్యక్తపరచటమే ఆమె "కమ్యూనిస్టుల తోటి ప్రయాణీకురాలని" కూడా నిందించారు. ఇందిర పక్షంగా ఉన్న రాజకీయ ప్రదర్శనలలో కమ్యూనిస్టు పార్టీ సభ్యులు పాల్గొంటున్నారని వారన్నారు తనను "కపటంగా" విమర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీవారు "ప్రతి సంవత్సరమూ ఓటు వేస్తున్న" కాంగ్రెస్ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా తాను కమ్యూనిస్టు ఎలా అయిందని ఆమె ప్రశ్నించింది

ఇరు పక్షాల మధ్య కటువైన మాటలు దొర్లుతున్నప్పటికీ, ఇరుపక్షాలకూ ముఖ్యమైన విషయం రాష్ట్రపతి ఎన్నిక ఇందిర సంజీవరెడ్డి నామినేషన్ కాగితాలపై సంతకం పెట్టటం తగని చర్య ఆమె ఆ తర్వాత అతని అభ్యర్థిత్వాన్ని కాదని వాస్తవంగా వి వి.గిరిని సమర్థించినపుడు ఆమె విమర్శకులు ఆమెది "అనైతిక ప్రవర్తన" అన్నారు. జాకీర్‌హుసేన్ మరణించినపుడు వి వి గిరి ఉపరాష్ట్రపతి ఆ తర్వాత రాష్ట్రపతి విధులు నిర్వర్తిస్తుండేవాడు తనను అభ్యర్థిగా నిలబెట్టనందుకు ఆయనకు కోపం వచ్చింది. ఇదివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు రాష్ట్రపతులయ్యారు ఆయన రాజీనామా ఇచ్చి స్వతంత్రంగా అభ్యర్థిగా నిలబడ్డాడు ఇందిర తన "అభిప్రాయం పూర్తిగా మార్చుకోటం" గురించి సిండికేట్ ఫిర్యాదు కాంగ్రెస్ అధ్యక్షుడయిన నిజలింగప్ప చేసిన పెద్ద పొరపాటు వల్ల పదును లేకుండా పోయింది ఇందిర పట్ల ప్రజల సమర్థన అధికంగా ఉండటం చూసి భయపడి

అయన జనసంఘ్, స్వతంత్ర పార్టీల నాయకులను కలుసుకొన్నాడు వాళ్ళ రెండోస్థానంలో ఓటు రెడ్డికి ఇవ్వవలసిందని కోరాడు మొదటి స్థానంలో ఎలాగూ ప్రతిపక్షాల అభ్యర్థి, రాజనీతిజ్ఞుడు అయిన సి డి దేశ్‌ముఖ్ ఉంటాడని అతనికి తెలుసు. రెండవ స్థానంలో ఓటు రాష్ట్రపతి ఎన్నికలో చాలా ముఖ్యం. నిజలింగప్ప, సిండికేట్ "మతవాదుల, అభివృద్ధి నిరోధకుల"తో "అపవిత్రమైన పొత్తు" కుదుర్చుకొన్నందుకు ఇందిర వారిని విమర్శించి, రెడ్డి అభ్యర్థిత్వంతో తనకు సంబంధం లేదని "మనస్సాక్షి ఓటు" ను వినియోగించుకోమని అమె చెప్పింది

20 ఆగస్టు 1969 అర్ధరాత్రి తర్వాత రాష్ట్రపతి ఎన్నిక ఫలితాలు ప్రకటింపబడ్డాయి చివరిదాకా ఉత్కంఠత కొనసాగింది ఎందుకంటే పోటీ తీవ్రంగా ఉంది చివరకు గిరి చాలా తక్కువ మెజారిటీతో గెలిచాడు. కానీ ఎన్నికలలో, ముఖ్యంగా భారతదేశంలో, ప్రేమ, యుద్ధం విషయంలో లాగ, గెలిచిన వారే గొప్ప. ఇందిర సమర్ధకులు చాలా సంతోషించారు నిజానికి వెర్రెత్తి పోయారు సిండికేటు చాలా నిరాశ చెందింది విజయ యాత్రలు, ప్రజల అమోదం మధ్య గిరి విజయం ఎంత అస్థిరమో ఇందిర మరచి పోలేదు ఎన్నో ప్రతిపక్షాలు రెండోస్థానంలో ఆయనకు ఓటు ఇచ్చినందునే గెలుపు సాధ్యమయింది. కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులలో మూడింట రెండు వంతులు, రాష్ట్రాల శాసనసభల సభ్యులలో నాలుగింట మూడు వంతుల మంది మొదటి స్థానంలో రెడ్డికే ఓటు వేశారు అమె పోరాటం ఇంకా ముగియలేదు

ఈ సమయానికి ఇందిర, సిండికేట్ మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి కాంగ్రెస్ విభజన అనివార్యమైనప్పటికీ "కాంగ్రెస్ ఐక్యత" అనే మార్మికతవల్ల పార్టీని విభజించిన చెడ్డపేరు ఏ పక్షమూ కోరుకోలేదు వర్షం తర్వాత మొలిచే పుట్టగొడుగుల్లా మధ్యవర్తిత్వం కోసం ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కొన్ని మరీ చిత్రమైనవి ఒక ప్రయత్నంలో చవాన్ ప్రముఖంగా ఉన్నాడు ముఖ్యంగా తన పొరపాటుకు విచారిస్తున్నానని, ఇకముందు ఆమె పట్ల విశ్వాసంతో ఉంటానని ఇందిరకు తెలియజెప్పటమే ప్రధానమయింది అతని సమర్థనకు అమె స్వాగతం పలికింది కాని అతనిని తాను నమ్మనని అమె చెప్పింది చవాన్

ఎంత "నమ్మరాని వ్యక్తో, తనకు ఏ మాత్రం తెలిసినా పార్లమెంటరీ బోర్డులో రెడ్డి అభ్యర్థిత్వం విషయమై తన సహచరులు బలవంత పెట్టకుండా చూసేవాడిన"ని 15 నెలల తర్వాత కామరాజ్ నాతో అన్నాడు

సుమారు రెండున్నర నెలలు ఈ చిత్రమైన ఆట కొనసాగింది ఇది ముగించటానికి నిజలింగప్ప బహిరంగంగా ఇందిరకు ఒక ఉత్తరం వ్రాసి ఆమె వల్ల వచ్చిన ఇబ్బందులు ఏకరువు పెడ్తూ "మీకు వ్యక్తిగతమైన విశ్వాసాన్ని, కాంగ్రెస్‌పట్ల, దేశం పట్ల గల విశ్వాసానికి పరీక్షగా మీరు భావిస్తున్నట్లున్నారు" అని దెప్పిపొడిచాడు ఒక విధంగా, ముందు ముందు రానున్న పరిణామాల దృష్ట్యా, ఇవి భవిష్యవాణిగా పని చేశాయి కాని ఆ సమయంలో ఇవి అవహేళనకు గురయ్యాయి. అప్పుడు ప్రజలందరు "అభ్యుదయ ఇందిర" పట్ల సుముఖంగాను "అభివృద్ధి నిరోధకమైన సిండికేట్" పట్ల వ్యతిరేకతతోను ఉన్నారు నిజలింగప్పను సిండికేటుకు ప్రతీకగా భావించారు ఇది అక్టోబరు 28న జరిగింది. పదిరోజుల తర్వాత నిజలింగప్ప ఇందిరా గాంధీని పార్టీలో ప్రాధమిక సభ్యత్వం నుండి తొలగించాడు ఆమె స్థానంలో కొత్త నాయకుణ్ణి ఎన్నుకోమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి పిలుపునిచ్చాడు ఈ విధంగా కాంగ్రెస్ విభజన అనివార్యము, నిశ్చయము అయింది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌ను స్థాపించి 84వ సంవత్సరం జరుగుతోంది. అది మహాత్మాగాంధీ శతజయంతి సంవత్సరం

తనను కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు చాలా మంది సమర్థిస్తున్నారని, నిజలింగప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ కొంతమందికి ఆ సమర్థన లేదని ఇందిర ప్రశాంతంగా ప్రదర్శించింది పార్లమెంటులోని రెండు సభలలో అప్పుడు 429 మంది కాంగ్రెస్ సభ్యులున్నారు వారిలో 310 మంది ఇందిర పిలిచిన సమావేశానికి హాజరయ్యారు అంతకంటె ముఖ్యమైన విషయం ఏ ప్రభుత్వాన్నయినా నిలపగలిగే, పడగొట్టగలిగే తాహతున్న లోక్‌సభ సభ్యులలో 220 మంది ఇందిర పక్షం వహించారు 68 మంది మాత్రమే సిండికేటు, దేశాయిల పక్షం వహించారు కాంగ్రెస్‌లో ఇందిర ప్రభావం స్పష్టమయింది కాని ఆమెది అల్పసంఖ్యాక ప్రభుత్వమయింది కాని దానికి ఏ ప్రమాదమూ

లేదు భారత కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్‌ను తమిళనాడులో ఓడించిన డి యంకె ఇంకా ఇతరవర్గాలు, ఇండిపెండెంటు పార్లమెంటు సభ్యులు ప్రభుత్వానికి పూర్తి సమర్ధన ఇస్తున్నారు పోటీ కాంగ్రెసు నిర్వహించిన విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ఓడించటం ఆమెకేమీ కష్టం కాలేదు

తనకు పార్లమెంటులో మెజారిటీ సమర్ధన ఉందని ప్రదర్శించిన తర్వాత ఇందిర ఎ ఐ సి సి ని సమావేశపరచింది 705 మంది సభ్యుల్లో 446 మంది హాజరయ్యారు ఈ పోరాటం జరిగినంత సేపూ ప్రశాంతంగా, సంతులనంగా ఉన్న ఇందిర మొదటిసారిగా తన భావోద్రేకతను చూపించింది తన కుటుంబానికి తనకు కాంగ్రెస్‌తో గల చిరకాల బంధాన్ని గుర్తుకు తెచ్చుకొంటూ కొంతమంది పార్టీ నాయకులు తనను పార్టీ నుండి బహిష్కరించటానికి ఎలా "తొందరపడ్డారని" ఆమె కన్నీళ్ళు పెట్టుకొంది తనను తాను వెంటనే అదుపులో పెట్టుకొంది తనను వ్యతిరేకిస్తున్న వారి గురించి ఆ తర్వాత ఒక మాటయినా మాట్లాడలేదు ఆమె అనుయాయులు వారిని నిందించటంలో దూషించటంలో ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు సిండికేటు కూడా మాటకు మాటగా జవాబిస్తున్నందున బహిరంగంగా మాట్లాడే మాటలు చాలా తక్కువ స్థితికి జారిపొయ్యాయి దానినుంచి వారు పూర్తిగా కోలుకోలేదు

అదేసమయంలో ఇందిర తను ప్రజలకు చేసిన వాగ్దానాలు నిలబెట్టుకొని, తన వాగ్ధాటి కేవలం వ్యక్తిగత అధికారం కోసం తను పడే తాపత్రయానికి "ముసుగు" అని విమర్శించేవారు తప్పని నిరూపించింది రాబర్ట్ క్లైవ్ కాలంనుండి భారత వ్యాపార వ్యవస్థను నియంత్రించిన నిర్వహణ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసింది నియంత్రణ లేని ఆర్థిక వ్యవస్థ వైపు మొగ్గుతున్న ధోరణిని ఆపి మానోపలీస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టిసెస్ (యం ఆర్ టి పి ) కమిషన్‌ను ఏర్పాటు చేసి భవిష్యత్తులో పరిశ్రమ, వ్యాపారాలు విస్తరించటాన్ని క్రమబద్ధం చేసింది తనను సమర్ధిస్తున్న వారిలో మౌలికంగా మార్పు కోరుతున్నవారు అడిగినట్లు విదేశ వ్యాపారాన్ని జాతీయాకరణ చేయటానికిగాని ఇదివరకు విదేశీ పెట్టుబడిదారుల కిచ్చిన రాయితీలు రద్దు చేయటానికి కాని ఆమె అంగీకరించలేదు.

ఇంత ముఖ్యమైన విషయం ఎవరూ గుర్తించక పోవటానికి కారణం ఆమె "కమ్యూనిస్టు లేదా కమ్యూనిస్టు వంటిది" అని సిండికేటు అర్థరహితంగా ప్రచారం చేయటమే

కాంగ్రెస్ విభజన దేశంలో ఇందిర స్థానాన్ని ఎంతగానో పటిష్ఠం చేసిందనటంలో ఏమాత్రం అనుమానం లేదు. తన మంత్రి వర్గంలో పెద్ద మార్పులు తీసుకురావటానికి ఆమె దీనిని ఉపయోగించుకొంది చవాన్‌ను ఆర్థిక మంత్రిని చేసి, అధికారసంపన్నమైన గృహవ్యవహారాల మంత్రిత్వ శాఖను తన ఆధ్వర్యంలోకి తీసుకొంది. ఇంకొక ముఖ్యమైన మార్పు దినేశ్ సింగ్ పదవి స్థాయిని తగ్గించటం ఆయన చాలా రోజులు "కిచెన్ కాబినెట్" లో ముఖ్యమైన, ప్రతిభావంతమైన సభ్యునిగా ఉండేవాడు మొదట ఇందిర ప్రధానమంత్రి అయినప్పుడు ఆయన విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో చిన్న మంత్రిగా ఉండేవాడు అప్పుడు తన మంత్రివర్గంలో వాణిజ్య మంత్రి పదవిని అతనికిచ్చింది. తను విదేశ వ్యవహారాల మంత్రి కావాలని ఆయన ఉబలాట పడితే ఆ పదవీ అతనికి దక్కింది కాని 15 నెలలలోనే అతనిని వ్యాకులపరుస్తూ అంత ఎక్కువ ప్రాముఖ్యం లేని మంత్రి పదవికి అతనిని తరలించింది త్వరలోనే మంత్రి మండలి నుండి, ఆ తర్వాత పార్టీ నుండి అతనిని తొలగించటమయింది అతనికి ముందు ఎందరో పదవీచ్యుతులయ్యారు. అతని తర్వాత మరెందరికో ఆ విధంగానే జరిగింది.

ఇందిర ఇస్తున్న సందేశం స్పష్టంగానే ఉంది "కిచెన్ కాబినెట్" సిండికేట్ కంటే ఎక్కువగా తాను సింహాసనానికి వెనక అధికారంగా ఉండటానికి ప్రయత్నించకూడదు కాని విచారించదగ్గ విషయమేమిటంటే చాలా మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులకు ఇది అర్థం కాలేదు ఏ విధంగానైనా అధికారకేంద్రానికి దగ్గరగా ఉండాలనే పిచ్చి వ్యామోహం ఎక్కువయింది దీని ఫలితంగా, సాంప్రదాయికంగా భూస్వామ్య వ్యవస్థలో, ఆ తర్వాత మొగలు సామ్రాజ్యంలో దర్బారు సంస్కృతికి అలవాటు పడ్డ వారికి, ప్రపంచంలో అతి పెద్దదైన ప్రజాస్వామ్యంలో దర్బారు పద్ధతి ఆచరణలోకి వచ్చింది. ఇందిర

సమున్నతాధికారంతో, ఎంతో ప్రజాదరణ గల నాయకురాలుగా ఆవిర్భవించటంతో గల రెండు హానికరమైన ఫలితాలలో ఇది ఒకటయింది. రెండవది తన తండ్రి పెంచి పోషించిన సంస్థలు, ప్రజాస్వామ్యంలో సంతులన కాపాడే వాటిని నిర్లక్ష్యం చేసి ప్రధానమంత్రి చేతుల్లోనే ఎక్కువ అధికారాన్ని కేంద్రీకృతం చేసుకోటం మంత్రివర్గంలో మార్పులు తీసుకువస్తూ ఇంటలిజెన్స్ బ్యూరోను ఇందిర విభజించింది అప్పటి వరకు దేశంలోను, విదేశాలలోనూ గూఢమైన సమాచార సేకరణకు ఈ సంస్థ బాధ్యత వహించేది విదేశాల సమాచారానికి రీసెర్చి అండ్ అనాలిసిస్ వింగ్ (ఆర్ ఎ డబ్ల్యు) ను ఏర్పాటు చేసి దీనిని ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ చేశారు ఇంటెలిజెన్స్ బ్యూరో గృహమంత్రిత్వ శాఖలో ఉంది రెవెన్యూ ఇంటలిజెన్స్ అప్పటివరకు ఆర్థికమంత్రిత్వ శాఖలో ఉండేది ఇప్పుడది ప్రధానమంత్రి నియంత్రణలోకి వచ్చింది

ఇందిర ప్రభుత్వం స్థిరంగానే ఉంది కాని ఇతరుల సమర్థనమీద ఆధారపడటం రాజకీయంగా బెదిరింపులకు దారి తీస్తుందని ఆమెకు బాగా తెలుసు ముందేమి చెయ్యాలా అని ఆలోచిస్తుండగానే కేరళలో తనంతట తానుగానే ఒక అవకాశం వచ్చింది ఇక్కడ 1967లో సి పి.ఐ (యమ్ ) నాయకత్వంలో ఒక సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. కాని అంతరంగ విభేదాల వల్ల జూన్ 1970లో అది పడిపోయింది పదేళ్ళ క్రితం తాను చేసినదానికి భిన్నంగా సెప్టెంబరులో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికలలో ఇందిర సి పి ఐ తో పొత్తు కలిపింది కాంగ్రెస్ – సి పి ఐ లు ప్రాంతీయంగా ఉన్న మరికొన్ని కూటాలు కలిసి సులభంగా ఎన్నికలలో విజయాలు సాధించాయి కొత్త రాష్ట్ర శాసనసభలో ఇందిర నాయకత్వంలోని కాంగ్రెస్ అన్నిటికంటె పెద్దపార్టీ కానీ ఆమె రాష్ట్ర ప్రభుత్వం నాయకత్వాన్ని పెద్ద మనసుతో సి పి ఐ కి ఇచ్చింది.

**ఇందిర కెరటం**

ఒక విధంగా కేరళ ఎన్నికలు రానున్న పూర్తి కథా చిత్రానికి మచ్చు తునక మాత్రమే తనకు తాజాగా ప్రజల తీర్పు కావలసినందున లోక్‌సభను రద్దు చేయటమయిందని, ఎన్నికలు కొత్త సంవత్సరంలో ఫిబ్రవరి మధ్యలో

జరుగుతాయని ఆమె రేడియోలో ప్రసంగించింది ఈ విధంగా జరుగుతుందని అందరూ అనుకొన్న విషయమే ప్రతిపక్షంలోని ముఖ్యమైన పార్టీలు - పోటీ కాంగ్రెస్, స్వతంత్ర, జనసంఘ్, రైతుల పార్టీ ఒకటి భారతీయ క్రాంతి దళ్ "గొప్ప మైత్రి" ని ఏర్పరచుకొన్నాయి తామందరూ కలిసి ఆమెను ఓడించగలమన్న నమ్మకం వారికుంది వాస్తవంగా కాంగ్రెస్ సంస్థను అన్ని రాష్ట్రాలలో సిండికేట్ నిర్వహిస్తున్నందున, ఇందిర కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ పార్టీ యంత్రాంగం లేనందున కొంతవరకు ఈ ఆశాభావం ఏర్పడిందనవచ్చు ప్రజలకు నేరుగా విజ్ఞప్తి చేయాలనుకొన్న ఆమె వ్యూహానికి ఇది బాగా సరిపోయిందన్న విషయం వాళ్ళు గుర్తించలేదు మొదటి సారిగా లోక్‌సభకు మాత్రమే ఎన్నికలు జరగటం, వీటితో పాటు రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరగకపోవటం ఆమెకు లాభదాయకమే అయింది రాష్ట్రాలలోని వ్యాకులతల గురించి తను ఆలోచించే అవసరం లేకపోయింది కాకపోయినా ఆమె పార్టీలో ఒకే ఒక్క నాయకురాలు ఆమె మాత్రమే దేశం ఈ మూలనుండి ఆ మూలవరకు తరగని అత్యధిక శక్తితో ప్రచారం చేసింది కూడా ఇందిరే

1971 నాటి పార్లమెంటు ఎన్నికలు ఇందిరా గాంధి నాయకత్వానికి ఎన్నికలుగా మారాయి తనకు ప్రజాదరణ మెండుగా ఉందని తెలిసి ఆమె ఈ పరిస్థితికి ఆనందించింది. ఈ ఎన్నికలలో ప్రధాన విషయమేమిటని న్యూస్‌వీక్ అడిగినపుడు "విషయం నేనే" అని ఆమె జవాబిచ్చింది. సంకేత మందుకొన్నట్టుగా గొప్ప మైత్రీ బంధం ఆస్థానాన్ని దిగ్బంధం చేసినట్లు "ఇందిర హటావ్" (ఇందిరను తొలగించండి) అని ఏకసూత్ర కార్యక్రమం ప్రకటించింది దీనికి జవాబుగా ఆమె ఏ వ్యక్తికీ వ్యతిరేకిని కానని, తన ప్రజలను పేదరికం బారినుండి తప్పించటమే తన ధ్యేయమని తన యుద్ధనినాదం, "గరీబీ హటావ్" (పేదరికాన్ని నిర్మూలించండి) అని ప్రకటించింది దేశమంతా సమ్మోహితమయింది జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న పేదలు తమకు పేదరికం నుండి ముక్తి కలిగించే వ్యక్తి దొరికిందని చాలా ఆనందించారు.

ఆమె ఎక్కడికి వెళ్ళినా జన సందోహాల ఉత్సాహం ప్రకటితం కావటంలో ఏమీ ఆశ్చర్యం లేదు. ఈ సారి ఆమె సభలలో ఎక్కడా ఏ అలజడీ లేదు రాళ్ళు రువ్వే ప్రశ్నే లేదు 1967 నాటికంటె ఇప్పుడు ఆమెకు, ఆమె విరోధులకు మధ్య వివాదం స్థాయి ఎంతో ఎక్కువగా ఉంది అయినా ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉంటాయో ఎవ్వరూ కచ్చితంగా చెప్పలేకపోయారు అందుకే ఎన్నికల ఫలితాలు ప్రజలను ఆశ్చర్య పరిచాయి ఇందిర సంచలనాత్మకమైన విజయం సాధించింది ఆమె పార్టీకి 352 సీట్లు వచ్చాయి ఇదివరకు సమైక్య కాంగ్రెసుకు వచ్చిన దానికన్నా 70 సీట్లు ఎక్కువే కాంగ్రెస్ (ఓ) భాగం 68 సీట్లనుండి 16 సీట్లకు తగ్గింది మరెన్నో ప్రతిపక్షాలు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి వ్యక్తిగతమైన అంత ఘనవిజయం అప్పటి వరకు కనీ వినీ ఎరుగనిది నిన్నటివరకు ఆమెకు ప్రతికూలంగా వున్న వార్తాపత్రికలు, మరీ తీవ్రంగా వ్రాసిన పత్రికలు ఒక్కసారిగా "ఇందిరకెరటాన్ని" ప్రశంసిస్తూ వ్రాశాయి ఇది కెరటం కాదు "తుఫాను" అని ఒకరన్నారు. ఆశ్చర్యకరమేమిటంటే దీర్ఘంగా, ఉద్రిక్తంగా సాగిన ఎన్నికల ప్రచారంలో వీరిలో ఒకరయినా దీనిని గుర్తించలేదు



## 6

# ఆమెకు అత్యంత శ్రేష్ఠమైన సమయం

ఇందిర 1971 సార్వత్రిక ఎన్నికలలో సాధించిన ఘన విజయానికి దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహం పెల్లుబికింది. ఉప్పొంగుతున్న తన అనుయాయులను ఆమె అదుపులో పెట్టింది చేయవలసిన పని ఎంతో ఉందని, వాగ్దానాలు నిలుపుకోవలసి ఉందని వారికి జ్ఞాపకం చేసింది ఐదవ దశకంలో తన తండ్రి కాలంలో జీవిత బీమాను జాతీయీకరణ చేయటమయింది ఇప్పుడు ఇందిర జనరల్ ఇన్సూరెన్స్‌ను కూడా జాతీయీకరణ చేసింది ప్రాధమిక హక్కులను సవరించే హక్కు పార్లమెంటుకు తిరిగి దక్కేటట్లు ఆమె రాజ్యాంగాన్ని సవరింపజేయటం గుర్తించ దగింది నాలుగేండ్ల క్రితం కె సుబ్బారావు ఇచ్చిన తీర్పును ఇది వ్యతిరేకించటమే ప్రజలకు ప్రయోజనకరమైన పని కోసం ఎవరి ఆస్తులైనా తీసుకోటం జరిగితే దానికి చెల్లించవలసిన మొత్తాన్ని న్యాయస్థానాలు కాక పార్లమెంటు నిర్ణయించేటట్లు మరో రాజ్యాంగ సవరణ జరిగింది రాజ్య విధానంలో ఆదేశిక సూత్రాలను అమలు పరచటానికి ఉన్న చట్టాలను న్యాయస్థానాలలో లేవనెత్తకుండా ఈ సవరణ జరిగింది

కొత్తగా ఎన్నికయిన పార్లమెంటులో రాజకీయంగా ఆకర్షణీయంగా, ఆర్ధికంగా వివేకవంతంగా ఉండే విధానాలను ప్రకటించటానికి ఆమె పనిచేయాలనుకొంది అయితే 1971 వ సంవత్సరమంతా ప్రధానమంత్రిని, ప్రజలను చింతాగ్రస్తం చేసి, భారత దేశం మీద గొప్ప ప్రభావం చూపే భయంకరమైన, విషాదకరమైన విషయాలు జరిగాయి

మూడవ సారి ఇందిర ప్రధానమంత్రిగా పదవీ స్వీకారం చేసిన ఎనిమిది రోజులకు, అప్పటివరకు ఎన్నో ఏండ్లుగా మరుగుతున్న గొప్ప విపత్తు నేడు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ గా వెలసిన ఆనాటి తూర్పు పాకిస్థాన్‌లో

హఠాత్తుగా విజృంభించింది ఈ విపత్తు ఆ దురదృష్టకరమైన దేశాన్ని అప్పుడప్పుడూ సర్వనాశనం చేసే తుఫాన్లకు ఏమాత్రం తీసిపోలేదు కొన్ని నెలల క్రితమే అటువంటి విధ్వంసకరమైన తుఫానొకటి ఆదేశంపై విరుచుకు పడింది

పాకిస్థాన్ ఏర్పడినప్పటినుండి భౌగోళికంగా వికృతంగా ఉంది రాజకీయ అధికారం చేపట్టిన పశ్చిమ పాకిస్థాన్ నుండి, అత్యధిక జనాభాగల తూర్పు పాకిస్థాన్ వెయ్యి మైళ్ళ దూరంలో ఉంది రెండింటి మధ్య భారత భూభాగముంది సాల్మన్ రష్దీ మాటల్లో అప్పుడు పాకిస్థాన్ "రెండు రెక్కలున్నా శరీరంలేని పక్షి". రెండు భాగాలలోను పంజాబీ ఉన్నత వర్గాలవారు ప్రభుత్వోద్యోగాలలో ప్రముఖంగా ఉంటూ దూరంగా ఉన్న బెంగాలీల పట్ల తిరస్కృత భావంతో ఉండటం అంత రహస్యమేమీ కాదు సైన్యంలో బెంగాలీల సంఖ్య చాలా తక్కువ ఒక మతంగాక రెండు పక్షాలలోను సామాన్య విషయమేదీ లేదు ముఖ్యంగా భాష వారిద్దరి మధ్య పెద్ద తగాదాకు కారణమయింది ఉర్దూ బలవంతాన రుద్దినపుడు దానిని నిరోధిస్తూ మరణించిన విద్యార్థులు తూర్పు పక్షంలో మొదటి మృతవీరులు, అమరజీవులు వారి జ్ఞాపకాలను బంగ్లాదేశ్ ఇప్పటికీ గౌరవిస్తుంది

తూర్పు పాకిస్థాన్‌కు జరిగిన అన్యాయాలను సరిదిద్ది ఉండవచ్చు లేదా తీవ్రతను తగ్గించి ఉండవచ్చు అయితే పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం వేళ్లూని ఉంటే ఇది సాధ్యమయ్యేది ఎందుకంటే అధిక సంఖ్యాకులు, ఎన్నికలలో నమ్మకమున్న వారు ఇక్కడున్నందున భూస్వామ్య పద్ధతిలో సాగే పశ్చిమ పాకిస్థాన్ మీద వీరిది పై చేయిగా ఉండేది కాని ఆవిధంగా జరగలేదు ఎన్నికలు లేకుండా ఏర్పడిన ప్రభుత్వాలు వరుసగా వచ్చిన తర్వాత, ముఖ్యంగా సైనిక శక్తి, ఉన్నతోద్యోగులు ప్రభుత్వాలను నడుపుతున్నప్పుడు రాజకీయ ప్రక్రియ కుంటుపడింది జనరల్ అయూబ్ ( ఆ తర్వాత ఫీల్డ్ మార్షల్ అయ్యాడు) రూపంలో సైన్యం 1958లో ప్రభుత్వాన్ని చేపట్టింది నేషనల్ అసెంబ్లీలో రెండు పక్షాలమధ్య "సమానత సూత్రాన్ని" కఠినంగా అమలు పరచింది

స్వాతంత్ర్యం కోసం తూర్పు పాకిస్థాన్‌లో ఒక ఉద్యమం మొదలై ఉరవడి నందుకోవటంలో ఆశ్చర్యం లేదు వాళ్ళ నాయకుడు జనాకర్షణ కలవాడు, ప్రజలను ప్రేరేపించే వాడు అయిన షేక్ ముజిబుల్ రహమాన్ ఆయనను సాధారణంగా

అందరూ షేక్ ముజిబ్ అని పిలిచేవారు. బంగ్లాదేశ్ జాతిపితగా ఆయనను పేర్కొన్నారు ఆ తర్వాత ఆయన పట్ల కినుక వహించిన అనుయాయులే షేక్ ముజిబ్‌ను హత్య చేశారు. 1965 లో జరిగిన భారత – పాకిస్థాన్ యుద్ధం వల్ల ముజిబ్ ఉద్యమం ఊపందుకొంది. ఆ సమయంలో తూర్పు పాకిస్థాన్ తనకు ఏమాత్రం రక్షణ లేనట్లు, చైనా పాకిస్థాన్‌ను సమర్థిస్తున్న సంకేతం లేకపోతే భారతదేశం తనను ఆక్రమించేదని భావించింది అయూబ్ వెంటనే ముజీబ్‌ను నిర్బంధంలోకి తీసుకొన్నాడు ఆయనను "ఇండియన్ ఏజెంటు" అని "దేశద్రోహి" అని నేర విచారణ జరిపించాడు "అగర్తలా కుట్ర" అనే కేసు ఇంకా నడుస్తూనే ఉంది అయూబ్‌ను తొలగించాలని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని జరిగిన ప్రజాందోళనతో అయూబ్ పదవిని పోగొట్టుకొన్నాడు ఫిబ్రవరి 1969 లో అయూబ్ పదవినుండి వైదొలగాడు. కాని ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటానికి బదులు మరింత దృఢమైన మిలిటరీ పాలన ఏర్పడింది

మిలిటరీ నియంతగా అయూబ్ తర్వాత వచ్చిన వ్యక్తి జనరల్ యాహ్యాఖాన్, హుంకరిస్తూ, గొప్పలు చెప్పుకొంటూ ఉండే మోటైన సిపాయి తనకు ముందు పదవిలో ఉన్న వ్యక్తికున్న రాజకీయ నైపుణ్యంగాని, హుందాతనంగాని ఇతనికి లేవు చాలావరకు తాగుడు మత్తులో ఉండేవాడు విషయాసక్తితో జీవితం గడిపేవాడు. అయినా తాను చెప్పిన మాట ప్రకారం మొదటి సారిగా పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరిపించినందుకు అతనిని మెచ్చుకోక తప్పదు. ఈ ఎన్నికలు డిసెంబరు 1970లో జరిగాయి వాటి ఫలితాలు చాలా గొప్పగా ఉన్నాయి. ముజీబు పార్టీ అవామీ లీగ్‌కు ఘన విజయం లభించింది ప్రావిన్సులోని అసెంబ్లీ ఇంచుమించు అన్ని సీట్లూ వారికే దక్కాయి నేషనల్ అసెంబ్లీలో తూర్పు పాకిస్థాన్‌కు కేటాయించిన 162 సీట్లలో 160 సీట్లు వీరికి మరింత ముఖ్యమైన విషయం 300 సభ్యులున్న అసెంబ్లీలో ముజీబ్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది అందుకని పోటీ లేకుండా ప్రధానమంత్రి పదవి పొందే హక్కుంది జుల్ఫికర్ ఆలీ భుట్టో పూర్తి మద్దతుతో యాహ్యా, సైన్యం ముజీబ్‌కు అధికారాన్ని దక్కనివ్వలేదు ఒకప్పుడు అయూబ్ ఆశ్రితుడు, ఒకప్పటి విదేశ వ్యవహారాల మంత్రి అయిన

భుట్టో తన గురువు మీదే తిరుగుబాటు చేసినా యాహ్యాతోను, ఇతర జనరళ్ళతోను అతి జాగ్రత్తగా మంచి సంబంధాలు పెట్టుకొన్నాడు. పశ్చిమ భాగానికి కేటాయించిన సీట్లలో అతని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి మెజారిటీ వచ్చింది కాని ముజీబ్ విజయంతో పోల్చి చూస్తే ఇది పెద్ద లెక్కలోకి రాదు

ముజీబ్‌కు అధికారాన్ని ఇవ్వకపోవటం చూసి తూర్పు పాకిస్థాన్ అదుపులేని కోపాన్ని, సర్వవ్యాపకమైన తిరుగుబాటును ప్రదర్శించింది యాహ్యా తీవ్రమైన చర్యతో దీనిని ఎదుర్కొన్నాడు పైపైకి ముజీబ్‌తో సంప్రదింపులు జరుపుతూ దీని వెనక క్రూరంగా ఈ దాడిగురించి పధకం వేశారు. గూఢ సమాచారం బాగా తెలిసిన పి యన్ ధర్ యాహ్యా కాకీ బట్టలలోని తన సహాయకులతో చెప్పిన మాటలు ఈ విధంగా పేర్కొన్నాడు – “బెంగోలను సరయిన దారిలో పెట్టేవరకు ఏ ఒప్పందమూ ఉండదు ”

నాజీ యుద్ధంలోని అపరాధాలకు మించి పాకిస్థానీ సైన్యం మాటల కందనంత క్రూరంగా ప్రవర్తించింది ముజీబ్‌ను నిర్బంధంలోకి తీసుకొన్నారు. పశ్చిమ పాకిస్థాన్‌లో భయంకరమైన కారాగారానికి తరలించారు ఏకాంతంగా ఖైదు చేశారు మార్చి 25న జరిగిన జనసంహారం చూసిన అవామీ లీగ్ నాయకులు కొందరు కలకత్తాకు పారిపోయి దేశం బయట ప్రభుత్వాన్ని ఏర్పరచారు తూర్పు పాకిస్థాన్‌లో అతి సహజంగా చెలరేగిన తిరుగుబాట్లలో ఇది వరకు ఎరుగని కొత్తనాయకులు ఉద్భవించారు మొత్తం తూర్పు పాకిస్థాన్ జనాభా అంతా తిరుగుబాటు చేసింది వేలాదిమంది తమ చేతికందిన ఆయుధాలు పట్టుకొన్నారు బంగ్లాదేశ్ ముక్తికోసం చాలా అసమానమైన యుద్ధం ప్రారంభమైంది

తూర్పు బెంగాలులో పాకిస్థానీ దుశ్చర్యలు ఎక్కువయ్యే కొద్దీ దగ్గరగా ఉన్న భారతదేశ రాష్ట్రాలలోకి శరణార్థుల రాక ఎక్కువయింది అప్పటికే స్వాతంత్ర్యం వచ్చినపుడు, విభజన జరిగినపుడు, చట్టవిరుద్ధంగా తూర్పు పాకిస్థాన్ నుండి వలస వచ్చినందున శరణార్థుల భారం ఈ రాష్ట్రాలమీద ఉంది ఐదు వారాలలోనే శరణార్థుల సంఖ్య మూడున్నర మిలియన్లు (ముప్పయి ఐదు లక్షలు) అయింది శరణార్థుల శిబిరాలు చూసి, వారి దుఃఖం, భయం గమనించి, కలకత్తాలోని

రాజభవన్‌కు తిరిగి వచ్చిన ఇందిరాగాంధి నిశ్చయంగా, స్థిరంగా తన సలహాదార్లతో ఈ విధంగా చెప్పింది - "ఇక్కడ జరుగుతున్న దానిని గురించి ప్రపంచానికి తెలియాలి దాని విషయమై ఏదైనా చేయాలి. ఏది ఏమైనా పాకిస్థాన్ ఈ మారణహోమం కొనసాగించటాన్ని మనం అనుమతించం "

ఆ తర్వాత శరణార్థుల సంఖ్య పది మిలియన్ల దాకా లేదా క్యూబా జనాభాకు ఒకటిన్నర రెట్లు పెరిగినపుడు "పాకిస్థాన్ ఆంతరంగిక సమస్య అనుకొన్నది ఇప్పుడు భారతదేశ అంతరంగిక సమస్య అయిందని" ఆమె ప్రకటించింది. శరణార్థులు తన దేశంపై "భరించలేని" ఆర్థిక, రాజకీయ భారం మోపారని, పాకిస్థాన్ "తన సమస్యను భారతదేశం మూల్యం చెల్లించటం ద్వారా పరిష్కరించుకోకూడదని" తెలియ జేసింది. శరణార్థులందరినీ తమ దేశంలో పెట్టుకొనే మార్గం లేనందు వల్ల వారందరూ వెనక్కు వెళ్ళాల్సిందే. "మరింతగా శరణార్థులు రాకుండా నిలిపివేసే పరిస్థితులను" పాకిస్థాన్ సృష్టించాలని, పాకిస్థాన్ ప్రపంచదేశాల సమూహం బంగ్లాదేశ్‌లో ఒక రాజకీయ పరిష్కారం సూచించాలని, దానివల్ల శరణార్థులు "భద్రంగా, గౌరవంగా" తమ దేశానికి వెళ్ళగలరని ఆమె తెలియజేసింది.

శరణార్థుల వెల్లువ భారతదేశంలోకి రావటంతో భారత ప్రజలు ఆందోళన చెందారు క్రుద్ధులయ్యారు "వెంటనే చర్య" తీసుకోవలసిందిగా ఒత్తిడి చేయసాగారు. తగిన చర్య అంటే సైన్యాలతో జోక్యం కలిగించుకొమ్మని మృదువుగా చెప్పటమన్న మాట అయితే ఇదివరకే గుర్తించినట్లు ఇందిరాగాంధి ధైర్యాన్ని. వివేకాన్ని ఎప్పుడూ మేళవిస్తుంది త్వరపడి చర్య తీసుకోటం గాని, విపరీత ఫలితమిచ్చే చర్య తీసుకోటంగాని లేక ఈ రెండిటి కలయిక గాని ఆమె తిరస్కరించింది. అంతర్జాతీయ న్యాయాన్ని భారతదేశం ఉల్లంఘించిందని ఎవరైనా అనటంగాని, బంగ్లాదేశ్‌లోని స్వాతంత్ర్య సమరాన్ని పాకిస్థాన్ అప్రతిష్ఠపాలు చెయ్యటంగాని జరక్కుండా త్వరపడి నిర్ణయం తీసుకోకూడదనే ఆమె విధానం సరిగానే ఉంది. అప్పుడున్న వాస్తవ పరిస్థితులకు ఇది అనుగుణంగానే ఉంది

వర్షాకాలానికి ముందుగాని, వర్షాకాలమప్పుడు గాని, నదులు పొంగిపోతున్నప్పుడు, దేశంలో చాలా భాగం బురదమయంగా ఉన్నప్పుడు, సైనిక చర్య తీసుకోవటంలో అర్థం లేదు. కాకపోయినా తగిన వ్యూహం తయారు చెయ్యటానికి కొంచెం సమయం అవసరమవుతుంది. ఈ విషయంలో ప్రధానమంత్రికి, త్రివిధ దళాల ముఖ్య అధిపతి, జనరల్ ( ఆ తర్వాత ఫీల్డ్ - మార్షల్) సామ్ మానెక్ షాకు మధ్య పూర్తి అవగాహన ఉంది. బంగ్లాదేశ్ విముక్తి 25వ వార్షికోత్సవం జరుపుకొంటున్నప్పుడు మానెక్‌షా, ఒక రేడియో ఇంటర్వ్యూలో "మూడు సైన్యాల మధ్య పూర్తి సామరస్యమే గాక, మొత్తం సాయుధ దళాలకు, ప్రధానమంత్రికి మధ్య కూడా సామరస్య ముంది" అని ఇందిరాగాంధి నాయకత్వాన్ని ఎంతగానో ప్రశంసించాడు

తొందరపడి చర్య తీసుకోక పోవటానికి మరో కారణం ప్రపంచాభిప్రాయాన్ని కదల్చవలసిన అవసరం ఉన్నందున, దాని ఫలితంగా పాకిస్థాన్ మారణహోమం చాలించి బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిష్కారానికి కృషి చేస్తుందన్న నమ్మకం ఒక వేళ ఈ కోరిక తీరక యుద్ధం అనివార్యమైనా హిమాలయ కనుమలు చలికాలంలో మంచుతో నిండిపోయే వరకు ఆగటం వివేకమే అవుతుంది అప్పుడు తన మిత్ర దేశమైన పాకిస్థాన్ సహాయార్థం చైనా పరుగున వచ్చే వీలుండదు

జులై 1971 లో ప్రెసిడెంట్ నిక్సన్‌కు జాతీయ భద్రతా సలహాదారు హెన్రీ కిసింజర్ న్యూఢిల్లీకి వచ్చిన తర్వాత చైనా తీసుకోగల చర్యల గురించి దేశంలో వ్యాకులత హెచ్చింది బంగ్లాదేశ్ విషయమై ఇండియా - పాకిస్థాన్ పోరాటంలో చైనా జోక్యం కలిగించుకొన్నట్లయితే అమెరికా సహాయం చేస్తుందని భారత దేశం ఆశించకూడదని అతను ఎన్నో సంకేతాలిచ్చాడు నిక్సన్ - కిసింజర్‌లు పాకిస్థాన్ వైపు "మొగ్గు" చూపిస్తున్న సందర్భంలో ఈ విషయం నిజంగానే ఒక కుదుపు కుదిపింది కొన్ని రోజుల తర్వాత కిసింజర్ రహస్యంగా చైనాకు వెళ్ళాడని, చైనా - అమెరికాల సంబంధాలలో గొప్ప మార్పు రాబోతుందన్న ప్రకటన మరింత విస్మయం కలిగించింది. కిసింజరు తాను ఢిల్లీలో విదేశ వ్యవహారాల కార్యదర్శి టి యన్ కౌలుకు ఇదివరకు సంక్షేపంగా చెప్పిన విషయాన్నే అమెరికాలోని భారత

రాయుబారి యల్.కె.ఝాకు వివరంగా చెప్పటానికి ఈ అవకాశాన్ని వినియోగించుకొన్నాడు.

ఈ కొత్త స్థితికి ప్రత్యుత్తరంగా శాంతి, మైత్రి, సహకారం ఒప్పందం ఇండియా – సోవియెట్‌ల మధ్య 9 ఆగస్టు 1971లో న్యూఢిల్లీలో జరిగింది ఈ ఒప్పందం గత రెండేండ్లుగా రూపొందుతున్నా ఇందిర దానికి ముగింపు నివ్వటానికి ఏమాత్రం తొందర పడలేదు. అంతర్జాతీయ అధికార రాజకీయాల చదరంగం బల్లపై స్పష్టమవుతున్న ఎత్తుల వల్ల ఈ ఒప్పందం అవసరమయింది. వాస్తవానికి ప్రజలు దీనిని సమర్థించారు ఎందుకంటే అమెరికా–పాకిస్థాన్ – చైనా కూటమికి ఇదే తగిన సమాధానమని వారికి తెలుసు.

ఇంతలో బంగ్లాదేశ్ ప్రజలు వీరోచితంగా పోరాడటానికి ఏర్పడిన ముక్తివాహినికి భారతదేశపు సరిహద్దుల్లో రక్షణ, శిక్షణ పరికరాలు లభించాయి దీనికి సహాయం చేసేవని సైన్యానికి గాక సరిహద్దు రక్షణ దళానికి అప్పగించటమయింది వారెంతో చక్కగా దానిని నిర్వర్తించారు

అధికారపరంగా "క్రియాశూన్యత" గురించి తమ అసహనాన్ని ప్రజలు, పార్లమెంటు సభ్యులు, చివరకు మంత్రులు కూడా ప్రకటిస్తున్నప్పుడు ఇందిర వాళ్ళను మళ్ళీ మళ్ళీ శాంత పరచవలసి వచ్చింది సైనికంగా జోక్యం చేసుకోమని ఒత్తిడి తెస్తున్న వారిలో గాంధి అనుయాయి, అహింసావాది అయిన జయప్రకాశ్ నారాయణ్ (జె.పి ) ఉండటం ఆశ్చర్యమే. పి యన్ ధర్ మాటల్లో "సంతులనం లేని నిర్ణయం, భావోద్రేకత" తనను "ఆశ్చర్య పరచింది " ఈ వ్యక్తి "చాలా ప్రేమించదగినవాడు " జె పి తన శక్తి సామర్థ్యాలు "పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని మళ్ళించటానికి" వినియోగించాలని ఆయనకు నచ్చజెప్పటమయింది బంగ్లాదేశ్‌కు వెంటనే గుర్తింపు నివ్వాలనే కోరికను ఇందిర నిరుత్సాహపరచింది "ఒక తప్పటడుగు, ఒక తప్పు మాట" "అనుకొన్న దానికంటె భిన్నమైన ఫలితాన్ని" స్తుందని ఆమె మృదువుగా వాదించింది

ఈ విధంగా అత్యున్నతమైన నాయకత్వ లక్షణాలు ఆమె ప్రదర్శించింది ప్రశాంతంగా, దృఢచిత్తంతో, స్ఫూర్తి దాయకంగా ఆమె వ్యవహరించింది పాకిస్థాన్

చేసిన సవాలుకు జవాబుగా రాజకీయ, దౌత్య, సైనిక అంశాలను అద్భుతంగా మేళవించింది ఆమె ప్రతి ఎత్తుగడ ప్రతిభావంతంగా సముచిత సమయంలో జరిగింది ప్రతి స్థాయిలోను ప్రతిపక్ష నాయకులకు విషయాలు తెలియజేస్తూ జాతీయంగా ఏకీభావాన్ని సాధించింది.

అంతర్జాతీయ అభిప్రాయాన్ని ప్రభావితం చేసి మలచుకోవటానికి అత్యంత ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని ఆగస్టు చివరకు ఆమె నిర్ణయించింది సెప్టెంబరు ప్రారంభంలో ఆమె మాస్కోకు వెళ్ళింది భారత సోవియెట్ ఒప్పందంపై సంతకం చేసి మూడు వారాలయింది మాస్కోలో ఆమె మాటలను గౌరవంగా, శ్రద్ధగా విన్నారు లియోనిడ్ బ్రెజ్‌నేవ్ తన సెలవులను అర్ధాంతరంగా ముగించి వచ్చేవరకు ఆమె ఇతర నాయకు లెవ్వరితోనూ సంప్రదింపులు జరపననటం ఆమె సోవియెట్ రాజధానిలో ఉన్న కొద్ది రోజులలో చెప్పుకోదగ్గ సంఘటన ఒక నెల తర్వాత త్వరితగతిలో జరిగిన మూడు వారాల ప్రయాణం ఆమెను ఆస్ట్రియా, బెల్జియం, ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ, బ్రిటన్, అమెరికాలకు తీసుకెళ్ళింది శ్రమతో కూడిన ఈ కార్యంలో మొదటి నుండి చివరి దాకా ఈమె ఎంతో ప్రావీణ్యాన్ని ప్రదర్శించింది

## అత్యుత్తమ దౌత్యం

వివిధ రాజధానులలో ఇందిర ఏమి చెప్పిందో, ఏమి చేసిందో చెప్పాలంటే ఎంతో వ్యవధి కావాలి కొన్ని ఉదాహరణలే చాలు లండన్‌లో నమ్రత, మృదుభాషణ గల విదేశ వ్యవహారాల కార్యదర్శి సర్ అలెక్ డగ్లస్ - హోమ్ ఆమెను సూటిగా "యుద్ధం వస్తుందా" అని అడిగాడు. "మా అంతట మేము దానిని కోరం" అని స్పష్టంగా, మర్యాదగా జవాబిచ్చింది ఆ తర్వాత వాళ్ళు మరో విషయం మాట్లాడుకొన్నారు

బ్రిటన్‌లో, ఇతర పశ్చిమ దేశాలలో తమ ప్రభుత్వాలకంటె ముందడుగులో ప్రజాభిప్రాయం, ప్రసారమాధ్యమాల అభిప్రాయం ఉన్నందున ఇందిర తన సందేశాన్ని ఇవ్వటానికి దీనిని ఉపయోగించుకొంది బి బి సి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో "సంయమనం" చూపించమని తనకు విజ్ఞప్తులు చేయటం

"అర్థరహితమ"ని చెప్పింది. "ఆ విధంగా రెచ్చగొట్టినా, మా భద్రతకు, స్థిరత్వానికి ప్రమాదకరంగా మారినా" మా ప్రభుత్వం చూపినంత సంయమనం మరే ప్రభుత్వం చూపగలిగేది కాదని ఆమె చెప్పింది ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి సంయమనం గురించి మరీ మరీ చెప్పగా "హిట్లర్ విధ్వంసం చేస్తున్నప్పుడు 'మనం ఊరుకొందాం. జర్మనీతో శాంతిగా ఉందాం యూదులు చనిపోనీలే' అని మీరెందుకనలేదు?" అని తిప్పికొట్టింది

అమెరికాలో కథ చాలా భిన్నంగా ఉంది పాకిస్థాన్‌లో హత్యా సదృశమైన యాహ్యా పాలన విషయంలో ఉదారంగా ఉంటూ, కొత్తగా చైనాతో ఏర్పరచుకొన్న సంబంధం గురించి ఉబ్బితబ్బిబ్బవుతున్న రిచర్డ్ నిక్సన్ తూర్పు పాకిస్థానులో భయభీతులై చిత్రవధకు గురవుతున్న ప్రజలగురించి ఏమాత్రం చింతలేనట్టున్నాడు శారదా ప్రసాద్ తెలియజేసినట్లు వైట్‌హౌస్ లాన్స్‌లో ఇందిరాగాంధీకి స్వాగతం పలుకుతూ చెప్పిన మొదటి మాటల్లోనే "చాలా పొరపాటు చేశాడు కొన్ని రోజుల క్రితం ఒరిస్సాలో వచ్చిన తుఫాను బాధితులకు అమెరికా "సానుభూతి" తెలియజేశాడు కాని "తూర్పు పాకిస్థాను నుండి పాకిస్థానీ సైన్యాల దౌర్జన్యాన్ని తప్పించుకొని భారతదేశంలోకి శరణార్థులుగా వస్తున్న లక్షలాది మంది గురించి ఒక్క మాటయినా లేదు " దీనితో ఇందిరకు తాను ఎందుకు వచ్చిందో "స్పష్టంగా, బిగ్గరగా తడబడుతున్న అతిథేయి ద్వారం వద్ద" చెప్పటానికి "అద్భుతమైన అవకాశం" వచ్చింది

2005 వసంత కాలంలో "సౌత్ ఏషియాక్రైసిస్, 1971" పేరిట 900 పేజీల పుస్తకాన్ని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ప్రచురించింది ఈ పుస్తకం తెలియజెప్పిన విషయాలు ఇదివరకు తెలిసినవే ఆ కాలంలో ఆ విషయంపై వచ్చిన పుస్తకాలు, ప్రచురణలు, ముఖ్యంగా ఆనాటి వ్యవహారాలు నడిపినవారు వ్రాసిన జ్ఞాపకాలు, సమాచార చట్టంలోని స్వేచ్ఛ కింద వెలికి వచ్చిన రహస్య పత్రాలు ఇందుకు కారణమయ్యాయి కాని వాస్తవంగా ఏమి జరిగిందో అధికార పత్రాలు తెలియజేసిన దానిని బట్టి చూస్తే 1971 లో అతి ముఖ్యమైన సంఘటనల గురించి ఇది వరకు వ్రాసిన వాటిలో తీవ్రత ఏమీ లేదనిపిస్తుంది

ఉదాహరణకు కిసింజరు వ్రాసిన "వైట్‌హౌస్ ఇయర్స్" (కొందరు దీనిని "వైట్‌వాష్ ఇయర్స్" అని అన్నారు) లో నిక్సన్ - గాంధి సంభాషణ గురించి అది "శ్రేష్ఠమైన బధిరుల సంభాషణలా మారింది" అని చెప్పటంతో తృప్తిపడ్డాడు ఇందిర, నిక్సన్‌లు "వ్యక్తిగతంగా అనుగుణంగా ఉండాలని విధి అనుకోలేదు" అని జోడించాడు ఆమెను కలిసిన తర్వాత నిక్సన్ వ్యాఖ్యానాలు అన్నీ "ముద్రింపదగినవి కావు" అని కూడా ఒప్పుకొన్నాడు 5 నవంబరు 1971న నిక్సన్, కిసింజర్లు అంతకు ముందురోజు ఇందిరాగాంధి తో జరిగిన చర్చల గురించి, కొన్ని గంటల తర్వాత జరగబోయే రెండవ సమావేశం గురించి మాట్లాడుకొన్న విషయాలు స్టేట్ డిపార్ట్‌మెంట్ పుస్తకంలో ఏ విధంగా ఉన్నాయో చూడండి

అధికార పత్రాల (పేజీ 499) ప్రకారం ఇలా ఉంది "కిసింజర్ అభిప్రాయంలో 'భారతీయులు ఎలాగూ నిందార్హులే (బాస్టర్డ్ స్) వాళ్ళక్కడ యుద్ధం ప్రారంభిస్తున్నారు వారికిప్పుడు తూర్పు పాకిస్థాన్ సమస్యే కాదు ఆమె పాకిస్థాన్ గురించి మీకు చెప్పిన తీరు నాకు చాలా ఆసక్తికరంగా ఉంది " అంతకు ముందు రోజు ఇందిరాగాంధి నిక్సన్‌తో జరిపిన సంభాషణల గురించి ఈ వ్యాఖ్య అని స్పష్టమవుతోంది పశ్చిమ పాకిస్థాన్ గురించి, ఇందిర తన విధానాన్ని చర్చించింది ఆ సమావేశంలో కిసింజరు, ఆమె ప్రధాన కార్యదర్శి పి యన్ హక్సర్ మాత్రమే ఉన్నారు

"భారతదేశానికి పాకిస్థాన్ వ్యతిరేకత లేదు పాకిస్థాన్ ధ్వంసమవ్వాలని కాని, శాశ్వతంగా కుంటుపడాలని కాని భారతదేశం ఎన్నడూ కోరుకోలేదు అన్నిటికీ మించి ఆ ప్రాంతంలో సుస్థిరత నెలకొల్పాలని, ఏ విధంగానైనా కల్లోల పరిస్థితిని తొలగించాలని కోరుతోంది" అని ఇందిర స్పష్టంగా చెప్పింది దీనికి పరిష్కార మేమిటి అని నిక్సన్ ప్రత్యేకంగా అడిగినపుడు "ఆ పరిస్థితి భారతదేశం మీద చూపిస్తున్న ప్రభావం గురించే భారతదేశం ఆందోళన పడుతోంది" అని చెప్పి, "అనివార్యమైన స్వాతంత్ర్యానికి ప్రతీక అయిన ముజీబ్ భవిష్యత్తు కీలక సమస్యగా ఉంది" అని జోడించింది (ఆ సమయంలో "గొప్ప దేశద్రోహానికి" నిర్బంధంలో

ఉన్న ముజీబ్‌ను మిలిటరీ న్యాయసభ విచారించాలని యాహ్యా ఆలోచిస్తున్నాడు. దీనిని ఆపాలని అమెరికాను కోరినపుడు, ముజీబ్‌కు మరణశిక్ష విధించరని మాత్రమే అమెరికా చెప్పింది)

ఇంత జరిగినప్పటికీ ఓవల్ ఆఫీసులో నిక్సన్, కిసింజర్ మాట్లాడు కొంటున్నప్పుడు, అమెరికా అధ్యక్షుడు, భారత ప్రధానమంత్రితో జరిపిన చర్చలలో "తన లక్ష్యాన్ని సాధించగలిగాడని" తమలో తామే పొంగిపోయారు. అధికార పత్రం కిసింజరు మాటలను ఈ విధంగా చెప్పింది "ఆమె (ఇందిరాగాంధి) నేరాలు చెపుతూ ఎంత స్వార్థంగా (బిచ్) వ్యవహరించినప్పటికీ, మనం కోరినది మనం పొందాము " నిక్సన్ అంగీకరించాడు "నిజంగానే మనం ఆ ముసలి మంత్రగత్తె పట్ల తీవ్రంగా వ్యవహరించాము (చొంగకార్చాము)" ఈ విధంగా అనహ్యమైన రీతిలో మరెంతో మాట్లాడుకొన్నారు అదిగాక "రాబోయే సంభాషణలలో "మరింత 'ఉదాసీనంగా' ఉండి, (ఇది వరకటిలా కాకుండా) ఆమె ఎక్కువ మాట్లాడేటట్లు చెయ్యాలి," అని ఇద్దరూ అంగీకరించారు

రెండవ సమావేశానికి ఎంతో అమర్యాద, అల్పత్వం ప్రదర్శిస్తూ నిక్సన్ ఇందిరాగాంధీని ఇరవై నిముషాలు పైగా వేచి ఉండేటట్లు చేశాడు తర్వాత ముందర గదిలోకి పెద్ద పెద్ద అడుగులు వేసుకొంటూ చేయి ముందుకు చాపి వస్తూ తన సిబ్బంది తనకు ఆమె రాక గురించి చెప్పనందుకు వాళ్ళను నిందించాడు ఇందిర శాంతంగా ఉంది అమెరికా అధికార పత్రం ఆ సందర్భం గురించి ఇలా వ్రాసింది ఆ సంభాషణలో "ప్రపంచ దౌత్య వ్యవహారాలన్నీ దొర్లాయి. దక్షిణ ఆసియా గురించి చాలా తక్కువ మాట్లాడటమయింది భారత, పాకిస్థాన్‌ల సరిహద్దులనుండి సైనిక దళాలు విరమించుకోవలసిందిగా నిక్సన్ చేసిన ప్రతిపాదనకు గాంధి జవాబివ్వలేదు మౌనాన్ని విధ్వంసక కళగా ఇందిరా గాంధి వాడటాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన ప్రపంచ నాయకులలో నిక్సన్ మొదటివాడూ కాదు, ఆఖరివాడూ కాదు "

వైట్ హౌస్‌లో అంతకు ముందు సాయంకాలం జరిగిన విందు గురించి శారదా ప్రసాద్ వ్రాసిన దానికంటె చక్కగా చెప్పటం సాధ్యం కాదు. 24 ఏండ్ల తర్వాత "అతి దూరప్రాంతంలో చల్లటి విందు" అనే శీర్షిక కింద ఈ విధంగా

వ్రాశారు ఆ విందు "బహుశా నేను పాల్గొన్న రాష్ట్ర భోజనాలలో ఇది అత్యంత శీతలమైన భోజనం దౌత్య వస్త్రం నుండి ఎంత పిండినా ఒక చుక్కయినా స్నేహ బిందువు రాలలేదు," అని ఆయన అన్నారు

మాస్కోలో ప్రారంభమై వాషింగ్టన్‌లో ముగిసిన ఇందిరాగాంధి సుదీర్ఘ దౌత్య యాత్రలో అమెరికాలో తనకు ఆతిధ్యమిచ్చిన దురహంకారి, మొరటు వ్యక్తి, అతి తెలివైన ఆయన సేవకుడు ఫ్రాయిడ్ ఇందిరాగాంధి తన అత్యంత నైపుణ్యం గల దౌత్యంలో బంగ్లాదేశ్ విషయమై అట్లాంటిక్ సఖ్యతను ముందుగానే అంతం చేసిందనే విషయం గ్రహించలేక పోవటం ఎంతో మన్నన పొందే అంశము ఐరోపా దేశాలు 'నాటో'లో సభ్యత్వం ఉన్నప్పటికీ భయభీతులైన బంగ్లాదేశ్ ప్రజల విషయమై సానుభూతితో ఉన్నారు పాకిస్థాన్ సైన్యం జరిపే దౌర్జన్యాన్ని ఇంకే మాత్రం సహించే స్థితిలో లేరు నైతికంగా తప్పు దోవ లోను, సైనికంగా ఓటమివైపు ఉన్న వారిని సమర్థించటంలో అమెరికా ఒంటరిదయింది

## మెరుపువంటి ప్రచారం

ఐరోపా, అమెరికా పర్యటిస్తున్నప్పుడు లండన్‌లో ఇండియాలీగ్ సభలో మాట్లాడే అవకాశం ఇందిరాగాంధీకి వచ్చింది ఆ సందర్భంగా, "నేను అగ్నిపర్వతం శిఖరం మీద కూర్చున్నాను అది ఎప్పుడు పేలుతుందో నాకు తెలీదు" అని ఆమె చెప్పింది తను స్వదేశానికి తిరిగి రాగానే విస్ఫోటం దగ్గరయిందని ఆమెకు తెలుసు నవంబరు ప్రారంభంలో, వర్షాకాలం అయిపోగానే, పాకిస్థానీ సైన్యం దురాగతాలు మిన్నంటాయి ముక్తివాహిని దాడులు ముమ్మరం చేసి తూర్పు పాకిస్థాన్‌లో చాలా ప్రాంతాలు తన నియంత్రణలోకి తెచ్చుకొంది ఆ ప్రాంతాలనుండి దానిని తొలగించాలని పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలు ప్రాంతీయ యుద్ధాలకు దారితీశాయి నవంబరు 21-22 లో జెస్సోర్ దగ్గర జరిగిన సంఘటన ప్రత్యేకంగా అందరి దృష్టినీ ఆకర్షించింది టాంకులు, ఫిరంగులు, విమానదళం విమానాలు కలిసి చేసిన ముమ్మరమైన దాడి సరిహద్దును దాటింది దానితో అది ధ్వంసమయింది

పరిస్థితిని ఇలా దిగజార్చటం విపత్తును ఆహ్వానించటమేనని భారతదేశం గుర్తించింది దీర్ఘకాలం పరిస్థితులు స్తంభిస్తే బయటిశక్తులు హాయిగా వేటాడే ప్రమాదముంది డిసెంబరు 4న నిర్ణయాత్మకమైన సైనిక చర్య తీసుకోవాలని ఆమె నిర్ణయించింది పూర్తి స్థాయిలో యుద్ధం ప్రారంభించటానికి ఆమె ఇప్పటికీ సమ్మతించటం లేదు ఆమె సందిగ్ధావస్థను యాహ్యా అంతం చేశాడు డిసెంబరు మూడవతేదీ సూర్యాస్తమయానికి ముందు దాడి ప్రారంభించాడు "దురదృష్టకరమైన దాడి" అని దీనిని అంటారు పాకిస్థానీ విమాన దళంలోని బాంబర్లు భారత వాయుసేన స్థావరాలపై దాడి చేశాయి ఇది అవివేకమైన అర్థరహితమైన దాడి. సాధించేదేమీ లేదు కాని బంగ్లాదేశ్ విముక్తికి యుద్ధం మొదలయ్యేటట్లు చేసింది.

మెరుపు వేగంతో భారత సైన్యం తూర్పు పాకిస్థాన్ గ్రామ ప్రాంతాలలోకి చొచ్చుకుపోయింది పెద్ద పట్టణాలలో పాకిస్థానీ పటిష్ఠమైన ప్రదేశాలు వదిలి పక్కగా వెళ్ళడమనేది మిలిటరీ నాయకత్వం ఆలోచించిన వ్యూహం భారత సైన్యాల పక్కగా లక్షమంది ఉన్న ముక్తవాహిని కూడా ముందుకు నడుస్తోంది

డిసెంబరు 6 సాయంకాలానికి భారత సైన్యం చొచ్చుకు రావటం ఆపటం సాధ్యం కాదని తేలిపోయింది ఢాకాకు వెళ్ళేదారి తెరచి ఉంది ఆ రోజు పార్లమెంటులో భారతదేశం బంగ్లాదేశ్‌ను స్వతంత్రదేశంగా గుర్తించినట్లు ఇందిరాగాంధి ప్రకటించింది సభ్యులు హర్షోల్లాసంతో దానికి స్వాగతం పలికారు పాకిస్థాన్ వెంటనే భారతదేశంతో దౌత్య సంబంధాలు తెంచుకొంటున్నట్టు తన ప్రతిక్రియ తెలిపింది ఈ సంబంధాలు ఐదేండ్ల తర్వాత 1976లో పునరుద్ధరింపబడ్డాయి

12 డిసెంబరు నాటికి బంగ్లాదేశ్‌లోని పాకిస్థానీ సైనికదళాల కమాండర్లు లొంగిపోటానికి సిద్ధంగా ఉన్నారు ఆ సమయంలో అమెరికా బంగ్లాదేశ్ యుద్ధంలో తాను పెద్ద ఎత్తుగడ అనుకొన్నది ప్రదర్శించింది అణు విమానాలను తీసుకెళ్ళే ఎంటర్‌ప్రైజ్ నాయకత్వంలో సెవెంత్ ఫ్లీట్ బెంగాలు ఖాతానికి తరలాలని నిక్సన్ ఆజ్ఞ జారీచేశాడు న్యూఢిల్లీ దీనికి చలించలేదు అమెరికన్ ఎత్తుగడలో "శబ్దం ఎక్కువ పస తక్కువ" అని ఇందిర, ఆమె సలహాదార్లు అనుకొన్నారు

ఏమైనా సెవెంత్ ఫ్లీట్ బంగ్లాదేశ్ దరిదాపుల్లోకి వచ్చేలోపుగా చిత్తుగా ఓడిపోయిన పాకిస్థానీ జనరల్ ఎ ఎ కె నియాజీ, 93000 ఆఫీసర్లున్న తన సైన్యం బేషరతుగా 16 డిసెంబరు మధ్యాహ్నం లెఫ్టినెంట్ జనరల్ జగజీత్ సింగ్ అరోరాకు లొంగిపోయారు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇంత పెద్ద ఎత్తున సైన్యాలు లొంగిపోవటం జరగలేదు

ఆ మధ్యాహ్నం ఇందిరాగాంధి తన పార్లమెంటు భవనం కార్యాలయంలో "నమ్మరానంత నిశ్చలమైన ద్వీపంలా" ఉంది జనరల్ మానెక్ షా నుండి కబురు కోసం ఎదురు చూస్తోంది అది రావటం ఆలస్యమవుతోంది ఆమె ఏ మాత్రం ఆతురత చూపకుండా, చాలా రోజుల క్రితం ఇంటర్వ్యూ కోసం అంగీకరించిన స్వీడిష్ టెలివిజన్ సిబ్బందిని పిలిచింది సాయంత్రం నాలుగున్నర తర్వాత మానెక్ షా రాక్స్ (రిస్ట్రిక్టెడ్ ఆటోమేటిక్ ఎక్స్‌చేంజి) మీద ఫోను చేశాడు మాటలు కేవలం ఐదు సెకండ్లే జరిగాయి ఇందిర "అచ్చా" (సరే) అని ఒకే ఒక పదం పలికింది తనను ఇంటర్వ్యూ చేసే వాళ్ళను కాస్సేపు ఆగమని, ఆమె వాస్తవంగా పరుగులు పెడ్తూ పార్లమెంటుకు వచ్చింది "పాకిస్థానీ దళాలు బేషరతుగా బంగ్లాదేశ్‌లో లొంగిపోయాయని, ఢాకా ఇప్పుడు స్వతంత్ర దేశానికి స్వతంత్ర రాజధాని" అని పార్లమెంటులో ప్రకటించింది ఆమె చెప్పిన మిగతా మాటలు ఎడతెగని కరతాళధ్వనులలో మునిగిపోయాయి ఆ మాటలు మళ్ళీ ఆమె చెప్పవలసి వచ్చింది

మళ్ళీ తన ఆఫీసుగదికి వచ్చి "మనం ఇప్పుడు పశ్చిమం వైపు కాల్పుల విరమణ ఆజ్ఞ జారీ చెయ్యాలి ఈ రోజు నేను చెయ్యలేకపోతే రేపిక చెయ్యలేను" అని శారదాప్రసాద్‌తో చెప్పింది శారదా ప్రసాద్ మాటల్లో "ఉల్లాస స్థితిలోని ప్రమాదాల" గురించి ఆమెకు మంచి అవగాహన ఉంది

పశ్చిమం వైపు కాల్పుల విరమణ ఆమె ప్రకటించినపుడు రాత్రి ఎనిమిది గంటలయింది తన మంత్రివర్గంలోని సభ్యులతో, ప్రతిపక్ష నాయకులతో ఈ విషయం చర్చించటానికి ఆమెకు సమయం కావలసివచ్చింది అనుకొన్నట్టుగానే కొందరు పశ్చిమ పాకిస్థాన్‌లో "అసంపూర్తిగా వదిలిన పని" పూర్తి చెయ్యాలని కోరారు దానికి ఆమె ఈ విధంగా జవాబిచ్చింది "బంగ్లాదేశ్‌లో ప్రజలు మనతో

ఉన్నారు. పశ్చిమ పాకిస్థాన్‌లో ప్రజలు, సైన్యాలు తమ ఇండ్లను రక్షించుకొనుటకు పోరాడుతారు. మన దళాలను అమితమైన ఇబ్బందులకు గురి చేయకూడదు " మానెక్‌షా, జగ్గీ అరోరా నాతో అన్నట్లు, సైనిక నాయకత్వం ఈ విధానాన్ని హృదయపూర్వకంగా సమర్థించింది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొంటే పశ్చిమ పాకిస్థాన్‌ను ధ్వంసం చేయాలని ఇందిర నిశ్చయించినట్లు, భారత్‌ను, సోవియెట్ యూనియన్‌ను అమెరికా హెచ్చరించటంతో పాకిస్థాన్ రక్షింపబడిందని ఈనాటి వరకు కిసింజరు గొప్పలు చెప్పుకోటం ఎంత హాస్యాస్పదమో అర్థమవుతుంది ఏ విధంగా యుద్ధం ముగిసిందో కిసింజర్ కష్టపడి వ్రాసిన తీరు "డిటెక్టివ్ నవల" లా ఉత్కంఠ భరితంగా ఉందని పి యన్ ధర్ చక్కగా చెప్పాడు తక్కినవాళ్ళు దానిని "పెద్ద అబద్ధం" అన్నారు

నిక్సన్ - కిసింజర్ ద్వయం ఏమనుకొన్నా, ఢాకా లొంగిపోయిన తర్వాత ఎన్నో వారాల వరకు భారతదేశంలో ఆనందం ఉరకలు వేసింది ప్రజలు ఇందిరను ప్రశంసలతో ఆకాశానికి ఎత్తారు 1971 ఎన్నికలలో ఆమె ఘనవిజయం పట్ల ప్రశంస ఇప్పుడు ఆరాధనగా మారింది. నిన్నటి "మూగబొమ్మ" నేడు అజేయమైన "దుర్గ" గా "శక్తి" స్వరూపిణిగా మారింది కృతజ్ఞతతో నిండిన దేశం తరపున రాష్ట్రపతి వి.వి గిరి ఆమెకు దేశంలో అత్యున్నతమైన సివిలియన్ అవార్డు "భారతరత్న" ఇచ్చాడు లండన్ లోని "ది ఎకానమిస్టు" ఆమెకు "ఎంప్రెస్ ఆఫ్ ఇండియా" (భారతదేశ సామ్రాజ్ఞి) అని బిరుదిచ్చింది. 1972 మార్చిలో ఎన్నో రాష్ట్రాలలో ఎన్నికలు జరగవలసి ఉంది ఆమె పార్టీ దేశ వ్యాప్తంగా మార్క్సిస్టులకు ఆలవాలమైన పశ్చిమ బెంగాలుతో సహా విజయం సాధించింది ఆమె తన శక్తి సామర్థ్యాలలో, కీర్తి ప్రతిష్ఠల్లో శిఖరాగ్రంలో ఉంది

## షిమ్లాలో ఒప్పందం

ఇంత మత్తెక్కించే వాతావరణంలో కూడా యుద్ధం గెలిచిన తర్వాత, శాంతిని గెలిచే గొప్ప కార్యం ఇంకా మిగిలి ఉందని దానిని ఎలాగయినా సాధించాలని ఇందిర నిశ్చయించుకొంది. మిగిలిన పాకిస్థాన్‌లో ఎన్నికయిన నాయకుడు జుల్ఫికర్ అలీ భుట్టో సాధ్యమైనంత వరకు పరిస్థితిని అదుపులో తెచ్చుకొని

చెదరిన దేశ వాసుల ధైర్యాన్ని కూడగట్టటానికి ప్రయత్నించాడు. గల్ఫ్‌లోని చమురు సంపన్నమైన ముస్లిమ్ దేశాలతో స్నేహం పెంపొందించుకోటం అతనికి ప్రధాన విషయమైంది 1973 లో అరబ్-ఇస్రాయిల్ యుద్ధం తర్వాత, చమురు పై నిబంధన తర్వాత, తమ అమితమైన సంపదలో కొంత భాగం పాకిస్థాన్‌కు చెందింది కాని అది జరగటం భవిష్యత్తులో పాకిస్థాన్ విభజన తర్వాత భుట్టో కార్యక్రమంలో భారత్ ప్రధమంగా ఉండవలసి వచ్చింది. అప్పటికీ భారత దేశం అధీనంలో ఉన్న 93,000 మంది యుద్ధ ఖైదీలు, భారత ఆక్రమణలో ఉన్న 5,000 చదరపు కిలోమీటర్ల పాకిస్థానీ ప్రాంతం పాకిస్థాన్ ఆత్మగౌరవానికి, అధికారంలో ఉండే తన సామర్ధ్యానికి ఎంతో అవసరమైన విషయాలు భారతదేశానికున్న అత్యంత అనుకూల పరిస్థితిలో భావోద్రేకాలు రెచ్చగొట్టే కాశ్మీర్ సమస్యను పరిష్కరించమని భారతదేశం ఒత్తిడి తెస్తుందని తనకు తెలుసు ఆ విషయంలో తాను పట్టు సడలిస్తే "అమ్ముడు పోయినట్ల"ని పిస్తుంది గనుక తాను దానికి సిద్ధంగా లేదు. అందుకే ఎంతో శక్తిమంతంగా, విజయవంతంగా ఒక ప్రచారం ప్రారంభించాడు. ఓడిపోయిన పొరుగువారిపై ఒత్తిడి తేవటం చివరకు విపరీత ఫలితాలకు దారితీస్తుందని భారతప్రజలకు విజ్ఞప్తి చేశాడు

ఇందిర, భుట్టోల నమ్మకమైన రాయబారులు, డి పి ధర్, అజీజ్ అహమ్మద్ - ఇద్దరు ప్రముఖుల సమావేశం పర్వత ప్రాంతమైన షిమ్లాలో ఏర్పాటు చేశారు 1972 జూన్ ఆఖరులో ఈ సమావేశం జరిగింది "వెయ్యేండ్ల యుద్ధం జరుగుతుందని" భారతదేశాన్ని బెదిరించిన వ్యక్తి ఆరేండ్లకే శాంతికోసం ప్రార్థిస్తున్నాడని కొందరు పాకిస్థానీలు దెప్పి పొడిచారు

షిమ్లాలో సంప్రదింపులు కఠినంగా, బాధాకరంగా ఉన్నాయి జులై 2వ తేదీ సమావేశం "విఫలమైందని" ప్రకటించటమయింది కాని భుట్టో ఇందిరాగాంధీతో వ్యక్తిగతంగా సమావేశం కోరాడు ఆ సమావేశంలో షిమ్లా ఒప్పందం రూపొందింది అధికారులు సూక్ష్మాంశాలు పరిశీలించిన తర్వాత జులై 3వ తేదీ మొదటిగంటలో ఈ ఒప్పందంమీద సంతకం జరిగింది

భారతదేశంతో ఉన్న మూడింట రెండు భాగాల కాశ్మీరు, పాకిస్థాన్‌తో ఉన్న మూడింట ఒక భాగం కాశ్మీరుల మధ్య ఉన్న విభజనరేఖ క్రమక్రమంగా శాశ్వతమైన సరిహద్దుగా మారుతుందని ఇందిరాగాంధి, జుల్ఫీ భుట్టోల మధ్య వ్యక్తిగతంగా, మౌఖికంగా జరిగిన ఒప్పందమే షిమ్లా ఒప్పందం సారాంశం. కీలకమైన పదం "క్రమక్రమంగా" రాతపూర్వకంగా ఉన్న పాఠంలో తాను బద్ధుడైనట్టు చెప్పలేనని "నన్ను నమ్మండి" అని ఇందిరాగాంధితో భుట్టో చెప్పాడు రెండు దేశాలూ ఏ దిశను పయనిస్తున్నాయో ఒప్పందంలోని పాఠం సూచించింది ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో ఉన్న కాల్పుల విరమణ రేఖ (మొదటి కాశ్మీరు యుద్ధం (1947 – 48) తర్వాత ఏర్పడింది) భారతదేశం 1971 వ సంవత్సరం జరిగిన యుద్ధంలో అధీనంలోకి తీసుకొన్న కాశ్మీరు ప్రాంతాలు కలిసి రెండు దేశాల మధ్య నియంత్రణ రేఖగా మారుతాయి రెండు దేశాలూ నియంత్రణ రేఖను గౌరవిస్తామని "సాంప్రదాయకంగా కాశ్మీరు విషయంలో రెండు దేశాల స్థితి పట్ల పక్షపాతం ఉండదని" ఇరు పక్షాలూ అంగీకరించాయి

భుట్టో నమ్మదగిన వాడుకాడనే మాట నిజం చేస్తూ భుట్టో షిమ్లా వాగ్దానం నుండి వెనక్కు మళ్ళాడు భుట్టో రహస్యంగా ఒప్పుకొన్న దానిని బయలు పరచాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 1995లో పి యన్ ధర్ "ది.టైమ్స్ ఆఫ్ ఇండియా" లో రెండు భాగాల వ్యాసం వ్రాశాడు దీనికి జవాబుగా ఇది సరికాదని వెల్లువలా ప్రతిస్పందనలొచ్చాయి ఒక పాకిస్థానీ వ్యాఖ్యాత ఈ విధంగా వ్రాశాడు "ధర్ గారూ, ఒక విషయం గుర్తుంచుకోండి మీరంటున్న మాటలు మేము ఒప్పుకొన్నా, భుట్టో గారు మీ ప్రధానమంత్రిని ఏమార్చారు " దానికి ధర్ ఈ విధంగా చమత్కరించాడు "పాకిస్థాన్‌లో దీనికి ప్రతిక్రియ చూపనిది అధికారంలో ఉన్న ఒకే ఒక వ్యక్తి పాకిస్థాన్ ప్రధానమంత్రి బెనజీర్ భుట్టో " నవయువతిగా ఆమె తన తండ్రితో పాటు షిమ్లాకు వచ్చింది దీర్ఘంగా కొనసాగిన సంప్రదింపులలో ప్రతి వివరం, ప్రతి మలుపూ ఆమెకు తెలుసు

అర్థంగాని విషయమేమిటంటే అతి మెళకువతో వ్యవహరించే ఇందిర భుట్టో మాటలు ఎందుకు నమ్మింది? షిమ్లాకు వెళ్ళే ముందు విదేశ గూఢ సమాచార

ఏజెన్సీ 'రా' కు అధిపతి, ఆమె నమ్మిన సలహాదారు ఆర్ యన్ కావ్‌తో ఇందిర ఈ విధంగా అంది "భుట్టోతో కరచాలనం చేశాక తమ వేళ్ళు లెక్క బెట్టుకోవాలని నేను విన్నాను " బహుశా "వెర్సైల్స్ లక్షణం" - ఓడిపోయిన శత్రువుపై కఠినంగా ఉండకూడదనేది - పనిచేసి ఉండొచ్చు

షిమ్లా ఒప్పందం పై సంతకం పెట్టగానే ఇందిర ఏ పొరపాటూ చెయ్యదు అనే ఆమె దేశవాసుల అభిప్రాయం అంతమయింది ఒప్పందంలో భారతదేశం చాలా ఇచ్చి, కొంచెంగా తీసుకోవటంలోనే తృప్తి పడిందని, బేరమాడటానికి అన్ని పరిస్థితులూ భారతదేశానికి అనుకూలంగా ఉన్నా ఇలా జరిగిందని గట్టి విమర్శ వచ్చింది భుట్టోతో రహస్యంగా జరిగిన ఒప్పందం గురించి ఇందిర చెప్పలేకపోయింది జులై 31న పార్లమెంటులో దురాక్షేపణలతో చర్చ జరుగుతున్నప్పుడు ఆమె తిప్పికొట్టింది " "నాకు తెలిసిందల్లా నేను శాంతి కోసం నిలబడాలి, శాంతికి దారితీసే చర్యలు తీసుకోవాలి అవి పని చేయకపోతే మనం సంసిద్ధంగానే ఉన్నాము. ఆసియా తన అదృష్టానికి మేలుకోవాలి మన మధ్య ఇది వరకు ఎటువంటి తగాదాలు, ద్వేషాలు, చేదు అనుభవాలు ఉన్నా మనలో మనం పోట్లాడుకోటం మానెయ్యాలి గతాన్ని భూస్థాపితం చేసే సమయం వచ్చింది "

ఈ దృక్పధానికి బాగా సమర్ధన దొరికింది వ్యక్తిగతంగా ఇందిరకున్న జనాదరణ చెక్కు చెదరలేదు



## 7

# కిందికి దిగజారటం

ఇందిరాగాంధి రాజకీయ దశ 1972 ముగిసేనాటికి స్పష్టంగా తగ్గుముఖం పట్టింది దీనికున్న ఎన్నో కారణాలు ఆమె నియంత్రణలో లేవు మరికొన్ని ఆమె అదుపు చేయగలిగి, చేయవలసి ఉండీ చేయలేదు నిజం చెప్పాలంటే పైకి ఎదిగి, ఎదిగి ఎవరెస్టు శిఖరం అధిరోహించిన తర్వాత విజయం సాధించవలసిన శిఖరాలు ఏవీ ఉండవు అన్ని బాటలూ, అన్ని దారులూ కిందకే వెళ్తాయి విచారించవలసిన విషయమేమిటంటే- ఇందిర కొండ కిందకు దిగజారటం కొంచెం త్వరగానే జరిగింది

ఆమెకు, దేశానికి గట్టిగా తగిలిన దెబ్బ మళ్ళీ వర్షాలు విఫలమవటం క్రూరంగా ఉండటానికి వరుణదేవుడు ఇంతకంటె కఠినమైన సమయం చూడలేకపోయాడు బంగ్లాదేశ్ శరణార్థులకు ఆహారమివ్వటంతో అప్పటివరకు నిండుగా పొరలిపోతున్న ప్రభుత్వ ధాన్యాగారాలు వాస్తవంగా ఖాళీ అయ్యాయి. యుద్ధంలో అయిన పెద్ద ఖర్చు గొప్ప లోటు బడ్జెటుకు దారితీసింది. విదేశీ మారక ద్రవ్యం ఖర్చయింది ధరలు 24 శాతం దాకా పెరిగాయి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక్కసారిగా ఇంతగా పెరగటం ఇదే మొదటిసారి

ఆర్థికంగా-క్లిష్టపరిస్థితి అంటే-తప్పనిసరిగా రాజకీయంగా సంక్షోభమే ఇది మరింతగా వేగం అందుకొంది బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం పొందిన తర్వాత అణగి ఉన్న రాజకీయాల భిన్నాభిప్రాయాలు మళ్ళీ బయట పడ్డాయి మరింతగా ఉద్రిక్తమయ్యాయి

ఒక సంవత్సరం తర్వాత విపత్తు మహావిపత్తుగా మారింది. అరబ్ – ఇస్రాయిల్ యుద్ధం వల్ల 1973 లో వచ్చిన చమురు సంక్షోభం దీనికి కారణమయింది పెట్రోలు ధరలు నాలుగింతలయ్యాయి. ఇదివరకే ఇబ్బందిలో ఉన్న భారత ఆర్థిక

వ్యవస్థ మరింతగా ధ్వంసమయింది ఈ కఠినమైన స్థితికి కఠినమైన పరిష్కారాలు కావలసి వచ్చాయి "గరీబీ హఠావో" నినాదానికి ఇవి వ్యతిరేకంగా ఉన్నాయి అంతర్జాతీయ ద్రవ్యనిధిని, ప్రపంచబ్యాంకును, పాశ్చాత్య దేశాలను సహాయమర్థించటం శోచనీయం. వారు పెట్టిన షరతులు కంట్రోళ్ళు, లైసెన్సులు "సడలించాలని" చెప్పటం పరిస్థితిని మరింత దిగజార్చాయి ఇప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఏడవ దశకంలో ఆమె ఆర్థిక సలహాదారులలో ప్రథమంగా ఉండేవారు "మొత్తం విధానం" తయారుచేయవలసిన ఒక గ్రూపుకు పెద్దగా ఉండేవారు ఆమె ధైర్యం, ఆమె ప్రసన్నత చూసి "అప్రతిభుడ" నయ్యానని ఆయన నాతో 1987లో అన్నారు అవలంబించబోయే విధానాలు ఆమె, ఆమె పార్టీ ప్రతిపాదిస్తున్న వాటికి పూర్తిగా విరుద్ధమని, "రాజకీయంగా జనాదరణ పొందవని" చెప్పినపుడు "ఏమి చెయ్యవలసిన అవసరముందో అది చెయ్యాలి మీరు మీ పని చెయ్యండి రాజకీయాల విషయం నేను చూసుకొంటాను" అని ఆమె చెప్పింది

ఆమె ఇచ్చిన మాట ప్రకారం వేతనం యథాస్థితిలో ఉంచింది వేతనాలు తెచ్చుకొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా డిపాజిట్లు చేయవలసి వచ్చింది ప్రభుత్వం ఖర్చు తగ్గించటమయింది. అంటే నిరుద్యోగం ప్రబలింది ప్రైవేటుకంపెనీలు షేర్ హోల్డర్లకు చెల్లించే డివిడెండ్ల మీద పరిమితి విధించింది. అయినా ఆమె ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా వచ్చే విమర్శ తగ్గలేదు డివిడెండ్లు తగ్గినా ధనవంతుల విలాస జీవితంలో మార్పురాలేదని, పేదల తక్కువ ఆదాయాన్ని తగ్గించటం వారికి దెబ్బ అని విమర్శలు వచ్చాయి వామపక్షంవాళ్ళు, తన పార్టీలో ఉన్నవాళ్ళు ఆమె "తన ఆదర్శము, నిబద్ధతల నుండి వెనక్కి మళ్ళిందని" ఆరోపించారు గోధుమ వ్యాపారం జాతీయీకరణ చేసి అనుకొన్నట్టుగా అది సమస్య సృష్టించగానే, ఆ నిర్ణయాన్ని త్వరగా విడిచిపెట్టటం ఆమె సందిగ్ధతను తెలియజేస్తుంది ఆమె వాస్తవంగా అడకత్తెరలో పడింది

కొత్త కాంగ్రెస్ అని పేరు పెట్టుకొన్న ఆమె పార్టీ పాతదానికంటె ఏమాత్రం భిన్నంగా ఉన్నా చింతాజనకమైన ఆర్థికస్థితిని ఎదుర్కొనే ఆమె సమర్థత మరింత

మెరుగ్గా ఉండేది ఆమెకు పూర్తిగా విశ్వాసపాత్రులనే గాని మరే విధంగాను వారు ముందటి కంటె భిన్నంగా లేరు వారికి తమ ఆలోచనా తీరుగాని, పనిచేసే విధానంగాని, జీవనశైలిగాని, మురా దృక్పధంగాని, అన్నిటికంటె మించి ఏవిధంగానైనా తమకు లాభదాయకంగా ఉండేటట్లు చూసుకోవటంలోగాని వారిలో తేడా లేదు. తమ "అత్యున్నత నాయకురాలి" సద్భావం తమపట్ల ఉన్నట్టయితే తమనెవరూ ఏమీ చెయ్యలేరని ఆమె అనుగ్రహం కోసం పాకులాడేవారు

తన పార్టీమీద ఎవరూ కదిలించలేని నియంత్రణ తనకు ఉండాలని ఇందిర వాంఛించినందున ఈ అనారోగ్యకరమైన స్థితి మరింత దిగజారింది సహజంగా ఆమె కొంత భయస్థురాలు అందుకే నిత్యమూ సంపూర్ణ భద్రతకోసం వెతుకుతుండేది 1972లో జరిగిన రాష్ట్ర ఎన్నికలను ఆమె నలుగురు ముఖ్యమంత్రులను తొలగించటానికి ఉపయోగించింది మోహన్‌లాల్ సుఖాడియా (రాజస్థాన్), బ్రహ్మానందరెడ్డి (ఆంధ్రప్రదేశ్), యం యం చౌదరి (అస్సామ్), యస్.సి శుక్లా (మధ్య ప్రదేశ్) లలో ప్రతి ఒకరికీ స్వతంత్రమైన అధికారం ఉంది వారి స్థానంలో తాను ఎంపిక చేసిన ముఖ్య మంత్రులను నియమించి మళ్ళీ మళ్ళీ వాళ్ళను మారుస్తూ వచ్చింది ఒక సందర్భంలో మధ్యప్రదేశ్‌లోని 280 మంది శాసనసభ్యులను ఢిల్లీకి వచ్చి ఆమె ఇంటి ఆవరణలో సమావేశం కావలసిందిగా కోరటమయింది వాళ్ళందరూ తమ ముఖ్యమంత్రి ఇవ్వని రాజీనామాను ఇచ్చినట్లు ఏకగ్రీవంగా అంగీకరించారు ఆమె ప్రతిపాదించిన కేంద్రమంత్రి పి సి సేఠీని తమ కొత్త ముఖ్యమంత్రిగా "ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు " కొంతకాలానికి సేఠీని మళ్ళీ ఢిల్లీకి పిలిపించటమయింది అతని స్థానంలో యస్ సి శుక్లాను తిరిగి ముఖ్యమంత్రిని చేశారు.

ఎవరు ఎంతకాలం పదవిలో ఉంటారో తెలియని సందిగ్ధస్థితిలో, దేశంలో తెగని సమస్య అయిన లంచగొండితనం, అవినీతి కొత్త పరిమాణాలు పొందాయి దీనికి ముసుగుగా "పార్టీకి నిధిసేకరణ" అన్నారు ఇది పూర్తిగా కల్పన కాదు లాల్ బహదూర్ శాస్త్రి కాలంలో పెద్ద వ్యాపారవేత్తలు తమ పార్టీకి (స్వతంత్ర - చాలాకాలం క్రితమే ముగిసింది) నిధులిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పార్టీలకు కంపెనీలు విరాళాలివ్వటాన్ని నిషేధించింది దీని ఫలితంగా

రాజకీయనాయకులకు, వారికి నిధులిచ్చేవారికి మధ్య లావాదేవీలు "నల్లధనం" తో జరిగేవి దోచుకొనే తత్వమున్న వారికి ఇది ఒక వరమయింది మొదట్లో నగదులో చాలా తక్కువ భాగం మాత్రమే వారి జేబుల్లోకి వెళ్ళేది త్వరలోనే ఈ భాగం పెద్దగా, మరింత పెద్దగా మారుతూ వచ్చింది దేశంలో కోపం రెచ్చిపోయింది ఎంతగానో గౌరవింపబడే ప్రతిపక్ష నాయకుడు, ఆ తర్వాత ప్రధానమంత్రి అయిన అటల్ బిహారి వాజ్‌పాయ్ "టన్నులకొద్దీ నల్లధనం" ప్రధానమంత్రి నమ్మిన బంట్లు సేకరిస్తున్నారని పార్లమెంటులో అన్నారు ఆమె పార్టీలో ముఖ్యంగా నిధులు సేకరించే లలిత్ నారాయణ్ మిశ్రాను "నఖద్ (నగదు) నారాయణ్" అని పరిహాసంగా పిలిచేవారు నెహ్రూ దీర్ఘమైన తన పదవీకాలంలో పార్టీ నిధులు సేకరించటంగాని, పంచిపెట్టటంగాని ఏనాడూ చెయ్యలేదు కాని ఇందిర నాయకత్వ శైలిలో ప్రధానమంత్రి ఇంటికి కరెన్సీ నోట్లతో నిండిన సూట్‌కేసులు పంపవలసి వచ్చేది

పరిస్థితులు ఎంతగా దిగజారాయో తెలియపరచే ఉదంతం తుల్ మోహన్‌రామ్‌కు చెందిన అపవాదు ఇప్పుడందరూ దానిని మరచిపోయారు కాని అది ఆ రోజుల్లో పెద్ద సంచలనం రేపింది నిజానికి తుల్ మోహన్ పార్టీలో ఒక అనామకుడు తన పైవాళ్ళు ముఖ్యంగా యల్ యన్ మిశ్రా ఆజ్ఞప్రకారం అనుమానాస్పదమైన ఒక వ్యాపార సంస్థకు అక్రమమైన ఉపకారాలు పొందాడు కాని ఇందిర పట్ల, ఆమె పార్టీ పట్ల ఎంతకోపం ఉందంటే మొత్తం పార్లమెంటు సమావేశమంతా తుల్ మోహన్ రామ్‌కు సంబంధించిన వ్యవహారం వల్లే భంగమయింది యం పి లు సభలోని అంతర్భాగానికి పరుగెత్తటం లేదా అక్కడ తిష్ఠవేయటం ఆరోజుల్లోనే ప్రారంభమై నేటికీ విజృంభిస్తోంది సరిదిద్దే చర్యలు తీసుకోకపోగా ఇందిర "అవినీతి ప్రపంచమంతా ఉంది" అని మర్మంగా మాట్లాడింది పార్లమెంటులో రాష్ట్ర అసెంబ్లీలలో ఆమెకు గొప్పమెజారిటీ ఉన్నందువల్ల ప్రతిపక్షం వారు అరవటం, పార్లమెంటు సమావేశానికి భంగం కలిగించటం, వీధుల్లో ఆందోళన నడపటం కంటె చేయగలిగింది ఏమీ లేదు వివాదం రోజురోజుకూ పెరుగుతూ ఉంది ఆర్థికస్థితి అంత మెరుగ్గా లేదు సమ్మెలు, ఘెరావోలు, హింస నిత్యమూ జరగసాగాయి

విసుగు చెంది, ఏమాత్రం సంతోషంగా లేకపోయినా ఇందిర భయపడినట్లు మాత్రం కనపడలేదు తన పనులన్నీ శాంతచిత్తంతో చేసుకొంటూ పోతున్నట్లు కనిపించింది. ఈ క్లిష్ట పరిస్థితులలో పర్యావరణం గురించి ఐక్యరాజ్యసమితి సమావేశంలో స్టాక్‌హోంలో ప్రపంచ వేదికపై ఇందిర కీలకోపన్యాసం ఇవ్వటం గుర్తుంచుకోదగ్గ విషయము.

**అత్యంత హరిత ప్రధానమంత్రి**

చక్కగా తయారు చేసి మంచి ప్రశంసలందుకొన్న ఆ ఉపన్యాసంలో ఆమె ప్రకృతిని గురించి తనకున్న గొప్ప భావాలను ప్రకటించింది పర్యావరణం "ప్రపంచంలో అత్యంత ప్రాముఖ్యం" గల సమస్యగా నొక్కి చెప్పింది సంపన్న రాజ్యాలు పర్యావరణం, పెరుగుతున్న జనాభా సమస్యలకు "ప్రాముఖ్య" మిచ్చి "బీద దేశాల అభివృద్ధిని విషపూరితం చేస్తున్నార"నే భావం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉండటం ఆమె మరచిపోలేదు కాని సంపన్న దేశాలకయినా, పేద దేశాలకయినా పర్యావరణ సంరక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని ఆమె చెప్పింది "మానవునికి తన స్థితిని అర్థం చేసుకొని, ఈ గ్రహంపై తన అనుభవ కాలాన్ని పరిరక్షించుకోటానికి చేసే హృదయపూర్వకమైన ప్రయత్నానికి ఈ సమావేశం ప్రాతినిధ్యం వహిస్తుంద"ని ఆమె సమావేశంలోని ప్రతినిధులనుద్దేశించి చెప్పింది అధర్వవేదంలో భూమినుద్దేశించి చెప్పిన ఒక శ్లోకంతో ఆమె తన ఉపన్యాసం ముగించింది "నీ నుండి తవ్వినది త్వరగా పెరగనీ. నీ శరీరావయవములను గాని, నీ హృదయాన్ని కాని నేను నొప్పించకుండా ఉండనీ "

30 ఆగస్టు 2005న, పర్యావరణం గురించి ది హిందూ వ్రాసిన ఒక సంపాదకీయంలో "హరిత ప్రధానమంత్రులు", "వాస్తవంగా అంతరించిపోయిన" వర్గమని ఈ కింది విషయాలను జోడించింది. "నాయకురాలుగా ఇందిరాగాంధి లోపాలెన్ని ఉన్నా మొదటి భారత హరిత ప్రధానమంత్రిగా ఆమె సుగుణాలను జాతీయ విధానానికి వనరుగా నొక్కి చెప్పవలసి ఉంది " "చెట్లు నరికే కంట్రాక్టర్లను ఎదుర్కొని ఆందోళన జరిపిన వారిని పార్లమెంటులో పొగడిన నిజమైన ప్రకృతి ప్రేమి తుపాకి పేల్చటంలో వినోదించే రాజవంశీకులను వేటాడటం నిషేధించి

అదుపులో పెట్టింది ప్రాజెక్ట్ టైగర్‌ను స్థాపించింది వన్యప్రాణులకోసం ఇండియన్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్ ను శక్తిమంతం చేసింది. కేశాచ్ఛాదితమైన జంతు చర్మాల వ్యాపారం నిషేధించింది వన్య ప్రాణుల సహజ అవాసాలు ప్రమాదానికి లోనవుతున్నప్పుడు వాటిని అభయారణ్యాలుగా, జాతీయ ఉపవనాలుగా మార్చింది " పర్యావరణాన్ని సంరక్షించటంలో ఆమె సాధించిన ఇతర విషయాలు పేర్కొంటూ ఆ వార్తాపత్రిక ఆమెను "అత్యంతహరిత ప్రధానమంత్రి"గా వర్ణించింది 1991 నుండి ప్రధానమంత్రులు "ప్రకృతి పరిరక్షణలో వ్యక్తిగతమైన ఆసక్తిగాని, ఏదైనా విధానం గాని చూపించలేదు కొందరయితే నిశ్చయంగా పచ్చదనానికి వ్యతిరేకుల్లా వ్యవహరించారు" అని విచారించింది పక్షి శాస్త్రంలో నిపుణుడై విఖ్యాతి చెందిన సలీం ఆలీతో ఆమె ఎప్పుడూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేదని కూడా ఆ పత్రిక వ్రాసి ఉంటే బాగుండేది స్టాక్ హోమ్‌కు వెళ్ళే ముందు అల్విన్ టోఫ్లర్ వ్రాసిన "ఫ్యూచర్ షాక్" ఆమె పూర్తిగా చదివింది ఈ విషయం పైకి పొక్కగానే దేశవ్యాప్తంగా పుస్తకాల దుకాణాల్లో ఉన్న టోఫ్లర్ పుస్తకం కాపీలు అమ్ముడయి పోయాయి

తన గౌరవార్థం స్వీడన్ రాజధానిలో ఐక్యరాజ్య సమితి సమావేశంలో జరిగిన విందుభోజనం తర్వాత విఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త గున్నార్ మిరాల్ భారతదేశం "మెత్తని దేశమ" ని చేసిన వ్యాఖ్యను ఆమె పసలేకుండా చేసింది భారతదేశం బంగ్లాదేశ్ సమస్యను పరిష్కరించిన తీరు చూస్తే భారతదేశాన్ని మెత్తని దేశం అనలేరని ఆమె సూటిగా మిర్దాల్‌ను చూస్తూ చెప్పింది. ఆమె విజ్ఞాన విషయాల సలహాదారు అశోక్ పార్థసారధితో పాటు విందులో పాల్గొంటున్న మిర్దాల్ పార్థసారధితో తాను ప్రధానమంత్రి అభిప్రాయంతో ఏకీభవించనని తన అభిప్రాయం మార్చుకోనని అన్నాడు ఈ విషయం పార్థసారధి ఆమెకు చెప్పినపుడు ఆమె ఈ విధంగా వ్యాఖ్యానించింది "పాశ్చాత్య దేశాలలో మన స్నేహితులమంటున్న వారి ఆలోచనా ధోరణిని మనమెలా మార్చగలం?"

1973 లో వరుసగా రెండవ సంవత్సరం 180 మిలియన్ల ప్రజలను బాధించిన భయంకరమైన క్షామం 1974, 1975 లలో కూడా పూర్తిగా వదలలేదు

పెరుగుతున్న హింస సమ్మెలకు, ఊరేగింపులకు, పోలీసులతో ఘర్షణలకు ఎన్నోచోట్ల దారి తీస్తోంది. నేను అప్పుడు నివసిస్తున్న బొంబాయిలో 1972-73 లో 12000 సమ్మెలు, నిరసనలు, లాకవుట్లు జరిగాయి కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో ప్రొవిన్సియెల్ ఆర్మ్‌డ్ కాన్‌స్టబులరీ తిరుగుబాటు చేసింది పరిస్థితిని అదుపులో తీసుకోటానికి సైన్యాన్ని పిలవటమయింది 13 మంది సైనికులు, తిరుగుబాటు చేసిన పి ఏ సి. లో 22 మంది హతులయి, వందకు పైగా గాయపడిన తర్వాత స్థితి అదుపులోకి వచ్చింది

## న్యాయ సభతో ఘర్షణ

ఈ భయంకర వాతావరణంలో ఇందిరాగాంధి ప్రభుత్వానికి ఉన్నత న్యాయసభకు మధ్య సంఘర్షణ బయటపడింది ఇది ఏనాడైనా వస్తుందని ఎన్నాళ్ళుగానో భయపడుతున్న విషయమే. ఇదివరకే చెప్పినట్లు 1971లో ఆమె పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారాన్ని పునరుద్ధరిస్తూ రాజ్యాంగ సంస్కరణ తెచ్చింది హక్కులను సవరించే అధికారాన్ని పునరుద్ధరిస్తూ రాజ్యాంగ సంస్కరణ తెచ్చింది ఆమె బ్యాంకులను జాతీయీకరణ చేసినపుడు, రాజాభరణాలు రద్దు చేసినపుడు చట్టబద్ధంగా ఏ సమస్యలూ రాకుండా చూసుకొంది దీనిని వెంటనే సుప్రీంకోర్టుకు తీసుకెళ్ళటమయింది ఈ చట్టానికి అనుకూలంగా, వ్యతిరేకంగా చాలా ఆందోళనలు చెలరేగాయి ఛీఫ్ జస్టిస్ యస్ యమ్ సిక్రీ 13 మంది న్యాయమూర్తులతో ఈ కేసును పరిశీలించి తీర్పు చెప్పటానికి న్యాయ పీఠాన్ని ఏర్పాటు చేశాడు వాళ్ళలో కూడా ఎంత విభజన ఉందంటే ఏడుగురు ఒక పక్షాన, ఆరుగురు మరో పక్షాన ఉన్నారు ఫిబ్రవరి 1973లో వారిచ్చిన తీర్పుకు అంతకంటె తక్కువ మెజారిటీ ఉండటానికి వీలులేకపోయింది ఇంతకూ తీర్పు ఏమిటంటే పార్లమెంటు రాజ్యాంగంలోని అన్ని భాగాలనూ, సవరించవచ్చుకానీ "ప్రధానమైన లక్షణాలను" ధ్వంసం చేయకూడదు ఏది ప్రధానమైన లక్షణం, ఏది కాదు అనేది న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి

చాలా మంది ఈ తీర్పును ఇందిర "ఓటమి" గా భావించారు ఆమె కూడా అలాగే భావించినట్టుంది ఆమె "శత్రువులు" ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత

న్యాయస్థానాలద్వారా "పార్లమెంటుపై, ప్రధానమంత్రి"పై దాడిజరుపుతున్నారని ఆమె సమర్ధకులు ఈ తీర్పును ఖండించారు "న్యాయసభ స్వార్థపరుల సేవకురాలయిందన్నారు" ప్రతిపక్షాలు, న్యాయ వృత్తిలో ఉండే అధిక సంఖ్యాకులు, చాలావరకు వార్తా పత్రికలు ఈ తీర్పును ఇందిర "చపలత్వానికి" "అవసరమైన నిరోధకం" గా భావించారు ఇరుపక్షాలలోను వాగ్దాటికి, ఆడంబరానికి తక్కువ లేదు దేశంలోని వాతావరణం ఉద్రిక్తతతో నిండిపోయింది

సిక్రీ పదవీ విరమణ చేయటానికి ఒకరోజు ముందు సుప్రీంకోర్టు అత్యంత ముఖ్యమైన మైలురాయి వంటి తీర్పు నిచ్చింది నెహ్రూకాలం నుండి అవలంబిస్తూ వచ్చిన సంప్రదాయం పాటించి ఉంటే అందరికంటె సీనియర్ అయిన జడ్జి చీఫ్‌జస్టిస్ అవుతారు ఇప్పుడు సిక్రి స్థానంలో షేలత్ రావలసి ఉంది కాని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు నిచ్చిన జడ్జీలలో ఈయన ఉన్నాడు. సీనియారిటీ పట్టికలో ఉన్న మరో ఇద్దరు జడ్జీల సంగతి అంతే ఈ ముగ్గురినీకాదని ఎ యన్ రే ను చీఫ్‌జస్టిస్‌గా నియమించాలని ఇందిర అనుకొంది ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు నిచ్చిన ఆరుమంది జడ్జీలలో కెల్లా ఈయన సీనియరు ఈ ప్రకటన దేశానికి పిడుగులా తగిలింది ఈయన పైనున్న ముగ్గురు జడ్జీలు రాజీనామా చేశారు ఇందిర న్యాయసభను "అడ్డదారి తొక్కించటానికి" అన్ని మంచి సంప్రదాయాలను గాలికి వదిలేసిందని ఆమె విమర్శకులు గట్టిగా అరచి చెప్పారు. పేరున్న న్యాయవాదులు, ప్రముఖ వార్తాపత్రికలు ఆమెకు వ్యతిరేకంగా లేనివారు కూడా ఆమె "న్యాయసభల స్వాతంత్ర్యాన్ని ధ్వంసం చేయటానికి" ప్రయత్నిస్తున్నదని అన్నారు

న్యాయ సభల గురించి ఈ అరుపులు కేకలలో అలహాబాద్ హైకోర్టులో ఒక మసక గదిలో జరుగుతున్న న్యాయ విచారణను ఎవరూ పట్టించుకోలేదు కొంచెం తమాషా మనిషయినప్పటికీ పట్టువదలని సోషలిస్టు, రాజ్‌నారాయణ్ గొప్ప మైత్రి సంఘటన తరపున అభ్యర్థిగా 1971లో రాయ్‌బరేలీలో ఇందిరాగాంధీతో పోటీ చేశాడు పెద్ద మెజారిటీతో ఇందిరాగాంధి అతనిని ఓడించింది. ఆమెకు వ్యతిరేకంగా కోర్టులో ఎన్నికల పిటిషన్ అతను పెట్టుకొన్నాడు ఈ దేశంలో

న్యాయ విధానం సహజంగా నడిచే తీరులో నత్త నడకలతో కేసు నడచింది ఇద్దరు జడ్జీలు పదవీ విరమణ చేశారు ఆ తర్వాత కేసు విచారించిన జగ్‌మోహన్‌లాల్ సిన్హా చాలా నెమ్మదిగానే సాక్ష్యాలు పరిశీలిస్తున్నాడు.

## నవ్ నిర్మాణ్ నుండి జె.పి ఉద్యమం వరకు

1972, 1973లో రేగిన అల్లకల్లోలం గంభీరమైనదైనా ఆ తర్వాత 1974లో జరిగిన దానితో పోలిస్తే ఇది పాలిపోయింది ఇది వరకు మొరార్జీ దేశాయ్‌కి, పాత కాంగ్రెసుకు బలమైన స్థావరంగా ఉన్న గుజరాత్‌లో ఆమె పార్టీ స్థితి అంత సంతృప్తికరంగా లేకపోవటమే దీనికి కొంత కారణమనవచ్చు ఇతర రాజ్యాలలో వలె ఇక్కడకూడా ఇందిర గౌరవనీయుడు, తనకు విశ్వాస పాత్రుడైన వ్యక్తి ఘనశ్యామ్ ఓజాను, అంతగా పేరున్నవాడు కానప్పటికీ ముఖ్యమంత్రిగా నియమించింది ఆమె విరోధులు ఆమెను "నిర్దయురాలైన నియంత" గాను ఆమె అనుయాయులు "సర్వోన్నత నాయకురాలు" గాను వర్ణించినప్పటికీ గుజరాత్‌లో ఆమె ఆజ్ఞానుసారం ఏమీ జరగటం లేదు అంతగా పాపభీతి లేకుండా, కుయుక్తులు పన్నుతూ ఆకాంక్షలు అధికంగా ఉన్న రాజకీయవేత్త చిమన్‌భాయ్ పటేల్ ఓజా ప్రభుత్వాన్ని పడగొట్టి తాను ముఖ్యమంత్రి అయ్యాడు ఇందిరకు చాలా కోపమొచ్చింది కాని ఉత్తరప్రదేశ్, ఒరిస్సాలలో రాష్ట్ర ఎన్నికలు రానున్నాయి అందుకే ఆమె తొందరపడి ఏ చర్యా తీసుకోలేదు చాలా అవసరమైన నిధులను ఎన్నికలకోసం సేకరిస్తానని చిమన్‌భాయ్ ఆమెను శాంతపరచచూశాడు. దీనికోసమై "చమురు రాజుల" ను కోరాడు వారు నిధులివ్వటానికి సంతోషంగా అంగీకరించారు కాని గుజరాత్‌లో ఎక్కువగా వాడే వంటనూనె అయిన వేరుశనగనూనె ధరను పెంచటానికి అనుమతించమన్నారు

చాలా కొరత ఉన్న సమయంలో, ధరలు అప్పటికే భరించరానంతగా ఉన్న సమయంలో ఇది భగ్గుమని మండగలిగే వస్తువుపై అగ్గిపుల్ల వెలిగించి వేసినట్లయింది అప్పటివరకూ అణచుకొన్న కోపం ఉద్యమ రూపంలో చెలరేగింది విద్యార్థులు దీనికి ముందు నిలిచారు చిమన్‌భాయ్ పటేల్‌ను వెంటనే

తొలగించమని కోరారు  అతనిని “చిమన్ చోర్” (చిమన్ దొంగ) అని పిలిచారు రాష్ట్ర అసెంబ్లీని కూడా రద్దు చెయ్యమన్నారు  కాంగ్రెస్‌కు మూడింట రెండు వంతుల మెజారిటీ ఉంది  అవినీతికి విరుద్ధంగా సాగిన వాడి ‘నవనిర్మాణ్’ ఉద్యమంగా మారింది

పటేల్ పట్ల, ప్రధానమంత్రి పట్ల ఉన్న వ్యతిరేకభావం ఎంత ముమ్మరంగా ఉందంటే వది వారాలపాటు గుజరాత్‌లో అరాచకత్వమే ఏలింది అహమ్మదాబాద్‌లో 105 ఇతర నగరాలలో, పట్టణాల్లో కర్ఫ్యూ విధించటమయింది సమస్య అణిగేసరికి 103 మంది హతులయ్యారు, 300 మంది గాయపడ్డారు, 8000 మందికిపైగా అరెస్టయ్యారు  ఇందిరాగాంధి అనుకొన్నదానికంటె భిన్నంగా అసెంబ్లీ రద్దుకు అంగీకరించవలసి వచ్చింది  కోపంతో, బెదిరింపులతో జన సమూహాలు శాసనసభ సభ్యులను రాజీనామా చేయమని ఒత్తిడి తేసాగాయి

ఈ నిరాశాజనకమైన నేపథ్యంలో గాంధి అనుయాయిగా పేరొందిన, ఎంతగానో గౌరవాస్పదుడైన నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ (జెపి) ఇందిరాగాంధికి, ఆమె “దేశాన్ని పరిపాలించే తీరుకు” వ్యతిరేకంగా పోరాటంలోకి దిగాడు  ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు  1942 లో “క్విట్ ఇండియా” ఉద్యమంలో వీరోచితమైన పాత్ర వహించాడు  నెహ్రూ అతనిని అభిమానించాడు  ఐదవ దశకం ప్రారంభంలో జె పిని తన ప్రభుత్వంలో ఉపప్రధానమంత్రిగా చేరమన్నాడు  కాని జెపి నిరాకరించాడు  ఆ తర్వాత క్రియాశీలమైన రాజకీయాలనుండి తప్పుకొన్నాడు

దీనితో ఆయనకు సన్యాసుల కిచ్చిన గౌరవాన్ని ఇచ్చారు  దేశంలో త్యాగాన్ని ఆరాధించటం సాంప్రదాయికంగా జరుగుతున్నదే  ఇందిర లాగ జెపికి కూడా జనాకర్షణ శక్తి ఉంది  కాని ఆమెకు భిన్నంగా అతను ఒక్కొక్కసారి అతి సరళంగాను, మరి కొన్ని సార్లు దుడుకుగాను ప్రవర్తించేవాడు  ఉదాహరణకు మొదటి పాకిస్థానీ సైనిక నియంత ఫీల్డ్ మార్షల్ అయూబ్ ప్రవేశపెట్టిన “ప్రాథమిక ప్రజాస్వామ్యాని” కి స్వాగతం పలికి ప్రశంసించాడు  ఇదివరకు చెప్పినట్లు బంగ్లాదేశ్‌లో క్లిష్టస్థితి మొదలవగానే భారతదేశం సైనికంగా జోక్యం

కలగజేసుకోవాలని తగిన సమయానికి ముందుగానే ఒత్తిడి తెచ్చాడు ఇందిర గుజరాత్‌లో రాష్ట్రపతి పాలన విధించవలసి వచ్చినపుడు రెండు రోజుల తర్వాత జె పి అహమ్మదాబాద్‌కు వచ్చాడు "నవ-నిర్మాణ్" పద్ధతితో వచ్చిన స్ఫూర్తితో దానిని దేశంలోని ఇతర ప్రాంతాలలో ప్రారంభిస్తానని, తన స్వంత రాష్ట్రంలో మొదలు పెడతానని ప్రకటించాడు

ఒకప్పుడు జె పి దృక్పధాలను కాకపోయినా, ఆయనను వ్యక్తిగా ఇందిరాగాంధి గౌరవించేది "అల్లకల్లోలానికి సిద్ధాంతి" అని జె పి గురించి తనకున్న అభిప్రాయాన్ని ఎప్పుడూ దాచుకోలేదు ఆయనకు రాజకీయాలంటే "అసాధ్యమైన కళ" అని కూడా అనుకొనేది ఇందిర "మాస్కోతో ప్రభావితురాలయిందని" "అధికారం చెలాయించేదని" "ప్రజాస్వామ్యం పునాదులే ధ్వంసం చేసేటట్లుందని" జె పి నమ్మాడు 1974 ప్రారంభంలో జెపికి నైతిక అధికారం ఎంతగానో ఉండేది ఇందిరాగాంధికి నైతిక అధికారం పూర్తిగా సన్నగిల్లింది ఈ విధంగా జెపి సులభంగా దేశంలో ఇందిరపట్ల వ్యతిరేక భావనకు సమావేశ స్థానమయ్యాడు ఆమెకు వ్యతిరేకంగా జరిగే నిరసన ప్రదర్శనలను, దిశారహితమైన వాటిని ఏకీకృతం చేసి శక్తిమంతమైన ఉద్యమంగా చేయగలిగాడు గాని అదేమంత పొందికగా మాత్రం లేదు

గుజరాత్‌లో వలె బీహార్‌లో కూడా జెపి ఉద్యమానికి మూలమైన కోరిక రాష్ట్రప్రభుత్వాన్ని తొలగించి, శాసన సభను రద్దు చేయటం ఈ లక్ష్యం "నవ-నిర్మాణ్" కంటె గొప్పది ఆయన దానిని "సంపూర్ణ విప్లవమ"న్నాడు కాని ఏనాడూ దానిని పూర్తిగా నిర్వచించలేదు మహాత్మాగాంధి శిష్యుడిననే ఈ వ్యక్తి, అహింసా ప్రవక్త, తన చుట్టూ ఉన్నవాళ్ళు చేసే హింసను సమర్ధించ సాగాడు కొంతమంది ప్రముఖ వ్యక్తులు, కొన్ని వార్తా పత్రికలు అతను చేస్తున్న దానిలోని ప్రమాదాన్ని సూచించారు ది టైమ్స్ ఆఫ్ ఇండియాకు ప్రముఖంగా సంపాదకుడైన శామ్‌లాల్ తన పేరుతో వ్రాసిన ఒక వ్యాసంలో జెపి "విప్లవానికి అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని గాక అల్లకల్లోలానికి వాతావరణాన్ని" సృష్టిస్తున్నాడని చెప్పాడు హిందూ తన సంపాదకీయంలో ఈ విధంగా పేర్కొంది

ప్రముఖ రాజకీయాలనుండి దూరంగా ఉండి "వాటిని సరిగా తీర్చిదిద్దే బాధ్యత నుండి వైదొలగి, శ్రీ నారాయణ్ ఇప్పుడు తప్పుదారిలో ఇంట్లోకి రావాలని దానిని అందరినెత్తినా కూల్చాలని చూస్తున్నారు " కాని జెపి ఇటువంటి విమర్శను, సలహాను పట్టించుకొన్నట్టు లేదు దేశం, రాజకీయంగా సక్రియాత్మకంగా ఉన్న మధ్యతరగతి కూడా ఆ విధంగానే ఉన్నారు "ఎంతగానో వ్యాపించిన లంచగొండితనం", "ప్రజాస్వామ్యాన్ని వికృత పరచటం" వీటన్నిటికీ "అధ్యక్షత వహిస్తున్న" ఇందిరపై అతను చేస్తున్న "యుద్ధాని"కి సమర్థన రోజు రోజుకూ పెరగసాగింది

బీహారులో తన దుర్గంలో ఉన్న జెపి ఉద్యమం గుజరాత్‌లోని "నవ-నిర్మాణ్" నుండి రెండు ముఖ్యమైన విషయాలలో భిన్నంగా ఉంది మొదటిది, గుజరాత్‌లో విద్యార్థులు నడిపించిన ఉద్యమంలో సహజత్వం ఉందేగాని రాజకీయాలతో ప్రమేయంలేదు ఆ తర్వాత రాజకీయ పార్టీలు దీనిని ఉపయోగించుకోవాలని చూశాయి బీహారులో ఇందిరకు, ఆమె కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న పార్టీలన్నీ కలిసి ఈ ఉద్యమాన్ని సృష్టించే పని చేపట్టాయి. నిజానికి ఈ పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా కుడిపక్షం వాళ్ళయిన భారతీయ జనసంఘ్ (ఈ నాటి బిజెపికి ముందున్న పార్టీ), భయంకరమైన తన మాతృ సంస్థ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ యస్ యస్ ) ఇందిర వ్యతిరేక ప్రచారానికి బలం చేకూర్చారు దీనికి కారణమేమిటంటే గుజరాత్‌లో "నవ-నిర్మాణ్" ఉద్యమం ఉచ్ఛదశలో ఉన్నప్పుడు కూడా ఉత్తర ప్రదేశ్, ఒరిస్సాలలో ఇందిర పార్టీ శాసనసభ ఎన్నికలలో గెలిచింది నిరాశ చెందిన ప్రతిపక్షాలు, సాధారణంగా పోట్లాడుకొనే బాతుల్లా శబ్దాలు చేసేవి, ఇప్పుడు జెపి ఆధ్వర్యంలో తామంతా ఏకమై ఇందిరను పదవినుండి తొలగించాలనే తమ లక్ష్యాన్ని సాధించగలమనుకొన్నారు

రెండో విషయమేమిటంటే, గుజరాత్‌లా కాక బీహార్‌లో ఇందిర స్థిరంగా నిలబడింది శాసనసభలో ఆమె పార్టీకున్న అత్యధికమైన మెజారిటీ చెక్కు చెదరలేదు అహమ్మదాబాద్‌లో చేసిన "పొరపాటు" తాను పాట్నాలో మళ్ళీ చేయబోద్దు తన



90967

యం.యల్ ఏ లను రాజీనామా చేయమని బెదిరించే ప్రయత్నాలను ఆమె కొనసాగనివ్వలేదు. 'ఎవరైతే రాజీనామా చేయాలనుకొంటారో వారు స్వయంగా వెళ్ళి స్పీకరుతో చెపితేనే వారి రాజీనామా స్వీకరించటం జరుగుతుంది' అనే చిన్న ఉపాయంతో ఇది సాధ్యమైంది

కానీ ఈ దృఢత్వం వల్ల వచ్చిన ఫలితాలు ఆమె చిన్న కొడుకు, ప్రియమైన వాడు అయిన సంజయ్ తనను ఇబ్బందిలో పెట్టిన తీరుతో నిష్ఫలమయ్యాయి అతను "ప్రజల కోసం మోటారుకారు" తయారు చేయాలని వేసిన పథకాలు ఈమె బంధుప్రీతి చూపిస్తోందని, అవినీతిని ప్రధానమంత్రి ద్వారం వద్దకే తెచ్చాయి

## సంజయ్, అతని మారుతి

1969 లో సంజయ్ కేవలం ఇరవై మూడేండ్లవాడుగా ఉన్నప్పుడు, పూర్తిగా స్వదేశానికి చెందిన, చౌకైన "ప్రజలకారు" మారుతిని తయారు చెయ్యటానికి లైసెన్సు కోసం దరఖాస్తు పెట్టుకొన్న పన్నెండు మందిలో అతనొకడు అటువంటి అత్యాశగల సాహసకార్యం చేయటానికి అతనికున్న అర్హతలు అనుమానాస్పదమే డూన్‌స్కూలు నుండి చదువు విరమించుకొన్న విద్యార్థి అతను. అయితే కార్లంటే అతనికున్న వెర్రి అభిమానం ఎవరూ కాదనలేరు. తాను కోరిన పని నేర్చుకొంటాడని తల్లి ఇంగ్లాండులోని రోల్స్-రాయిస్‌కు పంపితే అతనక్కడ తన చదువు పూర్తిచేయలేదు కాని తాను భారతదేశానికి హెన్రీఫోర్డ్ కావాలనే అతని కలలకు మాత్రం ఏమాత్రం భంగం కలుగలేదు పన్నెండు దరఖాస్తులలో సంజయ్‌కి మాత్రమే 50,000 కార్లు తయారు చెయ్యటానికి లైసెన్స్ దొరికినపుడు పెద్ద గొడవ జరిగింది ఇందిరా గాంధి ఇటువంటి విమర్శలను లెక్కపెట్టకుండా పట్టనట్టు ఊరుకొంది.

మారుతి గురించి విమర్శ మరింత తీవ్రమైంది హర్యానా ముఖ్యమంత్రి బన్సీలాల్ 290 ఎకరాల భూమిని, మార్కెటులో ఉన్న ధరకు తక్కువగా, అది కూడా రక్షణ స్థావరాలకు దగ్గరయినందున నిషేధింపబడిన స్థలాన్ని సేకరించగానే ఈ విమర్శ సబబనిపించింది సంజయ్ ఇందిరాగాంధి గారాలబిడ్డ అయినందున

అతని గురించి ఏమాత్రం విమర్శ వచ్చినా ఆమె సహించలేకపోయింది మారుతి కారు ఒకటీ కూడా తయారుకాకముందే సంజయ్ పెద్ద పెద్ద మొత్తాలను డీలర్‌షిప్‌ల కోసం వ్యాపారస్థులనుండి వసూలుచేశాడు పార్టీకి ముఖ్యంగా నిధులు సేకరించే యల్ యన్ మిశ్రా, విదేశ వాణిజ్య మంత్రి, సహాయం దీనికి లభించింది ఇది వెలికి వచ్చినా ఇందిరాగాంధి మాట్లాడలేదు. ఇందిరాగాంధికి దగ్గరి స్నేహితురాలు, ఆతర్వాత ఆమె జీవిత కధ వ్రాసిన పుపల్ జయకర్ కూడా సంజయ్ "పనికిమాలి తనంతో" వ్యవహరించాడని చాలా పెద్ద మొత్తాలు "వ్యర్థం" చేశాడని గుర్తించింది సంజయ్ తన తల్లికి కలగజేయబోయే ఇబ్బందులలో ఇది ప్రారంభం మాత్రమే చాలామందికంటె ఎక్కువగా తెలిసిన జయకర్ ఆయువకుని గురించి మెచ్చుకోని మాట ఏదయినా అతని తల్లితో అంటే కోరి ఇబ్బందులు తెచ్చుకొన్నట్టే. అంత అధికారం, గౌరవం ఉన్న సలహాదారు పి యన్ హక్సర్ కూడా సంజయ్ ప్రధానమంత్రి ఇంట్లో ఉంటూ వాణిజ్యసంబంధమైన పనులు చేయకపోతే మంచిదని సూచించినందుకు అతను కూడా ఆమె అనుగ్రహం కోల్పోయాడు

ఒక యువకుడు "ప్రధానమంత్రి కొడుకయినంత మాత్రాన" తనకు ఇష్టమున్న పనిని చేయకుండా ఆవటం సరికాదని ఇందిర మళ్ళీ మళ్ళీ తనను విమర్శించేవారికి జవాబిచ్చింది ఇందిరాగాంధి మరణించిన కొన్నేండ్లకు పుపల్ జయకర్ ఒక విషయం తెలియజేసింది ఒకసారి తాను కోసక్ మతాచార్యుని, ఫాదర్ కన్‌స్టాంటైన్‌ను కలిశానని, ఆ సాహసికుడు "బొంబాయిలోని రెండు గేరేజీలలో ఒక విమానం తయారుచేసి, తన స్నేహితులను సరదాగా విమానంలో తిప్పేవాడని" ఇందిర కొంచెం కోపం వ్యక్తం చేస్తున్నట్లుగాచెప్పి, "అతను విమానాన్ని నిర్మించగలిగితే, సంజయ్ కారునెందుకు తయారుచెయ్యలేదు?" అని గట్టిగా అడిగింది

## రైల్వే సమ్మె

బీహారు శాసనసభ రద్దు చేయటంలో విఫలమయిన జె పి నాయకత్వంలోని దళాలు హింసకు పాల్పడ్డాయి దీనికి ప్రతిగా బీహారు సాయుధపోలీసులు కేంద్రప్రభుత్వ పారామిలటరీ దళాలు మరింత హింసాత్మకంగా ప్రవర్తించాయి ఒకసారి పోలీసుల

లాఠీచార్జిలో జె పి సమర్ధకులు అయన చుట్టూ రక్షణాత్మకవలయం ఏర్పరచుకొన్నందున జె పి లాఠీ దెబ్బలు తప్పించుకొన్నారు ఆ ఉద్యమం ఆ తర్వాత తన పద్ధతులు మార్చుకొంది. ఒక దాని తర్వాత మరొకటిగా అన్ని చోట్ల సమ్మెలు చేయించసాగింది. దీనితో ఉత్పత్తికి, సాధారణజీవనానికి భంగం కలిగింది పెద్దపెద్ద ఊరేగింపుల ఉద్దేశమదే అదృష్టం కొద్దీ జె పి పార్లమెంటును చుట్టుముట్టుతానన్న పథకం కొనసాగించలేదు. అయితే పార్లమెంటు సింహద్వారం వరకు పెద్ద ఊరేగింపునయితే తీసుకువెళ్ళారు

సంఘర్షణ యుద్ధంగా మారిన ఈ సందర్భంలో స్వతంత్రుడైన సోషియలిస్టు, ట్రేడ్‌యూనియన్ నాయకుడు, ఇంతకుముందు జేసూయిస్ట్ మతాచార్యుడు అయిన జార్జి ఫెర్నాండెస్ దేశవ్యాప్తంగా రైల్వేసమ్మె చేయించారు పాతిక సంవత్సరాల తర్వాత రక్షణమంత్రిగా కూడా అతను గొప్ప బాధ్యతను ప్రదర్శించలేదు 1974 మే లో తన లక్ష్యాలను నిర్వచించటంలో పూర్తిగా నిర్లక్ష్యంగాను, మొరటుగాను వ్యవహరించాడు అతని తర్కం ప్రకారం రైళ్ళ ద్వారా బొగ్గు సరఫరా తగ్గిందంటే విద్యుచ్ఛక్తి కేంద్రాలుమూతపడుతాయి, ఆ తర్వాత పరిశ్రమలు మూత పబడుతాయి అహారం రవాణా లేకపోతే దేశం "ఆకలికి మాడి" పోతుంది, ఆ తర్వాత ఇందిర ప్రభుత్వం పడిపోతుంది అయితే ఏదో పాత సామెతలాగా ఆతిధ్యమిచ్చేవారిని మరచిపోయి లెక్కపెట్టసాగాడు బ్రిటిషుకాలంలో కూడా దేశమెన్నడూ చూడని విధంగా ఇందిర పాశవికంగా సమ్మెను అణచివేసేటట్లు చూసింది 20,000 మందికి తక్కువగాకుండా రైల్వే ఉద్యోగులు నిర్బంధంలోనికి తీసుకోబడ్డారు పనికి వెళ్ళమని సమ్మె చేసేవారి కుటుంబాలను రైల్వేక్వార్టర్ల నుండి వెళ్ళగొట్టటమయింది పదిహేను రోజులలోపే సమ్మె విఫలమైంది తర్వాత ఎమర్జన్సీ సమయంలో ఫెర్నాండెస్‌ను కారాగారంలో పెట్టటమయింది దానిని బరోడా డైనమైట్ కేసు అన్నారు

రైల్వే ఉద్యోగులను అణచివేసిన కఠినమైన తీరుకు భారతీయులెందరో భయభీతులయ్యారు వీరిలో రిపబ్లిక్ ప్రెసిడెంటు, ఇది వరకు ట్రేడ్ యూనియన్ నాయకుడైన వి వి గిరి ఉన్నాడు. అతనికి రాష్ట్రపతి పదవి ఇందిర వల్లే వచ్చింది

అయినా అతను తన దుఃఖాన్ని ఆమెకు తెలియజేశాడు అతని మాట ఆమె

విననట్టే నటించింది ఇంతకంటె ముఖ్యమైన ప్రతిక్రియ మధ్య తరగతి వారిది నేను స్వయంగా చూసిన బొంబాయిలోనే కాదు ఇతర స్థలాలలో కూడా వారి ప్రతిక్రియ తీవ్రంగా ఉంది ఇంతవరకు ఆమెను "అధికార దర్పమని" "ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘిస్తోందని" అన్నవారంతా హఠాత్తుగా, ఏమాత్రం సిగ్గులేకుండా ఆమె రైల్వే సమ్మెను అణచివేయటంలో చూపిన "గట్టితనాన్ని" మెచ్చుకొన్నారు వీరి ద్వంద్వ స్వభావం సులభంగా విశదీకరించవచ్చు సిద్ధాంత రీత్యా వీళ్ళందరూ వెస్‌మెన్‌స్టర్ ప్రమాణాలు అవలంబించాలనుకొంటారు కాని తమ కేవిధమైన అసౌకర్యంగాని, ఇబ్బందిగాని కలిగితే భరించలేరు

**అణ్వాయుధాల సంఘంలోకి**

రైల్వే సమ్మె కథలో అనుకోని, నాటకీయమైన మలుపు ఒకటి వచ్చింది మే 18న, దేశం తాత్కాలికంగా సమ్మె గురించి, జెపి ఉద్యమం గురించి మరచిపోయి ఉత్సాహంగా గొప్ప మైలురాయి వంటి విజయానికి స్వాగతం పలికింది దీనికి పట్టువిడువని ఆమె విమర్శకులు కూడా ఇందిరను ప్రశంసించారు సాధారణ ప్రజ ఆనందంతో ఉన్మత్తులయ్యారు ఆరోజు తెల్లవారు ఝామున రాజస్థాన్ ఎడారిలోని పోఖరన్‌లో భూగర్భంలో అణ్వస్త్ర పరీక్ష జరిపింది ఈ విధంగా ప్రపంచంలోని అణ్వాయుధాల సంఘంలో ఆరవ సభ్యురాలయింది ఈ సంఘం ప్రపంచంలో ప్రత్యేకమైన సంఘం అప్పుడు ఆ తర్వాత కొన్నేండ్లు అధికారికంగా భారతదేశం దానిని శాంతియుతమైన అణు ప్రయోగం అనేది కాని అణ్వస్త్రాల గురించి తెలిసిన ఎవరైనా ఆనాడు పరీక్షించింది అణుబాంబని చెప్పగలరు

ఈ పెద్ద సంఘటనకు ఒక రోజు ముందు ఢిల్లీ ఉన్నత స్థాయిలో అత్యంత రహస్య మయిన సమావేశం జరిగింది ఆ పరీక్ష ఇప్పుడే జరపాలా లేక ప్రయోగాన్ని ప్రస్తుతానికి వాయిదా వెయ్యాలా అని చర్చించారు. పి యన్ హక్సర్, పి యన్ ధర్‌ల నాయకత్వంలో అక్కడ సమావేశమయిన వారిలో చాలామంది ప్రయోగాన్ని విడిచిపెట్టక పోయినా, కొన్నాళ్ళ తర్వాత జరిపితే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు ఆటమిక్ ఎనర్జీ కమీషన్ అధ్యక్షుడు, హోమీ సేథ్నా, భౌతికశాస్త్రవేత్తగా కంటె ఇంజనీరుగా ప్రముఖుడు, మౌనంగా ఉన్నాడు ఇందిరాగాంధి బాంబును

నిర్మించిన రాజా రామన్నవైపు చూసింది "డాక్టర్ రామన్నా, దయచేసి పని కానివ్వండి అది దేశానికి మంచిది" అని చెప్పింది. రెండు సంవత్సరాలక్రితం నిక్సన్ సెవెన్త్ ఫ్లీట్‌ను (యుద్ధనౌకలు) బంగ్లాదేశ్ యుద్ధమపుడు బంగాళా ఖాతంలోకి పంపిన కొన్నిరోజులకు ఇందిర రామన్న ఆధ్వర్యంలో ఉన్న శాస్త్రవేత్తలకు శాంతియుతమైన అణు ప్రయోగానికి తయారీ ప్రారంభించమని సంకేతమిచ్చింది.

అణ్వాయుధాన్ని తయారు చేసి పరీక్ష చేయగల శక్తి భారతదేశానికుందని తెలియజేస్తూనే, అణ్వాయుధాలు తయారు చెయ్యకూడదని, పూర్తిగా అణ్వస్త్ర నిరాయుధీకరణకు ప్రయత్నించాలనే విధానానికి ఇందిర కట్టుబడి ఉంది కాని అణు సంబంధమైన సాంకేతిక విషయాలలో పరిశోధన, అభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోని ఇతర రాజ్యాలతో సమానంగా ఉండాలని ఇందిర పట్టుదలగా ఉండేది

పొఖరాన్‌లో జరిగిన అణు పరీక్షకు సంతోషించిన దేశం త్వరలోనే మరో విషయానికి ఇందిరను శ్లాఘించింది సెప్టెంబరులో వస్తువులను దొంగతనంగా చేరవేసేవారు, విదేశీ మారకద్రవ్యాన్ని చతురతతో చేతులు మార్చేవారు, ఇతర ఆర్థిక అపరాధులమీద ఇందిర తీవ్ర చర్య తీసుకొంది వీరెంతో ధనవంతులుగా, రాజకీయ నాయకుల ఎన్నికలకు తరచుగా ధన సహాయం చేస్తూ వారికి, పోలీసులకు, కస్టమ్స్ అధికారులకు దగ్గరగా ఉండి నమ్మలేనంత పలుకుబడి సంపాదించారు ఈ భయంకరమైన స్థితి రాత్రికి రాత్రే అంతమయింది 134 మంది మాఫియా డాన్‌లను జైళ్ళకు పంపించి, రెండేండ్లు నిర్బంధంలో ఉంచి పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి దేశంలో భద్రత నెలకొల్పే చట్టం (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్టు - మీసా) దోహదం చేసింది

సంవత్సరం ముగిసేసరికి జెపి ఉద్యమం అణగారి పోతుందని ఇందిర, ఆమె ప్రభుత్వం నమ్మారు కాని 1975లో జరిగిన రెండు అనుకోని సంఘటనలు ఈ లెక్కలు తారుమారు చేశాయి వాస్తవానికి ఆధునిక భారతదేశ చరిత్రమీద గొప్ప ప్రభావం చూపాయి



## 8

# ఎమర్జెన్సీ : సమ్మెట దెబ్బ

పందొమ్మిది వందల డెబ్బయి ఐదు ప్రారంభమైందో లేదో అప్పుడు వివాదాస్పదమైన యల్ యన్ మిశ్రా ఒక రైల్వే స్టేషన్‌వద్ద టైమ్ బాంబు పేలి మరణించాడు అతడు ఒక సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో వేదికలోపల దాచిన బాంబు పేలింది హత్య చేయబడిన మొదటి భారత కాబినెట్ మంత్రి ఇతనే జెపి, అతని సహచరులు వ్యాపింపజేస్తున్న హింసా సంస్కృతి ఫలితమే ఈ హత్య అని ఇందిర, ఆమె పార్టీ వారిని నిందించారు మిశ్రా ఆమెకు "ఇబ్బందికరంగా" మారినందున ఇందిర ప్రభుత్వమే మిశ్రాను వదిలించుకొన్నారని జెపి అనుయాయులన్నారు ఇందిర ఈ "పచ్చి అబద్ధాలకు" నిరసన తెలిపింది మిశ్రాను తొలగించటం, తనను హత్య చేయటానికి ఆయత్తమవటమేనని చెప్పింది "నేను హత్య చేయబడిన తర్వాత నేనే దానిని ఏర్పాటు చేసుకొన్నారని వీరు అనగలరు" అని కూడా ఆమె చెప్పింది

ఇందిరాగాంధి, ఆమె పార్టీలో అధిక సంఖ్యాకులు జె పి తెలిసో, తెలియకో విదేశీ సమర్థన ఉన్న ఫాసిస్టు ఉద్యమాన్ని నడుపుతున్నాడని తమకు తాము నమ్మకం కుదుర్చుకొన్నారు వీరిలో చాలామంది మాజీ కమ్యూనిస్టులు, మాజీ సోషలిస్టులు, సాంప్రదాయికంగా వస్తున్న కాంగ్రెసువారు, అయితే అందరూ అధికారానికి, పలుకుబడికి అన్నివేళలా తాపత్రయపడుతున్నవారే ఇందిరా గాంధికి స్వయంగా విదేశీయులు కలగజేసుకొంటున్నారనే భయముండేది సెప్టెంబరు 1973లో చిలీలో సాల్వడోర్ అలెండీ ప్రభుత్వాన్ని పడగొట్టటానికి సి ఐ ఏ పన్నాగం పన్నింది

దీని ఫలితంగా ప్రధానమంత్రి, ఆమె పార్టీ తమ పార్టీ సభ్యులపై అవినీతి ఆరోపణ వచ్చినా, అది నిజమైనా పట్టించుకోలేదు ఇందిర సాధారణంగా ఎవరినీ నమ్మనప్పటికీ ఆమె అనుయాయులలో చాలా అవినీతి పరులైనవారు తమపై దాడి చేయటమంటే ఆమెపై దాడి చేయటమేనని ఆమెను నమ్మించారు. అవినీతి "ప్రపంచమంతటా కనిపిస్తున్న విషయమేనని" ఆమె అనటం పరిస్థితులను మరింత దిగజార్చింది

తన పార్టీలో చంద్రశేఖర్ వంటి ముఖ్యమైన వారెందరో జె పి తో సంప్రదింపులు జరపమని ఆయనను ఎదిరించవద్దని ఎంతగానో ఆమెకు చెప్పారు ఆమె సెక్రటరీ పి యన్ ధర్‌కు జె పి బాగా తెలుసు ఆయనతో ఇంకా మాటా మంతీ ఉంది ధర్ కూడా పై విధంగానే ఆలోచించాడు నవంబరు చివరలో 1974లో ప్రధానమంత్రికి జె పి కి మధ్య ఒక సమావేశం జరిగింది కాని దాని వల్ల ఒరిగిందేమీ లేదు. ఆ తర్వాత ఒక జూనియర్ మినిస్టరు, "యంగ్‌టర్క్" అయిన మోహన్ ధారియా జె పి నాయకత్వంలో ఆందోళన చేస్తున్న వారిపై "పోలీసు అత్యాచారాన్ని" బహిరంగంగా ఖండించాడు కోపంతో రెచ్చిపోయిన ఇందిర ఒక గంటలోనే అతనిని తొలగించగానే అతని ప్రతిష్ఠ పెరిగిపోయింది

ఇందిరకున్న ఎన్నో సమస్యలకు మరొక కఠినమైన సమస్య తోడయింది 1975 ఏప్రిల్‌లో 79 ఏండ్లు నిండుతున్న మొరార్జీదేశాయ్ సంవత్సరానికి పైగా రద్దయిన గుజరాత్ అసెంబ్లీకి వెంటనే ఎన్నికలు జరగాలని నిరాహారదీక్ష మొదలు పెట్టాడు తాను ఓడిపోతానని తెలిసే ఇందిర ఎన్నికలు ఆలస్యం చేస్తోందని ఆరోపించాడు అతనికేమైనా అవుతుందేమోనని భయపడి 10 జూన్‌కు గుజరాత్ ఎన్నికలు జరగటానికి ఆమె వెంటనే అంగీకరించింది అప్పుడు మండిపోయే ఎండలున్నా ఆమె పట్టించుకోలేదు

అంటే మే నెలంతా గుజరాత్‌లో ఆమె ఎన్నికల ప్రచారం అతివేగంతో చేయవలసి ఉంది అయినా సున్నితమైన ఒక చర్యను ఆమె పర్యవేక్షించగలిగింది దీనివల్ల భారతదేశానికి చైనాకు మధ్య ఇరుక్కొన్నట్లున్న ఒక చిన్న హిమాలయ రాజ్యము భారతదేశంతో కలిసి పోయింది 1947 వరకు అది బ్రిటిష్‌వారి రక్షణలో

ఆ తర్వాత భారతదేశం రక్షణలో ఉండేది భారతదేశ భద్రతకు ఉన్నత హిమాలయాలలో సిక్కిమ్ కీలకమైనది 1962లో చైనాతో సరిహద్దు యుద్ధం ఇక్కడే జరిగింది సిక్కిమ్ ఛోగ్యాల్ అతని అమెరికన్ భార్య సిక్కిమ్ స్వతంత్రరాజ్యంగా ఉండాలని కోరినప్పుడు ఇందిర నిరాకరించింది సిక్కిమ్ శాసనసభ భారతదేశంతో సంబంధాన్ని సమర్థించింది ఛోగ్యాల్‌కు లొంగిపోక తప్పలేదు

జూన్ ఆఖరుకు ఇందిరాగాంధి మెక్సికో నగరానికి వెళ్ళ వలసి ఉంది ఐక్యరాజ్య సమితి మొట్ట మొదటిసారిగా స్త్రీల గురించి ఏర్పాటు చేస్తున్న సమావేశంలో ఆమె ప్రధాన ప్రసంగం చేయవలసి ఉంది ఒక నెల ముందు ఆమె స్నేహితురాలు పుపల్ జయకర్ న్యూయార్క్‌కు వెళ్ళవలసి ఉంది ఆమె ఇందిరను చూడటానికి వెళ్ళి "మళ్ళీ మిమ్మల్ని మెక్సికోలో చూస్తాను" అంది ఇందిర మెరుపులా నవ్వి "ఇదంతా 12 జూన్ న ఏమి జరుగుతుందో దానిమీద ఆధారపడి ఉంది" అంది "పన్నెండున ఏమి జరగబోతోంది" అని పుపల్ అడిగింది "అలహాబాద్ తీర్పు" అని క్లుప్తంగా జవాబిచ్చింది ఇందిర ఆ కేసులోని చిక్కులు, దానికున్న ప్రాముఖ్యం తెలియక జయకర్ ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు

### అలహాబాద్ తీర్పు

జూన్ 12న అతివేడిగాను, ధూళిభరితంగాను ఉన్న రోజున, ఇందిరకు వరుసగా మూడు పెద్ద దెబ్బలు తగిలాయి మొదటిది, ఆరోజు ఉదయం తనకు ఎన్నో ఏళ్ళుగా ఆంతరంగిక వ్యక్తిగా ఉంటూ వచ్చిన డి పి ధర్ మరణించాడు ఆ తర్వాత గుజరాత్ నుండి వస్తున్న ఎన్నికల ఫలితాలు తమ పార్టీ ఓడిపోతున్నట్టు సూచించాయి రాత్రయ్యేసరికి కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందని స్పష్టమయింది జె పి తొందరతొందరగా కలిపిన నాలుగు ప్రతిపక్ష పార్టీలు గెలుస్తున్నాయి అన్నిటికంటే మించిన దెబ్బ అలహాబాద్ హైకోర్టులో నాలుగేండ్ల క్రితం రాజ్‌నారాయణ్ ఆమెకు వ్యతిరేకంగా పెట్టుకొన్న ఎన్నికల అర్జీపై న్యాయమూర్తి జగ్‌మోహన్ లాల్ సిన్హా ఇచ్చిన తీర్పు

"లంచగొండితనం, ఓటర్లను బెదిరించటం" వంటి తీవ్రమైన నేరారోపణలను సిన్హా కొట్టివేశాడు కాని ప్రధానమంత్రి రెండు చిన్న సాంకేతికపరమైన చట్ట ఉల్లంఘనలు చేసినందుకు ఆమెను "అపరాధి"గా నిర్ణయించాడు ఒకటి, రాయ్ బరేలీలో తనకు ఎలెక్షన్ ఏజెంటుగా పని చేసిన వ్యక్తి తన ప్రభుత్వ పదవినుండి రాజీనామా చెయ్యటంలో కొన్నాళ్ళు జాప్యం చేయటం రెండు, ఆమె నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజనీర్లు వేదిక నిర్మించటం ఏమైనా "అవినీతి చర్యలకు" పాల్పడినందుకు, ఆమెను "అపరాధి"గా భావించి, 1971లో ఆమె ఎన్నిక చెల్లదని, ఎన్నికల ద్వారా పదవిని ఆరేండ్లవరకు ఆమె పొందటానికి వీలులేదని సిన్హా తీర్పునిచ్చాడు బ్రిటిష్ జర్నలిజంలో గొప్ప పేరున్న జేమ్స్‌కామెరాన్ ఈ తీర్పు గురించి వ్యాఖ్యానిస్తూ "తప్పుగా బండి నిలిపినందుకు" ఒక ప్రభుత్వాధిపతిని "శిరచ్ఛేదనకు" పంపినట్లుందని అన్నాడు కాని జె పి ఆయన మిత్రపక్షాలు ఆనందంతో పొంగిపోతూ ఎటువంటి వాదాన్నీ వినే స్థితిలో లేరు ఇందిరా గాంధి చాలా కాలం క్రితమే రాజకీయాధికారాన్ని, నైతిక అధికారాన్ని పోగొట్టుకొందని, ఇప్పుడు చట్టబద్ధమైన అధికారాన్ని కూడా కోల్పోయిందని వాళ్ళు భావించారు అందుకే దేశంలో ఈ మూలనుండి ఆ మూలవరకు "ఇందిర తొలగిపోవలసిందే" నని నినాదాలు చేశారు ఆమె అధికారంలో ఉంటే "భారతదేశంలో ప్రజాప్రభుత్వానికి విరుద్ధమని" జె పి ప్రకటించాడు

కాకపోయినా అలహాబాద్ తీర్పుపై సుప్రీం కోర్టులో అర్జీ పెట్టుకునే వీలుంది చట్టంలో విశేషజ్ఞులు సుప్రీంకోర్టు ఈ తీర్పును వెనక్కి మళ్ళిస్తుందని భావించారు కాని సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు రావటానికి కొన్ని నెలలు పడుతుంది అప్పుడు వేసవి సెలవులలో ఉన్న కోర్టు తిరిగి పని ప్రారంభించాలి అధికారంలో ఉన్న పార్టీ "తగిన ఏర్పాట్లు చేసుకోటానికి" జస్టిస్ సిన్హా 20 రోజులు గడువిచ్చాడు

'సుప్రీంకోర్టులో తన అర్జీ ఉండగా తాను చేయవలసిందేమిటి' అన్నదే ఇందిర ముందున్న అసలు సమస్య సెలవులలో న్యాయమూర్తిగా ఉన్న వి.ఆర్ కృష్ణ అయ్యర్, న్యాయమూర్తి సిన్హా తీర్పు విషయమై "పూర్తిగా నిరపేక్షంగా నిలుపుదల"

కోసం ఆమె పెట్టుకొన్న అర్జీపై ఎటువంటి తీర్పునిస్తాడన్న దానిమీదే పరిష్కారం ఆధారపడి ఉంది ఇందిర వెంటనే రాజీనామా ఇవ్వలేదని నిరాశ చెందిన జె పి, ప్రతిపక్షాల నాయకులు ఆమె వెంటనే తొలగిపోవాలనే తమ ఆందోళనను ముమ్మరం చేశారు నిరసన ప్రదర్శనలు, కవాతులతో పాటు రాష్ట్రపతిభవన్ ఎదురుగా రోజూ ధర్నా చేయసాగారు రాష్ట్రపతి తన అధికారాన్ని వినియోగించి ఆమెను పదవి నుండి తొలగమని నిర్దేశించాలన్నది వీరి కోరిక

ఉద్రిక్తము, అల్లకల్లోలమైన ఈ వాతావరణంలో ఎంతగానో ఎదురు చూసిన తీర్పును న్యాయమూర్తి కృష్ణ అయ్యరు 24 జూన్‌న వినిపించాడు ఇందిరా గాంధి కోరిన పూర్తిగా, నిరపేక్షంగా ఇదివరకటి తీర్పును నిలుపుదల చేయటాన్ని ఆయన తిరస్కరించాడు "షరతులతో కూడిన నిలుపుదల" నిచ్చాడు దీని ప్రకారం ఆమె ప్రధానమంత్రి పదవిలో ఉండవచ్చు పార్లమెంటులో మాట్లాడవచ్చు కాని ఓటు చెయ్యటానికి వీలులేదు ఇది ఆమెను ఇబ్బందిలో పెట్టింది జె పి శిబిరంలో ఆనందం ఉప్పొంగింది ఇందిర ఏవిధంగానూ తన పదవిని "అంటిపెట్టుకొని" ఉండటానికి వీలులేదని వారందరికీ నమ్మకం కుదిరింది

మరుసటిరోజు ఢిల్లీలోని రామలీలా మైదానంలో జరిగిన ఉత్సాహ భరితమైన బహిరంగ సభలో ఇందిరాగాంధీపై రాజీనామాకు ఒత్తిడి తీసుకు రావటానికి దేశవ్యాప్తంగా నాగరిక అవిధేయ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్టు జె పి ప్రకటించాడు సైన్యానికి, పోలీసులకు "చట్టవిరుద్ధమైన" ప్రభుత్వపు ఆజ్ఞలు "పాటించవద్దని" మళ్ళీ విజ్ఞప్తి చేస్తూ తన ఉపన్యాసాన్ని ముగించాడు "దేశద్రోహానికి తన మీద విచారణ" జరపమని ఇందిరాగాంధీపై సవాలు చేశాడు

## అర్ధరాత్రి కిందకు పడగొట్టే ముష్టిఘాతం

ఉప్పొంగుతున్న ప్రతిపక్షాల పథకాల గురించి దేశాయ్ మరింత స్పష్టం చేశాడు "ఆమెను శాశ్వతంగా పడగొట్టాలనుకొంటున్నాం" అని ఇటాలియన్ జర్నలిస్టు అయిన ఓరియానా ఫాలసీకి చెప్పాడు "ఈ మహిళ మా ఉద్యమాన్ని తట్టుకోలేదు. ఆమె ఇంటిచుట్టూ వేలాది మందిమి చేరి ఆమె బయటకు రాకుండా చూస్తాం

రాత్రింబవళ్ళు అక్కడే తిష్ఠ వేస్తాం " ముట్టడిలో ఉన్న ఇందిర తన ఓటమిని ఇష్పుకొనే ఆనందకరమైన దృశ్యాలు ఊహిస్తూ దేశాయి, జె.పి తమ ఇండ్లకు వెళ్ళేసరికి ఇందిర వారిపై ప్రతి ఘాతానికి పధకాన్ని రహస్యంగా తయారు చేసింది అర్ధరాత్రి ఆమె తన ఆయుధాన్ని వదిలింది – ఎమర్జన్సీ ప్రకటింపబడింది అది భారత ప్రజాస్వామ్యాన్ని తాత్కాలికంగా తొలగించింది ఆ సమయంలో ప్రాధమిక హక్కులు పని చేయకుండా చూసింది దిగ్ర్భమ చెందిన విరోధులకు తమను ఏది పడగొట్టిందో అర్ధం కాలేదు

జె పి , దేశాయ్, ఇంకా ఎందరినో నిద్రలేపి తమను నిర్బంధంలోకి తీసుకోటం జరిగిందని చెప్పటమయింది జె పి ని, దేశాయిని అన్ని సౌకర్యాలూ ఉన్న అతిధి గృహాలలో ఉంచారు మిగిలిన వారిని రాజధానిలోనూ, దరిదాపులలోనూ ఉన్న వివిధ కారాగారాలలో నిర్బంధించారు వారిలో కనీసం అరడజను మంది ఆమె పార్టీకి చెందిన ప్రముఖులున్నారు వారిలో చంద్రశేఖర్, మోహన్ ధారియా, రామ్‌ధన్ ఉన్నారు దేశంలో ఇతర ప్రాంతాలలో కూడా పెద్ద ఎత్తున అరెస్టులు జరుగుతున్నాయి దీనికంతటికీ ఎంతో విస్తారంగా పధకం వేయవలసి ఉంది అయినా ఎమర్జన్సీ గురించి ఒక్కమాటయినా పైకి పొక్కక పోవటమన్నది చెప్పుకోదగ్గ విషయం

దీనికి కారణం మొత్తం పని ప్రధానమంత్రి "కుటుంబం" లోనే జరిగింది దీనిలో సంజయ్‌కు ప్రముఖ పాత్ర ఉంది దీనికి వ్యతిరేకిస్తారనుకొన్న వాళ్ళందరినీ మినహాయించటం జరిగింది అలహాబాద్ తీర్పు తర్వాత ఇందిరాగాంధి రాజీనామా ఇవ్వాలనుకొంది తనకు నమ్మకస్తుడైన వ్యక్తిని పదవిలో పెట్టి సుప్రీంకోర్టులో తన కేసు గెలిచిన తర్వాత తిరిగి పదవిలోకి రావాలనుకొంది కాని ఈ ఆలోచన ఎక్కువసేపు నిలవలేదు తాత్కాలికంగా వచ్చే ప్రధానమంత్రి అదేదో సామెత చెప్పినట్లు గూట్లోని కోకిలలా బయటకు వెళ్ళటానికి అంగీకరించకపోవచ్చు అనే అనుమానం తలెత్తింది ఆమెవల్ల పదవులు పొందినవారందరూ ఆమె తాత్కాలికంగానైనా పదవి నుండి తొలగటానికి ఒప్పుకోలేదు. ఈ "పనికిమాలిన మాటలన్నిటికీ" "ఒక రోజయినా తన తల్లి పదవినుండి తొలగటానికి" సంజయ్ ముగింపు పలికాడు

ఆ తర్వాత ఇందిర పదవిలో ఉంటుందా లేక తొలగుతుందా అనే సమస్య జె పి , ప్రతిపక్ష నాయకుల కఠోరమైన అరుపులు, దూషణలకు, ప్రతిరోజూ ప్రధానమంత్రి ఇంటిదగ్గర ఆమెను సమర్థిస్తూ జరిగే ఊరేగింపులకు మధ్య పోటీ కిందకు మారింది. ఇరు పక్షాలలోనూ జన ఉన్మాదం ప్రబలింది ఎమర్జన్సీ ప్రకటన ఒక క్షణంలో వీటన్నిటినీ అంతం చేసింది

జూన్ 25 రాత్రి జరిగిన సంఘటనల విషయానికి వస్తే ఎమర్జన్సీ విధించటంలో సంబంధమున్న కొందరు రాజకీయ నాయకులలో పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి, న్యాయ విషయాలలో ప్రతిభావంతుడు అయిన సిద్ధార్థ శంకర్ రే ఒకరు రాజ్యాంగ విషయాలలో పరిమితమైన పరిజ్ఞానమున్న ఇందిరకు "దేశంలోపల" ఎమర్జెన్సీని విధించమని సలహా ఇచ్చింది ఇతనే 1971 లో బంగ్లాదేశ్ యుద్ధం జరిగినప్పటినుండి "బాహ్య విషయాలలో" ఎమర్జెన్సీ ఉండనే ఉంది ప్రధానమంత్రితో పాటు ఈయన రాష్ట్రపతి.భవన్‌కు వెళ్ళి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్‌ను ఎమర్జెన్సీ ప్రకటించమని అనునయించి చెప్పటమయింది మంత్రి వర్గం తీర్మానం ఆ తర్వాత వస్తుందని చెప్పటంతో అహమ్మద్ పత్రంపై సంతకం పెట్టాడు

ఇంకొక రాజకీయవేత్త సంజయ్ వర్గంలో ఎమర్జెన్సీ గురించి ఆలోచించిన వ్యక్తి ఓమ్ మెహతా గృహమంత్రిత్వ శాఖలో ఈయన చిన్న మంత్రి గృహ వ్యవహారాల మంత్రి బ్రహ్మానందరెడ్డిని ఆరోజే గాక, ఎమర్జన్సీ ఉన్నంతకాలం పక్కకు పెట్టటమయింది సమయం గడచేకొద్దీ ఇదే పద్ధతి ఇతర మంత్రిత్వ శాఖలలో, సంస్థలలో అవలంబించటమయింది

ఎమర్జన్సీ అమలు తర్వాత రే ప్రధాన మంత్రి ఇల్లు వదిలి వెళ్తున్నప్పుడు వార్తా పత్రికల కార్యాలయాలకు విద్యుత్తు సరఫరా ఆగిపోతోందని మరుసటిరోజు హైకోర్టు మూతబడుతుందని ఓమ్ మెహతా చెప్పగా విని అప్రతిభుడయ్యాడు వెంటనే ప్రధాన మంత్రిని కలుసుకోవాలని పట్టు బట్టాడు "అసంబద్ధమైన ఈ భావాలను" మొదట్లోనే తుంచేయమని ఆమెనుకోరాడు. ఆయన మాటల ప్రకారం ఆమె "అప్రతిభురాలయింది " ఆమె లోపలికి వెళ్ళి ఏమిటి విషయమని బహుశా

సంజయ్‌ను అడిగినట్లుంది ఇవతలకి వచ్చి, "సిద్ధార్థా! హైకోర్టు రేపు పని చేస్తుంది" అని చెప్పింది వార్తా పత్రికల కార్యాలయాలకు విద్యుత్ సరఫరా గురించి ఆమె ఏమీ మాట్లాడలేదు.

అప్పుడే సంకేతం లభించినట్లు ఢిల్లీ ఫ్లీట్ స్ట్రీట్ (చాలావరకు వార్తా పత్రికల కార్యాలయాలు ఇక్కడ ఉన్నందున ఈ మారుపేరు వచ్చింది) లోని దీపాలన్నీ అదేక్షణం ఆరిపోయాయి. అయితే విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోవటం ఆ రోజుల్లోనూ, ఇప్పటికీ దేశ రాజధానిలో సామాన్యమయినందున ఎవరూ పట్టించుకోలేదు కాని ఈ విద్యుచ్ఛక్తి ఆగిపోవటం కొనసాగింది ఆరోజు వార్తాపత్రికల ముద్రణ జరగలేదు ఇందిర తన సమ్మెట దెబ్బ కొట్టినపుడు చాలామంది భారతీయులు, జె పి, దేశాయిల వలె గాఢ నిద్రలో ఉన్నారు 26 జూన్ ఉదయం బిబిసి 7 30 గంటలకు చేసిన వార్తా ప్రసారంలో ప్రజలు దీనిగురించి తెలుసుకొన్నారు అర్ధగంట తర్వాత ప్రధానమంత్రి ఆలిండియా రేడియోలో ప్రసంగించారు ఆమె చేసిన క్లుప్తమైన ప్రకటన పాతకాలపు ఇందిర పద్ధతిలోనే ఉంది "రాష్ట్రపతి ఎమర్జెన్సీ ప్రకటించారు ఇందులో భయపడవలసిందేమీ లేదు" అని ఆమె చెప్పింది ఆ తర్వాత వివరించింది "లోతైన విస్తృతమైన కుట్ర ప్రభుత్వం తన విధిని నిర్వహించటానికి, దేశంలో సుస్థిరతకు ప్రమాదకరంగా మారింది కొంతమంది మన సాయుధ దళాలను తిరుగుబాటు చెయ్యమని, మన పోలీసులను ఎదిరించమని రెచ్చగొట్టే వరకు పోయారు "

ఈ రేడియో ప్రసంగానికి ముందు మంత్రి వర్గాన్ని ఎన్నడూ జరగనట్లు ఉదయం ఆరుగంటలకు సమావేశం కావలసిందిగా పిలవటం జరిగింది అక్కడున్న కొద్దిమంది అధికారులలో శారదాప్రసాద్ ఒకరు "నంబరు ఒకటి అక్బర్ రోడ్డులోని గదిలో మంత్రివర్గం ఎమర్జెన్సీకి తమ అంగీకారం తెలిపినపుడు వాతావరణం గడ్డగట్టుకు పోయినట్టుంది రాత్రి చీకటి పగలుగా కరిగిపోయింది" అని అయన జ్ఞాపకం తెచ్చుకొంటాడు జరిగిన పనికి అంగీకారం తెలిపేటట్లు ప్రకటనను మంత్రివర్గం ముందు పెట్టినపుడు కొన్ని నిముషాలలోనే దానిని ధ్రువీకరించటమయింది అప్పుడు రక్షణ మంత్రిగా ఉన్న స్వర్ణసింగ్ మాత్రం

కొన్ని సాంకేతిక పరమైన ప్రశ్నలడిగాడు. ఆ తర్వాత తన సహచరులతో మాట్లాడుతూ "ఈ పోలీసు పద్ధతులు చెల్లవు" అన్నాడు ఆ మాట వెంటనే ప్రధానమంత్రి దాకా వెళ్ళింది కొన్ని నెలల తర్వాత స్వర్ణసింగ్‌ను మంత్రివర్గం నుండి తొలగించటమయింది అందరూ ఆశ్చర్యపోయేటట్టు, చివరకు పదవిని పొందిన వ్యక్తికి కూడా ఆశ్చర్యం కలిగేటట్లు, హర్యానా ముఖ్యమంత్రిగా సంజయ్ మారుతీ పథకానికి ఎంతో సహాయం చేసి అతనికి దగ్గరి స్నేహితునిగా, అతను చేయమన్న పనులు చేసే వ్యక్తిగా ఉంటున్న బన్సీలాల్ రక్షణ మంత్రి అయ్యాడు సంజయ్‌తో కలిసి పనులు సాగించే మరోవ్యక్తి వి సి శుక్లా అయన ప్లానింగ్ మంత్రిగా ఉండేవాడు కాని ఎమర్జెన్సీ వచ్చిన రోజు ఉదయం అతనిని ఇందర్ గుజరాల్ వద్ద ఉన్న సమాచార, ప్రసారణ మంత్రిత్వశాఖ బాధ్యతను స్వీకరించమని చెప్పటమయింది సంజయ్ ఆల్ ఇండియా రేడియో వార్తలను ముందుగా పరిశీలించాలనుకొని నమ్రంగా, మర్యాద పూర్వకంగా వ్యవహరించే గుజరాల్ (భవిష్యత్తులో ప్రధానమంత్రి)తో దుడుకుగా వ్యవహరించాడు శుక్లా ఆంక్షలు కఠినంగా విధించాడు ఆయన ఉత్సాహం చూసి ఆయనను "భారతదేశ గోబెల్స్" అన్నారు సంజయ్ ఆంతరంగిక కూటమిలో పనులు అమలుజరిపే వ్యక్తి ఆర్ కె ధవన్ ప్రధానమంత్రికున్న ఇద్దరు వ్యక్తిగతమైన కార్యదర్శులలో ఇతనొకడు తన పదవికి మించిన ప్రాముఖ్యం అతనికొచ్చింది

ఎమర్జెన్సీ గురించి నేను రెండు విధాల బాధపడ్డాను కోపం ఒకవైపు, దేశ భవిష్యత్తు గురించి చింత మరోవైపు ప్రపంచంలోకెల్లా పెద్ద ప్రజాస్వామ్య ప్రభుత్వంగా ఉన్న భారతదేశం, రాష్ట్రపతి ఇచ్చిన ఒక కలం పోటుతో, మూడవ ప్రపంచంలో కొల్లలుగా ఉన్న పనికిమాలిన నియంతృత్వాలలో ఒకటిగా మారిపోయిందనే బాధ హృదయ విదారకమయింది భావ ప్రకటనకున్న స్వాతంత్ర్యం పోవటంతో నేను కోరుకొన్న వృత్తిలో ఉన్న ఆనందం మటుమాయం కావటం మరింత బాధ కలిగించింది అంతకంటె నన్ను అప్రతిభుణ్ణి చేసిన విషయం ఈ విశాల దేశంలో ఎమర్జెన్సీ విధించినందుకు ఎదిరించటం లేకపోగా ఏ మాత్రం ప్రతిక్రియ కూడా లేకుండా పోయింది

సంవత్సరానికి పైగా భారతదేశంలో యుద్ధ నినాదాలు ప్రతిధ్వనించాయి ఇందిర "ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నందున" ఆమెతో "అంతం వరకు పోరాడి" ఆమెను తొలగించటమవుతుందని అన్నారు వాస్తవానికి ఆమె ఓర్పు నశించిందని మరి కొంచెం ఒత్తిడి తెస్తే ఆమె పదవిని వదలటం ఖాయమని జె పి; దేశాయ్ ఇద్దరూ నమ్మారు కాని నిజంగానే దెబ్బ తగిలి ప్రజాస్వామ్యం ధ్వంసమైందని అనిపించినపుడూ దానికి నిరసనగా ఏ చిన్న శబ్దమూ వినిపించలేదు హఠాత్తుగా వచ్చిన ఎమర్జెన్సీ ఎంత విభ్రాంతి కలిగించిందో ఇదీ అంతే విభ్రాంతి కలిగించింది. ఏదో సామెత చెప్పినట్లు ఒక కుక్క కూడా మొరగలేదు పైగా ఎమర్జెన్సీ ప్రజాదరణ పొందినట్లనిపించింది, కనీసం ప్రారంభదశలో దీనికి నాలుగు కారణాలున్నాయి

మొదటిది, ఇందిర విషయంలో అంత సానుభూతి లేనివారు కూడా, జె పి ఉద్యమం ద్వారా నిత్యజీవితం అల్లకల్లోల మైనందున, ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సంతోషించారు ప్రభుత్వోద్యోగులు సమయానికి కార్యాలయాలకు రావటం, తమ పనిని శ్రద్ధగా చేయటం, చాలా తక్కువగా టీ విరామాలు తీసుకోటం ఆ ఆనందాన్ని బలపరచింది ప్రధానమంత్రి గురించి ప్రచారం చేసేవాళ్ళు దీనికెంతో ప్రాముఖ్య మిచ్చారు వారిలో కొంతమంది మూర్ఖంగా "రైలు బండ్లు సమయానికి నడుస్తున్నాయు" ని గొప్పలు చెప్పుకోసాగారు. ఇటలీలో ముస్సోలినీ ఈ విధంగానే గొప్పలు చెప్పుకొనే వాడని వారికి తెలీదేమో! కొన్ని నెలల తర్వాత పరిస్థితులు మారాయి ఎమర్జెన్సీ వల్ల వచ్చిన కష్టాలు ప్రకటింపబడిన "లాభాల" ను మించి పోయాయి

సంజయ్ ఎంత క్రూరంగా, ఎంత మోటుగా వ్యవహరించినా తన తల్లి సహోద్యోగులు, పార్టీలోని పెద్దలు అతనిపట్ల ఆనందంగా ఎంతో వినయం ప్రదర్శించారు రాష్ట్ర ముఖ్యమంత్రులు తమ రాష్ట్రానికి అతనిని ఆహ్వానించి సన్మానించటానికి పరస్పరం పోటీ పడ్డారు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఉన్నతోద్యోగులు అతను కోరినది చేయటానికి, అతను ఏమి కోరబోతాడో అది చేయటానికి పరస్పరం పోటీ పడసాగారు ఎమర్జెన్సీని సమర్థించిన చాలా వార్తా

పత్రికలు సంజయ్‌ను గొప్పగా చిత్రించటానికి తగిన సహాయం చేయసాగారు "ఉద్భవిస్తున్న పుత్రుని భూమి" గా భారతదేశం మారసాగింది

పొరుగునున్న గేరేజిలో కార్లతో పనిచేయటం ప్రారంభించినప్పటి నుండి చెత్తమూకను, రౌడీలను చేర్చుకోటంలో సంజయ్ తన నేర్పు చూపిస్తూ వచ్చాడు అటువంటి యువకులు అధిక సంఖ్యలో, అతని చుట్టూ చేరారు అతను అధికారంతో అతిశయిస్తున్నప్పుడు అతనిపట్ల తమ విశ్వాసం ప్రకటిస్తూ తమ బలప్రదర్శన చేస్తూ, అతనికి దగ్గరగా ఉన్న విషయాన్ని ఉపయోగించుకొని డబ్బు కూడబెట్టుకొన్నారు అధికార పక్షంలోని యువ విభాగానికి సంజయ్ అధిపతి అయినందున వీరందరూ దానిని తమ చేతిలో పెట్టుకొన్నారు

కొడుకు తనకున్న సమర్థత పెంపొందించుకొంటూ ఉండగా ఇందిర ఎమర్జెన్సీ దేశానికి "ఆర్థిక కార్యాలలో ముందుకు సాగటానికి కొత్త అవకాశమ"ని చెప్పసాగింది ఈ లక్ష్యం కోసం ఆమె ఇరవై-సూత్రాల కార్యక్రమాన్ని ప్రకటించింది ఇందులో ఆమె అందరికీ కొంత ఇచ్చింది. కాని ఇది పెద్దగా ముందుకు సాగలేదు ఎందుకంటే కాంగ్రెస్ అమలు జరపని పాత విధానాలనే కొత్తరూపంలో చూపించటమయింది అయినా వీటిలో రెండు విషయాలు మామూలు స్థితిలో అయితే ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించేవే అవి - వెట్టి చాకిరీ నుండి పనివారిని నెమ్మది నెమ్మదిగా విడుదల చేయటం, గ్రామ ప్రాంతాలలో వడ్డీవ్యాపారుల నుండి అప్పులు తీసుకొన్న అతి పేదవారి ఋణాలు రద్దుచేయటం కాని పరిస్థితులు సాధారణమైనవి కావు చాలామంది దృష్టిలో ఆమె "ఆర్థిక ప్రకటన" ఎమర్జెన్సీ నుండి, ఆ నియంతృత్వం నుండి దృష్టి మళ్ళించే కుట్ర అయింది

ఇందిర ప్రకటించిన ఇరవై సూత్రాలకు సంజయ్ తన ఐదు సూత్రాలు జోడించాడు "కుటుంబాలను ఇద్దరు పిల్లలకు పరిమితం చేయండి, వయోజన విద్య (ప్రతి వ్యక్తీ మరో వ్యక్తికి బోధించాలి), వివాహంలో కట్నం కోరవద్దు, స్వీకరించవద్దు; మురికి వాడల నిర్మూలన, చెట్లు నాటటం" దేశానికి అత్యవసరమైన విషయాలు అతను చెప్పినమాట వాస్తవమే కాని భారతదేశాన్ని

21వ శతాబ్దంలోకి తీసుకెళ్ళటానికి పరిపాలన చెయ్యాలనుకొంటున్న యువకుని వ్యక్తిగతమైన ఆదర్శంగా అది చాలా అల్పంగా కనిపించింది

సంజయ్‌కు చాలా ఇష్టమైన కార్యక్రమం జనాభా నియంత్రణ మురికి వాడల నిర్మూలన, దానితో పాటు నగరాలను "అందంగా తీర్చిదిద్దటం" అన్నది తన తల్లి రాజకీయ పతనానికి ముఖ్యమైన అంశమయింది అతని ప్రోత్సాహంతో వాసెక్టమీ కార్యక్రమాన్ని చాలా దౌర్జన్యంగా అమలు జరపటమయింది యువకులను, అంతగా యువకులు కాని వారిని కూడా బలవంతాన వాళ్ళిండ్ల నుండి లాక్కెళ్లి, బస్సుల్లో తీసుకొని బలవంతాన ఆపరేషన్లు చేయించటమనే మాటలు చాలా వరకు అతిశయోక్తులే ఈ విషయమై ఇందిర తన బాధను వెళ్ళగక్కుతూనే వచ్చింది బలవంతం ఎన్నో విధాల ఉంటుందనే విషయం ఆమె గమనించలేదు. ఢిల్లీలోను, ఉత్తరదేశంలోని రాష్ట్రాలలోను చిన్న అధికారులను, పోలీసులను, మునిసిపల్ ఇన్‌స్పెక్టర్లను, ఉపాధ్యాయులను, డాక్టర్లను, నర్సులను ఒక పరిమితి ప్రకారం వ్యాసెక్టమీకి ప్రజలను "ఒప్పించి" తీసుకొని రాకపోతే వారికి నెలజీతాలు అందవని చెప్పటమయింది ఈ చిన్నరాజులను ఈ విధంగా కోరటం బలపూర్వకంగా పనులు చేయించటానికి ఆహ్వానం కాకపోతే మరేమనుకోవాలి! అతిపేదలు, నిరక్షరాస్యులు వేసెక్టమీ దాడికి గురయ్యారు. 1971 ఎన్నికలలో ఇందిరకు ఓటిచ్చిన హరిజనులు, ముస్లింలు కూడా ఇందులో ఉన్నారు

ఏమయినా ఎమర్జెన్సీ అమలులో ఉన్నందున వార్తాపత్రికలపై ఆంక్షలు ఉన్నందున (ఆ రోజుల్లో ప్రభుత్వ నియంత్రణలో ప్రయోగాత్మకంగా ఉన్న దూర దర్శన్ గాక మరే టెలివిజనూ లేదు) సంజయ్ దీనిని పట్టించుకోలేదు చాలా గౌరవనీయులైన వ్యక్తులు చేసిన ఫిర్యాదులు కూడా వినటానికి అతని తల్లి సిద్ధంగా లేదు. ఎమర్జెన్సీని సడలించి, కొత్తగా ఎన్నికలు జరగాలని ఇందిర నిర్ణయించిన తర్వాతే అణచిపెట్టుకొన్న ప్రజల ఆగ్రహం కట్టలు తెంపుకొంది ఎన్నికల సమయానికి వాసెక్టమీలు, 110, 000 మించిన సంఖ్యలో ప్రజల నిర్బంధాలు,

ఇతర ఎమర్జెన్సీ దౌష్ట్యాలు కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోటానికి కారణాలు కావటంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు

**రాజ్యాంగంలో మార్పులు**

ఎమర్జెన్సీ సమయంలో పార్లమెంటు కేవలం రబ్బరు స్టాంపు అయింది ప్రతిపక్ష నాయకులు, జైళ్ళలో ఉన్నారు జైళ్ళలో లేనివారు ఎంత గొంతెత్తి అరచినా అంక్షలున్న వార్తా పత్రికలలో వాటిని ముద్రించే మార్గం లేదు ఎమర్జెన్సీ ప్రకటనను 60 రోజుల లోపుగా పార్లమెంటు ధ్రువీకరించాలనే రాజ్యాంగ ఆవశ్యకత సులభంగానే తీరింది ఆ తర్వాత వరుసగా రాజ్యాంగ సవరణలు చేయటంలో పార్లమెంటు నిమగ్నమయింది

19 నెలల ఎమర్జెన్సీలో తానేమి చేసినా రాజ్యాంగ పరిధిలోనే చూడాలని ఇందిర అభిలషించింది అయినా నిర్లక్ష్యంగా ఆమె రాజ్యాంగ సవరణ లెన్నో చేసింది ఎమర్జెన్సీ ప్రకటన, ఇతర ఆర్డినెన్సులు న్యాయమూర్తుల పరిశీలనకు లోనుకాకుండా ఉండేటట్లు చూసింది రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్, దానికి సంబంధించిన మరి రెండు చట్టాలు వెనక తారీఖు నుండి సవరించింది దీనితో అలహాబాదు కోర్టు తీర్పును కాదనటం గాక సుప్రీం కోర్టు చేయగలిగిందేమీ లేదు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ల ఎన్నికల తగాదాలు తీర్చే అధికారం సుప్రీం కోర్టుకు లేకుండా చేసింది "పార్లమెంటు నియమించబోయే ఒక సంఘాని"కి ఈ తగాదాలు బదిలీ చేయటమయింది ఇందిరా గాంధీతో విడిపోయిన ఆమె మేనత్తకూతురు నయనతారా సెహగల్ ఆ తర్వాత వ్యాఖ్యానించినట్లు తక్కిన ముగ్గురు ఉన్నత పదవులలో వారిని చేర్చటం "ప్రధానమంత్రి అధికారం అనే విచారకరమైన విషయానికి లలిత సంగీతం జోడించినట్లు" అయింది

రాజ్యసభ మెరుపువేగంతో ఆమోదించిన మరో విభ్రాంతిని కలిగించే సవరణ చేయటానికి వీలు లేకపోవటం మంచిదయింది ఒక వేళ దీనిని రెండవ విషయం, అధికారదర్పంతో జరిగే పాలన రావటం, అది ఎంతకాలం కొనసాగుతుందో

తెలియక పోవటంవల్ల చాలామంది భయభ్రాంతులయ్యారు విచారంగా, కోపంగా వారి భావాలు వ్యక్తిగతంగా వెలిబుచ్చినా, వారు బహిరంగంగా మౌనం వహించారు. ఎమర్జెన్సీ పాలనలోని ఫలితాల గురించి వారు భయపడ్డారు

మూడవ విషయం, విచారకరమైన విషయం జె పి ఉద్యమాన్ని ఎంతగానో సమర్థించిన వారిలో చాలామంది ప్రముఖులు, ఎమర్జెన్సీని సమర్థించటానికి ముందుకు వచ్చారు. దీనిలో బాగా బయట పడింది మఖ్‌బూల్ ఫిదా హుసేన్. భారతదేశంలోని చిత్రకారులలో చాలా ప్రముఖుడు ఆయన చిత్రాలు గొప్ప ధరలు పలుకుతాయి ఇప్పుడు 90 ఏండ్లవాడు కాని ఆసక్తికరమైన వ్యక్తి పొడవైన తెల్లటి గడ్డం. ఎంత ఎండయినా, చలయినా చెప్పులు లేని కాళ్ళు 1975 మార్చిలో జె పి. పార్లమెంటువరకు వచ్చిన నిరసన ప్రదర్శనలో ఇతను ప్రముఖంగా ఉన్నాడు

నాలుగవది, చివరిది అయిన కారణం, చాలా ముఖ్యమైనది ఢిల్లీ టుర్క్‌మాన్ గేటు వద్ద జరిగిన సంఘటన - 42వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా జరిగిన చర్చలో పేరొందిన లాయర్లు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు మొదలైనవారు ప్రదర్శించిన హృదయానందకరమైన నిరసన వంటివి మాత్రమే ఎమర్జన్సీని ప్రతిఘటించే కొన్ని సంఘటనలు - మొరార్జీదేశాయ్ ఆమెను “అవతారమెత్తిన చెడు” గా వర్ణించినా, “ఎమర్జెన్సీ ఎక్కువకాలం ఉండదని సాధ్యమైనంత త్వరలో ముగుస్తుందని” ఇందిర ఇచ్చిన హామీని చాలామంది నమ్మారు “ప్రజాప్రభుత్వం పట్టాలు తప్పిందని, ఆమె దానిని సరయిన మార్గాన పెడుతుందని” ఆమె చెప్పిన మాటను వారు కాదనలేదు

ఎమర్జెన్సీ ప్రకటించగానే హుసేన్ ఒక పెద్ద ట్రిప్‌టిక్ (వరుసగా మూడు బొమ్మల చిత్రం) చిత్రించటానికి వెనుకాడలేదు ఇందులో ఇందిరా గాంధీని దుర్గా దేవిగా, తన శత్రువులైన దుష్టులను ఓడించి గర్వంగా పులిపై స్వారి చేస్తున్నట్లు చిత్రించాడు తను వేసిన చిత్రాలలో ఇది గొప్పదని అనలేము కాని ప్రధానమంత్రి ప్రచారకులు ఈ అవకాశం వినియోగించుకొని ఆమె గొప్పతనం చాటి చెప్పారు మనం భారతీయులం అల్లకల్లోలానికి, అధికారానికి కూడా లొంగిపోతామని ఇది తెలియజేస్తుంది ఎమర్జెన్సీకి లొంగిపోవటమన్నది చాలావరకు

స్తబ్ధంగా ఉండటమేనని నొక్కి చెప్పక తప్పదు ప్రధానమంత్రి మనుషులు ఎంత ప్రయత్నించినా దానికి సక్రియాత్మకమైన బహిరంగమైన సమర్ధన పొందలేక పోయారు

భారతదేశంలో జరిగిన దానికంటె భిన్నంగా అంతర్జాతీయ ప్రతిక్రియ ఇందిర ఎమర్జెన్సీకి కనిపించింది పుపుల్ జయకర్ కొన్ని గంటలు ముందుగా న్యూయార్క్ చేరింది ఆమెకు, ఇందిరకు స్నేహితురాలయిన డోరతీ నార్మన్ ఆమెను నిద్రలేపి జరిగిన విషయాలు ఎంతో ఆందోళనతో తెలియజేసింది ఇతర అమెరికన్ మిత్రులు డోరతికి వరుసగా ఫోను చేసి తమ ఆశ్చర్యాన్ని, భయాన్ని ప్రకటించారు డోరతి వాళ్ళందరితో చేరి బహిరంగంగా ఎమర్జెన్సీ తొలగించమని ఇందిరకు విజ్ఞప్తి చేసింది ఎంతో ప్రయత్నించి జయకర్ ప్రధాన మంత్రితో మాట్లాడ గలిగినపుడు ఆమెను శాంతంగా ఉండమని సలహా ఇవ్వటమయింది త్వరలోనే వివరణ ఆమెకు పంపించటమవుతుందని అప్పుడు ఆమె ఎమర్జెన్సీని విమర్శించేవారికి జవాబు చెప్పగలుగుతుందని హామీ ఇవ్వటం జరిగింది ఆ వివరణ వచ్చింది కాని దాని వల్ల చేకూరిన లాభమేమీ లేదు

స్వదేశానికి వచ్చాక ఢిల్లీ "తీవ్ర కోపంతో, నిర్బంధాల, నిరాహారదీక్షల, జైళ్ళలో చావుల (యధాతథం)" నగరంగా జయకర్‌కు "భయభ్రాంతమైంద"ని "జవహర్‌లాల్ కుమార్తె ఈ విధంగా జరగనివ్వవచ్చా" అని ఆమె ఇందిరను అడిగింది ఆమె (జయకర్)కు "ఏమవుతుందో తెలీదు నాకు వ్యతిరేకంగా జరిగిన కుట్రల గురించి నీకు తెలీదు" అని ఇందిర జవాబిచ్చింది

## సంజయ్‌గాంధి ఆధిక్యము

ఎమర్జెన్సీని తొలగించమని ఇందిరను కోరుతున్నప్పటికీ జయకర్ చాలావరకు దానిని సమర్ధించింది కాని గుర్తించదగ్గ విషయం, సంజయ్ "రాజ్యాంగానికి అతిరిక్త అధికారం"గా వ్యవహరించటం ఆమెకు నచ్చలేదు ఇందిర మరణించిన తర్వాత ఆమె చెప్పినట్లు "బడి విడిచి పెట్టిన" సంజయ్ దేశం తన "కుటుంబ మాన్యం" గా భావించాడని ఆమె నమ్మింది తన స్నేహితురాలి ప్రియమైన కుమారుని గురించి అటువంటి విరుద్ధ భావాలు ప్రకటించటం సరికాదని ఆమెకు

తెలుసు సంజయ్‌ను గురించిన విమర్శను పట్టించుకోవటం మాట అటుంచి వినటం కూడా ఇందిరకు సమ్మతం కాదు ప్రధానమంత్రి ఇంట్లో ఉంటూ సంజయ్ వాణిజ్య సంబంధమైన 'పనులు చేపట్టకూడదని అన్నందుకు పి యన్ హక్సర్ పట్ల ఆమె సుహృద్భావం మాయమయింది కాబట్టి అతివేగంగా, విభ్రాంతి కలిగించేటట్లు పెరుగుతున్న సంజయ్ అధికారాన్ని ఎవరూ ఆపలేకపోయారు ఎమర్జెన్సీ ప్రకటించిన కొద్ది రోజులకే భారతదేశంలో అత్యంత అధికారం గల వారిలో అతను రెండవ వ్యక్తి సమయం వచ్చినపుడు తన తల్లికి వారసుడయ్యే అవకాశం ఉంది కాంగ్రెస్ పార్టీకి ఇది చాలా సహజమైన విషయం

లోక్‌సభ కూడా ఆమోదించి ఉంటే రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నరు పదవులలో ఉన్నవారు తాము "అధికార పరంగానో, వ్యక్తి గతంగానో, ఆ పదవి స్వీకరించేముందో ఆ పదవిలో ఉన్నప్పుడో చేసిన పనికి" క్రిమినల్ లేక సివిల్ న్యాయ విచారణ నుండి మినహాయింపబడేవారు

వచ్చిన రాజ్యాంగ సవరణలన్నింటిలోకి 42వ సవరణ చాలా విషయాలకు సంబంధించింది రాజ్యాంగంలోని 59 ఆర్టికల్స్‌ను ప్రభావితం చేస్తూ, న్యాయ మండలి అధికారాన్ని తగ్గించి పార్లమెంటు ఆధిక్యాన్ని, వాస్తవంగా ప్రధానమంత్రి ఆధిక్యాన్ని, ఎక్కువ చేయటానికి అతి జాగ్రత్తగా తయారు చేయబడింది అది పార్లమెంటు గడువును ఐదేండ్లనుండి ఆరేండ్లకు హెచ్చించింది ఇది కేవలం ఔపచారికమే ఎందుకంటే ఎమర్జెన్సీ చట్టంలో 1975 శీతాకాలం సమావేశంలో అప్పటికున్న లోక్‌సభ గడువు మరో సంవత్సరం పొడిగించటమయింది

అక్టోబరు ఆఖరున 1976లో నలభై రెండవ సవరణ చట్టం కాగానే, 5 నవంబరును లోక్‌సభ గడువు ఇంకొక సంవత్సరం పెరిగింది ఎన్నికలు 1978 వరకు వాయిదా వేయటమయింది రెండవసారి గడువు పొడిగించిన 83 రోజులకే ఇందిర హఠాత్తుగా అందరూ ఆశ్చర్యపోయేటట్లు ఎన్నికలు ప్రకటించింది ఎన్నికలు జరపాలని ఆమె డిసెంబరు 1976 ముగియకముందే అనుకొన్నదని నాకు విశ్వసనీయమైన అధికార వర్గం ద్వారా తెలిసింది దేశానికి "కొత్త సంవత్సరం కానుక" గా 1977 లో జనవరి ఒకటోతారీఖున ప్రకటించవలసిందిగా ఆమెకు

సలహా ఇవ్వటమయింది కాని వాస్తవంగా ఈ ప్రకటన 18 జనవరి నాడు జరిగింది అది చాలా శుభమైన దినమని భావించారు అప్పటి చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ టి స్వామినాధన్‌ను కొత్త సంవత్సరంనాడే పిలిచి ఎన్నికల తయారీ ప్రారంభించమని చెప్పటానికి పి యన్ ధర్ ఆమె అనుమతిని పొందాడు

ఆగస్టు నుండి డిసెంబరు 1976 వరకు ఇందిరా గాంధి మనసులోని ఆలోచనలు చాలా సంక్లిష్టంగా ఉన్నాయి ఆమె రెండు భిన్నమైన లక్ష్యాలకై ప్రయత్నిస్తున్నట్టు కనిపించింది బహిరంగంగా సంజయ్‌కు పూర్తి సమర్ధన నివ్వటం, వ్యక్తిగతంగా ఎమర్జెన్సీని తొలగించటం గురించి, ఎన్నికల గురించి నిర్ణయిస్తున్నప్పుడు ఆ విషయాలలో అతనిని దూరంగా ఉంచడం జరిగింది నవంబరు ప్రారంభంలో లోక్‌సభ గడువు పొడిగించటంలో అర్ధముంది నవంబరు ఆఖరున గౌహతిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో సంజయ్‌కు వాస్తవంగా యువరాజు పట్టాభిషేకం జరిగింది అతను, అతని యువకాంగ్రెస్ అసలు కాంగ్రెస్‌ను మించిపోయారు "అతను కాంగ్రెస్ అధ్యక్షుని దుస్తులతో వెళ్ళిపోయాడు" అని అనుకోటమయింది "మా ఉరుమును సంగ్రహించారు" అని ఇందిరాగాంధి ప్రకటించింది అయినా ఆమె త్వరగా ఎన్నికలు జరగాలని కోరింది దీనికి సంజయ్ పూర్తిగా, ఏ మాత్రం రాజీపడని రీతిగా వ్యతిరేకించాడు

నిజంగా ఆలోచిస్తే నలభైరెండవ సవరణ జరగాలని ఆమె ఇచ్చిన సంకేతం ఒక విధంగా సంజయ్ సవాలుకు, అతని చుట్టూ ఉన్న అహితమైన బన్సీలాల్ వంటి వ్యక్తులు పార్లమెంటును రాజ్యాంగ సభగా మార్చి "పేదలు, దీనుల" కోసం కొత్త రాజ్యాంగం ఏర్పరచాలని చేసే ప్రయత్నాలకు జవాబనుకోవచ్చు. రాజ్యాంగం మార్చటం గురించి గొప్పగా మాట్లాడినా అసలు సంగతి మాత్రం సాధ్యమైనంతకాలం ఎమర్జెన్సీని పొడిగించటమే ఎమర్జెన్సీకి ముందు పార్లమెంటరీ విధానం నుండి, అధ్యక్షతరహా పాలన విధానానికి మారాలనే విషయం చర్చలో ఉంది గొప్ప పేరున్న సివిల్ ఉద్యోగి, రాయబారి, ఇందిర బంధువు అయిన బి కె నెహ్రూ అప్పుడు బ్రిటిష్ హైకమిషనర్ గా ఉన్నాడు ఆయనవంటి మేధావులు కూడా ఈ అంశాన్ని సమర్ధించారు బన్సీలాల్ బి కె నెహ్రూతో "అక్కగారిని (ఇందిరా గాంధి) జీవితకాలం ప్రెసిడెంటుగా చేయండి ఆ తర్వాత

అన్ని సమస్యలూ తీరిపోతాయి" అని అసలు సంగతి బయటపెట్టాడు ఈ ఆలోచన బన్సీలాల్ ఆ తర్వాత పి.యన్ ధర్‌తోనూ పంచుకొన్నాడు

అటువంటి మాటలు నిరాటంకంగా సాగుతున్నప్పుడు రాజ్యాంగసభ ఏర్పడటం తధ్యమని అందరూ అనుకొన్నారు రాజ్యాంగసభను ఏర్పాటు చెయ్యమని కాంగ్రెస్ ఆధిపత్యంలో ఉన్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్ర అసెంబ్లీలు ఒకదాని తర్వాత మరియొకటిగా తీర్మానాలు చేశాయి ఇందిరకు తెలియజెయ్యకుండానే ఈ పని జరిగింది ఆమె ఆందోళన చెందింది ఆమెకు కోపమూ వచ్చింది ఈ ఆలోచన చాలా ప్రమాదకరమైందని మరెన్నో ఇక్కట్లకు దారితీస్తుందని ఆమెకు తెలుసు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఒక్కటే కాంగ్రెస్‌కు చెందకపోయినా ఎమర్జెన్సీని సమర్థించింది ఆ పార్టీ జనరల్ సెక్రటరీ సి.రాజేశ్వరరావు "ఆత్మహత్యా సదృశమైన ఈ ప్రతిపాదన" ను తిరస్కరించమని ఇందిరకు ఉత్తరం వ్రాశాడు

ఇందిర ఆవిధంగానే చేసింది. స్వరణ్‌సింగ్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా నలభైరెండవ సవరణను పార్లమెంటులో ప్రవేశపెట్టవలసిందిగా ఆమె నిర్దేశించింది కొత్త రాజ్యాంగ సభ కావాలంటున్నవారు, దేవ్‌కాంత్ బరువా (సిగ్గు చెందవలసిన నినాదం "ఇందిరే ఇండియా, ఇండియానే ఇందిర" సృష్టించిన వ్యక్తి) తో సహా స్వరణ్‌సింగ్ కమిటీ సిఫారసులు "సరిపోవు" అన్నారు

బి.కె. నెహ్రూ భార్య, ఫోరీ నెహ్రూ, తన భర్త కంటె ఎక్కువగా మనసులోని మాట బయటకు చెప్పే మనిషి, ఈ సమయంలో ఆమె ఇందిరా గాంధీని కలిసింది. పరిస్థితులు చేయి దాటిపోతాయేమోనని "వ్యాకులం" చెందుతున్నట్టు, "నిస్సహాయంగా" ఉన్నట్టు ఆమె గమనించింది ఇందిర బిడ్డ కృష్ణమూర్తితో ముఖాముఖీ చర్చించిన విషయాల వివరాలు పుపుల్ జయకర్ ఇచ్చింది. చర్చలలో "తన బాధాకరమైన సందిగ్ధావస్థల" ను సరిదిద్దుకొనే "తెలివితేటలు" ఆమెకున్నాయని ఆయన చెప్పాడు

ఆమె గూఢచార ఏజెన్సీలు ఆమె ఎన్నికలలో గెలుస్తుందని, అందు మూలంగా ఎమర్జెన్సీ "చట్టబద్ధమవుతుంద"ని సమ్మతింపజేసినందున, ఆమెకు నమ్మకం

కుదిరినందున కొత్తగా ఎన్నికలు జరిపేందుకు ఆమె సిద్ధపడిందని అప్పుడు వాదించినవారు, ఇప్పుడూ, అదే నమ్మేవారు ఉన్నారు నా మటుకు ఇది ఆధార రహితమనిపిస్తుంది ఇందిర గూఢచార ఏజెన్సీలు చెప్పినవన్నీ నమ్మే మనిషి కాదు జె పి ఉద్యమం పరాకాష్ఠలో ఉన్నప్పుడు ఒకసారి ఫీల్డ్-మార్షల్ సామ్ మానెక్‌షా ఆమెను కలువడానికి వెళ్ళాడు అప్పుడు "అత్యంత రహస్యమని" ఉన్న ఇంటిలిజెన్స్ బ్యూరో రిపోర్టు మానెక్‌షా జె పి తో కలిసి ఆమెకు వ్యతిరేకంగా "కుట్ర చేస్తున్న"ట్లు ఉన్నది అతనికి చూపించింది "ప్రధానమంత్రిగారూ, మీరు దీనిని నమ్ముతారా?" అని ఫీల్డ్ మార్షల్ అడిగాడు. "సామ్, నేను దీనిని నమ్మితే నీకు చూపించేదానినా?" అని ఆమె జవాబిచ్చింది

ఎన్నికలలో గెలుస్తానని ఇందిర ఒకవేళ భావించినా (అప్పుడు ప్రతివ్యక్తీ మరో విధంగా తలిచాడు) రెండు అనుకోని అదరగొట్టే సంఘటనలు ఆ నమ్మకాన్ని చెల్లా చెదరుచేసి ఉండాలి సాధారణంగా పరస్పరం తగవులాడే నాలుగు ప్రతిపక్షాలను - మొరార్జీ కాంగ్రెస్ (ఓ), జనసంఘ్ మతాధారమైన పార్టీ, సోషియలిస్టులు, భారతీయ లోక్‌దళ్, చరణ్‌సింగ్ ఆధిపత్యంలో ఉన్న రైతుల పార్టీ - ఒకటిగా జనతాపార్టీగా ఏర్పరచటం జె పి చేసిన అద్భుతం విభజింపబడిన ప్రతిపక్షాల ఓటుపొందే అవకాశం కాంగ్రెస్‌కు లేకుండా పోయింది 'ఇందిరను తొలగించండి' అనే వారి ప్రియ నినాదానికి ఎమర్జెన్సీ అర్థం కలిగించింది ఆరేండ్ల క్రితం ఇదే నినాదం తిప్పి కొట్టింది

రెండవ సంఘటన ఇందిరకు మరింత విభ్రాంతి కలిగించింది హరిజనులకు అతి ముఖ్యమైన నాయకుడు, ఎన్నో ఏండ్లుగా మంత్రి పదవిని చేపట్టినవాడు, ఎంతగానో అనుభవమున్న రాజకీయవేత్త జగజ్జీవన్ రామ్ 2 ఫిబ్రవరి 1977న కాంగ్రెసుకు రాజీనామా ఇచ్చాడు జగజ్జీవనరామ్ కొత్తగా ఏర్పరచిన కాంగ్రెస్ ఫర్ డెమొక్రసీలో ఇతర కాంగ్రెస్ నాయకులు, ఉత్తరప్రదేశ్ నుండి ఎచ్ ఎన్ బహుగుణ, ఒరిస్సా నుండి నందిని సత్పధి వెంటనే చేరిపోయారు ఎమర్జెన్సీ కాలంలో వీరి పట్ల ఎంతో అమర్యాదగా ప్రవర్తించటమయింది. ఇంతకంటె తొందరగా ఈ పార్టీ (సి యఫ్ డి ) జనతా మైత్రి ఏర్పరచుకొన్నారు

ఇది సరిపోదన్నట్టు, ఇందిర తన ఎన్నికల ప్రచారంలో చాలా తక్కువ మంది ఉన్నట్టు గమనించింది తనకూ, ప్రజలకూ మధ్య ఆ అనుబంధం కన్పించలేదు ఆ ప్రచారాన్ని గురించి వ్రాసిన నేను 1975-76లో జరిగిన వాసెక్టమీలు, బ్రిటిష్ పాలనకు "1857 లో కొవ్వు పూసిన తూటాలు" చేసిన పని చేశాయని నేను కనుక్కొన్నట్లు ఆమె కూడా గుర్తించి ఉండవచ్చు

ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో జరిగిన అత్యంత అసహ్యకరమైన సంఘటన అయిన ఎమర్జెన్సీని ఇందిర తొలగించటానికి అసలు కారణమేమిటి? తన హత్యకు రెండు నెలల ముందు చెప్పినట్లు, ఇదివరకు ఎన్నో సార్లు చెప్పినట్లు, అవసరమైతే "ఎన్నికలు, అధికారం పోగొట్టుకోటానికి" తాను సిద్ధంగా ఉన్నట్లు "ప్రజాస్వామ్యాన్ని వెనక్కు తీసుకు రావాలని" తాను ప్రయత్నించినట్లు తెలుస్తుంది అప్పుడూ చాలామంది ఆమె మాటలు నమ్మలేదు ఇప్పుడూ బహుశా నమ్మకపోవచ్చు ప్రముఖ సోషియలిస్టు నాయకుడు మధులిమాయె ఎమర్జెన్సీని, ఇందిరను వ్యతిరేకించిన వ్యక్తి, ఆ 19 నెలలు జైల్లో ఉన్న వాడు 1987లో వ్రాసిన దానికంటె ఎక్కువగా ఆమె మాటల్లోని సత్యాన్ని ఎవరు ధ్రువీకరించగలరు

అతని కథనం ప్రకారం 1977లో ఎన్నికలు జరిపించటానికి ఇందిర చెప్పిన కారణాలు " ఆమె లోపలి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి తప్పుగా వాదించటం, తనని తాను సమర్థించుకోటం అన్నీ ఉన్నాయి అన్నిటికీ మించి ప్రజామోదం పొందిన ప్రజాస్వామ్యానికి ఉన్న గొప్పతనంలో ఆమెకున్న విశ్వాసం చెప్పుకోదగ్గ విషయం చట్టబద్ధం కావటం విషయమై ఆమె ఆరాటం ఇందిరాగాంధి తాను జవహర్‌లాల్ కుమార్తెనని, మనలాగా మహాత్మాగాంధి నడిపిన స్వాతంత్ర్యోద్యమం బిడ్డ అని ఎన్నడూ మరచి పోలేదు "

## ఎమర్జెన్సీ దూరానుగత చిత్రణ

ఇందిరాగాంధి జీవిత చరిత్రను నేనింతకు ముందు వ్రాసినప్పుడు ఎమర్జెన్సీ "విపత్తుతో నిండిన గొప్ప పొరపాటు, వాస్తవానికి ఆమె చేసిన గొప్ప పాపం"

అని వ్రాశాను. ఈ తీర్పును నేను చాలా ఏండ్లు సమర్థించాను. ఎందుకంటే ఎమర్జెన్సీ పాలనలో జరిగిన దురాగతాల విచార జ్ఞాపకాలు అప్పటికి ఇంకా తాజాగానే ఉన్నాయి అంతేగాక ఎమర్జెన్సీ సమయంలో మొత్తం వ్యవస్థలోకి జొప్పించిన విషాన్ని రాజకీయాల నుండి తొలగించటానికి చాలా కాలం పట్టింది కాలం గడిచే కొద్దీ గడచిన సంఘటనలను సరయిన దృష్టితో చూడటానికి వీలయింది కొన్నేళ్ళ క్రితం ఇంత శాంతంగా చూడటం సాధ్యం కాలేదు

అయితే అన్యాయంగా, భయంకరంగా ప్రజలమీద రుద్దిన బాధలు క్షమించినట్లు అనుకోకూడదు అయితే వాటిని క్రమక్రమంగా మరచిపోవటం జరుగుతోంది నిజానికి 1975 తర్వాత పుట్టినవారికి, భారతీయులలో సగం జనాభాకు ఎమర్జెన్సీ గురించి ఏమీ తెలియదు దానిని వారు పట్టించుకోరు ఏమైనా ప్రజల భావంలోని మార్పు స్పష్టంగా కనిపిస్తుంది ఉత్తుత్తి మాటలు చెప్పేవారు ఇందిరాగాంధిని అసహ్యించుకొనేవారు జన సమూహాలు ఆరాధించేవి ఈ ఇరువది మధ్య ఉన్న దూరం కూడా దగ్గరవుతోంది ఒకవేళ ఇందిర పాపం చేసినా, ఆమెకు ప్రతికూలంగా ఎన్నో పాపాలు జరిగాయని ఇదివరకు లేనంతగా చాలా మంది భారతీయులు నమ్ముతున్నారు

ఆంద్రెబెటైల్, దేశంలోని గొప్ప సమాజ శాస్త్రవేత్త, మార్చి 2000లో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఈ విధంగా వ్రాశాడు "భారతదేశంలో చాలా మంది మేధావుల దృష్టిలో ఎమర్జెన్సీకి ఇందిరాగాంధి ప్రతినాయకురాలయితే జె పి నాయకుడు '' అయితే అతడు ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు "సంపూర్ణవిప్లవం" పేరిట జె పి సృష్టించిన "కల్లోల స్థితి" ప్రధాన మంత్రిచే ముఖ్యంగా ఆమె కొడుకు సంజయ్ ద్వారా "అధికార దుర్వినియోగం" "ఒకే నాణేనికి రెండు పక్షాలు" అని అతను అనునయించి చెప్పాడు

*ఇన్ ది నేమ్ ఆఫ్ డెమొక్రసీ · జె పి మూవ్‌మెంట్ అండ్ ది ఎమర్జెన్సీ* (ప్రజాస్వామ్యం పేరిట జె పి. ఉద్యమం మరియు ఎమర్జెన్సీ) అనే తన పుస్తకంలో ప్రముఖ చరిత్రకారుడు బిపన్ చంద్ర 19 నెలల భయంకర స్వప్నానికి కేవలం ఇందిరను గాని, జె పి.ని గాని నిందించటం తప్పని చెప్పటానికి చాలా

శ్రమపడ్డాడు. ఇద్దరి తప్పూ సరిసమానంగా ఉంది. ఎమర్జెన్సీ విధించక ముందు, అలహాబాదు తీర్పుకు ముందు (ఇందిర దీనిని "నా తీర్పు" అంటూ ఉండేది) జె పి. ఉద్యమంలోని వివిధ స్థాయిలను లెక్కించకపోయినా, వీరిరువురి మధ్య తీవ్రమైన పోరాటం లేకుండా చూడటానికి ఏదో ఒక మార్గముండేది. నిర్ధారిత సమయమైన మార్చి 1976కు ముందే జె పి ఎన్నికలు కోరి ఉండవచ్చు లేదా ఇందిర త్వరగా ఎన్నికలు జరగటానికి ప్రయత్నించి ఉండవచ్చు దురదృష్టవశాత్తు వారాపని చేయలేదు అయినా నిర్బంధంలో ఉన్న జె పి తో ప్రత్యక్షంగానో, మధ్యవర్తుల ద్వారా పరోక్షంగానో పి యన్ ధర్ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాడు

భారత దృశ్యాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించిన గ్రాన్‌వీల్ ఆస్టిన్ తన పుస్తకం "*వర్కింగ్ ఎ డెమొక్రాటిక్ కాన్‌స్టిట్యూషన్ - ది ఇండియన్ ఎక్స్‌పీరియన్స్*" (ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని అమలు పరచటం . భారతదేశ అనుభవం) లో ఈ విధంగా వాదించాడు ఎమర్జన్సీ "పూర్తిగా సమర్థన లేనిది కాదు ప్రతిపక్షాల వైఫల్యం పొంగి పొరలింది ఇరు పక్షాల ప్రవర్తన కలిసి ప్రజాస్వామ్యం తెగే వరకు లాగాయి "

"ఏమయినా ఎమర్జెన్సీ లక్ష్యం పైకి చెప్పినది కాదు ఒక వ్యక్తి రాజకీయ పదవిని రక్షించటానికి దానిని ప్రకటించటమయింది " వ్యక్తిగతంగాని క్లిష్ట పరిస్థితులు, రైల్వే సమ్మె, నవ్ నిర్మాణ్ ఆందోళన వంటివి, ఎంత తీవ్రంగా ఉన్నా ఇందిరకు చట్టబద్ధంగా తగిన అధికారాలున్నాయి మొదటి దానిని ఆమె అణచివేసింది రెండోదానిని శాంతింపజేసింది అలహాబాద్ తీర్పు తర్వాత, తాత్కాలికంగా నైనా తాను పదవీ విరమణ చేయకూడదనుకొన్నప్పుడు ఆమె ప్రతిపక్ష నాయకులను నిర్బంధంలో ఉంచి, పత్రికలను నోరెత్తకుండా చేయవలసి వచ్చింది లేకపోతే అప్పుడున్న వాతావరణంలో జె పి. తీవ్రంగా తలపడటం, ప్రముఖ పత్రికలు ఆమె రక్తం కోసం పొలి కేకలు పెడుతున్న సమయంలో, ఆమె అనుకొన్నది సాధించలేకపోయేది అందుకే ఇందిర చేసిన గొప్ప పొరపాటు ఎమర్జెన్సీ విధించటం కాదు, అదే సమయంలో అన్నింటికీ ఆంక్షలు విధించటమనే

భావంలో అర్థం లేదనిపిస్తుంది ఖుష్వంత్‌సింగ్ ఎమర్జెన్సీని తొలగించకపోయినా సెన్సార్‌షిప్ తొలగించమన్నప్పుడు "సెన్సార్‌షిప్ లేకుండా ఎమర్జెన్సీ ఉండదు" అని ఆమె కటువుగా జవాబిచ్చింది.

అస్టిన్ ఎంతో ఆలోచనతో చెప్పిన మరో విషయం గుర్తించదగింది "ఎమర్జెన్సీ ఎంత అసహ్యాకరమైనదైనా 1976 లో న్యూఢిల్లీ అడోల్ఫ్ హిట్లరు పాలనలోని బెర్లిన్ మాత్రం కాదు " దీనికి "స్టాలిన్ పాలనలోని మాస్కో, మావో పాలనలోని బెయిజింగ్, పినోషెట్ పాలనలోని శాంటియాగో లేక జియా –ఉల్– హక్ పాలనలో ఇస్లామాబాదు కాదు" అని జోడించవచ్చు ప్రముఖ రచయిత డామ్ మొరాయిస్ ఇందిర జీవితగాథను వ్రాశాడు. అతను కూడా ఎమర్జెన్సీని సమర్థించలేదు అయినా అతను ఈ విధంగా వ్రాశాడు "(ఇందిర) విరోధులు మాయమయ్యారు వారి మాటలు వినిపించలేదు. ఇతర దేశాలలో జరిగినట్లు ఒక కందకంలోనో, నేలమాళిగలోనో వారిని చప్పుడు కాకుండా చంపలేదన్న విషయం 1975 నాటి ఎమర్జెన్సీ గురించి కొంత తెలియజేస్తుంది "

పౌరుల జీవితానికి, స్వేచ్ఛకు సంబంధించిన హక్కులు కూడా చెల్లకుండా చేసిన ఆ భయంకరమైన ఉపనాటకానికి కేవలం ఇందిరే బాధ్యురాలు అనే ప్రశ్నకూడా ప్రాముఖ్యమైనదే ప్రజాస్వామ్యాన్ని బలపరచే సంస్థలకు అధిపతులుగా ఉన్నవారు నిందార్హులు కారా? క్లిష్ట పరిస్థితిలో అత్యున్నతమైన న్యాయసభ ఎంత దిగజారుతుందో ప్రసిద్ధ న్యాయవాది ఫాలినారిమన్ జూన్ 2005న ఎమర్జెన్సీ వచ్చి ముప్పయ్యేళ్ళయిన సందర్భంలో తెలియ జేశాడు. ఎమర్జెన్సీ వచ్చిన కొన్ని రోజులకే భారతదేశపు ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సహోద్యోగులు "పౌరుల స్వేచ్ఛకున్న ప్రాముఖ్యాన్ని" గురించి 180 డిగ్రీలకు తమ సిద్ధాంతాన్ని మార్చుకొన్నారు ఇక పత్రికల విషయానికి వస్తే మొరార్జీదేశాయి ప్రభుత్వంలో సమాచార మంత్రిగా ఉన్న యల్ కె అద్వాని చెప్పిన మాటలను మించి చెప్పటం కష్టం కొందరు జర్నలిస్టులతో "మిమ్మల్ని వంగమని అడిగితే మీరు నేలమీద పాకారు" అని అన్నాడు

మరో రెండు విషయాలు సందర్భోచితమే ఇందిరను ఓడించిన జనతా కూడా రాజ్యాంగాన్ని లక్ష్య పెట్టలేదు ఎమర్జెన్సీని ప్రకటించకుండానే ప్రజాస్వామ్య ప్రమాణాలను వికృత పరచింది ఆమె మీద, ఆమె కొడుకు సంజయ్‌మీద, వారితో చేరిన ఇతరులమీద వారి ప్రతీకారం ఎమర్జెన్సీ మితిమీరిన ధోరణికి ఏమాత్రం తీసిపోదు ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల కింద, అటల్ బిహారి వాజ్‌పాయ్‌తో సహా, పరిస్థితి ఏ మాత్రం మెరుగవలేదు

రెండో విషయం, ఎంతో ముఖ్యమైనది ఏమిటంటే, భారతదేశాన్ని పరిపాలించాలంటే ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిపాలించాలిగాని మరే విధంగానూ కాదు అని ఎమర్జెన్సీ ఋజువు చేసింది మరో విధంగా చెప్పాలంటే మరోసారి ఎమర్జెన్సీ రావటానికి వీలులేదని భారతదేశం స్పష్టం చేసింది

ఈ నేపథ్యంలో ఇందిర ఏ మాత్రం ఒత్తిడి లేకుండా, తనంతట తానుగా ఎన్నికలు ప్రకటించి తన పేరు తాను దక్కించుకొంది అనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు ఎన్నికలలో ఓడిపోయినప్పుడు తన అధికారాన్ని హుందాగా విడిచి పెట్టటంకూడా చెప్పుకోదగ్గ విషయమే అయినా ఎమర్జెన్సీ ఆమె పుస్తకంలో ఒక కళంకంగా మిగిలి పోతుంది ఆమె దేశానికి ఎంతో ప్రతిభావంతంగా అసమానంగా దీర్ఘకాలం చేసిన విశిష్టమైన సేవను ఇది మరుగుపరచలేదు

## 9

# ఇందిర నిష్క్రమణ, జనతా ప్రవేశం



ఇందిరాగాంధి 1977 ఎన్నికలలో ఓడిపోతుందన్న విషయం నిశ్చయమయినప్పటికీ, ఎన్నికల ఫలితాలు విభ్రాంతి పరిచాయి లోక్‌సభలోని 542 సీట్లలో జనతా దాని మిత్ర పక్షాలు 330 సీట్లు గెలిచాయి జనతా/సి యఫ్.డి కలిసి 298 సీట్లు గెలిచాయి ఇది అనుకూలమైన మెజారిటీ కాంగ్రెస్ సీట్లు 154కు దిగజారాయి నాయకులందరూ ఓడిపోయారు 1971లో దీని భాగం ఓట్లు 43 6 శాతం కాగా ఇప్పుడది 34 5 అయింది ఇందిర పాత శత్రువు రాజ్ నారాయణ్ ఆమెను పెద్ద మెజారిటీతో ఓడించటం మనసును వికలం చేసే విషయం సంజయ్ ఎవరో అనామకుడైన ఒక వ్యక్తి చేతిలో ఓడిపోయాడు వారి ఓటమి ఎంత ఆశ్చర్యకరంగా ఉందో, ఓటు చేసే పద్ధతి, భౌగోళికంగా విభజన కూడా అంతే ఆశ్చర్యకరంగా ఉంది ఉత్తర ప్రాంతంలోని రాష్ట్రాలలో పూర్తిగా కాంగ్రెసును తొలగించి జనతా గెలిచింది కాని దక్షిణ ప్రాంతంలో జనతా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది ఇక్కడ కాంగ్రెస్ సమర్ధన బాగుంది వాస్తవానికి కాంగ్రెస్ గెలుచుకొన్న 154 సీట్లలో 92 నాలుగు దక్షిణరాష్ట్రాలవి హిందీ ప్రాంతమైన ఉత్తర రాష్ట్రాలలో గెలుచుకొన్నది రెండే రెండు సీట్లు

ఎమర్జెన్సీ ఎంత కఠినంగా ఈ రెండు ప్రాంతాలలో అమలు జరిగిందో ఓటింగ్ పద్ధతి తెలియజేస్తుంది దక్షిణ రాష్ట్రాలు, కొంతవరకు పశ్చిమాన ఉన్న మహారాష్ట్రకూడా నిరంకుశమైన నిర్బంధాలకు, బలవంతపు వేసక్టమీలకు ఉత్తర ప్రాంతం గురయినంతగా గురికాలేదు ఎన్నికల ఫలితాలు వచ్చిన రాత్రి, ఆరేళ్ళక్రితం ఆమె విజయం పట్ల చూపిన ఉత్సాహం ప్రజలు ఇందిర ఓటమి పట్ల చూపించటం ఒక విధంగా వక్రోక్తి అనిపించింది అది చాలా చలిరాత్రి

అయినా ఆ రోజు అర్ధరాత్రి ది టైమ్స్ ఆఫ్ ఇండియాలోని నా ఆఫీసు వదలి వెళ్తున్నప్పుడు గుంపులు గుంపులుగా జనం కాంగ్రెస్ ప్రతి ఓటమికీ ఆనందం వెలిబుచ్చటం కనిపించింది "ఫ్లీట్‌స్ట్రీట్"లో వెలుగుతున్న బోర్డులపై ఇందిర ఓటమి కనిపించినపుడు, జన సమూహాలు ఆనందంతో నాట్యం చేయసాగాయి వాళ్ళలో కొందరు బ్యాంకుల జాతీయీకరణప్పుడు కూడా నాట్యం చేసి ఉండవచ్చు

ప్రధానమంత్రి ఇంట్లో దృశ్యం విచారకరంగా ఉంది జనతా ఆనందోత్సాహాలకు కేంద్రం జగజ్జీవన్‌రామ్ నివాసం అది మంత్రిగారి బంగళా రాజీనామా ఇచ్చిన తర్వాత కూడా ఆరునెలలు అక్కడ ఉండవచ్చు ఇందిర చిన్న కొడుకు సంజయ్, అతని భార్య మేనక ఇంకా అతని నియోజకవర్గం నుండి తిరిగి రాలేదు ఆమె పెద్ద కొడుకు రాజీవ్, ఇటలీలో పుట్టిన అతని భార్య సోనియా, అప్పుడు రాజకీయాలనుండి పూర్తిగా దూరంగా ఉన్నా భోజనం అసలు సహించలేదు ఇందిర పూర్తిగా భోజనం చేసింది రెండు రోజులకు చివరి ఫలితం కూడా వచ్చిన తర్వాత ఆమె రాజీనామా ఇచ్చింది ఈ ఆలస్యం వల్ల భయంకరమైన అపవాదులు ప్రబలాయి రాజీనామా చేయకుండా ఆమె సైన్యాన్ని కూడా రాజకీయాలలోకి దింపటానికి కుట్ర చేస్తోందని అనుకొన్నారు ఆ అపవాదులు ఎంత అసహ్యంగా ఉన్నాయో అంతగా ఆధారరహితాలు కాని అవి వదలకుండా ప్రబలటం ఎన్నికలలో ఎంతో విజయం సాధించినవారు ఆమెను ఎంత నమ్మలేకుండా ఉన్నారో తెలియజేస్తుంది మార్చి 23న ఇందిరాగాంధి రాష్ట్రపతి భవన్‌కు తన రాజీనామా నివ్వటానికి వెళ్ళింది అప్పుడు బి డి జట్టి రాష్ట్రపతి విధులు నిర్వహిస్తున్నారు రాష్ట్రపతి అహమ్మద్ కొన్ని నెలల క్రితమే మరణించాడు జట్టి భార్య ఇందిరను చూచి ఆపుకోలేనంతగా వెక్కి వెక్కి ఏడ్చింది

**జనతా ఉపనాటకం**

ప్రజల సదభిప్రాయమనే ఉత్తుంగతరంగంమీద జనతా అధికారంలోకి వచ్చింది ఇదివరకటి సాధారణ ఎన్నికలలో ఇందిర గెలిచినప్పటి వెర్రి ఆనందం ఇప్పుడూ ప్రకటితమయింది కాని కొన్ని కారణాలవల్ల ఇది చాలా కాలం నిలవలేదు ఇరవై ఎనిమిది నెలలలో జనతా ప్రభుత్వం పడిపోవటానికి ఇవే మూలమయ్యాయి

ప్రారంభంలో ఈ ప్రభుత్వానికి ఎన్నో ప్రశంసలు అందాయి ఎమర్జెన్సీలో కోల్పోయిన నాగరిక స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య స్వాతంత్ర్యాలు పునరుద్ధరింపబడ్డాయి ఇందిర చేసిన నలభై రెండవ సవరణలోని అసహ్యామైన, అధికారయుతమైన అంశాలలో చాలా వాటిని రద్దు చేస్తూ నలభై నాలుగవ సవరణ జరిగినపుడు దేశమంతా ఉత్సాహం పెల్లుబికింది చవాన్, బ్రహ్మానందరెడ్డి నడుపుతున్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సహకారం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు రాజ్యాంగం సవరించటానికి కావలసిన మూడింట రెండు భాగాల మెజారిటీ సంగతి అటుంచి, జనతాకు రాజ్యసభలో సాధారణమైన మెజారిటీ కూడా లేదు

ఈ సమయమంతా ఇందిర మౌనంగా ఉంది తన అవమానకరమైన ఓటమి, అనిశ్చితమైన భవిష్యత్తు బాధించిన మాట నిజమే కాని అంతకంటె ఎక్కువగా తన శత్రువులు సంజయ్‌కు ఎంత గొప్ప హాని చేస్తారో అని భయపడింది. జనతా విజయాన్ని చాటే ఊరేగింపులలోని నినాదాలలో "సంజయ్ గాంధీని ఉరి తియ్యండి" అనేది ఒకటి మురికివాడల నిర్మూలనకు సంజయ్ ఢిల్లీలోని టుర్క్‌మాన్ గేటువద్ద పని ప్రారంభించినపుడు అక్కడి ప్రజలు దానిని నిరోధించారు పోలీసుల కాల్పులలో చాలామంది మరణించారు ఇప్పుడు అక్కడున్న వారు సంజయ్‌కు బలవంతాన వేసక్టమీ చేయించి తగిన శాస్తి చెయ్యాలని అనసాగారు ఏమి అల్లర్లు జరుగుతాయో నని అధికారులు ఇందిర అధికార గృహం వద్ద భద్రత ఎక్కువ చేశారు మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రిగా పదవీ ప్రమాణం చేసి ఇందిరను చూడటానికి ఆమె ఇంటికి వెళ్ళాడు .అక్కడున్న ఏర్పాట్లు అతనికి నచ్చలేదు కాకపోయినా ఇందిర ఒక చిన్న బంగళాకు మారవలసి వచ్చింది అది 12, విల్లింగ్‌డన్ క్రెసెంట్ అక్కడ పరిస్థితులు తారుమారవటం ఆమె గమనించింది ఆమె సుదీర్ఘ పదవీకాలంలో తన విరోధులపై గట్టిగా నిఘా వేసి ఉంచిన గూఢచార ఏజెన్సీలు ఇప్పుడు ఆమెను అవిరామంగా గమనిస్తున్నాయి వారు వేసుకొన్న గమ్‌బూట్లు పరిసరాల్లో విలీనమయ్యే ప్రయత్నం ఫలించక పోగా అభాసుపాలవటం జరిగింది

ఏదేమైనా ప్రభుత్వ గూఢచారులు ఆమెను చూడటానికి వచ్చిన వారి పేర్లు కార్ల నంబర్లు మాత్రం వ్రాసుకోగలిగారు ఇందిర క్రియారహితంగా, మౌనంగా

ఉండిపోయింది చాలా రోజులు ఆమె తన కొత్త ఇంటినుండి బయటకు కూడా రాలేదు. ఆమె ఇంకా ప్రధాన మంత్రి ఇంట్లో ఉండగా, ఎన్నికలలో ఓటమి పొందిన మూడు రోజులకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమయింది అక్కడికి వెళ్ళటానికి కూడా ఆమె నిరాకరించింది ముగ్గురు సీనియరు పార్టీ నేతలు వచ్చి ఆమెను మనసు మార్చుకోమని ప్రాధేయపడ్డారు. మీటింగులో ఆమె ఎన్నికలలో చిత్తుగా ఓడిపోయినందుకు "పూర్తి బాధ్యత" తనదేనని ఒప్పుకొంది "కలిగించిన కష్టానికి ఎంతో విచారాన్ని" వ్యక్తం చేసింది ఎమర్జెన్సీ విధించినందుకు మాత్రం ఆమె పశ్చాత్తాపం చెందలేదు వాస్తవానికి ఆమె దానిని సమర్ధించింది ఇది జరిగిన తర్వాత ఆమె వెళ్ళిపోయింది అక్కడ సమావేశమైన నాయకులలో చాలామంది ఎమర్జెన్సీ కాలంలో ఉన్నతమైన పదవులలో ఉన్నవారు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని, ఎమర్జెన్సీలోని "దుష్కృత్యాలను" సంజయ్‌ను, తనను విమర్శించాలని చూస్తున్నారని ఆమెకు తెలుసు. అసలు ఈ విధంగానే జరిగింది దేశంలో ఎమర్జెన్సీ విధించమని సలహా ఇచ్చిన సిద్ధార్థశంకర్ రే "ఇండియానే ఇందిర, ఇందిరే ఇండియా" అని అవమానకరమైన నినాదమిచ్చిన దేవ్ కాంత బారువా విమర్శను ప్రారంభించారు కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకుడు, వై బి చవాన్ ఇందిరను సంప్రదించకుండానే ప్రధానమంత్రి దేశాయ్, యన్ సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నుకోవాలని చేసిన ప్రతిపాదనను ఏమాత్రం జాప్యం చేయకుండా స్వీకరించాడు ఈ పదవికి అతను అభ్యర్థిగా ఉండటమే 1969లో కాంగ్రెస్ చీలికకు కారణమయింది ఇందిర ఏమీ మాట్లాడలేదు కాని మనసులో "నమ్మకద్రోహం" జరిగినట్లు భావించింది

సమయం గడచేకొద్దీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, పార్లమెంటరీ పార్టీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన దోషారోపణలతో చీలిపోసాగాయి ఇప్పుడు కాంగ్రెస్ నాయకులుగా ఉన్నవారు ఇందిర మళ్ళీ చురుగ్గా రాజకీయాలలోకి రావాలనుకొనేసరికి పక్క చూపులు చూడసాగారు తన మీద, అంతకంటె ఎక్కువగా సంజయ్‌మీద జనతా చేస్తున్న దాడిని ఎదుర్కోవాలంటే రాజకీయాలలోకి రావటమే మార్గమని ఆమె అనుకొంది జ్ఞాని జిడ్డు కృష్ణమూర్తి రాజకీయాలు పూర్తిగా

విడిచిపెట్టమని ఆమెకు సలహా ఇచ్చినపుడు ఆమె ఈ విధంగా చెప్పింది .. "నాకు రెండే మార్గాలున్నాయి పోరాడటం లేదా కూర్చున్న బాతును ధ్వంసం చేసినట్లు నా నాశనానికి వారిని అనుమతించటం "

## ప్రతీకారంలో వివిధ వర్ణాలు

ఎమర్జెన్సీ, దానిలో జరిగిన దుష్కృత్యాలకే గాక ఆమె తీసుకొన్న చర్యలకు, పొరపాట్లకు అన్నిటికీ ఇందిరాగాంధి సంజాయిషీ ఇచ్చుకోవాలన్నది జనతా లక్ష్యమయింది ఎన్నికలతర్వాత ఆమెపైన తీవ్రమైన చర్య తీసుకోవాలన్న కోరిక తీవ్రంగా, నిరంతరంగా మారింది ఇందులో ఆశ్చర్యమేమీ లేదు ఉద్రిక్తంగా ఉన్న ప్రజాభిప్రాయం మాట అటుంచి కొత్తగా ఎన్నికయిన 302 జనతా పార్లమెంటు సభ్యులలో 222 మంది ఎమర్జెన్సీలో చాలా బాధలకు గురయిన హిందీ రాష్ట్రాల నుండి వచ్చినవారే వారిలో పదిమందిలో ఎనిమిది మందయినా ఎమర్జెన్సీ కాలంలో జైళ్ళకు వెళ్ళారు చాలా మందికి శాసన సభలు కాదు కదా, మునిసిపాలిటీల అనుభవం కూడా లేదు చట్ట పరిపాలన అంటే వారికంత స్పష్టత లేదు "వెంటనే తల్లికి, కొడుక్కు వారు చేసిన అపరాధాలకు గొప్ప శిక్ష వెయ్యాల్సిందే" అన్నది వారి కోరిక

జనతా నాయకత్వంలో భిన్నాభిప్రాయాలున్నాయి చట్టం "దాని పద్ధతిలో అది పోవాల్సిందే" అన్నది మొరార్జీకి ఇష్టమైన మాట చరణ్‌సింగ్‌ది స్వదేశవ్యవహారాల మంత్రిత్వశాఖ ఏ చర్య తీసుకోవాలన్నది నిర్ణయించే వ్యక్తి ఇదివరకటి ప్రధానమంత్రికి "న్యూరెంబర్గ్-వంటి విచారణ" జరపాలన్నది అతని అభిమతం రాజ్యాంగంలో గాని, భారతీయ న్యాయశాస్త్రంలో గాని అటువంటి విచారణకు వీలులేదని చట్టం విషయంలో విశేషజ్ఞులు ఇచ్చిన సలహా ఆయన వినదలచుకోలేదు

ఇందిర, సంజయ్‌లపై, మిగిలినవారిపై ఎటువంటి నేరారోపణ చెయ్యాలని చర్చ కొనసాగుతుండగా దేశాయ్ ప్రభుత్వం విచారణ జరపటానికి చాలా కమిషన్లను ఏర్పాటు చేసింది వాటన్నిటిలోకి ముఖ్యమైనది షా కమిషన్. ఇదివరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసిన జె సి షా పేరు దీనికి వచ్చింది ఈ కమిషన్‌లో

ఆయనొక్కడే సభ్యుడు. ఎమర్జెన్సీలో జరిగిన అన్ని దుష్కృత్యాలను, అధికార దుర్వినియోగాన్ని ఈ కమిషన్ పరిశీలించవలసి ఉంది. ఆ అకృత్యాలు "అత్యున్నత రాజకీయాధికారం ఉన్నవారు చేసినా, ప్రభుత్వంలోని అతి చిన్న ఉద్యోగి చేసినా ఈ కమిషన్ పరిశోధించవలసిందే "

ఈ కమిషన్ 30 సెప్టెంబరు 1977లో పని చేయటం ప్రారంభించింది ప్రారంభం నుండి అమెరికాలోని కాంగ్రెస్ ఎంక్వయిరీకి, చైనాలోని ప్రజా న్యాయస్థానానికి చెందిన అంశాల సమ్మిశ్రమంగా ఇది పని చేయసాగింది కిట కిటలాడుతున్న కమిషన్ న్యాయస్థానంలో వాతావరణం ఇందిరకు ప్రతికూలంగా ఉంది ఆమెకు వ్యతిరేకంగా వచ్చిన ప్రతి మాటకు ఆనందం ఉప్పొంగింది ఏ మాత్రం ఆమె పక్షం మాట్లాడినా పరిహాసంగా కేకలు వినిపించాయి రెండుసార్లు ఇందిర కమిషన్ ముందుకు వచ్చింది కాని సాక్ష్యం చెప్పటానికి నిరాకరించింది ప్రధానమంత్రిగా పదవీస్వీకారం చేసినపుడు రహస్యంగా ఉంచటానికి తీసుకొన్న ప్రమాణం ఉల్లంఘించలేనని, తనకై తానుగా తనపై "నేరారోపణ" చేసుకోలేనని ఆమె చెప్పింది ఈమెపై మరో కేసు పెట్టటం జరిగింది ఇప్పటికే ఎన్నో కేసులున్నాయి. ఒకటయితే కొన్ని కోడి పెట్టలను "దొంగిలించింద" నే హాస్యాస్పదమైన నేరారోపణ కూడా ఉంది సంజయ్ మీదున్న నేరారోపణలు మరింత తీవ్రమైనవి అన్నిటికంటె తీవ్రమైనది ఇందిరకు వ్యతిరేకంగా ఉన్న ఒక ఫిలిం "కిస్సాకుర్సీకా" (ఒక కుర్చీ కథ) (ఇక్కడ కుర్చీ అధికారానికి ప్రతీక) ను తగల బెట్టటం. సంజయ్, ఎమర్జెన్సీ కాలంలో సమాచార మంత్రిగా ఉన్న వి సి శుక్లా ఇందులో నేరస్థులు

షా కమిషన్ ప్రతిరోజూ విచారణ జరపటం కొనసాగుతుండగా, నేరాలకు సంబంధించిన కేసులు న్యాయస్థానాల వ్యూహంలోకి వెళ్ళిపోయాయి ఇక్కడ అన్నీ నత్త నడకలే. ఇంతలో దేశంలో ఎన్నో మార్పులొచ్చాయి ఇవి జనతాకు హానికరంగా, ఇందిరకు మేలు చేసేటట్లు ఉన్నాయి. మొదట్లో కొన్ని ప్రశంసలు పొందినా, జనతా ప్రభుత్వం తన శక్తిని పోగొట్టుకొంది ఆవిధంగా ప్రజల గౌరవాన్ని కోల్పోయింది. చిత్రంగా సాధారణ పరిస్థితులు నెలకొనటం కూడా

అల్లకల్లోలంగానే జరిగింది రాజకీయ ఖైదీలను విడుదల చేసేటప్పుడు జనతా మరెందరో నేరస్థులను, దుండగులను, స్మగ్లర్లను, దొంగగా స్టాకులను పెట్టుకొనేవాళ్ళను, చట్టవిరుద్ధంగా లాభాలను పొందేవాళ్ళను కూడా విడుదల చేసింది దేశ రాజధాని నడిబొడ్డున కూడా నేరాలు పెరిగాయి దానితో చాలామంది ఎమర్జెన్సీలోని "క్రమశిక్షణ" వస్తే బాగుండనుకొన్నారు దేశవ్యాప్తంగా పోలీసులు అస్తవ్యస్తంగా ఉన్నారు సగం పోలీసు బలగం, ఎమర్జెన్సీ సమయంలో మిగిలిన సగం పోలీసు బలగం చేసిన నేరాలు పరిశోధిస్తోంది పోలీసుల తిరుగుబాట్లు అక్కడక్కడా తలెత్తాయి దురదృష్టవశాత్తు దేశ ఆర్థికస్థితి కూడా దిగజారిపోయింది దీనికి ఒక విధంగా కారణం సరయిన వర్షాలు లేకపోవటం కాగా, మరో విధంగా ఏ మాత్రం అదుపులేని వాతావరణంలో ఏ మాత్రం పాపభీతిలేని వ్యాపారస్థులు ధరలను అమితంగా పెంచేశారు

జనతా పాలనలో హరిజనులమీద (ఇప్పుడు వారిని దళితులంటున్నారు) అత్యాచారాలు ప్రబలాయి అనటంలో ఏమాత్రం సందేహంలేదు గతంలో కూడా అటువంటి భయంకర సంఘటనలు జరిగాయి. కాని ఎన్నడూ ఇంత తరచుగా, ఇంత అసహ్యంగా జరగలేదు. దీనికి జనతాలోని కులాల కూర్పుకు కొంచెం సంబంధం ఉంది ఎమర్జెన్సీ సమయంలో కొన్ని ప్రయోజనాలు పొందిన హరిజనులంటే చరణ్‌సింగ్ చుట్టూ ఉన్న మధ్యరకపు కులాల వారికి కన్నెర్రగా ఉంది

అంత ఘన విజయం పొందిన కొంత కాలానికే, జనతా అంత దయనీయ స్థితికి రావటం, అది దాని పతనానికి దారి తీయటానికి ప్రముఖ కారణం అందులోని నాలుగు ప్రముఖ పార్టీలు ఉన్నత స్థాయిలో నిరంతరం తీవ్రంగా పోట్లాడుకోవటం అని చెప్పవచ్చు ఇందిర ఓడిపోయిన సంతోషంలో ఉన్న దేశం కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ తమ నాయకుణ్ణి ఎన్నుకోలేకపోతోందన్న విషయం గుర్తించలేదు ముగ్గురు ప్రముఖులు, మొరార్జీదేశాయి, చరణ్‌సింగ్, జగజ్జీవనన్‌రామ్‌లలో ప్రతి వ్యక్తీ తానే నాయకుడు కావాలనుకొన్నాడు కాని ఇంకొక నాయకత్వం స్వీకరించటానికి సిద్ధంగా లేడు. జె పి, క్రియాశీల

రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన గౌరవనీయుడైన మరో నాయకుడు ఆచార్య కృపలాని మొరార్జీ విషయం అందరూ ఒప్పుకొనేటట్లు చూశారు అది చాలా కాలం కొనసాగలేదు ఇందిరకు "తగిన శాస్తి" చేయాలనే విషయంలో తగాదాలు మురా తగాదాలను మరింత తీవ్రం చేశాయి

ఈ నేపథ్యంలో 23మే 1977న చరణ్‌సింగ్ పార్లమెంటులో అందరూ ఉలికి పడేటట్లు ఒక ప్రకటన చేశాడు "ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్షాల నాయకులందరినీ జైళ్ళలో చంపించాలని" ఇందిరా గాంధి అనుకొన్నట్టు చెప్పాడు జనతాను తిప్పికొట్టటానికి అదనుకోసం చూస్తున్న ఆమెకు అవకాశం దొరికింది గృహమంత్రిత్వశాఖ మంత్రి చేసిన ఆరోపణ "దిగ్భ్రాంతి కలిగించేటట్లు అస్వాభావికంగాను ఉందని" ఆమె చెప్పింది అప్పుడు విదేశ వ్యవహారాల మంత్రిగా ఉన్న అటల్ బిహారి వాజ్‌పాయ్, చరణ్‌సింగ్ "అస్వస్థతగా ఉన్నారని మొదట సమాచారం అందగానే" వారిని విడుదల చేయటం జరిగిందని కూడ ఆమె చెప్పింది "వాళ్ళను చంపించాలనుకొన్నవాళ్ళు" ఎవరూ ఆ విధంగా చేసి ఉండరంది తనను "కళంకితం చేసే ప్రయత్నం" కొనసాగించే బదులు జనతా "హరిజనుల మీద జరిగే దురాగతాల" పట్ల, "పెరుగుతున్న అరాచకం పట్ల" పెరుగుతున్న ధరల" పట్ల శ్రద్ధ వహిస్తే మంచిదని చెప్పింది

ఈ మాటలన్న తర్వాత ఈమె బెల్చికి ప్రయాణం పెట్టుకొంది ఇది బీహారులో దూర ప్రాంతంలో ఉన్న గ్రామం నిస్సహాయులైన హరిజనుల పట్ల భరించరాని దౌర్జన్యం ఇక్కడ జరిగింది ఎంతో మందిని సజీవ దహనం చేశారు హరిజన స్త్రీలపై మూకుమ్మడిగా బలాత్కారాలు చేశారు బెల్చిలో అప్పుడు వర్షాకాలం మోకాలి లోతు బురద, రొచ్చుతో ఉన్న ఆ ప్రాంతాన్ని చేరుకోవడం కష్టం ఇందిర గ్రామస్థునికి చెందిన ఒక ఏనుగు మీద స్వారి చేసి వెళ్ళింది ఇంచుమించు ఆకలి జీవితాలు గడుపుతున్న వారి బాధలు, వారిని దహించటం, భయంకరమైన అత్యాచారాలు ఆమెకు కన్నీళ్ళు తెప్పించాయి వారూ కన్నీళ్ళు కార్చి ఆమెకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు క్షమాపణ చెప్పుకొన్నారు ఆమె సంతోషపడింది అంతా పోగొట్టుకోలేదన్న నిబ్బరం ఆమెకు కలిగింది

బెల్చికి ఏనుగుపై వెళ్ళిన తర్వాత మిగిలిన ప్రయాణమంతా రైలు మార్గాన, రోడ్డుమీదుగా జరిగింది లక్నోకు దగ్గరగా ఉన్న తన నియోజకవర్గం రాయ్‌బరేలీకి రావటానికి ఆమెకు "విమాన ప్రయాణం చేసే స్తోమత లేదు." ది గార్డియన్‌కు చెందిన సైమన్ విన్‌ఛెస్టరు ఆమెతో పాటు ప్రయాణం చేశాడు ఆమెకు ఎంతో ఉత్సాహంగా స్వాగతం పలికిన తీరు చూస్తే ఆమె నియోజక వర్గంలోని వారు "పది నిమిషాల లోనే ఆమెను క్షమించారు" అని అతను వ్రాశాడు దీనికి భిన్నంగా భారత దేశంలోని చాలా వార్తా పత్రికలు ఆమెకు నల్ల జెండాలు చూపించారని దీర్ఘమైన రిపోర్టులు వ్రాశాయి ఎమర్జెన్సీలో బాధలు పడ్డ మాధ్యమాలు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకొంటున్నాయని అనుకోకూడదు ఇందిర లక్ష్యంగా మారినంతవరకు ఎవరూ ప్రతిఘటించలేదన్నది అప్పుడున్న అభిప్రాయాన్ని సూచిస్తుంది పవిత్రమైన నగరం హరిద్వార్‌లో, చారిత్రాత్మక నగరమైన ఆగ్రాలో ప్రజలు ఉత్సాహంగా ఆమెకు స్వాగతం పలికారు కొందరు నల్ల జెండాలు చూపించారు జనతా సమర్థకులు కొందరు ఆమె కారు మీద రాళ్ళు కూడా రువ్వారు

జనతాలో కఠినమైన పద్ధతి అవలంబించాలనుకొనేవారు చాలా ఆగ్రహించారు ఇందిర దేశమంతా తిరగటానికి అనుమతించే బదులు ప్రభుత్వం ఆమెకు ఆమె స్థానం చూపించాలని వారన్నారు గృహ మంత్రిత్వ శాఖ మంత్రి చరణ్‌సింగ్ వెంటనే చర్య తీసుకొన్నాడు మహాత్మాగాంధి జయంతి అయిన మరుసటి రోజు అక్టోబరు 3న, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ (సిబిఐ) అధికారులు, ఆ ప్రాంతపు పోలీసులను వెంటబెట్టుకొని ఆమెను నిర్బంధంలోకి తీసుకోటానికి ఆమె ఇంటికి వచ్చారు ఆ తర్వాత జరిగినది జనతా మొహం మీద పడేటట్లు నమ్మశక్యంగాని సంపూర్ణ వైఫల్యం ఇందిర పోలీసుల వెంట వెళ్ళటానికి సిద్ధం కాగానే ఆమె సమర్థకులు చాలా మంది ఆమెను నిర్బంధంలోకి తీసుకోటానికి నిరసనగా గుమికూడారు పోలీసులు ఆమెను బండిలో తీసుకెళ్తుండగా వీరు వెంబడించారు. ఆమెను ఢిల్లీ సరిహద్దు దాటించి హర్యానాకు తీసుకెళ్ళే ప్రయత్నం చేసినపుడు ఆమె ఒక మోరీ మీద కూర్చుని అక్కడి నుండి కదలటానికి

నిరాకరించింది జన సమూహం తన నిరసన కొనసాగించింది పోలీసులు ఆమెను వెనక్కు తీసుకొచ్చి ఆ రాత్రికి పోలీసు లైన్లలో పెట్టారు మరుసటి క్రిక్కిరిసిన న్యాయస్థానంలో, ఉద్రిక్తమైన వాతావరణంలో మేజిస్ట్రేటు రెండు నిముషాలలోనే "ఆమెపై ఆరోపణ ఏదీ లేదని" ఆమెను విడుదల చేశాడు ఆమెను హఠాత్తుగా నిర్బంధంలోకి తీసుకోవటం, అంత త్వరగా విడుదల చేయటం జరిగాక జనతా నవ్వుల పాలయింది ఆమె తిరిగి ప్రాముఖ్యంలోకి రావటానికి ఇది దోహదం చేసింది చాలా మంది భారతీయులు, ఆమెను విమర్శించే వారు కూడా, చట్టం ప్రకారం ఆమె నేర విచారణ జరపకుండా ఇందిరను ఊరికే బాధపెడుతున్నారని భావించ సాగారు టేప్ చేసిన ఇంటర్ వ్యూలో పుపుల్ జయకర్‌తో మాట్లాడుతున్నప్పుడు అటల్ బిహారి వాజ్‌పాయ్ ఈ విషయం ఒప్పుకొన్నాడు

ఆమె అరెస్ట్ నాటకానికి ముందే దక్షిణ గుజరాత్‌లో ఆదివాసుల ఊర్లను చూస్తానని ఇందిర ప్రకటించింది బొంబాయి విమానాశ్రయంలో సూరత్‌కు వెళ్ళే ముందు పెద్ద జనసమూహం ఆమెకు స్వాగతం పలకటం ఆమెను ఆశ్చర్యపరచింది ఏమయినా సూరత్ జిల్లాలో ఆదివాసులు ఆమెకు స్వాగతం పలికిన తీరు, ప్రశంసించిన విధానం ఇది వరకు జరిగినవన్నిటినీ మించిపోయింది.

కోపంతో మండిపోతూ చరణ్‌సింగ్ దేశాయ్‌కు ఉత్తరం వ్రాశాడు మంత్రి వర్గం ఇందిరను న్యాయ విచారణకు తీసుకొని రాలేని "నిర్వీర్యుల సమూహం" గా దానిలో ఆయన పేర్కొన్నాడు. దేశాయ్ వెంటనే అతని రాజీనామా కోరాడు చరణ్‌సింగ్ రాజీనామా ఇచ్చాడు ఈ అవకాశం వినియోగించుకొని ప్రధానమంత్రి, చరణ్‌సింగ్ విధేయుడు, ఆరోగ్య విషయాల మంత్రి అయిన రాజ్‌నారాయణ్‌ను కూడా వదిలించుకొన్నాడు తాను తప్పు చేయననే భావనతో ఎంతో తృప్తిగా ఉన్న దేశాయ్ తన ప్రభుత్వ పతనానికి అప్పుడు బీజాలు నాటానని గుర్తించ లేదు చరణ్‌సింగ్ దేశాయి పదవికి ఆశ పడ్డాడు విదూషకుడిలా ఉన్నా కుట్రలు పన్నగలిగిన రాజ్‌నారాయణ్ దేశాయ్ స్థానంలో చరణ్‌సింగ్‌ను తీసుకొని రావాలని నిర్ణయించుకొన్నాడు వాళ్ళు ఎక్కువకాలం వేచి ఉండవలసిన అవసరం రాలేదు

## రెండవసారి కాంగ్రెస్ చీలిక

అమెకు కొత్తగా వచ్చిన జనాదరణ పెరుగుతున్నకొద్దీ, అమెకు ఆనందం కలిగించేటట్లు ఇతర కాంగ్రెస్ నాయకత్వంతో సమస్యలు ఎక్కువ కాసాగాయి. కాంగ్రెస్ అధ్యక్షుడయిన బ్రహ్మానందరెడ్డి అమెను అంతగా పట్టించుకోలేదు

పార్లమెంటరీ నాయకుడు చవాన్ అమె పట్ల మర్యాదగా వ్యవహరించేవాడు కాని దూరంగా ఉండేవాడు ఇదివరకు సంజయ్ చెప్పింది ఏమి చెయ్యటానికైనా సిద్ధంగా ఉన్న మంత్రులు యస్ యస్ రే, టి ఏ పాయ్‌లతో సహా ఇప్పుడు షా కమిషన్‌లో సంజయ్‌కు, ఇందిరకు వ్యతిరేకంగా సాక్ష్యాలు చెప్పసాగారు

తాను, ఇతర కాంగ్రెస్ నాయకత్వం ఇక ఏమాత్రం కలిసి ఉండలేమని నమ్మకం కుదిరి ఇందిర పదేళ్ళ లోపుగా మళ్ళీ కాంగ్రెస్‌ను 1978 లో కొత్త సంవత్సరంనాడు విభజించింది ఈ సారి కొత్త పార్టీని స్పష్టంగా కాంగ్రెస్ (ఇందిర) లేక కాంగ్రెస్ (ఐ) అన్నారు అమె దగ్గరి స్నేహితులు కూడా అమె కొంచెం మితిమీరిందనే అనుకొన్నారు • కాని మార్చిలో ఐదు రాష్ట్ర అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలలో ఈ అపార్థాలు తొలగిపోయాయి కాంగ్రెస్ (ఐ) కి గొప్ప సమర్ధన లభించింది అమెకు విశ్వాసపాత్రంగా ఉన్న ఆంధ్ర, కర్ణాటకలలో ఇందిర కాంగ్రెస్‌కు చాలా సీట్లు లభించాయి మొత్తంమీద 394 అసెంబ్లీ సీట్లు కాంగ్రెస్ (ఐ)కి రాగా 271 సీట్లు జనతాకు 147 సీట్లు కాంగ్రెస్ (యస్) కు వచ్చాయి బ్రహ్మానందరెడ్డి తర్వాత, స్వరణ్‌సింగ్ కాంగ్రెస్ అధ్యక్షుడయినందుకు కాంగ్రెసుకు అ పేరు వచ్చింది వై బి చవాన్‌కు కోటవంటి మహారాష్ట్రలో కాంగ్రెస్ (ఐ) గొప్పగా విజయం సాధించింది ఇండిర చవాన్‌ను "జనతా 'బి' టీమ్ కు" కేప్టెన్ అనుకొనేది

షా కమిషన్ మొదటి నివేదిక వచ్చింది ఎమర్జెన్సీని విధించటం "వంచన" అని, "తనను న్యాయాధికారం తీర్పులోని చట్ట బద్ధమైన నిర్బంధాలనుండి రక్షించు కోటానికి ఇందిరాగాంధి "అన్నిటికీ తెగించి చేసిన ప్రయత్నమ" ని స్పష్టంగా తీర్పు నిచ్చింది అయితే దీని వల్ల అమెకు జనాదరణ ఏమాత్రం తగ్గలేదు అమె దేశం ఈ చివరనుండి ఆ చివర దాకా తిరిగింది అమె కర్ణాటకలో దేవాలయాలు,

మరాలు సందర్శించి సంజయ్ క్షేమానికి ప్రార్థించసాగింది. అతను ఇబ్బందిలో పడతాడని ఆమెకు తెలిసినప్పటి నుండి ఇది ఆమె మనసులో తీవ్రంగా నాటుకు పోయింది నేర విచారణ సాక్షులను "బెదిరించటం," వారికి "లంచం ఇవ్వడం" చేయకుండా సంజయ్‌ను "ఒక నెల న్యాయ సంరక్షణలో ఉంచాలని" సుప్రీం కోర్టు ఉత్తర్వు జారీ చేసింది ఇందిర దొరికిన విమానంలో ఢిల్లీ చేరుకొని తీహార్ జైలులో తన కొడుకును చూడటానికి వెళ్ళింది. నిర్బంధంలో ఉండటం అతనికి "రాజకీయంగా పునర్జన్మ" అని ఆమె చెప్పింది కొన్ని నెలల క్రితం సంజయ్ "ఎన్నడూ రాజకీయాలలో లేడు" అని ఆమె చెప్పిన మాటలు మరచి పోయి నట్టుంది సంజయ్ జైలు నుండి బయటకు వచ్చేసరికి మూడు కీలకమైన విషయాలు జరిగాయి ఇందిర మళ్ళీ పార్లమెంటు సీటుకు ఎన్నికలలో నిలబడాలనుకొంది. జనతాలో అంతరంగిక కలహాలు ముమ్మరమై అది ఏనాడైనా చీలిపోతుందనే సూచనలు కనపించాయి తమని తామే ధ్వంసం చేసుకొనే స్థితి నుండి జనతాను రక్షించటానికి జె పి దరిదాపుల్లో లేడు జనతా ప్రభుత్వం పదవిలోకి రాగానే తమ నిర్మాణానికి కారణమైన వ్యక్తిని మరచి పోయారు దేశాయ్ తమకు మేలు చేసిన వ్యక్తి పట్ల నిర్లక్ష్య వైఖరి చూపించటంలో ఏ మాత్రం మొహమాట పడలేదు చాలా బాధపడి జె పి పాట్నాకు వెళ్ళిపోయాడు

సంఘటనలు ఇందిరకు అనుకూలంగా జరగసాగాయి కాని ఆమె సంజయ్‌కు ఏమి జరుగుతుందో అని, అతని భవిష్యత్తు ఏమిటోనని ఆందోళన పడసాగింది జనతా అతనిని తప్పక జైలుకు పంపిస్తుందని, "కిస్సా కుర్సీకా" కేసులో చాలా ఏండ్లు శిక్షవేసి అతనిని చిత్ర హింసకు గురిచేస్తుందని ఆమె నమ్మింది 1979 ఫిబ్రవరిలో ఈ భయం సడలింది కోర్టు సంజయ్‌కు రెండేండ్లు శిక్ష విధించింది ఈ తీర్పు మీద దరఖాస్తు పెట్టుకోవచ్చని బెయిల్ ఇచ్చింది

మార్చి 1978 రాష్ట్ర శాసన సభల ఎన్నికల తర్వాత కాంగ్రెస్ (యస్) నుండి ఇందిరా కాంగ్రెస్‌కు మారటం ప్రారంభమైంది. కాంగ్రెస్ (ఐ) బలంగా ఉన్న కర్ణాటకలోని చిక్ మగలూరు నుండి ఇందిర లోక్ సభకు ఉప ఎన్నికలో గెలవగానే పెద్ద ఎత్తున ఈమె కాంగ్రెస్‌లోకి సభ్యులు మారటం ప్రారంభించారు

ఈ ఉప ఎన్నిక దేశంలోని ప్రజాభిప్రాయసేకరణ ఏమాత్రం కాదు కాని ఇందిరను ఎలాగైనా ఓడించాలని జనతా ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేయటం ఆమె విజయానికి మరింత వన్నె తెచ్చింది. యాదృచ్ఛికంగా అమె 7 నవంబరు 1978న ఢిల్లీకి తిరిగి వచ్చింది అది అప్పుడు సోవియెట్ యూనియన్ జాతీయ దినోత్సవం సోవియెట్ ప్రధాన మంత్రి అలెక్సీ కోసిగిన్ ఢిల్లీలో ఉన్నాడు సోవియెట్ రాయబారి కార్యాలయంలో పెద్ద ఎత్తున జరుగుతున్న పార్టీకి ఆమె విజయోత్సాహంతో వచ్చింది ఆతిధ్యమిస్తున్న వారు కలవర పడ్డారు. ముఖ్యఅతిథి ప్రధానమంత్రి దేశాయ్ స్పష్టంగా చికాకు పడ్డాడు

## చికమగలూరు నుండి తీహారుకు

లోక్‌సభలో ఇందిరాగాంధి కొత్త సభ్యత్వం ఆరువారాలు కూడా నిలవలేదు జనతా ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన తీరు తికమకగా, చిత్రంగా ఉంది అది విధివకృతంగా మారింది.

ఎమర్జెన్సీ ముందు పార్లమెంటులోని ఒక ప్రశ్న కోసం సంజయ్ మారుతి ప్రాజెక్టు గురించి సమాచారం సేకరిస్తున్న నలుగురు అధికారులను ఇందిర "బాధించిం"దన్నది షా కమిషన్ తీర్పులో ఆమెపై మోపిన కేసులలో ఒకటి అధికారులు పార్లమెంటు తరపున పనిచేస్తున్నందున, పార్లమెంటు విశేషాధికారాలను ఆమె ఉల్లంఘించిందని ఆరోపించటమయింది ఆమె తన ఆసనం స్వీకరించిన 24 గంటలలో ప్రివిలేజెస్ కమిటీ నివేదిక ఆమెను "నేరం చేసినట్లు" భావించింది ఆమె కమిటీ ముందు సాక్ష్యం చెప్పటానికి రానందుకు "పార్లమెంటు పట్ల నిర్లక్ష్యం" చూపిందని కూడా ఆరోపించారు

ఇందిర క్షమాపణ చెప్పినా, లేక విచారం వ్యక్తపరచినా ఈ సమస్య తీరుతుందని జనతా నాయకులు తెలియ జేశారు. కాని ఆమె దీనిని తిరస్కరించింది. దీని ఫలితంగా దీర్ఘంగా, ఉద్రిక్తతతో జరిగిన చర్చ తర్వాత మాజీ ప్రధానమంత్రిని "బహిష్కరించాల"ని, "పార్లమెంటు సమావేశం ముగిసేవరకు" ఆమెను నిర్బంధించాలని 19 డిసెంబరు 1978 న లోకసభ ఓటు చేసింది కాబట్టి ఇందిర వారం రోజులకు పైగా తీహార్ జైలులో గడిపింది కాని ఇరుకైన

బారకాసులో కాదు. ఆమె భోజనం ఇంటి నుండి రావటానికి అనుమతింపబడింది ఇందిరా గాంధీని జైలులో పెట్టాలని పార్లమెంటు నిర్ణయించటాన్ని నిరసిస్తూ వేలకొద్దీ జనం నిర్బంధంలోకి వచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని పాండే సోదరులు, ఆమె యువ అనుయాయులు ఒక విమానాన్ని ఆటపిస్తోలు చూపించి దారి మళ్ళించటానికి ప్రయత్నించారు వారిని పట్టుకొని నిర్బంధించటమయింది 1980లో ఇందిర అధికారంలోకి మళ్ళీ వచ్చినపుడు ఆ సోదరులిద్దరికీ ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో సభ్యులను చేసి ప్రతిఫలమివ్వటం జరిగింది

**జనతా పతనం**

ఇది వరకు చెప్పనట్లు చరణ్‌సింగ్ ఇంచుమించు మంత్రివర్గం నుండి తన తొలగింపును 1978 వేసవిలో కోరి తెచ్చుకొన్నాడు కాని చరణ్‌సింగ్ చాలా కాలం మంత్రివర్గంలో లేకపోతే తమ ప్రభుత్వం కొనసాగలేదని దేశాయికి గాక తక్కిన జనతా నాయకులందరికీ తెలుసు కాని ప్రధానమంత్రికి, చరణ్‌సింగ్‌కు మధ్య స్నేహం పెంపొందించటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అది సాధ్యం కాలేదు ఎందుకంటే తనతోపాటు రాజ్ నారాయణ్‌ను కూడా మంత్రివర్గంలోకి తీసుకోవలసి ఉంటుందని చరణ్‌సింగ్ పట్టు పట్టాడు అది దేశాయికి సమ్మతం కాదు అంతేగాక ప్రధానమంత్రి కొడుకు కాంతిదేశాయ్ అవినీతి చర్యలను, మాజీ గృహవ్యవహారాల మంత్రి భార్య అవినీతి చర్యలను పరస్పరం వేలెత్తి చూపించసాగారు

పార్లమెంటుకు దగ్గరగా తన బలప్రదర్శన చేస్తూ తన పుట్టిన రోజు సందర్భంగా చరణ్‌సింగ్ పెద్ద ఎత్తున జన సమూహాలను చేర్చినపుడు ఇందిర కారాగారంలోనే ఉంది అమె తరఫున ఆమె సహోద్యోగి ఒక పూలగుత్తిని "పుట్టినరోజు బాలుని" కి సమర్పించాడు దీనితో ఒక ఒప్పందం కుదిరింది జనతా మధ్యవర్తులు భవిష్యత్తు గురించి ఆందోళన చెందారు ఈ ఒప్పందం ప్రకారం చరణ్‌సింగ్ ప్రభుత్వంలోకి 1979 జనవరిలో ఉపప్రధానమంత్రిగా, ఆర్థికమంత్రిగా వచ్చాడు. ఒకప్పుడు దేశాయ్ ఇందిరాగాంధి ప్రభుత్వంలో ఈ పదవులలో ఉన్నాడు గృహమంత్రిత్వ శాఖపోయినందుకు బదులుగా ఈ పెద్ద పదవి ఇవ్వటం జరిగింది కాని ఈ

పదవిని అతను జగజ్జీవన్ రామ్‌తో పంచుకోవలసి వచ్చింది. తన స్థాయి గురించి, తన పెద్దరికం గురించి ఆయనకు బాగా అవగాహన ఉంది దేశాయ్ పట్టు బట్టినందున రాజ్ నారాయణ్‌ను వెనక్కు తీసుకోలేదు. ఇది దేశాయి చేసిన గొప్ప పొరపాటు రాజ్‌నారాయణ్ వెంటనే జనతాకు రాజీనామా ఇచ్చి జనతా (సెక్యూలర్) అని పార్టీ ఏర్పరచాడు. ఇదివరకటి జనసంఘ్ సభ్యులు "రెండురకాల విశ్వాసం" చూపించటాన్ని ఇతను తెలివిగా ఉపయోగించుకొన్నాడు. వాళ్ళు ప్రభుత్వంలో చేరి ఒకవైపు సెక్యులర్ గాను, రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్ యస్ యస్) సభ్యులుగా ఉంటూ హిందూ పక్షపాతులుగా ఉన్నారు. ప్రతిపక్షంలో రాజ్‌నారాయణ్‌తో పాటు చాలా మంది జనతా సహోద్యోగులు చేరారు. మొదట చుక్కలు చుక్కలుగా ప్రారంభమైన ఈ ప్రవాహం చివరకు పెద్ద వరదయింది.

మామూలు న్యాయస్థానాలలో ఉండే జాప్యాన్ని తప్పించుకోటానికి ఇందిరను, సంజయ్‌ను ఇతర "అపరాధుల"ను విచారించటానికి ప్రత్యేకమైన న్యాయస్థానాలు ఏర్పాటు చేయటానికి జనతా ప్రభుత్వం ఒక చట్టం చేసింది కాంగ్రెస్ (యస్) సమర్థన లేకపోతే ఈ చట్టం ఆమోదింపబడేది కాదు. గుర్తించదగ్గ విషయమేమిటంటే స్పెషల్ కోర్టుల బిల్లుకు కాంగ్రెస్ (ఐ) సభ్యులు కూడా కొందరు ఓటు చేశారు.

ఇందిర ప్రజల అభిమానాన్ని, సమర్ధనను పొందటంలో ఎంత విజయం సాధించినా ఆమె పార్టీలో ఆమె ఇంకా ముట్టడింప బడిందని ఈ విషయం స్పష్టం చేస్తుంది దీనికి కారణం సంజయ్ మళ్ళీ అధికార కేంద్రంగా మారటం, యూత్ కాంగ్రెస్ తిరిగ్ బలసంపన్నం కావటం అని చెప్పవచ్చు కర్ణాటక ముఖ్యమంత్రి దేవరాజ్ అర్స్ ఇప్పటివరకు ఇందిర పక్షాన ఉన్నాడు. చికమగలూరులో ఆమె విజయానికి తానే బాధ్యుడినని కూడా చెప్పుకోసాగాడు అతనే ఇప్పుడు సంజయ్‌మీద ధ్వజమెత్తాడు దీనికి సమాధానంగా ఇందిర రాష్ట్రంలోని పార్టీ సంస్థ అధికారాన్ని అతని నుండి వెనక్కు తీసుకొంది అంతః కలహాలలో అర్స్ అమాయకుడేమీకాదు మొత్తం కర్ణాటక కాంగ్రెస్(ఐ) ను తనతో పాటు తీసుకెళ్ళి కాంగ్రెస్ (యస్) తో చేరి పోయాడు

"పాత కాంగ్రెస్" అతనికెంతో కృతజ్ఞత తెలుపుకొంటూ అతనిని తమ అధ్యక్షునిగా ఎన్నుకొని తమ పేరు కాంగ్రెస్ (యు)గా మార్చుకొన్నారు

ఇందిరకు తన పార్టీలోని సమస్యలు జనతాలోని "అనాగరిక యుద్ధం" తో పోల్చి చూస్తే పెద్దగా చెప్పుకోదగ్గవి కాదు చరణ్‌సింగ్ ఒకప్పుడు ఇందిరను "నూరెంబర్గ్ - విధానంలో విచారణ" కు గురి చెయ్యాలన్నవాడు, ఇప్పుడు రహస్యంగా ఆమెతో సంప్రదింపులు ప్రారంభించాడు "రాముడు" చరణ్‌సింగ్‌కు "హనుమంతుడైన" రాజ్ నారాయణ్, ఇందిరకు దీర్ఘకాల శత్రువు, 'ఇందిరను తొలగించండి' అనే నినాదాన్ని సృష్టించిన వాడు, తన తల్లి తరపున మాట్లాడుతున్న సంజయ్‌తో రహస్యంగా సంప్రదింపులు జరుపుతాడని ఎవరనుకొన్నారు? కానీ ఈ విధంగానే జరిగింది

ఇందిరా కాంగ్రెస్, చరణ్‌సింగ్ ఆధిపత్యంలో ప్రభుత్వంలో చేరకున్నా ఆ ప్రభుత్వాన్ని "నిలబెట్టాల"ని చరణ్‌సింగ్ రాజ్ నారాయణ్ ద్వయం వాంఛించింది ఇది ఇందిరకు బాగా నచ్చింది. జనతాను విడగొట్టాలని ఆమె అనుకొంది. "తన జీవితకాంక్ష" అయిన ప్రధానమంత్రి పదవి దొరికితే ఈ విధంగా చేయటానికి చరణ్‌సింగ్ సిద్ధంగా ఉన్నాడు చవాన్, కాంగ్రెస్ (యస్) లోని ఇతర నాయకులు పదవులు లేక విల విల లాడుతున్నవారు చరణ్‌సింగ్ ప్రభుత్వంలో ఏ షరతులతోనైనా చేరుతారని, వారి సమర్థన పొందిన తర్వాతే చరణ్ సింగ్ తన సమర్థన కోరి ఉంటాడని ఇందిర గ్రహించకపోలేదు. వాస్తవానికి జరిగింది కూడా అదే

11 జూలై 1979 లో పార్లమెంటు వర్షాకాల సమావేశం ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్ష నాయకుడిగా చవాన్ మామూలు ధోరణిలో దేశాయ్ ప్రభుత్వం పట్ల నమ్మకం లేదని చర్చకు పెట్టాడు చక్కగా మెజారిటీ ఉన్న ప్రభుత్వం మెరుపు వేగంతో కరిగి పోవటం దేశాన్ని విస్మయానికి గురి చేసింది చర్చ ప్రారంభంకాగానే చరణ్‌సింగ్ రాజీనామా ఇచ్చాడు. ఇతరులు అతనిని అనుసరించారు ప్రభుత్వంలో ఉన్న పెద్ద మంత్రులు, లేక పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని సమర్థిస్తూ మాట్లాడటానికి సిద్ధ పడ్డారు. జులై 14న, జనతా పార్లమెంటరీ బోర్డు మొరార్జీ

దేశాయిని పదవినుండి తొలగి జగజ్జీవన్ రామ్‌వంటి వారికి పదవి అప్పగించమని, అప్పుడు జనతా ఆ పదవి నుండి బయటపడుతుందని కోరింది. దేశాయ్ తిరస్కరించాడు మరుసటిరోజు జనతా నుండి సోషలిస్టులందరూ రాజీనామా చేశారు. దేశాయికి మెజారిటీ పోయింది ఒక ఆదివారం మధ్యాహ్నం ఆయన రాజీనామా ఇచ్చాడు. కాని తన పార్టీ అన్నిటికంటె పెద్దదయినందున కొత్త ప్రభుత్వం ఏర్పరచే హక్కు తనకు ఉండాలని కోరాడు.

చరణ్‌సింగ్ హక్కు మరింత పటిష్ఠంగా ఉంది కాంగ్రెస్ (యు) అతని ప్రభుత్వంలో చేరటానికి ఆనందంగా అంగీకరించింది. దానిలో చవాన్ ఉపప్రధానమంత్రిగా ఉంటాడు ఇందిర కాంగ్రెస్ "బయటినుండి" సమర్థించటానికి హామీ ఇచ్చింది అయినా రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, సమస్యను తాను పరిష్కరించకుండా ఇరు పక్షాల వారిని తమ సమర్థకుల పట్టీలు చూపించవలసిందని చెప్పాడు. దేశాయ్ చూపించిన పేర్లలో అతనిని సమర్థించాలని ఏమాత్రం ఉద్దేశం లేని వారి పేర్లు కూడా చేరటం హాస్యాస్పదమయింది. దీనికి పశ్చాత్తాపపడుతున్నట్లు దేశాయ్ పార్లమెంటునుండి రాజీనామా చేశాడు. అతని స్థానంలో అందరూ అనుకొన్నట్టే జగజ్జీవన్ రామ్ జనతా నాయకునిగా ఎన్నుకోబడ్డాడు కాని అప్పటికే బాగా ఆలస్యమయింది జనతా ప్రభుత్వం చరిత్రలో కలిసిపోయింది చరణ్‌సింగ్‌ను ప్రభుత్వం ఏర్పరచవలసిందిగా రాష్ట్రపతి పిలుపునిచ్చాడు ఆ ప్రభుత్వం జులై 27న ప్రమాణ స్వీకారంచేసింది

1977 లో ఇందిర చిత్తుగా ఓడిపోయిన రోజు ఆమె "చరిత్రలోని చెత్తబుట్టలో చేరింది"ని అటల్ బిహారి వాజ్‌పాయ్ ప్రకటించాడు. తన విరోధుల గురించి ఇందిర వ్యక్తిగతంగా చెప్పిన చరమశ్లోకం . "జనతాప్రభుత్వం సింహంలా గర్జిస్తూ వచ్చి ఎలుకలా కీచుమని కూడా అనకుండా పోయింది "

## చరణ్‌సింగ్ దారి సమాప్తం

చరణ్‌సింగ్ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవటమే గాక తానే అదృష్టవంతుడుగా భావించసాగాడు లోక్‌సభ విశ్వాసాన్ని పొందటానికి అతనికి ఒక నెల గడువివ్వటమయింది దీనికై నిర్ణయించిన తేదీ 20 ఆగస్టున తనకు

గెలుపుంటుందని అతను నమ్మాడు ఒకరోజు ముందుగా అతనికి గొప్ప అఘాతం తగిలింది ఇందిర మనసులో మళ్ళీ ఎన్నికలు రావాలని ఉంది కాని కొత్త ప్రభుత్వం కాదు కాంగ్రెస్(ఐ) సమర్థన కావాలంటే స్పెషల్ కోర్టులు రద్దు చేయాలని చివరి నిమిషంలో తెలియజేసింది అతను ఈ మూల్యం చెల్లించే స్థితిలో లేడు. ఒక రోజయినా పార్లమెంటులో లేని భారత ప్రధానమంత్రిగా అతను రాజీనామా ఇచ్చి, మళ్ళీ ఎన్నికలు జరపవలసిందిగా రాష్ట్రపతిని కోరాడు రెండురోజుల తర్వాత సంజీవరెడ్డి లోక్ సభను రద్దు చేసి డిసెంబరు రెండో భాగంలో ఎన్నికలు జరిగేటట్లు ప్రకటించాడు. చరణ్‌సింగ్ "ఆపద్ధర్మ ప్రభుత్వానికి" అధిపతిగా ఉన్నాడు కాని విధాన సంబంధమైన ఏ నిర్ణయమూ తీసుకోకూడదని, కొత్త ఖర్చుకు దేశాన్ని గురిచెయ్య కూడదని కచ్చితంగా నిర్దేశించటమయింది

ఇందిరా కాంగ్రెసు, జనతా అంతఃకలహాలతో ఉండగా ఏ ఒక్క పార్టీకి మెజారిటీ వస్తుందన్న నమ్మకం పోయింది ప్రధానమంత్రి పదవికి పోటీ పడుతున్న వారి మధ్య పోట్లాట ఉన్నట్టు కనిపించింది వీళ్ళు వరుసగా చరణ్‌సింగ్, జగజ్జీవన రామ్, ఇందిరా గాంధి అని ప్రజాభిప్రాయాన్ని అధ్యయనం చేసేవారు అభిప్రాయ పడ్డారు కాని తీక్షణంగా చూడగలిగిన కొందరు పార్టీ వ్యవస్థ చక్కగా లేకపోయినా ఇందిరా కాంగ్రెస్ చక్కటి ప్రచారం చేయ గలిగింది సంజయ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ద్వారా ఇది సాధ్యమయింది. ఈ అవకాశం వినియోగించుకొని సంజయ్ . "తన మనుషులకు" పార్టీలో మూడింట ఒక భాగం టిక్కెట్లు పంచిపెట్టాడు ఇందిరాగాంధి లోని జనాకర్షణ తిరిగి పెంపొందటం ఎవరూ తగినంతగా గుర్తించలేదు. జనతా భయంకరమైన కార్యనిర్వహణ, బ్రహ్మాండమైన అసమర్థత ఇందిర ఉపయుక్తమైన నినాదం సృష్టించటానికి తోడ్పడింది : పనిచేయ గలిగిన ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

ఓట్లు లెక్కపెట్టటం 3 జనవరి 1980 న ప్రారంభమైంది ఒక గంటలో ఇందిర ఘన విజయం సాధించినట్లు స్పష్టమయింది ఒక పశ్చిమ బెంగాలులో గాక దేశమంతటా ఆమె గెలిచింది. ది టైమ్స్ ఆఫ్ ఇండియా మరుసటి రోజు ఇచ్చిన పతాక శీర్షిక "అంతటా ఇందిరే" అన్ని విషయాలూ చెప్పింది



## 10

# ఇందిరమ్మ మళ్ళీ రావటం

ఇందిరాగాంధి 1977 లో చిత్తుగా ఓడిపోవటాన్ని "బాలెట్ బాక్స్ తెచ్చిన విప్లవం" అని చాలా మంది భారతీయులు అన్నారు. ఆ వర్ణన కల్పన కాదు. కాని తన సంతానమే తనను భక్షించిన విప్లవంగా అది మారింది వెనుకటి అధ్యాయంలో అతి త్వరగా జనతా పతనమవటానికి కారణాలు చర్చించటమయింది జనతాలోని ముగ్గురు అత్యున్నత నాయకుల ఆకాంక్షల సంఘర్షణ వల్ల, అనునయింపలేని వ్యక్తిగతమైన ద్వేషాలవల్ల, సామూహికంగా వారి వయసు 235 సంవత్సరాలు కాగా, వారి అహంకారం విశ్వపరిమాణంలో ఉన్నందున జనతా చివరకు పతనమయిందని చెపితే సరిపోతుంది.

వారి అవమానకరమైన నిష్క్రమణకు మరో ముఖ్యకారణం రమేశ్ ఠాకూర్ చెప్పినట్లు "శ్రీమతి గాంధీని బాధించి, అవమానించాలనే మానసిక రుగ్మత" అతను అన్నట్లు ధి షా కమిషన్ రిపోర్టులు చక్కగా తయారైనవి చక్కగా వాదించినవి, చక్కగా ప్రచారం పొందినవి, కాని శ్రుతిమించినందున ప్రజలకు వినుగు కలిగించింది " సాహస పోరాటం జరిపే జర్నలిస్టు, దీర్ఘకాలంగా ఇందిరాగాంధి విమర్శకుడయిన అరుణ్ శౌరి (అటల్ బిహారి వాజ్‌పాయ్ ప్రభుత్వంలో స్టేట్ మంత్రి అయ్యాడు) ఈ విధంగా అన్నాడు. 1979లో ఎన్నికలు జరిగే సమయానికి షా కమిషన్ "ఇబ్బందికరంగా మారింది - శ్రీమతి గాంధీకి కాదు కాని జనతాకు."

ఎంతో గొప్పగా తాను తిరిగి అధికారంలోకి వచ్చినందుకు ఇందిర రెండు రెట్లు ఆనందించింది - తనకోసం, మరింత ఎక్కువగా సంజయ్ కోసం. అత్యధికమైన అతని అధికారానికి, అతని సింహాసనానికి ఎన్నికలు చట్టబద్ధమైన

రూపొన్నిచ్చాయి. ఇదివరకు ఎమర్జెన్సీ కోటగోడల వెనక వీటిని నిర్మించుకోవటమయిందనే కళంకముండేది అతని పద్ధతి ఏమాత్రం మారలేదు అయినా యువరాజుగా అతని స్థానాన్ని అందరూ అంగీకరించారు అధికారంలో ఉన్న కాంగ్రెస్ (ఐ)లో ఎందరో సంజయ్ మిత్రులున్నారు అతనికి విధేయులై ఉన్నారని గాక వారిని గురించి చెప్పుకోదగినది ఏదీ లేదు. ఇక్కడ సంజయ్ మాటే చట్టమయింది ఇందిర అతనిని తన మంత్రివర్గంలో చేర్చుకొన్నా ఎవరూ ఏమనేవారుకారు కాని ఆమెకు ఎంతో తెలుసు ఆ విధంగా చేయకుండా ఊరుకోటమే గాక ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా "సంజయ్‌ను తీసుకోవాల"న్న ప్రతిపాదన కూడా కాదన్నది. ఉత్తరప్రదేశ్ అధిక జనాభాతో రాజకీయంగా కీలకమైన రాష్ట్రం ఏమయినా సంజయ్‌కున్న భయంకరమైన అధికారానికి ఒక కేంద్రం కల్పించటానికి సంజయ్‌ను అఖిల భారత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించింది.

రెండవసారి అధికారంలోకి వచ్చినపుడు ఇందిర తీసుకొన్న మొదటి చర్య జనతా చేసినట్లే చేయటం మూడేళ్ళ క్రితం పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెసు ఓడిపోయిన తొమ్మిది రాష్ట్రాలలో దేశాయి ప్రభుత్వం కాంగ్రెసు ప్రభుత్వాలను రద్దు చేసింది కాంగ్రెస్ ప్రజల అభిమతాన్ని రాష్ట్ర స్థాయిలో కూడా కోల్పోయిందని ప్రత్యేకంగా జనతా వాదించింది సుప్రీంకోర్టు దానిని సమర్థించింది ఆ తర్వాత వచ్చిన ఎన్నికలలో జనతా, తన మిత్రపార్టీలు ఈ రాష్ట్రాలన్నిటిలో గెలుపొందాయి. ఇందిర అదే వాదాన్ని ముందుకు తెచ్చి తొమ్మిది రాష్ట్రాలలో శాసనసభలు రద్దుచేసి కొత్తగా ఎన్నికలు తెచ్చింది ఈసారి కాంగ్రెస్ ఆ రాష్ట్రాలన్నీ గెలుచుకొంది. దెబ్బకు దెబ్బ తీసే రాజకీయాలింతేనని ఎనిమిది రాష్ట్రాలు సరిపుచ్చుకొన్నాయి కాని పంజాబులో శిక్కులకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనే అకాలీ పార్టీ తన ఓటమికి మండిపడింది "శిక్కుల పార్టీ"ని చట్ట విరుద్ధంగా పడగొట్టటానికి తొమ్మిది రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల నాటకం, ఒక "ముసుగ" ని అన్నారు. ఈ ఒక్క రాష్ట్రంలోనే అకాలీ పార్టీ అధికారంలోకి వచ్చే వీలుంది

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి, దేశ విభజన తర్వాత అకాలీలు ఎన్నడూ అధికారంలోకి రాలేదు దేశంలో రెండు శాతం మాత్రమే ఉన్న శిక్కులు పంజాబీ సుబా ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతంలో హిందువులకంటె కొంచెం ఎక్కువ సంఖ్యలో ఉన్నారు ఇక్కడ కూడా అధికారంలోకి రాలేదు సాధారణంగా అధికసంఖ్యలో ఉన్న హిందూ ఓట్లతో, వెనుకబడిన మజబీ శిక్కుల ఓట్లతో కాంగ్రెస్ సులభంగా గెలిచేది ధనవంతులైన జాట్ సమాజం దౌర్జన్యంగా ఉండటం మజబీలకు నచ్చేది కాదు ఆరవ దశకంలో రెండుసార్లు అకాలీలు అధికారంలోకి వచ్చారు అది కూడా హిందుత్వము చాటిచెప్పే జనసంఘ్ మైత్రితో వీలయింది రెండుసార్లు ఈ పార్టీల కలయిక తాత్కాలికమయింది. 1977లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా వచ్చిన ఓట్లతో అకాలీదల్ పంజాబ్‌లో తన బలంతోనే అధికారంలోకి వచ్చింది అయినా జనసంఘ్‌తో భాగస్వామ్యం పెట్టుకొంది కేంద్రంలో వారితో అధికారాన్ని పంచుకొంది 1980 లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు అకాలీ పార్టీకి తీవ్ర ఆఘాతాన్ని కలిగించింది పదహారు సీట్లలో లోక్‌సభకు ఒకే ఒక సీటు గెలుచుకొంది కాని రాష్ట్ర శాసనసభలో తమకు పూర్తిగా మెజారిటీ ఉన్నందున ఐదేండ్ల పాలనకాలం పూర్తి చేసే హక్కు తమకుందని అన్నారు

కాని తొమ్మిది శాసన సభల రద్దు తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అకాలీపార్టీ చిత్తుగా ఓడిపోయింది శిక్కు సమాజం సుసంపన్నమైనదైనా ఈ అకాలీ క్రోధం, అసంతృప్తి పదేళ్ళపాటు పంజాబును రగిల్చటానికి, చివరకు ఇందిర ప్రాణాలు తీయటానికి కారణాలయ్యాయి.

కాని పంజాబు ఉపద్రవం మరో ఏడాదికి గాని రాలేదు. ఇందిర మనసులో నున్న పెద్ద సమస్య ఆఫ్ఘునిస్థాన్ భారత ఉపఖండానికి, రష్యాకు మధ్యస్థ రాజ్యంగా ఉంది ఇది భారత భద్రతకు, హితాలకు ముఖ్యమైనది

## ఆఫ్ఘున్ దూలగొండిని పట్టుకోటం

డిసెంబరు 26, 1979 న సోవియెట్ టాంకులు, సైనిక దళాలు కాబూలులోకి వచ్చాయి అక్కడ బలహీన పడిన మిత్ర పరిపాలనకు సమర్థన నివ్వటానికే వచ్చాయి భారతదేశం గట్టిగా తలవడుతున్న జనరల్ ఎలెక్షన్లలో

నిమగ్నమయినందున ఇంత తీవ్రమైన పరిణామం పట్ల శ్రద్ధ వహించలేదు. అప్పటికి చరణ్‌సింగ్ ఇంకా ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ఉన్నాడు ఈ సమస్యలోని చిక్కుల అవగాహన ఆయనకు పరిమితంగా ఉంది ఎన్నికలలో ఆయన పూర్తిగా ఓడిపోయిన తర్వాత కూడా పరిస్థితి బాగుపడలేదు ఇందిర 6 జనవరి 1980 న గొప్పగా విజయం సాధించినప్పటికీ శుభప్రదమైన మకర సంక్రాంతి వచ్చేవరకు ఆమె పదవీ స్వీకారం చేయదలచుకోలేదు. ఆపద్ధర్మ ప్రభుత్వం నుండి కొత్త ప్రభుత్వానికి అధికారం రావటంలో జాప్యం, ఉత్సాహంగా ఆమె విజయం వేడుకలు జరుపుకొంటున్న జన సమూహాలు ఇందిర చిన్న గృహం, 12 విల్లింగ్‌డన్ క్రెసెంట్ వద్ద చేరటం మూలంగా ఐక్యరాజ్యసమితిలో ఉన్న భారత రాయబారికి సూచనలివ్వటంలో కొంచెం తికమక జరిగింది ఐక్యరాజ్య సమితిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు, తన మిత్ర రాజ్యాలు, చైనాతోసహా కలిసి చిన్న పొరుగు రాజ్యంపై దాడి జరిపిన సోవియెట్ పై తమ కోపం వ్యక్తం చేస్తూ ఆ "దుష్ట సామ్రాజ్యం" పై చర్య తీసుకోవాలని కోరసాగాయి "ఏ మాత్రం ఒప్పుకోలేని" సోవియెట్ చర్య విషయంలో భారతదేశం "మితిమీరి అర్థం చేసుకొంటున్నట్టు" ఒక విధమైన భావం పెంపొందసాగింది. ఇందిర త్వరగా దీనిని చక్క దిద్దింది సంక్లిష్టంగా, చిక్కుగా ఉన్న విదేశీ విధాన సమస్యలను సంబాళించుటలో తనకు గల చాకచక్యాన్ని తెలియజేసింది

ఐదవ దశకం నుండి భారతదేశానికి, సోవియెట్ యూనియన్‌కు మధ్య సంబంధాలు స్నేహ పూర్వకంగా ఉండేవి ఆమె తండ్రి కాలంలోను, ఆ తర్వాత ప్రధాన మంత్రిగా పదకొండేళ్ళు ఆమె కొనసాగిన కాలంలోను సంబంధాలు బాగుండేవి ఆమె పాలనలో భారత-సోవియెట్ ఒప్పందం కుదిరింది. మాస్కో ఆమె పట్ల ఎప్పుడూ గౌరవభావం ప్రకటించింది కాని ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత బహుశా జనతా ప్రభుత్వం విదేశాలన్నిటికీ ఏ సంబంధమూ పెట్టుకోవద్దని చెప్పినందున ఆమె పట్ల సరిగా వ్యవహరించలేదు కాబట్టి సోవియెట్ సహాయానికి త్వరపడాలనే ఉత్సాహం ఆమెకేమీ లేదు. అయితే భారతదేశం హితం గురించి ఆలోచించేటప్పుడు ఆమె వ్యక్తిగత భావనలకు చోటిచ్చేది కాదు

న్యూఢిల్లీకి వరుసగా వస్తున్న విదేశీ ప్రముఖులకు ఆమె తన ఆఫ్ఘన్ విధానం స్పష్టం చేసింది ఆ తర్వాత ఆమె దేశానికి విచ్చేసిన ఫ్రెంచి అధ్యక్షుడు జిస్కార్డ్ డిస్టెయింగ్ కలిసి జారీ చేసిన ప్రకటన అలీన రాజ్యాల విదేశ మంత్రుల సమావేశంలో అందరి సమ్మతినీ పొందింది. ఇందులో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కూడా భాగస్వాములే. దాని సారాంశమేమిటంటే విదేశ సైనిక దళాలు ఏరాజ్యం భూమిపైన కూడా ఉండకూడదు ఆఫ్ఘన్ సమస్యకు రాజకీయ పరిష్కారం చూడాలిగాని సైనిక పరిష్కారం కాదు ఇది త్వరగా జరిగితే సోవియెట్ యూనియన్‌ను వెంటనే తన దళాలను వెనక్కు మళ్ళించమని అడగవచ్చు ఫ్రెంచ్ అధ్యక్షుడు స్వదేశం వెళ్లిన తరువాత అనుభవజ్ఞుడైన సోవియెట్ విదేశమంత్రి (ఆ తర్వాత సోవియెట్ అధ్యక్షుడు) అంద్రేయ్ గ్రోమికో ఢిల్లీకి వచ్చాడు ఆమెకు అతనికి మధ్య జరిగిన సమావేశాన్ని ప్రపంచం ప్రత్యేకంగా గుర్తించింది. గ్రోమికో చాలా సేపు విశదీకరించిన విషయాన్ని ఆమె శ్రద్ధగా విన్నది కాని తనకు స్వాభావికమైన మౌనం వహించింది రాయబార కార్యంలో నిపుణుడైన గ్రోమికో ఆమె ప్రతిక్రియకోసం చూస్తున్నానని చెప్పాడు "ఆ విషయమా? నేను మిమ్మల్ని ఇందులో సమర్థించలేను. మీకు సాయం చెయ్యలేను." కాని అమెరికా, చైనాలు కలిసి "సోవియెట్ యూనియన్‌ను ఏకగళంతో ఖండించడంలో, చేరటానికి కూడా నిరాకరించింది

త్వరలోనే ఆఫ్ఘన్ సమస్య భారత దేశ భద్రతకు ప్రత్యక్షంగా ప్రమాదకరంగా మారింది. మిగిలిన సంవత్సరాలలో అది ఆమెకు వ్యాకులత కలిగిస్తూనే వచ్చింది. బంగ్లాదేశ్ విముక్తి తర్వాత భారతదేశానికి ప్రమాదకరంగా మారే స్థితిలో పాకిస్థాన్ లేదు జుల్ఫికర్ ఆలీ భుట్టోకు మరణశిక్ష విధించినందుకు ఇస్లామాబాద్‌ను శిక్షించటానికి అమెరికా ఏప్రిల్ 1979లో సహాయం అందించటం మానేసింది అప్పటివరకు ఎన్నికలలో ఎన్నుకోబడిన పాకిస్థాన్ ప్రధానమంత్రి అతనొకడే జనరల్ జియా ఉల్ హక్ మిలిటరీ పాలనలో అతనిని ఉరితీయటమయింది అందుకని పాకిస్థాన్ అంటరానిదయింది కాని హఠాత్తుగా, రాత్రికి రాత్రే "ఆఫ్ఘనిస్థాన్‌పై దాడి చేసిన వారి"తో పోరాడటానికి "ముందువరుసలోని రాజ్యం"

గా భావింపబడింది ప్రెసిడెంట్ కార్టర్ పాకిస్థానుకు 400 మిలియన్ డాలర్ల మిలిటరీ పరికరాలు ఇవ్వటానికి సిద్ధపడ్డాడు జియా దీనిని "అతిస్వల్పమ"ని తిరస్కరించాడు అప్పుడు సైనిక, ఆర్థిక సహాయం కలిపి మూడు బిలియన్ డాలర్లకు పైగా ఉండేటట్లు అంగీకరించింది. వీటిలో పేరొందిన అణుశక్తిగల యఫ్ - 16 విమానాలు కూడా ఉన్నాయి ఇందిర చాలా వ్యాకులపడింది. రెండువైపులా పాకిస్థాన్, బలసంపన్నమైన చైనాల నుండి రక్షించుకోటానికి రక్షణకు పెద్ద ఎత్తున వనరులు తరలించవలసి వచ్చింది.

**విజయం విషాదమయింది**

ఆఫ్ఘనిస్థాన్ పట్ల నిరంతరం జాగురూకతతో మెలగ వలసి వచ్చింది కానీ ఇందిరకు తన అసలైన కష్టాలు దేశంలోనే ఉన్నాయని తెలుసు ఆమెకు సుపరిచితమైన సమస్యలు - హరిజనులమీద అత్యాచారాలు, మతకలహాలు, కులాల ఘర్షణలు, అప్పుడప్పుడు భాషకు జాతికి చెందిన లేక ఆదివాసులకు చెందిన తిరుగుబాట్లు, పెరుగుతున్న ధరలు - ఆమె 33 నెలలు అధికారంలో లేకపోయేసరికి పరిస్థితులు మరీ విషమించాయి. జూన్ మధ్యలో ఆమెకు, సంజయ్‌కు అంతగా విచారించవలసిన విషయాలేవీ లేవు దీనికి భిన్నంగా పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయి అప్పుడప్పుడూ కొన్ని విచిత్రమైన సంఘటనలూ ఉన్నాయి నాలుగవసారి (అదే ఆఖరిసారయింది) ఆమె ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉదయం,ఆమెను విచారించటానికి జనతా ఏర్పరచిన రెండు స్పెషలు కోర్టుల న్యాయమూర్తులు అవి "రాజ్యాంగబద్ధం కాదని" వాటిని "రద్దు" చేశారు కిస్సాకుర్సీ కా ఫిలిం నిర్మాత అమృత్‌నహాతా, తన ఫిలింను కాల్చివేశారని కేసుపెట్టిన వ్యక్తి "ప్రతీకారం తీర్చుకోవాలనే కోపంతో సంజయ్, శుక్లాలపై "తప్పుడు నేరము" మోపానని పశ్చాత్తాపం వెలిబుచ్చుతూ ప్రమాణపత్రం కోర్టుకు సమర్పించాడు

ఇందిరాగాంధి నుండి విడిపోయిన "పాత కాంగ్రెస్" నాయకులు ఒక ఊరేగింపులా కాంగ్రెస్ (ఐ)లో చేరటానికి వచ్చారు. వీరిలో హర్యానా జనతా ముఖ్యమంత్రి ప్రముఖ పాత్ర వహించాడు 12 విల్లింగ్‌డన్ క్రెసెంటుకు వచ్చి

సంజయ్‌కు పూలమాల వేశాడు గౌరవపూర్వకంగా ఇందిరకు ప్రణమిల్లాడు హార్యానాలో జనతా ప్రభుత్వం కాంగ్రెస్(ఐ) ప్రభుత్వంగా మారిందని ప్రకటించాడు.

దీనికంటె ముఖ్యమైనది తొమ్మిది రాష్ట్రాలలో పార్టీ విజయం సాధించటం. సంజయ్ అధికారం మళ్ళీ ప్రదర్శనలోకి వచ్చింది తనే వాస్తవంగా తొమ్మిది మంది ముఖ్యమంత్రులను పేర్కొన్నాడు అనుకొన్నట్టే కొందరిని ఎన్నుకోటంలో తప్పు చేశాడు. తర్వాత ఇందిరకు అది ఇబ్బందికరమైంది సంజయ్‌ను యధావిధిగా పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించటానికి తల్లీకొడుకులిద్దరూ ఆనందంగా ఏఐసిసి ముఖ్యకార్యాలయానికి వెళ్ళారు .

సరిగా పదిరోజులు తర్వాత 23 జూన్ 1980న సంజయ్ ఒక విమానాన్ని విన్యాసాలు చేయిస్తూ మరణించాడు ఇందిరకు అంతకంటె పెద్ద దెబ్బ మరొకటి లేదు అతనికి 33 ఏండ్లు ఊరడింపశక్యం గాని తల్లిని, చిన్నవయసులో ఉన్న భార్య మేనకను, మూడు నెలల క్రితం పుట్టిన కొడుకు ఫిరోజ్ వరుణ్‌ను విడిచి పెట్టి వెళ్ళాడు

సంజయ్ అకాలమరణం ఇందిరాగాంధి మీద ఎటువంటి ప్రభావం చూపింది అన్నది బహు చర్చితం ఈ సమయంలో ఆమె దుఃఖాన్ని "దిగమింగలేదు" కాని ఆమె చెప్పినట్లు దుఃఖంతో జీవించటం నేర్చుకుంది అని చెపితే సరిపోతుంది. ఇందిరకు చాలా కాలం ప్రైవేటు సెక్రటరీలుగా పని చేసిన ఇద్దరిలో ఒకరయిన యన్ కె శేషన్ తానెంత న్యాయప్రవర్తన కలవాడో అంత ముక్కుసూటి మనిషి. "ఒకవేళ సంజయ్ లేకపోతే ఆమె మరింత గొప్ప నాయకురాలిగా రాణించేది" అనే తన అభిప్రాయాన్ని అతనెన్నడూ దాచుకోలేదు అతను చక్కగా ఆలోచించి వెలిబుచ్చిన విషయం, సంజయ్ మరణం ఇందిరాగాంధి జీవితంలో వదిలిపెట్టిన "శూన్యం" మరెవ్వరూ "రాజీవ్‌కూడా" నింపలేక పొయ్యారు.

తల్లిని స్తబ్ధురాలిని చేసిన సంజయ్ మరణం కూడా తన తల్లిపై, ఆమె ప్రభుత్వంపై అతనికున్న ప్రభావం తెచ్చిన దుష్ఫలితాలను స్పష్టంగా తెలియ జేసింది. సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్ ఏర్‌మార్షల్ జె జహీర్ ప్రధానమంత్రిని ఆమె కొడుకు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తున్నాడని, ఆ విధంగా తన

జీవితానికి, ఇతరుల జీవితాలకు ముప్పు తెస్తున్నాడని హెచ్చరించినందున ఆమెకు తెలియకుండానే అతని బదిలీ జరిగింది మరో విషయం కూడా వెలుగులోకి వచ్చింది సంజయ్‌ను కూల్చిన విమానం, ధీరేంద్ర బ్రహ్మాచారి విదేశీ శిష్యుడు ఆ "పవిత్రమైన వ్యక్తికి" ఇచ్చిన కానుక ధీరేంద్ర బ్రహ్మాచారి ఎప్పుడూ సంజయ్ వెంటే ఉండేవాడు. అతను ప్రధానమంత్రి వద్దకు నిరాటంకంగా వెళ్ళగలిగేవాడు ఆ విమానాన్ని ఏ పన్నులూ చెల్లించకుండానే దిగుమతి చేసుకోటమయింది సంజయ్ అంతిమక్రియలు కూడా కీర్తి సంపన్నుడైన అతని తాతగారి సమాధికి చాలా సమీపంలో ఎంతో ఆడంబరంగా జరగటం కూడా విమర్శకు గురయింది "ముఖస్తుతి వాస్తవమైన భావావేశాలను మరుగు పరుస్తుంది" అని తారిక్ అలీ వ్రాశాడు

సంజయ్ గౌరవార్థం సున్నపు గోపురాలు కట్టటం ప్రారంభమైంది అతని విగ్రహాలు అన్ని చోట్లా వెలిసాయి అతని జ్ఞాపకార్థం కొత్త పాఠశాలలు లేక ఆస్పత్రులు కట్టలేని చోట అప్పటికే ఉన్న రోడ్లను, సంస్థలను అతని పేర పెట్టటం ప్రారంభించారు అతనిని సంస్మరణ సమావేశాలు వెత్రితలలు వేశాయి. ప్రభుత్వంలో ఉన్న పెద్ద నాయకులు, పార్టీ నాయకులు సంజయ్‌ని జీసస్‌క్రైస్టుగా, ఆది శంకరాచార్యగా వర్ణించటమేగాక (బహుశా వాళ్ళు 33 ఏండ్ల వయసులో మరణించినందుకేమో) ఏమాత్రం వివరించలేని విధంగా కార్ల్‌మార్క్స్‌తో, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కూడా పోల్చారు "భారత దేశ పుత్రుని" మరణానంతరం అతిశయించిన వ్యక్తిఆరాధన హఠాత్తుగా పూర్తిగా ఆగిపోయింది అది ప్రారంభించినప్పటినాటి అనుచితమైన పరిస్థితుల వంటి పరిస్థితులలోనే ఈవిధంగా జరిగింది

### వారసత్వ సంలక్షణం

సంజయ్ ఆరాధన వెనుదిరగటానికి, గాంధీ కుటుంబంలో అతను ఖాళీ చేసిన స్థానాన్ని ఎవరు పూరిస్తారని వెనువెంటనే పైకి ఉబికిన తగాదాకు సంబంధం ఉంది సంజయ్ భార్య మేనక వయసులో, తీవ్రమైన ఆకాంక్షతో ఉన్న వ్యక్తి తన భర్త వారసత్వం తనకు చెందటమే సమంజసమని భావించింది దానికోసం

పోరాడటానికి కూడా వెనుకాడలేదు ఇందిరాగాంధీకి ఇదే మాత్రమూ ఇష్టం లేదు సంజయ్ బతికున్నప్పుడు కూడా చిన్న కోడలితో ఆమె సంబంధాలు మొదట సందిగ్ధంగా, తర్వాత ఇబ్బందికరంగా, చివరకు ప్రతికూలంగా మారాయి దీనికి విరుద్ధంగా ఆమెకు రాజీవ్ భార్య అయిన సోనియాతో సంబంధాలు ప్రేమాస్పదంగా, పరస్పరం సహాయం చేసుకొనేటట్లున్నాయి

రాజీవ్‌కు రాజకీయాలపట్ల ఆసక్తిలేదని, ప్రమాదకరమైన విమానాలు నడిపే వృత్తి వదిలిపెట్టి, తన తల్లికి ఎంతో అవసరమైన "సహాయాన్ని" రాజీవ్ అందజేయాలని ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ అతను రాజకీయాలలో ప్రవేశించటాన్ని సోనియా వ్యతిరేకిస్తుందని గుర్తించిన మేనక సంతోషించింది రాజీవ్ "సోమరి" అని, తనకు చెందిన పాత్రను "బలవంతాన లాక్కోలేడ"ని మేనక అతనిని లక్ష్యపెట్టలేదు ఆమె తన అత్తగారికి తనపట్ల ఉన్న అనుమానాలను, తనంటే ఉన్న అయిష్టాన్ని మేనక గుర్తించలేక పోయింది. ఇందిర స్పష్టంగా చెప్పకపోయినప్పటికీ ఆమెకు రాజీవ్ పట్లే మొగ్గుంది అమిత సంఖ్యలో వస్తున్నవారు రాజీవ్‌ను "తీసుకోవాల"ని కోరినప్పుడు ఆమె సమాధానంగా వారు ఆ యువకునికి "అనునయించి" చెప్పాలని, రాజీవ్ వాస్తవానికి "నిర్ణయం" తీసుకోవాలని చెప్పేది

సంజయ్ మరణం తర్వాత ఐదు రోజులకు ప్రముఖ జర్నలిస్టు, రచయిత ఖుష్వంత్‌సింగ్ తాను సంపాదకుడుగా ఉన్న హిందూస్థాన్ టైమ్స్‌లో చాలా జనాదరణ పొందిన కాలమ్‌లో ఈ విధంగా వ్రాశాడు· "సంజయ్ ఆరాధనకు ఒకే ఒక వారసురాలు బహుశా మేనక మాత్రమే ఆమె కూడా తన భర్తలాగ భయమెరుగని మనిషి రెచ్చగొడ్తే మాత్రం సింహం మీద స్వారి చేస్తున్న దుర్గ అవతారమే " ఇందిరకు చాలా కోపం వచ్చింది మేనక "వ్యూహాలు, అనుబంధాలు" విషయమై ఆమె అనుమానాలు పెరిగాయి రాజ్యసభకు ఖుష్వంత్‌ను ప్రతిపాదించినది సంజయ్. ఇప్పుడతనిపట్ల సదభిప్రాయం పోయింది ఒకే ఇంట్లో సింహవాహినులైన ఇద్దరు దుర్గలు ఉండటానికి వీలులేదని స్పష్టంకాసాగింది కాని తన భర్త పేరు పెట్టిన సంజయ్ కొడుకంటే ఇందిరకు చాలా మక్కువ ఆ

బిడ్డ నుండి విడిపోవటమనే ఆలోచనే ఆమెకు కష్టం కలిగించేది ఏమైనా ఏదో ఒక నిర్ణయానికి రావటానికి రాజీవ్ చాలా సమయం తీసుకొంటున్నాడు కాబట్టి ప్రధాన మంత్రి ఇంట్లో నివసిస్తున్నప్పటికీ సంజయ్ వారసత్వానికి తనకున్న హక్కు కోసం ఒత్తిడి తీసుకురావచ్చని మేనక అనుకొంది.

రాజీవ్ ఏ నిర్ణయమూ తీసుకోకపోవటం, మేనక ఉద్రిక్తత చెందటం, చిరచిరలాడటం గమనించిన ఇందిర సంజయ్‌కు ముఖ్య స్నేహితుల అధికారాన్ని, పలుకుబడిని తొలగించటానికి త్వరగా చర్య తీసుకొంది తన కొడుకు చేర్చిన మూకను కొడుకు మాత్రమే నియంత్రణలో ఉంచగలిగేవాడని తెలిసిన ఇందిర ఇప్పుడు వారిని చెదరగొట్టవలసిన అవసరముందనుకొంది అంతేగాక సంజయ్ స్నేహితుల మధ్య తన అధికారానికి ఆధారం పెంపొందించుకోవాలని మేనక చేసే ప్రయత్నం విఫలం చేయాలని కూడా ఆమె అనుకొంది. సంజయ్‌కు చాలా దగ్గరగా చేదోడుగా ఉన్న అక్బర్ అహమద్ "డంపీ" విషయంలో జరిగినది అన్నిటినీ స్పష్టం చేస్తుంది ప్రధానమంత్రి ఇంటికి అతనికి స్వేచ్ఛగా రాక పోకలుండేవి తనకు సెల్యూట్ కొట్టే గార్డులు ఒకరోజు అతనులోపలికి వెళ్ళటానికి వీలు లేదన్నప్పుడు అతను అప్రతిభుడయ్యాడు అతను కోపంతో రెచ్చిపోగా గార్డులు తాము ఆజ్ఞప్రకారం చేస్తున్నామన్నారు "ఈ బుద్ధిలేని ఉత్తర్వు ఎవరిచ్చారు?" అని "డంపీ" గట్టిగా అరిచాడు. "నేను ఇచ్చాను" అంది ఇందిర గేటు దగ్గరకు వస్తూ ఇది "డంపీ" స్వయంగా ఉల్లేఖించింది

మేనక తన భర్తలాగే ఏ మాత్రం నేర్పు లేనిది అందుకే మీడియాకు ఇచ్చే సుదీర్ఘమైన ఇంటర్వ్యూలలో, రాజీవ్ "మమ్మీకి సహాయం" చేయటానికి రాజకీయాలలోకి రావాలని నిర్ణయించినపుడు మేనక తన నిరాశను వ్యక్తం చేయటానికి వెనుకాడలేదు రాజీవ్ తన సోదరుని పార్లమెంటరీ నియోజక వర్గం అమేథీ నుండి పోటీ చేశాడు. సులభంగానే గెలిచాడు ఎన్నికలలో మేనక తప్పక సవాలు చేసేది కాని పార్లమెంటు మెంబరుకు కావలసిన కనీసమైన వయసు అప్పుడు ఆమెకు లేదు

సమష్టి కుటుంబాలలో అత్తకు, కోడలికి ప్రతిరోజూ తగాదా జరగటం మామూలే ఈ దేశంలో వినోద పరిశ్రమకు అది ముఖ్యమైన సరుకు కాని దేశంలోని ప్రథమ కుటుంబంలో ఈ విలక్షణ నాటకం భిన్నమైన వినోదాన్నిచ్చింది దీనిలో వ్యక్తిగతమైన తగాదా రాజకీయాల తగాదాగా మారింది.

మేనక – రాజీవ్‌ల పోటీ, ప్రధానమంత్రి ఆమె చిన్న కోడళ్ళ మధ్య తీవ్రమైన వివాదాలు ఇందిరా గాంధికి "రాజవంశం" వైపు మొగ్గుందని, తన రక్త సంబంధీకులకే వారసత్వం కట్ట బెట్టాలనుకొంటోందని ఆమెను నిందించే వారికి మరింత దోహదం చేశాయి. సంజయ్ యువరాజుగా గుర్తింపబడిన రోజులనుండి ఈ విమర్శ కొనసాగుతోంది రాజీవ్‌ను రాజకీయాలలోకి ప్రవేశ పెట్టినపుడు అంత పెద్దగా విమర్శ రాలేదు

దీనికి భిన్నంగా అతనిని కాంగ్రెస్ (ఐ) నాయకత్వంలోకి తీసుకు రావటానికి స్వాగతం పలికారు దానికి కొంత కారణం ఇతను తమ్ముకి పూర్తిగా భిన్నమైనవాడు. పెద్దలను గౌరవించేవాడు. తన వయసు వాళ్ళతో మర్యాదగా ప్రవర్తించేవాడు తన తల్లి వెనక కనిపించకుండా పనిచేయటంతో తృప్తి పడేవాడు. అతనిపట్ల "శుభ్రమైనవాడు" (మిస్టర్ క్లీన్) అనే భావముండటం కూడా చాలా సాయపడింది అతనితో పాటు అధికారంలోకి వచ్చిన వాళ్ళు కూడా చక్కగా ప్రవర్తించేవారు వ్యాఖ్యాతలు "సంజయ్‌గూన్స్, రాజీవ్ డూన్స్" మధ్య పోలికలు తెచ్చేవారు సంజయ్‌ది రౌడీ మూక అయితే రాజీవ్‌ది డూన్ స్కూల్లో చదివిన వారి నాగరిక సమూహం

"డైనాస్టీస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్" (భారతదేశానికి, ఆవల ప్రదేశాలకు చెందిన రాజవంశాలు) అనే పుస్తకంలో నేను వాదించినదిదే భారత దేశంలో, ఈ ఉపఖండంలో "పాలకుని కొడుకును లేక కూతురిని రాబోయే పాలకునిగా లేక పాలకురాలిగా స్వీకరించటం చాలా సహజం " ఇక్కడ ఉల్లేఖించబడింది, ఒకప్పుడు జుల్ఫికర్ అలీ భుట్టోకు సహాయకునిగా ఉన్న రాజా అన్వర్ వ్రాసినది ఆయన ఇంకా ఇలా అన్నాడు .. "వంశపారంపర్యపు భావం ఎంతగా ఆమోదింపబడిందంటే బ్రిటిషు పాలన నుండి ఎన్నికై,

ప్రతిపాదించిన ప్రతి మండలిలోను కొన్ని కుటుంబాల సభ్యులు అలిఖిత అధికారంతో కూర్చుంటూ వచ్చారు శ్రీలంక మొదటి ముగ్గురు ప్రధానమంత్రులు సేనానాయకే వంశానికి చెందిన వారు. నాలుగవ వాడయిన యస్ డబ్ల్యు ఆర్.డి. బండార్ నాయకే వితంతువు, సిరిమావో, 1960లో తన భర్త హత్య తర్వాత ప్రపంచంలో న్యాయబద్ధంగా ఎన్నికైన ప్రథమ మహిళా ప్రధానమంత్రి. ఇందిర రెండవ మహిళా ప్రధానమంత్రి.

ఈ విషయాన్ని మరింత కొనసాగించకుండా, భారతదేశంలో కూడా ఇందిరాగాంధి రాజీవ్‌ను గాని, సంజయ్‌నిగాని తన వారసునిగా తీర్చి దిద్దకముందే వంశపారంపర్య సూత్రం అమలులో పరిమితంగానైనా ఉండేది అని చెప్పవచ్చు ఉదాహరణకు, మధ్యప్రదేశ్‌లో శ్యామా చరణ్ శుక్ల మొదట తన తండ్రి రవిశంకర శుక్ల అసెంబ్లీ సీటు, ఆ తర్వాత ముఖ్యమంత్రిపదవి పొందాడు సర్దార్ పటేలు, రాజేంద్రప్రసాద్ రాజాజీల కొడుకులు, బంధుప్రీతి అనే మాటలేకుండా పార్లమెంటుకు ఎన్నికయినపుడు ఇందిర అప్పుడప్పుడు పార్లమెంటును చూడటానికి వెళ్తుండేది అయితే నెహ్రూ–గాంధి వంశంలో కళ్ళు జిగేల్ మనిపించే ప్రత్యేకత ఉన్నమాట నిజమే (ఢిల్లీలోని డైనాస్టీని మించిన డైనాస్టీ దల్లాస్‌కు పోటీగా, అని సాల్మన్ రష్దీ అన్నాడు) అయితే భారత దేశంలో ఇదొకటే కుటుంబం కాదు మరెన్నో కుటుంబాలున్నాయి జమ్మూ, కాశ్మీర్‌లో అబ్దుల్లాలు, ముఫ్తీలు, తమిళ్ నాడులో కరుణానిధులు, ఉత్తరప్రదేశ్, బీహారులలో యాదవులు; ముంబయ్‌లో ధాకరేలు ఉన్నారు కాని వీరు చిన్న, మధ్య శ్రేణి వంశాలు. తమ ప్రాంతానికి చెందినవారు. దేశమంతటా వీరి ప్రభావం ఉండే ఆస్కారం లేదు

అన్నిటికంటె ముఖ్యమైన విషయం వంశపారంపర్యంగా పదవి రావటమన్నది ఎన్నికలలో ప్రజలు ఎన్నుకొంటేనే జరుగుతుంది లేకపోతే ఇది వీలు కాదు. అందుకే "రాజవంశపు రాజకీయాల"నే ఫిర్యాదు ఇందిరకు ఎన్నడూ అపకారం చెయ్యలేదు. ఇక ఇంట్లోని తగాదా విషయానికి వస్తే ఎంతో కాలంగా అనుకొంటున్న విచ్ఛేదం మేనక, ఆమె అత్తగారి మధ్య మార్చి 1982లో వచ్చింది. ఫెస్టివల్ అఫ్ ఇండియా ప్రారంభించటానికి ఇందిరాగాంధి లండన్ వెళ్ళింది

బయట ప్రపంచానికి భారతదేశ సంస్కృతి, జానపద కళలు, హస్త కళలు తెలియజేయటానికి ఈ పండుగ గొప్ప ప్రయత్నమని అందరూ భావించారు ఇందిరలేనప్పుడు మేనక సంజయ్ అనుయాయులను లక్నోలో సమావేశపరచి సంజయ్ విచార్ మంచ్ ప్రారంభించాలనుకొంది తన కోడలు ఆ సమావేశానికి వెళ్తే మళ్ళీ 1 సఫ్దర్‌జంగ్ రోడ్డుకు రానక్కరలేదని ఇందిర హెచ్చరించింది. మేనక ఈ ఉత్తర్వును పాటించలేదు తిరిగి ప్రధానమంత్రి ఇంటికి వచ్చింది దీని ఫలితంగా ఇందిరకు మేనకకు మధ్య పదునైన మాటలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి ఇవి వార్తా పత్రికలకు అందాయి.

మేనక తన అత్తగారిని రెచ్చగొట్టటానికి చేయవలసినదంతా చేసి చివరకు ఎలా ప్రవర్తించిందంటే ప్రసారమాధ్యమాలు, ప్రజలు కూడా సానుభూతితో "పాపం కోడల్ని బయటకు నెట్టేశారు" అనుకొన్నారు ఇది చిత్రంగానూ, అర్థంకాకుండానూ ఉంది ఇందిర ఏ మాత్రం చలించకుండా వాస్తవానికి చిరునవ్వుతో తనతో పరమ శత్రుత్వం వహించిన వారితో కూడా వ్యవహరించింది కాని మేనక, కేవలం ఒక బాలిక అయినా, తన ఎదిరింపుకు ఇందిర చలించిపోయింది దానితో ఒకసారి, మేనక పెళ్ళి తన కొడుకుతో జరిపించటం "ఆమెను ఎలాగైనా తమ ఇంట్లో ప్రవేశింపజెయ్యాలనే కుట్ర" అని చెప్పింది మేనక ఇందిరను "రక్తం త్రాగే" కాళికా దేవితో పోల్చింది ఇందిరా గాంధి హత్య తర్వాత నాలుగు రోజులకు ప్రచురింపబడిన ఒక వ్యాసంలో, ఇందిరతో ఎన్నో దశాబ్దాలుగా స్నేహం కొనసాగించిన మేరీ సీటన్ ఈ విధంగా వ్రాసింది ఇందిర చివరి సంవత్సరాలలో "మేనక ఇందిరను బాధించినంతగా, మరేదికాని, మరెవ్వరు కాని బాధించలేదు "

## కఠినమైన, పెరుగుతున్న బాధలు

తిరుగుబాటు చేసిన మేనకతో ఇందిర వ్యవహరిస్తుండగానే, మరిన్ని ఇబ్బందులు, బాధలు ఆమెను చుట్టుముట్ట సాగాయి ఇది వరకు చెప్పినట్లు మత, ప్రాంత, జాతి, భాష, కులాల సంబంధమైనవి, ఇతర కలహాలు కొత్తకాదు కాని ఇవి అశుభసూచకంగా రూపొందసాగాయి ఇదివరకు ఇందిర వీటితో వ్యవహరించిన

రీతిలో లేవు చెల్లాచెదురుగా ఉండటం, చాలా తక్కువ కాలం కొనసాగటం, ప్రాంతీయంగా ఉండటానికి బదులు ఎనిమిదవ దశకంలో ఇవి దీర్ఘకాలం కొనసాగుతూ, బాధాకరంగా తరచూ చెలరేగుతూ, ప్రమాదకరంగా వ్యాపించసాగాయి అన్ని సందర్భాలలో హింస ముమ్మరంగా, విషపూరితంగా మారింది. ఆధునికమైన ఆయుధాలు విదేశ మూలాలనుండి విపత్తులు సృష్టించేవారికి సులభంగా అందుబాటులోకి వచ్చాయి దీనికి ఆఫ్ఘనిస్థాన్‌లో యుద్ధం, వియెత్నాం యుద్ధంలో విడిచి పెట్టి పోయిన ఆయుధాలు కారణమయ్యాయి

ఆమె అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటిదాడి ఆమె ప్రత్యేక నియోజకవర్గమైన హరిజనులమీద జరిగింది బీహారులోని పిప్ర, పారస్ బీఘా గ్రామాలలో ఉన్నతకులాల వారు హరిజనులపై చేసిన దురాగతాలు, ఆమె రాజకీయాలలో ఒంటరిగా ఉంటూ ఏనుగుస్వారి చేసి బెల్చీలో పరామర్శించినప్పటికంటె తీవ్రంగా ఉన్నాయి చాలా చోట్ల పోలీసుల దురాగతాలు ఎక్కువయ్యాయి అన్నిటికంటె హేయమైనది భగల్‌పూర్‌లో జరిగింది ఇదీ అనాగరిక వ్యవహారాల బీహారులో ఉంది నవంబరు 1980 న తమ నిర్బంధంలో ఉన్న అనుమానిత నేరస్థులను అంధులను చేయటానికి వరుసగా వారి కళ్ళలో ఆమ్లం (యాసిడ్) పోయటమయింది దీనికి బాధ్యులైన 15 మంది పోలీసులను పని నుండి తొలగించగానే వారి సహోద్యోగులే గాక, ఆ ప్రాంతంలోని ప్రజలు కూడా ఈ అపరాధులను సమర్థిస్తూ ప్రదర్శనలు జరిపారు కళ్ళు పోగొట్టినది రాటు తేలిన నేరస్థులకని, వారికి వ్యతిరేకంగా ఎవ్వరూ సాక్ష్యమివ్వనందున వారిని చట్టబద్ధంగా శిక్షించటానికి వీలులేదని వీరు వాదించారు

ఢిల్లీకి దగ్గరగా ఉన్న మొరాదాబాద్‌లో హిందువులకు, ముస్లింలకు మధ్య చెలరేగిన తగాదాలు ఒక నెలపాటు సాగి 144 మంది ప్రాణాలు తీశాయి ఇవి చుట్టు పక్కల ప్రాంతాలకు పాకటమే కాకుండా అలహాబాద్‌కు, మధ్యప్రదేశ్‌లోని మోకు, సాధారణంగా ఇటు వెర్రితనానికి దూరంగా ఉండే కాశ్మీరుకు కూడా వెళ్ళాయి.

సమయం గడిచేకొద్దీ హరిజనుల, ముస్లింల సమస్యలు మిళితమయ్యాయి ఎందుకంటే సాయుధపోలీసులే ఈ అల్ప సంఖ్యాక వర్గాల మీద రెచ్చిపోవడంతో తీవ్రమైన ఘర్షణలు జరిగాయి తమిళ్‌నాడులోని ఒక గ్రామమైన మీనాక్షిపురంలో 1300 మంది హరిజనులు ఇస్లామ్ మతాన్ని స్వీకరించారు. గొలుసుకట్టు ప్రతిక్రియలాగ హరిజనులమీద మరికొన్ని దుండగాలు, ఆపైన మరెన్నో మతమార్పిడులు జరిగాయి హిందూ మతోన్మాదులు భారతదేశాన్ని "హిందూరాజ్యం" గా ప్రకటించాలని, మత మార్పిడులు నిషేధించాలని కోరారు భారతదేశం సెక్యూలర్ దేశమని "సెక్యూలర్ దేశంగానే ఉంటుందని", రాజ్యాంగంలో మత విషయమై గల స్వేచ్ఛల వల్ల మత మార్పిడులను నిషేధించటం "అసంగతమ"ని ఇందిర దృఢంగా జవాబిచ్చింది గుజరాత్‌లో 1981 లో హరిజనుల సమస్య తలకిందులయింది. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలలో హరిజనుల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్నత కులాలవారు తీవ్రమైన ఆందోళన ప్రారంభించారు ప్రభుత్వం, విధానాలను రూపొందించే వారి కంటె ఎక్కువగా పాపం హరిజనులు జనసమూహాల హింసకు గురికావలసి వచ్చింది ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా జరిపిన విచారణలో గుజరాతీ వార్తా పత్రికలు హరిజనులకు వ్యతిరేకమైన వైఖరి బాహాటంగా అవలంబించాయని తేలింది

నక్సలైట్లనబడే మావోయిస్టులను, తమ స్థావరమైన పశ్చిమబెంగాలులో పదేళ్ళ క్రితమే అణచివేయటం జరిగింది కాని ఎనిమిదవ దశకం ప్రారంభంలో వాళ్ళు మళ్ళీ తమ కార్యక్రమం ప్రారంభించారు 1981లోనే 324 సంఘటనలు. ఎక్కువగా ఆదివాసుల ప్రాంతాలలో జరిగిన వాటిలో 92 మంది ప్రాణాలు పోయాయి

ఇంతకంటె గంభీరమైనవి, అశుభ సూచకాలు తిరుగుబాట్లు అనవచ్చు ఈశాన్య ప్రాంతంలో పాత తిరుగుబాట్లే ఇప్పుడు తీవ్రంగా, విస్తృతంగా జరగసాగాయి కొత్తగా పంజాబులో తిరుగుబాటు ప్రారంభదశలో ఉంది ఈ రెండింటినీ కొంచెం వివరంగా చర్చిద్దాం

**అవినీతి మళ్ళీ ప్రముఖం కావటం**

దురదృష్టవశాత్తు, ఇంధిర ఇబ్బందులన్నీ తన నియంత్రణలో లేని పరిస్థితుల మూలంగానే రాలేదు కొన్ని ఆమె స్వయంకృతం మరి కొన్ని సంజయ్ వదిలిపెట్టి వెళ్ళినవి. తన పార్టీలో ఆమెకున్న అత్యున్నత స్థానం గురించి ఎటువంటి తగాదా లేదు, తగాదా వచ్చే పరిస్థితి లేదు. కాని "పరిపూర్ణమైన భద్రత" కోసం ఆమె వెతుకులాట, తీవ్రమైన భయం మాత్రం తగ్గలేదు దీని ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రులను మారుస్తూ వచ్చింది తన మంత్రి వర్గాన్ని తరచుగా, కనీసం మూడు నెలలకు ఒకసారయినా మారుస్తూ వచ్చింది ఎంతకాలం తాము అధికారంలో ఉంటామో తమకే తెలియనందున అవకాశం ఉండగానే పబ్బం గడుపుకోసాగారు ఎమర్జెన్సీకి ముందున్నట్లే అవినీతి, అధికార దుర్వినియోగము చెలరేగిపోయాయి

కాంగ్రెస్ (ఐ) కి, ప్రధానమంత్రికి చాలా హానికారకమైనవి ఎ ఆర్ అంతులే తెస్తున్న ఉపద్రవాలు దేశంలో అత్యధిక సంపన్న రాష్ట్రమయిన మహారాష్ట్రకు సంజయ్ ఔదార్యం వల్ల అంతులే ముఖ్యమంత్రి అయ్యాడు ఒక రాజకీయవేత్త అధికారానికి ధనం చాలా ముఖ్యమని భావించి ఎంతో చాతుర్యంతో తొందర తొందరగా డబ్బు సేకరించసాగాడు ట్రస్టులు స్థాపించాడు వాటిలో ముఖ్యమైనదానికి "ఇందిరాగాంధి ప్రతిభా ప్రతిష్ఠాన్" అని పేరు పెట్టాడు డబ్బు రూపంలో చందాలు స్వీకరించటం లేదని, అన్ని చెల్లింపులు చెక్కుల రూపంలో నిజాయితీగా ఉండాలని గొప్పగా ప్రకటించాడు కాని, ప్రభుత్వం నుండి పొందే ఉపకారాలకు బదులుగా డబ్బు "బలాత్కారంగా వసూలు చేయబడుతోంద"ని న్యాయస్థానాలలోను, పార్లమెంటులోను ఆరోపించబడింది ఈ విషయాన్ని తీవ్రంగా తీసుకోటానికి బదులు ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ ముందు చేసినట్లు అన్ని ఆరోపణలను ఖండించి అవి "నిరాధారమని, ద్వేషంతో" చేస్తున్నవని చెప్పి తమ చుట్టూ ఒక గోడ నిర్మించుకొన్నారు: పార్లమెంటు ఉభయసభలలోనూ ఈ విషయం చర్చకు రానివ్వలేదు ఫలితంగా ఒక పార్లమెంటు సమావేశం మొత్తాన్ని అంతులే మూలంగా భంగపరచటం జరిగింది చివరకు ఇందిర అతనిని

రాజీనామా ఇవ్వమని అడిగింది కాని అప్పటికే ప్రభుత్వ గౌరవానికి, కీర్తికి ఎనలేని అవకారం జరిగింది కింది న్యాయస్థానం అంతులేను దోషిగా నిర్ణయించింది కాని చాలా ఏండ్ల తర్వాత ఈ విషయం అందరూ మరచిపోతున్నప్పుడు సుప్రీంకోర్టు అతను నిర్దోషి అని తీర్పిచ్చింది

కొంతమంది సంజయ్ మిత్రులు, "సన్యాసి" ధీరేంద్ర బ్రహ్మచారి ఉత్తర్వు ప్రకారం ఒక సింగపూర్ కంపెనీతో చమురు విషయమై లావాదేవీలు జరిగాయనే విషయమై పెద్ద గొడవ జరిగింది సంజయ్ మిత్రులను పక్కకు నెట్టినా బ్రహ్మచారి ప్రధానమంత్రి ఇంటికి యధేచ్ఛగా వస్తూ ఉండేవాడు. రాజీవ్ గాంధీ కఠినంగా దానిని నిలిపివేశాడు

## చిత్రంలో మెరుగైన పార్శ్వము

భారతదేశ దృశ్యంపై మబ్బులు కమ్ముకొంటున్నాయి అయితే మళ్ళీ ప్రధానమంత్రిగా ఇందిరాగాంధి పనిచేసిన కాలం అంతా విచారంగా, వినాశకరంగా ఉందనుకో కూడదు మధ్య మధ్యలో కాంతిపుంజాలున్నాయి ఆమె సాధించిన ఎన్నో విజయాలు ఎంతో ప్రతిభావంతమైనవి, దేశం శ్లాఘించినవి

1974 మేలో ఇదివరకటి ఇందిర పాలనలో భారతదేశం న్యూక్లియర్ క్లబ్ (అణుదేశాల సమూహం) లో ఆరవ సభ్యత్వం పొందింది ఇది ప్రపంచంలో ప్రత్యేకమైనది ఇప్పుడు ఆరేండ్ల తర్వాత అంతరిక్షంలో దేశం ఎంతో ముందుకు పోయింది అది తన స్వంతమైన ఉపగ్రహాలు పంపగలిగే పరికరాన్ని, యస్ యల్ వి – 3 ను అంతరిక్షంలోకి పంపింది దేశంలోనే రూపొందించబడి తయారయిన 35 కిలోగ్రాముల ఉపగ్రహం, రోహిణి – 1 ని అంతరిక్షంలోకి యస్.యల్ వి – 3 ద్వారా పంపటమయింది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఐ యస్ ఆర్ ఓ) ఒక కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని భూమికి నిలకడ (జియోస్టేషనరీ) గా ఉన్న స్థానంలో పెట్టగలిగింది విజ్ఞాన, సాంకేతిక విషయాలలో జరిగిన ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో 1982లో "సమగ్ర క్షిపణి కార్యక్రమం" కూడా ఉంది. 1984 లో స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ సోవియెట్ సాల్యూట్ – 7

స్పేస్‌స్టేషన్ సిబ్బందితో చేరినందున అంతరిక్షయానం చేసిన మొదటి భారతీయుడయ్యాడు

సాంకేతికంగా ముందుండాలంటే దేశానికి ఏమి కావాలనే విషయం ఇందిర ఎంత చక్కగా గమనిస్తూ ఉండేదో 1976 వేసవి కాలంలో జరిగిన సంగతి స్పష్టపరుస్తుంది. ఆమె సైంటిఫిక్ అడ్వయిజరు (విజ్ఞాన విషయాల సలహాదారు) అశోక్ పార్థసారధిని పిలిచి, "అశోక్, మనం సిలికాన్ గురించి ఏం చేస్తున్నాం?" అని అడిగింది ఇదివరకు చేసింది, ఇక చేయబోయేది అంతా అతను వివరంగా తెలియజేశాడు తరువాత ధైర్యం చేసి అడిగాడు "మేడం, ఈ ఎండాకాలం మధ్యాహ్నం సిలికాన్ గురించి ఎందుకాలోచించారు?" తన బల్లమీదనున్న "ది ఎకానమిస్ట్' కాపీని ఆమె చూపించింది దానిలో ప్రముఖమైన వ్యాసంలో సిలికాన్ భవిష్యత్తు గురించి ఉంది "ఇరవయ్యో శతాబ్దంలో స్టీలుకున్న ప్రాముఖ్యం ఇరవై ఒకటవ శతాబ్దంలో సిలికాన్‌కు ఉంటుంది" అని అందులో ఉంది డిసెంబరు 1979లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతున్నప్పుడు, తన భవిష్యత్తు దానిమీద ఆధారపడినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్ జ్ఞానం వ్యాపించాలనే విషయాన్ని ప్రముఖంగా సమర్థించే జీన్ - జాక్స్ షెర్వన్ - ష్రైబర్ తో దీర్ఘంగా చర్చించటానికి ఆమె కాలాన్ని వెచ్చించింది మైక్రోచిప్‌కున్న అపారమైన శక్తిని గురించి ఆమె పూర్తిగా తెలుసుకో లేదు కాని జె జె యస్ యస్ కథనం ప్రకారం ఆమె శ్రద్ధగా విని, అన్వేషణాత్మకమైన ప్రశ్నలు అడిగింది

మొరార్జీదేశాయ్ ఇంచుమించు నిలిపి వేసిన అణుశక్తి కార్యక్రమాన్ని పునరుద్ధరించటానికి చాలా శ్రమపడింది అనటంలో ఆశ్చర్యం లేదు ప్రముఖ అణుశాస్త్రవేత్త రాజారామన్న రక్షణ మంత్రికి విజ్ఞాన విషయాల సలహాదారుగా ఉండటం గమనించి అతనిని వెంటనే ముంబయ్‌లోని భాబా ఆటోమిక్ రిసెర్చి కేంద్రానికి బదిలీ చేసింది అణ్వాయుధాలపట్ల మొగ్గాలా అనే విషయమై ఆమె ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కాని అవసరమైతే భారతదేశం అణ్వాయుధాలు గల దేశంగా మారటం తను చూడదలచుకొంది. 1983 ప్రారంభంలో భూగర్భంలో మరో అణుపరీక్ష జరిపించాలనుకొందిగాని ముఖ్యంగా అమెరికా ఒత్తిడి వల్ల ఆమె తన మనసుమార్చుకొంది

ప్రధానమంత్రి అయిన తర్వాత రక్షణ మంత్రిత్వశాఖ తన ఆధ్వర్యంలో ఉంచుకొంది భారతదేశమంతటా, హిందూమహాసముద్రంతో సహా, భద్రత దిగజారిపోతున్న దృష్ట్యా భారత రక్షణ పటిష్ఠం చేయటానికి ఆమె పెద్ద ప్రయత్నాలు చేసింది ఈ ప్రయత్నాలకు ఆమెకు ఎవరూ ధన్యవాదాలు తెలియజేయకపోగా, "కిక్ బ్యాక్‌లు", "పే ఆఫ్‌లు" అంటూ అక్రమంగా ఆయుధాల కొనుగోలులో లంచాలు తీసుకోటం జరిగిందనే మాటలు వినపడసాగాయి ముఖ్యంగా సంజయ్ ఎక్కువ ఆసక్తి చూపిన జర్మన్ ఎచ్.డి.డబ్ల్యు జలాంతర్గాముల విషయంలో ఈ పుకార్లు ప్రచారంలోకి వచ్చాయి దక్షిణాసియా విషయాలలో అమెరికా విశేషజ్ఞుడైన సెలిగ్ హారిసన్ ఇందిర దేశ వ్యవహారాలను "నేర్పు లేకుండా నిర్లక్ష్యంగా నడిపినప్పటికీ ఆమె విదేశ విధానాన్ని, భద్రతకు సంబంధించిన విషయాలను చక్కగా నడిపించినందుకు" ఆమెను మెచ్చుకొన్నాడు "చైనా అణుశక్తిగల దేశంగా ప్రభవిస్తున్నప్పుడు, యన్ పి.టి.లోని ఆరవ ఆర్టికల్ (అణ్వాయుధాల నిరస్త్రీకరణ)ను అమెరికా ఇతర అణ్వస్త్రాల దేశాలు ఉల్లంఘిస్తున్నప్పుడు 1974లో అణు పరీక్ష జరపటమనే" తన నిర్ణయాన్ని ముఖ్యంగా ప్రశంసించటమయింది

ఇందిరాగాంధి చేసిన దౌత్య ప్రయత్నాలు, తీసుకొన్న చొరవలు ఆమె విజ్ఞాన, సాంకేతిక క్షేత్రాలలో చేసిన ప్రయత్నాలంత గొప్పగానూ ఉన్నాయి ఆమె అధికారానికి తిరిగివచ్చిన తర్వాత, తన హత్యకు మధ్య నాలుగున్నర సంవత్సరాలకాలంలో ఆమె 18 సార్లు విదేశాలకు వెళ్ళింది. ముప్పయి దేశాలు అమెరికా నుండి సోవియెట్ యూనియన్ వరకు, ఫిన్‌లాండ్ నుండి ఫిజీవరకు, మెక్సికో నుండి గ్రీసు వరకు, ఆస్ట్రేలియా నుండి సౌదీ అరేబియా వరకు భారతదేశ హితాలదృష్ట్యా పర్యటించింది అమెరికా నిర్మించిన తారాపూర్ ఆటమిక్ పవర్‌స్టేషన్‌కు అణు ఇంధనం సరఫరా చేసే విషయంలో ఉన్న తగాదాను వాషింగ్టన్‌కు వెళ్ళిన సందర్భంగా ఆమె, రోనాల్డ్ రీగన్ పరిష్కరించగలిగారు ఆఫ్ఘనిస్థాన్ విషయమై అమెరికా, భారతదేశాలు సమ్మతింపక పోయినా, భారత - అమెరికాల మధ్య సంబంధాలు మెరుగవటం స్పష్టంకాసాగింది కొంకన్‌లో

సంపన్న దేశాలు, నిర్ధనదేశాలు సమావేశమైనపుడు రీగన్ ఇందిరను కలిశాడు ఆమెపట్ల సద్భావం పెంపొందించుకొన్నాడు

1980 లో బెల్‌గ్రేడ్‌ను జోసిప్ బ్రోజ్‌టిటో అంతిమక్రియలకై దర్శించినపుడు ఆమె చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుణ్ని, హువా గుఫెంగ్‌ను కలిసింది రెండు దశాబ్దాలుగా భారత - చైనాల మధ్య సంబంధాలు బిగుసుకు పోవటాన్ని సడలించమని, స్నేహం పెంపొందించుకోటానికి కృషి చెయ్యమని కోరింది ఈ ప్రక్రియ జూన్ 1981లో న్యూఢిల్లీలో ఆనాటి చైనా విదేశ వ్యవహారాల మంత్రి హువాంగ్ హువా రావటంతో ప్రారంభమైంది దీనికందరూ స్వాగతం పలికారు

అమెరికా నుండి అత్యధికంగా సైనిక సంబంధమైన సహాయం పొందిన తర్వాత, 30 ఏండ్లుగా యుద్ధంవద్దనే సంధి చేసుకోటానికి నిరాకరించే విధానాన్ని మార్చుకొని ఆ ఒప్పందానికి ముందుకొచ్చింది శాంతి, మైత్రి, సహకారమనే సంధి చేసుకోమని సూచించి ఇందిర దానికి మెరుగులు దిద్దింది

ప్రపంచ నాయకురాలిగా గుర్తింపబడి, గౌరవింపబడటానికి ఆమె సాధించిన మరెన్నో గొప్ప విషయాలున్నాయి ఎన్నికయిన ప్రభుత్వానికి అధిపతిగా ప్రపంచంలో మరెవ్వరూ అధికారంలో లేనంత దీర్ఘ కాలం ఈమె అధికారంలో ఉంది మార్చి 1983లో అలీన ఉద్యమం (నాన్ అలయిన్డ్ మూవ్‌మెంట్) సమావేశం న్యూఢిల్లీకి మార్చినపుడు ఈమె దానికి అధ్యక్షత వహించింది ఇరాక్‌లో జరగవలసిన సమావేశం, ఇరాక్ ఇరాన్‌తో ఎనిమిదేండ్ల పాటు యుద్ధం సాగిస్తున్నందున సమావేశ స్థలం మార్చవలసి వచ్చింది కాని అలీన ఉద్యమ సమావేశంలో (నామ్) ఈ రెండు దేశాలూ పాల్గొన్నాయి కంబోడియా విషయమై తగాదాపడుతున్న ఆగ్నే యాషియా రాజ్యాలు కూడా పాల్గొన్నాయి ఇందిర 'నామ్'ను "అతిపెద్దదయిన శాంతి ఉద్యమం"గా పేర్కొని, వివాదాలు కల్పించే విషయాలన్నిటిలో సర్వసమ్మతిని సాధించింది కామన్‌వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశం (సి హెచ్ ఓ జి యమ్) నవంబరులో జరిగినపుడు ఆమె నిర్వహణ చెప్పుకోదగినదిగా ఉంది మదర్ థెంసాకు ఆర్డర్ ఆఫ్ మెరిట్ రాష్ట్రపతి భవన్‌లో

బహూకరించాలన్న మహారాణి ఎలిజెబెత్ ఆలోచనను కూడా ఆమె అనునయించి వారించగలిగింది

ఈ మధ్యలో ఆసియాక్రీడలు (ఏషియెన్ గేమ్స్) కూడా జరిగాయి ఇందిరాగాంధి అరవై ఐదవ జన్మదినం రోజు 19 నవంబరు 1982 న ఏషియెన్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. డిసెంబరు వరకు జరిగాయి. అయితే పంజాబ్‌లోని మనోఘాతంతో ఇవి మిళితమయ్యాయి.

## విపత్తు తర్వాత విపత్తు

నామ్, చోగ్మ్ సమావేశాలలో ఎంతో ఘనంగా సాఫల్యం పొందినప్పటికీ 1983 వ సంవత్సరం ఇందిరాగాంధికి చాలా చెడుగా ప్రారంభమైంది. అస్సామ్ ఎంతో సంక్షోభంలో ఉంది పంజాబులో స్థితి చేయి దాటిపోయేటట్లుంది ఒక సంవత్సరం తర్వాత ఆ విధంగానే జరిగింది జనవరి 1983 లో పిడుగులాపడి ఇందిరను వ్యాకులతకు గురిచేసిన విషయం అనుకోకుండా జరిగింది రాష్ట్ర శాసనసభల ఎన్నికలలో ఆమె ఆంధ్రను, కర్ణాటకను పోగొట్టుకుంది ఈ దక్షిణ రాష్ట్రాలు రెండు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి కాంగ్రెస్‌కు విశ్వాసపాత్రంగా ఉన్నాయి 1919 లో, 1978లో కాంగ్రెస్ విభజింపబడినపుడూ ఆ రాష్ట్రాలు ఆవేశంతోనే ఉన్నాయి. తన పార్టీ స్థితి భయంకరంగా ఉందని ఆమె ఆలస్యంగా గ్రహించింది ఆమె ఏ మాత్రం సహాయం చేసే స్థితిలో లేదు. దీనికి ఆమె చెయ్యగలిగిందీ ఏమీ లేదు. ఇప్పుడు పార్టీ “తలకిందులుగా ఉన్న త్రికోణం”గా మారింది ఆమె గొప్ప వ్యక్తిత్వం వల్ల ఈ చెల్లాచెదరయిన మూక ఒకటిగా ఉంది. కాంగ్రెస్(ఐ)లోని సభ్యులందరు “ఇందిరాజీకి, ఆమె కుటుంబానికి” తాము విధేయులమని చెపుతూనే తమ స్వార్థానికి పనిచేయసాగారు.

కోటల్లాంటి రెండు దక్షిణ రాష్ట్రాలలోని ఓటమిలో, ఆంధ్రలో ఓటమి మరీ వ్యాకులత కలిగించేదిగా ఉంది కాంగ్రెస్ (ఐ) ఎంత దయనీయస్థితిలో ఉందో అది తెలియజేసింది దాని ఫలితాలు దీర్ఘకాలమున్నాయి. ఇందిర ఏ పదవీ లేకుండా ఉన్నప్పుడు మూడేండ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న

చెన్నారెడ్డి తన పరిమితులు మించి పోయాడు. 1982లో ఆమె అతనిని తొలగించాలనుకొంది.

అతని స్థానంలో ఆమె టి అంజయ్యను నియమించింది అతను మంచివాడేకాని ఏమాత్రం అనుభవం లేనివాడు. అంత సామర్ధ్యమూ లేదు రాజీవ్‌కు తమ్మునికి ఇష్టమైన మొరటు పద్ధతులు నచ్చవని తెలియక కొత్తగా యువరాజయిన రాజీవ్‌కు హైద్రాబాద్‌లో ముఖస్తుతి చేస్తూ స్వాగతం పలికాడు. రాజీవ్‌కు కోపం వచ్చింది స్వాగతం చెప్పటానికి వచ్చిన జనాలు చూస్తుండగా అంజయ్యను నాలుగు మాటలన్నాడు

ఈ "అవమానానికి" దేశమంతటా నిరసన జరిగింది ఈ అవమానం "మొత్తం ఆంధ్రా"కు జరిగినట్లేనని, అది కేవలం ముఖ్యమంత్రికే జరిగిందనుకోకూడదనే భావం చెలరేగింది ప్రముఖుడు, బాగా జనాదరణగల సినిమా నటుడు యన్ టి రామారావు, యన్ టి ఆర్ గా ప్రసిద్ధుడు, ఈ అవకాశాన్ని వినియోగించుకొని తెలుగుదేశం పార్టీ (టి డి పి ) స్థాపించాడు దీని ఏకైక లక్ష్యం "ఆంధ్రుల హుందాతనం, ఆత్మగౌరవం పునః స్థాపించటం " సినిమా నటులకు రాజకీయాలలో పలుకుబడి వస్తుందని ఇందిరకు బాగా తెలుసు సినీనటుడు యం.జి.రామచంద్రన్, ప్రజలు అభిమానంగా యం.జి ఆర్ అని పిలుచుకొనే వ్యక్తి, తమిళ్‌నాడును చాలా రోజులు పరిపాలించాడు. అమెరికా తన అధ్యక్షునిగా రోనాల్డ్ రీగన్‌ను ఎన్నుకోటానికి ఎంతో ముందుగానే భారతీయ చలనచిత్ర నటులు రాజకీయాల్లో తమ ముద్రవేశారని ఆమె అంటూ ఉండేది కాని ఆమె చుట్టూ ఉన్నవాళ్ళు "యన్ టి ఆర్. యం.జి ఆర్ కాదు" అంటే నమ్మింది. ఈ తృప్తివల్ల "మ్యాటినీ ఐడల్" ఎన్నికలలో గొప్ప విజయం సాధించి రాత్రికి రాత్రి ఆరాధ్య దైవమయ్యాడు అంజయ్యను ఇదివరకే తొలగించటమయింది. అప్పుడతను అన్న గొప్ప మాటలు : "నేను మేడం వల్ల వచ్చాను. నేను మేడం వల్ల పోతున్నాను నేను ఎందుకు వచ్చానో, ఎందుకు పోతున్నానో నాకు తెలీదు."

ప్రారంభం నుండి రామారావు తనను జాతీయస్థాయికి మలచుకోసాగాడు ఇందుకోసమై 14 ప్రతిపక్ష పార్టీలనాయకుల, కాంగ్రెస్‌కు చెందని ముఖ్యమంత్రుల

"సమావేశాలు" ఏర్పాటు చేయసాగాడు ఇందిరాగాంధి చేతుల్లో "కేంద్రీకృతమైన" అధికారాన్ని వికేంద్రీకరణ చేసి ఫెడరల్ సమతుల్యం తీసుకురావాలని ఈ సమావేశాలు పిలుపునివ్వసాగాయి ఇది ఆమెకు బాగా కోపం తెప్పించింది. రెండేళ్ళ సమయంలో యన్.టి ఆర్ కున్న విపరీతమైన జనాదరణ తగ్గసాగింది. ఈ సమయంలో ప్రధానమంత్రి అనుయాయులు ఆమె అనుమతి లేకుండా ఆమెకు తెలియకుండా రాష్ట్ర గవర్నరు రామారావును తొలగించేటట్లు చూశారు ఇది గొప్ప విపత్తులు తెచ్చే పొరపాటు ఆంధ్రలో ఈ హేయమైన నాటకం జరగటానికి ముందు అస్సాం, పంజాబు, కాశ్మీరులలో జరిగిన భయంకరమైన సంఘటనల వలె ఆ పొరపాటు విపరీతమైన ఫలితాలకు దారి తీసింది

**అస్సామ్ మారణకాండ**

ఆంధ్ర, కర్ణాటక బురుజులు ఇందిర పోగొట్టుకొన్న ఒక నెలలోనే అస్సామ్‌లో కూడా ఎన్నిక లొచ్చాయి తిరుగుబాట్ల మయంగా, సంవేదన శీలంగా ఉండే ఈశాన్య ప్రాంతంలో ఇది పెద్ద రాష్ట్రం. పరిస్థితులు సాధారణంగా ఉంటే అస్సామ్‌లో ఎన్నికలు "అదుపులో పెట్టలేని హింసకు" దారితీయవచ్చు ననే భావంతో అస్సామ్ ఎన్నికలు వాయిదా వెయ్యమని ఆమె సలహాదార్లు చెప్పే మాట విని ఉండేది. కాని సాధారణ పరిస్థితులు లేవు దక్షిణాన బాగా ఓడిపోయిన తర్వాత కనీసం ఒక విజయమైనా పొందవలసిన అవసరం ఎంతో ఉంది ప్రతిపక్షాలన్నీ అస్సామ్ ఎన్నికలలో పాల్గొననందున ఈమె సులభంగానే విజయం సాధించింది పదిశాతం మాత్రమే ఓటు చేయటమయింది ఏమైనా ఎన్నికలతో పాటు జరిగిన భీకర హింసాకాండ ఎన్నికలను పూర్తిగా మరుగున పడేటట్లు చేసింది దీనిలో ఎన్నో వేల మంది మరణించారు లక్షలాదిమందికి ఇంఢ్లు లేకుండా పోయాయి

ఈ హత్యలు చాలా దూర ప్రాంతాలలో జరిగాయి. ఇక్కడి నుండి వార్త బయటపడటానికి పది పన్నెండు రోజులు పైనే పడుతుంది. ఈ గొప్ప విషాదం జరిగిన సమయం చాలా ఇరుకున పడేసింది ఈ జుగుప్సాకరమైన వివరాలు ఢిల్లీ చేరినప్పటికి అలీన ఉద్యమ (నామ్) సమావేశం ప్రారంభమయింది సమావేశ

స్థలం దగ్గరగా ఇండియాటుడే ప్రతులు ప్రదర్శింపబడ్డాయి నెల్లీ గ్రామంలో హతులైన పిల్లల చిత్రాలు ఒళ్ళు జలదరించేటట్టుగా రంగుల్లో అట్టమీద కనిపిస్తున్నాయి. వాళ్ళను నరికి చంపేసి వరుసగా పొలాల్లో పడుకోబెట్టారు చిత్రమేమిటంటే ఒక పురుషుని కూడా హత్య చేయలేదు చనిపోయిన వారందరు స్త్రీలు, పిల్లలే ఆ తర్వాత తెలిసిన విషయం మగవాళ్ళందరూ నదికి అవతల తీరంలో మరో తెగకు చెందిన తమ శత్రువులను చంపటానికి వెళ్ళారు

అస్సామ్ ఉపద్రవం ఇందిర అధికారానికి తిరిగిరాక ముందే ప్రారంభమైనా ఆ భారం ఇందిర నెత్తిన పడింది 1978 నుండి "అధిక సంఖ్యలో" "విదేశీయులు"న్నారనే విషయంపై విద్యార్థుల నడిపిస్తున్న ఆందోళన అస్సాం అంతటా ఉంది ఈ విదేశీయులనే వారు ఇది వరకటి తూర్పు పాకిస్థాన్ అయిన బంగ్లాదేశ్ నుండి తరలివచ్చినవారు విద్యార్థి నాయకులు తమ కోరికలను నాలుగు వర్గాలుగా చెప్పారు విదేశీయులెవరో కనిపెట్టండి, వారికి ఓటు లేకుండా చేయండి; ఎన్నికల జాబితాల నుండి వారి పేర్లు తొలగించండి; వారిని బంగ్లాదేశ్‌కు తిరిగి పంపండి. పైకి చూస్తే ఈ కోరికలు సమంజసంగానే కనిపిస్తాయి తమ స్వస్థలంలోనే పరాయివాళ్ళు తమను మించిపోవటం అస్సాం ప్రజలకు సమ్మతంకాదు కాని వాస్తవం చాలా క్లిష్టంగా ఉంది. అధిక జనాభాగల బెంగాలు తూర్పు ప్రాంతం నుండి అస్సాంలో ఖాళీగా, సారవంతంగా ఉన్న భూములకు తరలిరావటం 20వ శతాబ్దం ప్రారంభంనుండి జరుగుతోంది అప్పుడు మొత్తం ఉపఖండం ఒకటిగా ఉండేది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, చౌకగా పనివారికోసం చూస్తున్న అస్సామీలు, "ఓటు బ్యాంకు" ల కోసం చూసే రాజకీయ పార్టీలు, ముఖ్యంగా విభజింపబడని కాంగ్రెసు, వీరి రాకను ప్రోత్సహించారు

ఈ ఆందోళన పైకి బంగ్లాదేశీయులపై దాడి జరుపుతున్నట్లున్నా, వాస్తవానికి భారతీయ బెంగాలీలపై, అస్సామీలు కాని భారతీయులందరిపై, అస్సాంలో నివసిస్తున్నా, లేక అస్సామ్ పర్యటించటానికి వెళ్ళినా వారందరిపై దాడి జరగసాగింది పశ్చిమ బెంగాలులో తిరుగు దెబ్బ కొట్టటమయింది అస్సామ్‌లో ఆదివాసులు, ఆదివాసులు కానివారి మధ్యే గాక మరెన్నో విభేదాలు తలెత్తాయి

కొండల్లో ఉన్న తెగలు, మైదానాల్లో ఉన్న తెగల మధ్య విభజన జరిగింది బోడోలు తామే మొదట అస్సాంలో నివసించేవారమని, అస్సామీ హిందువులు కాదని అనసాగారు. అస్సాంలో ఉన్న చాలామంది బంగ్లాదేశీయులు ముస్లిములయి నందున, మత విభేదం ఈ తగాదాను మరింత విషమింపజేసింది. మార్చి 25, 1971 తర్వాత అంటే బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ప్రకటింపబడిన తర్వాత అస్సామ్‌కు వెళ్ళిన బంగ్లాదేశీయులను వెనక్కు తీసుకొంటామని, అంతకు ముందు వలసపోయిన వారి గురించి తమకు బాధ్యత లేదని బంగ్లాదేశ్ ప్రకటించింది ఈ తేదీని "విభజన" తేదీగా ఆమోదించవలసిందని విద్యార్థుల నాయకులకు అనునయించి చెప్పటానికి ఇందిర ఎంతో ప్రయత్నించింది కాని వాళ్ళు వినలేదు విస్ఫోటకరమైన ఈ స్థంభనలో అస్సాం ఎన్నికలు జరిగాయి

### కాశ్మీరులో సంఘర్షణ

అస్సామ్‌లోని హత్యాపూరిత ఎన్నికల తర్వాత జమ్మూ, కాశ్మీర్‌లో ఎన్నికలొచ్చాయి కాని వాస్తవంగా ఎన్నికలు జరగటానికి ఇంకా ఒక సంవత్సరముంది ఇందిర ఈ విషయమై తొందరపడలేదు కాని కొత్తగా నియమింపబడిన ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఎన్నికలు త్వరగా జరపమని ఒత్తిడి చేయసాగాడు కాశ్మీరులో అత్యున్నత నాయకుడయిన షేక్ మహమ్మద్ అబ్దుల్లా తర్వాత అతని కొడుకు ముఖ్యమంత్రి అయ్యాడు ఎన్నికలు త్వరగా జరిపించాలనటానికి అతనికి కారణాలున్నాయి.

అబ్దుల్లాల కుటుంబానికి, నెహ్రూ కుటుంబానికి మధ్య సంబంధాలు చాలా స్నేహపూరితంగా, ప్రేమగా ఉండేవి గొప్ప నాయకుడైన షేక్ చాలా కాలం జైల్లో ఉన్నప్పటికీ ఈ సంబంధాలు కొనసాగాయి నెహ్రూ వారి కుటుంబాన్ని బాగా చూసుకొన్నాడు భారత దేశంలో, విదేశాలలో ఫరూఖ్ విద్యనభ్యసించేటట్లు చూశాడు

భారతదేశానికి వచ్చి, రాజకీయాలలో చేరిన తర్వాత ఫరూఖ్ ఇందిరను "మమ్మీ" అని పిలిచేవాడు సెప్టెంబరు 1982లో పెద్దవాడైన అబ్దుల్లా మరణించినపుడు, అతని వారసత్వానికి ఫరూఖ్ బావ జి యమ్ షా ఎన్నో విధాల

ప్రయత్నించినప్పటికీ ఫరూఖ్‌కు అది చెందేటట్లు చేయటానికి ఇందిర ఎంతో ప్రయత్నించింది అయితే పరిస్థితులు త్వరగా మారిపోయాయి.

ఇందిరాగాంధీకి వ్యతిరేకత పెరగటం వల్ల, తనని తాను కాశ్మీరు వ్యక్తిత్వాన్ని రక్షించేవానిగా తెలియజేసుకోవాలనే తపనతో, ఆంధ్ర ముఖ్యమంత్రి, యన్ టి.ఆర్. తరచుగా ఏర్పాటుచేసే కాంగ్రెసేతర సమావేశాలకు ఫరూఖ్ హాజరు కాసాగాడు ఇందిర ఆగ్రహించింది. తన ప్రభుత్వాన్ని తొలగిస్తుందేమోనని ఫరూఖ్ బాధపడసాగాడు ఎన్నికలను త్వరగా 1983 వేసవిలో జరపమని అడగటం తన పదవిని రక్షించుకొనే వ్యూహమే ఎన్నికల ప్రచారం చాలా విషపూరితమయింది ఇందిర ప్రసంగిస్తున్న ఒక సభలో ఫరూఖ్ అనుయాయులు కొందరు చాలా చౌకగా, అమర్యాదగా ప్రవర్తించారు ఫరూఖ్ కాశ్మీరు లోయలో చాలా సీట్లు గెలిచి ఎన్నికలు గెలిచాడు జమ్మూలో చాలా సీట్లు ఇందిర కాంగ్రెస్ గెలిచింది ఈ ప్రాంతంలో హిందువులు అధిక సంఖ్యలో ఉన్నారు ఇందిర తన సమర్థనకు హిందువుల ఓటు తెచ్చుకొంటోందని ప్రతిపక్షం వారన్నారు · చివరకు సి పి ఐ జనరల్ సెక్రటరీ సి రాజేశ్వరరావు కూడా ఈ మాట తరచూ అనసాగాడు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పేరున్న కాగితం మీద "డియర్ జనరల్ సెక్రటరీ" అని అప్పుడు సోవియెట్ నాయకుడుగా ఉన్న యూరి ఆంద్రొపోవ్‌కు సి పి ఐ చేస్తున్న "కళంకిత" ప్రచారం సంగతి ఇందిర తెలియజేసింది

### పంజాబ్ ఉపద్రవం

పంజాబులో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు పతాకస్థాయిని అందుకొంటున్న సమయంలో, పంజాబు పట్ల దృష్టి నంతటిని కేంద్రీకరించవలసిన తరుణంలో ఇందిర ప్రభుత్వం కాశ్మీరునుండి ఆంధ్ర వరకు అల్పమైన రాజకీయాలలో మునిగి ఉండటం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే అ రాష్ట్రంలో భయంకరమైన మృత్యుతాండవం ప్రతిరోజూ కనిపించసాగింది ఈ రాష్ట్రం దేశానికి ఆహారమివ్వటమే గాక, దేశ రక్షణలో కూడా ముందుంది. అయినా "శిక్కుల పట్ల పగ ఉన్నందున" లేదా ఇంకొక చోట "రాజకీయంగా లబ్ధి" పొందటానికి ఇందిర పంజాబును తగలబడపోనిచ్చిందనే ఆరోపణ మాత్రం పూర్తిగా తప్పు

ఆమెకు శిక్కుల పట్ల ఎటువంటి శత్రుత్వమూ లేదు "అమృతసర్ · ఇందిరాగాంధి చివరియుద్ధం" అనే పుస్తకంలో మార్క్ టులీ, సతీశ్ జాకబ్ నొక్కి చెప్పినట్లు శిక్కు "సమాజమంటే ఆమెకెంతో అభిమానం." ఆమె చేసిన ఘోరమైన తప్పిదం స్వర్ణమందిరానికి సైన్యాన్ని పంపటం కాదు కాని పంజాబులో సైన్యం పంపే అవసరం వచ్చేటంతగా పరిస్థితిని దిగజారనివ్వటం అనవచ్చు ఇది ఆమె గొప్ప వైఫల్యం అనటంలో సందేహం లేదు అమాయకులను నిరంతరం వధించేటంతగా దిగజారిపోయిన అకాలీ ఆందోళనను, ఇతరులను కూడా దీనికి నిందింపక తప్పదు కాని వ్యవహారాలు నడిపిస్తూ అధికారంలో ఉన్న ఆమె బాధ్యత మరింతగా ఉంది

దేశ స్వాతంత్ర్యాన్ని, సరిహద్దులను, ఐక్యతను రక్షించే వ్యక్తిగా, ప్రధానమంత్రిగా జూన్ 1984లో సైన్యాలను స్వర్ణమందిరానికి పంపించకపోతే ఆమె విధిని క్షమించరాని రీతిగా నిర్లక్ష్యం చేసినట్లయ్యేది అప్పటికే ఆ మందిరం, పాకిస్థాన్ నుండి సమర్ధన పొందిన టెర్రరిస్టులతో, ఎంతో కట్టు దిట్టంగా రక్షింపబడుతున్న అయుధాగారంగా మారింది పాకిస్థాన్ సైనిక పాలకుడు జనరల్ జియా ఉల్ హక్, అపఖ్యాతి చెందిన ఇంటర్ - సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐ యస్ ఐ ) ఉపయోగించి భారతదేశపు పంజాబులో మండుతున్న మంటకు ఆజ్యం పోసి హిందువులకు, శిక్కులకు మధ్య విభజన సృష్టించాలనుకొన్నాడు

సైన్యం నుండి తొలగింపబడిన మేజర్ - జనరల్ షాబెగ్ సింగ్, స్వర్ణమందిరాన్ని కోటలా బలవరచటంలో, ఆధునికమైన ఆయుధాలు చేర్చుకోటంలో, టెర్రరిస్టులకు శిక్షణ నివ్వటంలో ప్రముఖ పాత్ర వహించాడు.

ఇంత బ్రహ్మాండంగా మారిన పంజాబ్ సంఘర్షణ 1972లో అతి చిన్న స్థాయిలో ప్రారంభమైంది 1980లో ఇందిరకు దేశ వ్యవహారాల మంత్రిగా, ఆ తర్వాత భారత రిపబ్లిక్‌కు రాష్ట్రపతిగా ఉన్న జ్ఞాని జైల్ సింగ్ 1972లో పంజాబుకు ముఖ్య మంత్రిగా ఉండేవాడు కొంచెం పల్లెటూరి వాలకమయినా తెలివైన రాజకీయ వేత్త శిక్కుల మత భావనలకు ఎంతో అనువుగా నడుచుకొంటూ అకాలీల పరువు తీయాలనుకొన్నాడు అకాలీలకు ఇది ఇష్టం లేదు శిక్కు

సమాజాన్ని అతను సంతృప్తి పరచలేని సమస్య ఏదైనా ఉందా అని వెతక సాగారు ఈ అపాయాన్ని జైల్ సింగ్ ముందే పసికట్టవలసింది కాని అలా జరగలేదు పరిస్థితి సరిదిద్దేపని ఎవరూ చెయ్యలేదు

ఈ సమయంలో కొందరు అకాలీ నాయకులు, ముఖ్యంగా విదేశాలలో ఉన్న శిక్కులు, "ఖలిస్థాన్" అనే స్వతంత్ర రాజ్యం శిక్కుల రాజ్యంగా ఉంటుందని దాని గురించి మాట్లాడసాగారు. లండన్‌లో నివసిస్తున్న జగజీత్ సింగ్ చౌహాన్ అనే అతను తనను "ఖలిస్థాన్ రిపబ్లిక్" కు "అధ్యక్షుని"గా పేర్కొన్నాడు. కాని అకాలీదళ్ నాయకత్వం కొంచెం జాగ్రత్త పడింది. 1973లో శ్రీ అనంద్‌పూర్ సాహిబ్ వద్ద సందిగ్ధంగా ఉండే తీర్మానాన్ని చేశారు ఖలిస్థాన్ కోరికను ఒప్పుకోకుండా ఆగిందిగాని, స్వాతంత్ర్యానికి, స్వయంపాలనకు మధ్యనున్న తేడాను స్పష్టపరచలేదు "శిక్కురాజ్యం" తరపున మాట్లాడుతూ "అక్కడ ఖల్సా ప్రముఖంగా ఉండాలి" అని అకాలీదళ్ ప్రకటించింది ఈ లక్ష్యం సాధించటానికి కేంద్ర ప్రభుత్వం "జోక్యం" పంజాబులో రక్షణకు, విదేశ వ్యవహారాలకు, కరెన్సీకి, కమ్యూనికేషన్‌కు "పరిమితం" కావాలని కోరింది శిక్కు మతం "సర్వాధికారం లేకుండా సురక్షితంగా ఉండద"ని కూడా ఆ తీర్మానం ప్రకటించింది

ఒక సంవత్సరం తర్వాత దేశం జె పి ఉద్యమంలో మునిగిపోయింది అకాలీలు దానిని సమర్థించారు. ఎమర్జెన్సీ వచ్చింది 1977 వరకు అన్ని రాజకీయ కార్యకలాపాలూ రద్దయ్యాయి 1977 లో ఇందిర పూర్తిగా ఓడిపోయింది. పంజాబులో అకాలీ తమ శక్తితోనే గెలిచారు 1980 వరకు ఎవరూ ఆనందపూర్ సాహిబ్ తీర్మానం గురించి వినలేదు 1982 వరకు పంజాబును పాలిస్తామని, మళ్ళీ ఎన్నికలు గెలుస్తామని అనుకొన్న అకాలీల కల భంగమయింది

అప్పుడు అకాలీలు ఆనందపూర్ సాహిబ్ తీర్మానాన్ని తమ యుద్ధ నినాదంగా మార్చుకొన్నారు ఇందిరా ప్రభుత్వం మీద ధర్మయుద్ధం ప్రకటించారు.

శిక్కులు "అణచివేయబడ్డ, స్వార్థానికి వినియోగించబడ్డ" అల్ప సంఖ్యాకులు అని వాళ్ళు ఫిర్యాదు చెయ్యటం నవ్వు తెప్పించేటట్లుంది. దేశంలో సగటు ఆదాయంకంటే, ధనవంతులైన ఈ అల్ప సంఖ్యాకుల ఆదాయం రెండు రెట్లుంది

సివిల్ సర్వీసులలో, మరింతగా సాయుధ దళాలలో శిక్కుల సంఖ్య ఎంతో ఎక్కువగా ఉంది ఛండీగడ్ నగరం కేవలం పంజాబీలకే ఇవ్వలేదనే అకాలీల క్లేశం చట్టబద్ధమైనదే.

అకాలీల ధర్మయుద్ధం ప్రారంభం కాక ముందు రెండు సంవత్సరాల క్రితం, అధికారంలో లేని ఇందిర సంజయ్‌ను, జైల్ సింగ్‌ను పంజాబ్ గురించి పెద్ద పొరపాటు చేయనిచ్చింది. వీరిద్దరూ పంజాబులో అంతగా పేరులేని ఒక మత బోధకుడు జర్నైల్ సింగ్ భింద్రన్ వాలేను ఎన్నుకొని, పంజాబ్‌లో అకాలీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేటట్లు, అకాలీదళ్ అనుయాయులను విభజించేటట్లు తీవ్రమైన పక్షం తీసుకోమని ప్రోత్సహించారు అతను తనకిచ్చిన పనులు ఎంత చక్కగా నిర్వహించాడంటే తానే ప్రముఖమైన, అధికారయుతమైన శిక్కుగా పరిగణింపబడ్డాడు అనుభవజ్ఞులైన నాయకులందరూ అతనికి లొంగిపోయారు అతను వారు తమ నాయకత్వాన్ని నామమాత్రంగా కొనసాగించేటట్లు అనుమతించాడు కొన్నాళ్ళకు ఈ నాటకం కూడా కొనసాగలేదు.

ఇందిర తిరిగి అధికారంలోకి వచ్చే సరికి, ఛండీగడ్‌లో అకాలీ ప్రభుత్వం లేదు తనకు ఇదివరకు మార్గదర్శకులైన వారికి, వాస్తవానికి భారతదేశానికి వ్యతిరేకంగా ఎదిరించేటంతటి బలాన్ని భింద్రన్‌వాలే సంపాదించుకొన్నాడు అన్ని విధాలా ఫ్రాంకెన్ స్టెయిన్ సృష్టించిన రాక్షసునిలా మారాడు ఇప్పుడు గృహ వ్యవహారాల మంత్రి అయిన జైల్‌సింగ్‌తో ఇదివరకు సఖ్యమున్నందున, మరి కొందరు ఇందిరా కాంగ్రెస్ నాయకులతో సాన్నిహిత్య మున్నందున (అప్పటికి సంజయ్ మరణించాడు) భింద్రన్ వాలేతో వ్యవహరించటం కష్టమైపోయింది. కాంగ్రెస్ తిరిగి పంజాబులో అధికారం సంపాదించుకొన్నప్పుడు, జైల్‌సింగ్‌కు ప్రధాన విరోధి అయిన దర్బారాసింగ్ ముఖ్యమంత్రి కావటం పరిస్థితులను మరింత క్లిష్టపరిచింది ఇద్దరూ ఒకరినొకరు ఎంతగానో అనుమానించుకొనేవారు ఇద్దరూ ఒకరికొకరు వ్యతిరేకంగా పనిచేయసాగారు. దీనితో భింద్రన్‌వాలే వీళ్ళనేమాత్రం లక్ష్య పెట్టకుండా తనకిష్టమొచ్చింది చేయసాగాడు.

భీకరమైన మత మౌఢ్యంతో భింద్రన్‌వాలే మొదట నిరంకారీలను వధించటం మొదలుపెట్టాడు. మతాన్ని గట్టిగా నమ్మేవారు శిక్కులలో ఒక శాఖయిన నిరంకారీలను మతత్యాగం చేసినవారుగా భావించేవారు ఆ తర్వాత భింద్రన్‌వాలే చక్కగా వ్యవస్థీకృతమైన శిక్కు యువకులను రాష్ట్రమంతటా హత్యలు చేయటానికి వినాశనం సృష్టించటానికి పంపించాడు 1982 అంతా ఆలోచనా రహితమైన హింస కొనసాగింది. 1983 లో ఇది పేట్రేగిపోయింది 1982 చివరలో జరిగిన ఏషియన్ గేమ్స్ దీనికి దోహదం చేశాయి

ఏసియాడ్ వాస్తవంగా రాజీవ్‌గాంధి “బిడ్డ” మౌలిక సదుపాయాల నిర్మాణం నుండి చివరి క్రీడ పూర్తయ్యేవరకు అంతా రాజీవ్ పర్యవేక్షణే అతని నాయకత్వం గురించి కార్య నిర్వహణా చాతుర్యం గురించి దేశానికి తెలియజెప్పటమే దీని ఉద్దేశం. ఏషియన్ క్రీడలు జరిగే ప్రతి స్థానంలోనూ, ప్రతి రోజూ ప్రదర్శనలు జరువుతామని అకాలీలు ప్రకటించారు తనకు అప్పజెప్పిన పనిని పూర్తి చేయటానికి రాజీవ్ సాయంగా ఎంపిక చేసిన కొందరు భయపడ్డారు తన మొదటి నాయకత్వ పరీక్షలో రాజీవ్ విఫలం కావటం ప్రధానమంత్రికి నచ్చదని ప్రదర్శన జరిపేవారు రాజధానికి రాకుండా చూడటానికి కఠినమైన చర్యలు తీసుకొన్నారు హర్యానా ముఖ్యమంత్రి భజన్‌లాల్ జనతా నుండి ఇందిర కాంగ్రెస్‌కు జనవరి 1980లో ఆమె విజయం సాధించగానే తరలి వచ్చాడు అతనిప్పుడు రంగప్రవేశం చేశాడు పంజాబునుండి రోడ్డు, రైలు ప్రయాణాలు చేయాలంటే హర్యానా మీదుగా రావలసిందే. ఏషియన్ గేమ్స్ దరిదాపుల్లో ఏ అల్లరి మూకలూ చేరకుండా, భజన్‌లాల్ అతని మొరటు, దురుసు పోలీసులు ఢిల్లీకి వెళ్తున్న ప్రతి శిక్కు ప్రయాణీకుడినీ అవమానించారు వీరిలో 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో పాకిస్థాన్ సైన్యాలు లొంగిపోవటాన్ని స్వీకరించిన భారత విమానదళానికి ఇదివరకటి అధిపతి కూడా ఉన్నాడు ఏషియన్ గేమ్సు ఏ సమస్యా లేకుండా ముగిశాయి కాని శిక్కులు చాలా క్రుద్ధులయ్యారు

అమృతసర్‌లో ఒక ఉన్నత పోలీసు అధికారి ఎ యస్ అట్వాల్, స్వర్ణమందిరంలో ప్రార్ధన చేసి ఇవతలికి వచ్చినపుడు, ఆ మందిరం ఆవరణలో

స్థావరమేర్పరచుకొన్న హంతకులు 23 ఏప్రిల్ 1983 న అతనిని వధించారు. భింద్రన్‌వాలేను, హంతకులైన అతని అనుయాయులను నిర్బంధంలోకి తీసుకోటానికి దర్బారాసింగ్ పోలీసులను మందిరంలోకి పంపదలచినట్లు అధారాలున్నాయి కాని జైల్‌సింగ్ అలా జరక్కుండా చూశాడు అప్పుడు భింద్రన్‌వాలే మందిరం ఆవరణలోని నివాసప్రాంతం నుండి, శిక్కుల అధికారానికి ఆసనమైన అకాల్ తక్త్‌కు మారాడు ఆటంకవాదుల కోటను బలపరచడం వెంటనే ప్రారంభమైంది

పట్టపగలు, బాగా పధకం వేసి అట్వాల్‌ను హత్య చేయటం, ప్రభుత్వం ఆ విషయమై ఏమీ చెయ్యలేకపోవటంతో పంజాబులో భయకారణమయింది. దేశమంతటా నిరుత్సాహం ఆవహించింది ఇదే సమయంలో సిక్కు యువకులలో భింద్రన్ వాలేకు గొప్ప ఆదరణ లభించింది అకాలీనాయకులలో అగ్రగణ్యులైన ముగ్గురు, సంత్ హర్‌చంద్ సింగ్ లాంగోవాల్ "పవిత్ర యుద్ధం" గురించి "విధులు జారీ చేసినవాడు", గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధిపతి గురుచరణ్‌సింగ్ తోహ్రా, పంజాబు మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్‌సింగ్ బాదల్, దీనితో ఆందోళన పడ్డారు

హిందువులను పంజాబు నుండి తరిమివెయ్యాలని చేసిన రాక్షస ప్రయత్నంలో భింద్రన్‌వాలే తన దుండగులను బస్సులను ఆపమని, హిందువులను మాత్రం చంపమని పంపించాడు అతని హేయమైన కుట్ర ఫలించలేదు ఇందిర దర్బారాసింగ్ పాలనను రద్దు చేసి పంజాబును నేరుగా న్యూఢిల్లీ పాలనకిందకు తీసుకొచ్చింది చివరి వరకు సైనిక చర్య తీసుకోకూడదనే అనుకొంది మే నెల మధ్యలో "మితవాదులైన" అకాలీ నాయకులతో టులీ, జాకోబ్‌లు చెప్పినట్లు, "చివరి ప్రయత్నంగా సంప్రదింపులు" జరిపింది అకాలీ "త్రిమూర్తులు" రాజీకి ఒప్పుకోబోయారు కాని భింద్రన్‌వాలే వారిని "పిరికివార"ని "ద్రోహుల"ని తిరస్కారంగా మాట్లాడినపుడు వారు వెనుకంజ వేశారు తరువాత క్లుప్తంగా చెప్పాలంటే భింద్రన్‌వాలే దాక్కున్న స్థలంపై సైనిక చర్య తీసుకోటం గాక మరో మార్గం లేకపోయింది దురదృష్టవశాత్తు ఇందిర ప్రతిపక్షాల సమర్థన పొందటానికి

ఏ ప్రయత్నమూ చేయలేదు వాళ్ళు తనతో మాట్లాడటానికి కూడా ఇష్టపడనంతగా తనకు వ్యతిరేకులని ఆమె భావించింది

సైనిక చర్యను రహస్య భాషలో "ఆపరేషన్ బ్లూస్టార్" అన్నారు దీనిని రూపొందించిన వారు అనుకొన్నదానికంటె ఎక్కువ నష్టం జరిగింది శస్త్ర చికిత్స వంటి కమాండోల దాడికాకుండా ఇది మూడు రోజుల ముట్టడివరకు పోయింది భారీగా జన నష్టం జరిగింది చనిపోయిన 576 మందిలో భింద్రన్ వాలే ఒకడు వీరిలో 83 మంది సిపాయిలు కూడా ఉన్నారు అకాల్ తక్త్‌కు చాలా నష్టం జరిగింది ఇదివరకు ఎన్నడూ లేనంతగా ప్రపంచవ్యాప్తంగా శిక్కులు కోపగించారు

బ్లూస్టార్‌ను నడిపించిన ఆరుగురు జనరల్స్‌లో నలుగురు శిక్కులు కాని కొత్తగా సైన్యంలో చేరిన 2500 మందికి ఈ విషయం పట్టలేదు ఎనిమిది స్థలాలలో వాళ్ళు తిరుగుబాటు చేశారు పదిలక్షల మంది గల సైన్యంలో 120,000 మంది శిక్కులున్నారు ఈ సమస్యను త్వరగా అధిగమించినప్పటికీ, అటువంటి పరిస్థితి వచ్చినందుకు సైనికబలం ఇబ్బందిలో పడింది

## ఆశ్చర్యం గొలిపే ఇందిర స్థిరచిత్తం

అతి విశిష్టమనిపించే ఇందిర గుణాలలో ఒకదానిని ఇక్కడ పేర్కొనటం సమంజసంగా ఉంటుంది ఒక క్లిష్ట పరిస్థితి లేదా విపత్తు ఎంత విషాదంగా, భయంకరంగా, వ్యక్తిగతంగా ఆమెకు ఎంతబాధాకరంగా ఉన్నా ఆమె తన శాంత స్వభావాన్ని, స్థిరచిత్తాన్ని కోల్పోలేదు ప్రశాంతంగా పరిస్థితిని ఎదుర్కొంది మనసులో ఎంత బాధపడినా బాహాటంగా ఆమె తన భావాలు ప్రకటించలేదు సంజయ్ మరణం తర్వాత, తన కన్నీళ్ళను, దుఃఖాన్ని నియంత్రించుకోలేక పోవటమన్నది నిజంగా మినహాయింపే

తన తండ్రి కోపగించినట్లు, బహిరంగంగా ఆమె తన కోపాన్ని వ్యక్తం చేయలేదు ఆంతరంగికంగా కూడా చాలా తక్కువ కోపం వ్యక్తం చేసేది ఒక మాటయినా మాట్లాడకుండా తనతో తగాదాపడిన వారికి తనకోపం వ్యక్తం చేయగలిగేది "వాగ్ధాటిగల మౌనానికి యజమానురాలే" గాక ఆమెకు "గడ్డకట్టించే చూపు" కూడా వరంగా దొరికింది కాని చాలావరకు ఆమె మృదువుగా, సౌమ్యంగా,

మనోహరంగా వ్యవహరించేది 1983లో నెల్లీలో జరిగిన మారణకాండ ఆమెను చాలా బాధపెట్టింది కాని నామ్ సమావేశంలో హాజరైన ప్రభుత్వాధిపతులు ఆమె ఉజ్జ్వలంగా కనిపించింది జూన్ 5, 1984 న అపరేషన్ బ్లూస్టార్ ఇంకా కొనసాగుతున్నప్పుడు, ఆమె ప్రాణాలకు ముప్పు తెస్తామని శిక్కులు బెదిరిస్తున్నప్పుడు, ఏ తోట చివరలో కొన్నాళ్ళకు తన ప్రాణాలు పోగొట్టుకుందో, అదే తోటలో పశ్చిమ జర్మనీ సోషియలిస్టు నాయకుడు, మాజీ ఛాన్సెలర్ అయిన విల్లీ బ్రాంట్‌తో హాయిగా మాట్లాడుతూ ఉంది

వారి మాటల్లో పంజాబు ప్రస్తావన వచ్చింది కాని చాలా వరకు ఇందిర "మానవ జాతికి అణు ఉపద్రవం" గురించి అతనితో మాట్లాడింది. అణు సంబంధమై వివేకంతో వ్యవహరించాలని ఆరు దేశాలు చేసిన విజ్ఞప్తి గురించి చెప్పింది పంజాబ్ మనోఘాతం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు 22 మే న ఆమె అంతర్జాతీయ స్థాయిలో చొరవ దీసుకొన్నదాని ఫలితమే ఆరు దేశాల విజ్ఞప్తి. సంపూర్ణంగా అణ్వస్త్రాల నిరాయుధీకరణ జరగటానికి నాందిగా ఐదు ఖండాలలో "పరిమాణాలలో, సంపదలో, అభివృద్ధిలో వైవిధ్యంగల" దేశాలు భారతదేశం, అర్జెంటీనా, గ్రీసు, మెక్సికో, స్వీడన్, టాంజానియా నాయకులు "అణ్వస్త్రాల నిలుపుదల"ను కోరారు.

**రెండు అవమానకరమైన తొలగింపులు**

ఇందిరాగాంధి వ్యక్తిత్వంలో పరస్పర విరుద్ధమైన విషయాలు సంక్లిష్టతను అయినా ఆకర్షణను తెలియజేస్తాయి ఆమె చర్యలలో ఔన్నత్యము, నైచ్యము మిళితమయ్యేవి మానవజాతి మనుగడ గురించి బాధపడుతూ, దేశాన్ని ఆధునీకరణ చేయటంలో, అభివృద్ధి చేయటంలో నిమగ్నమయిన ఆమె మనసు తన రాజకీయ శత్రువులపై దెబ్బకు దెబ్బ తీయటంలో కూడా శ్రద్ధ చూపేది

బ్లూ స్టార్ జరిగిన మూడు వారాలకు, దాని ఫలితాలవైపు దృష్టి పెట్టవలసిన ఇందిరా గాంధి కాశ్మీర్ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను తొలగించింది. ఒక సంవత్సరం పాటు ఆమె ఈ అవకాశంకోసం చూస్తోంది. ఇంతకు ముందు

అతనిని తొలగించక పోవటానికి కారణం బంధుత్వంలో తన సోదరుడైన బి కె నెహ్రూ, కాశ్మీరుకు గవర్నరుగా ఉండి దీనిని నిరోధించటమే ఇందిర అతనిని గుజరాత్‌కు బదిలీ చేసింది అతని స్థానంలో జగ్‌మోహన్‌ను తీసుకొచ్చింది అతను సివిల్ ఉద్యోగిగా ఉండి ఆమె విశ్వాసాన్ని పూర్తిగా పొందాడు జగ్‌మోహన్ ఫరూఖ్‌ను తొలగించాడు అయితే గవర్నరు పాలన విధించమని ప్రధానమంత్రిని నమ్మించలేకపోయాడు ఫరూఖ్‌కు శత్రువు, బావగారు అయిన జి యమ్ షాకు అధికారం అప్పజెప్పి అతని దయమీద ఆధారపడవలసి వచ్చింది

ఇందిర దీర్ఘ పాలనలో 60 రాష్ట్రప్రభుత్వాలకు పైగా రద్దు చేయటమయింది ఫరూఖ్‌ను తొలగించినపుడు ప్రదర్శించినంత నిరసన మరెన్నడూ ప్రదర్శింపబడలేదు అందరికంటె బిగ్గరగా నిరసించిన వ్యక్తి యన్ టి ఆర్ ఆగస్టు 16న తనకు దానిఫలితం ఎదురయింది ఆంధ్ర గవర్నరు ప్రధానమంత్రి ఇంటిలో ఎవరితోనో టెలిఫోనులో మాట్లాడిన తర్వాత యన్ టి ఆర్ ను తొలగించాడు ఫరూఖ్‌కు కాశ్మీరులో ఉన్నట్లుగాక యన్ టి ఆర్ మెజారిటీ చెక్కు చెదరకుండా ఉంది కాబట్టి అతనిచే మళ్ళీ ప్రమాణ స్వీకారం చేయించవలసి వచ్చింది

సెప్టెంబరు 16న న్యూయార్క్‌కు వెళ్ళటానికి లండన్‌లో ఏర్‌ఇండియా విమానమెక్కినపుడు యన్ టి ఆర్ తిరిగి పదవిలోకి రావటం గురించి విని ఉపశమనం పొందాను నలభై ఐదు రోజుల తర్వాత లండన్‌లో ఒక హోటల్ రూములో ఉన్నప్పుడు ఉదయం ఐదున్నర గంటల సమయంలో ఇందిరను ఆమె సెక్యూరిటీ గార్డులే పాశవికంగా హత్య చేశారని ఒక ఫోన్‌కాల్ ద్వారా తెలిసింది

**ఆ భయంకరమైన హెల్పులు**

ఆపరేషన్ బ్లూస్టార్ జరగటానికి అనుమతించినపుడే తాను తన మరణ పత్రంమీద సంతకం పెట్టానని ఇందిరకు ముందే తెలుసు తాను హింసాత్మకంగా మరణిస్తుందనే ఆలోచన ఆమెకు ఎన్నాళ్ళుగానో ఉంది నవంబరు 11, 1973లో న్యూఢిల్లీ మీదుగా ప్రయాణిస్తున్న ఫీడెల్ కాస్ట్రో గౌరవార్థం విందునేర్పరచిన సందర్భంలో చిలీలో సాల్వడోర్ అలెండే హత్య గురించి వార్త తెలిసింది "అలెండేకు వాళ్ళు చేసినట్లే నాకూ చేయాలని వాళ్లకుంది. చిలీలో ఈ చర్య తీసుకొన్న శక్తులతో

సంబంధం ఉన్నవాళ్ళు ఇక్కడున్నారు" అని ఇందిర తనతో అన్నట్లు కాస్ట్రో ఆ తర్వాత ఎప్పుడో చెప్పాడు ఆమె దేశస్థులు ఎన్నో సార్లు ఎగతాళి చేసిన "విదేశీ హస్తం" భారతదేశపు ఇబ్బందులకు కొన్నిటికి మూలమని ఆమె నమ్మింది

ఆమెకు ప్రాణాపాయం పెరుగుతున్నప్పటికీ ఆమె భద్రత విషయం సైన్యానికి అప్పజెప్పాలని ఆర్ వెంకట్రామన్ చేసిన సూచనను ఆమె తిరస్కరించింది వెంకట్రామన్ ఆమె ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా, ఆ తర్వాత ఉపరాష్ట్రపతిగా, చివరకు రాష్ట్రపతిగా ఉన్నాడు మన అదృష్టం కొద్దీ 96 ఏండ్ల వయసులో ఇప్పటికీ మనతో ఉన్నాడు ఆమె సెక్యూరిటీ గార్డులనుండి శిక్కులందరినీ తొలగించాలని సూచించినపుడు ఆమె "మనం సెక్యూలర్ కాదా?" అని ప్రశ్నించింది భద్రత విషయంలో ఆమె ఎంతో నమ్మిన సలహాదారు ఆర్ యన్ కావ్ ఆమె ఇంటిలోపల తిరిగేస్థలం అంత భద్రంగా లేదని ఇంటిముందరి తోటలో కొంచెం మార్పు చేసి రక్షణ కలిపిస్తే బాగుంటుందని చెప్పినపుడు ఆమె దానికి ఒప్పుకోలేదు కావ్ తనంతట తానుగా సెక్యూరిటీలో ఒకేసారి ఒకేచోట ఇద్దరు శిక్కులుండకూడదని నిర్దేశించాడు కాని ఆమెను హత్య చేసిన ఇరువురిలో ఒకడయిన సత్వంత్ సింగ్ తనతో చేరిన బెంట్‌సింగ్‌తో డ్యూటీలో ఉండటానికి ఏమాత్రం కష్టం లేకుండానే అనుమతి సంపాదించాడు

1984లో అక్టోబరు నెలంతా హింసాత్మకమైన మరణం ఆమె మనసులో ఉంది

జిడ్డు కృష్ణమూర్తితో, ఒక కాశ్మీరీ సాధువు లక్ష్మణ్‌జూతో ఆమె ఈ విషయం చర్చించింది. లక్ష్మణ్ జూను దర్శించటానికి శ్రీనగర్ చుట్టూ ఉన్న ఎత్తయిన పర్వతాలమీద ఉన్న అతని నివాస స్థలానికి వెళ్ళింది ఆమె హత్యకు రెండురోజుల ముందు ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో చిరస్మరణీయమైన ఉపన్యాసంలో చెప్పిన మాటలు దీనిని తెలియ జేస్తాయి "నేను చనిపోయినపుడు నా ప్రతి రక్త బిందువూ దేశాన్ని శక్తిమంతం చేసి, సమైక్య భారత దేశాన్ని పటిష్ఠం చేస్తుంది " "ఆరాత్రి తనకు విందునిచ్చిన గవర్నరు బిషంబర్ నాథ్ పాండేతో తన తల్లి, తాత, తండ్రి చాలా బాధ పడుతూ పడకలో మరణించటం చూసిన తాను "నా రెండుకాళ్ళమీద"

చనిపోవాలని ఉందని చెప్పింది ఒరిస్సాలో తాను ఉండవలసిన సమయాన్ని తగ్గించుకొని త్వరగా ఢిల్లీకి తిరిగి వచ్చింది తన మనమడు, మనమరాలు ఒక కారు ప్రమాదానికి గురయ్యారని తెలిసింది ఆతంకవాదులు పిల్లలపై హత్యాయత్నం చేశారేమోనని ఆమె అనుమానించింది.

మిగిలిన కథ, అత్యంత విషాదకరమైన కథ ఇప్పటికే బాగా తెలిసినదే కనుక దాని వివరాలు ఇవ్వనవసరంలేదు. మనలో అతి చిన్న వయసులోని వారు కూడా ఎంతో కాలం జీవించినా అటువంటి వ్యక్తిని మళ్ళీ చూడలేమని నిశ్చయంగా చెప్పవచ్చు



# —11—

# ఉపసంహారము

నా శక్తి మేరకు ఇందిరాగాంధి జీవిత కధను చెప్పిన తర్వాత, ఎటువంటి సంక్షోభ పరిస్థితులు ఆమెను రూపొందించాయో, రూపొందటానికి సహాయపడ్డాయో తెలియజేయటానికి సంక్షేపంగా వాటిని పేర్కొనవలసి ఉంది ఆమె బహుముఖ వ్యక్తిత్వంలోని భిన్నప్రవృత్తులను, అనివార్యంగా సమ్మిశ్రితమైన కధనాన్ని, ఇందులో నకారంకంటె, సకారమే ఎక్కువగా ఉండటాన్ని ఒకటిగా చేర్చవలసి ఉంది.

సెయింట్ అగస్టిన్ చెప్పినట్లు ఎవరు కూడా దోషరహితంగా పరిపాలించలేరు ఎంత గొప్ప వాళ్ళయినా తప్పులు, లోపాలు, బలహీనతలు లేకుండా ఉండలేరని మనం చేర్చుకోవచ్చు ఇందిరలో ఈ మూడూ ఉన్నాయి సున్నితమైన మనసు, మానవత్వం గల స్త్రీ అయినా ఆమె చంచలంగా, అహంకారంగా, నిర్దయగా ఉండగలిగింది దేశ లక్ష్యాలయినా, తన లక్ష్యాలయినా సాధించటానికి ఎటువంటి మార్గాలు ఎన్నుకొన్నదీ ఆమె పట్టించుకోలేదు ఒక్కొక్కసారి వాస్తవాన్ని కూడా పొదుపుగా వినియోగించుకొంది ఆమె గొప్ప పొరపాట్లు చేసింది. వాటికి గొప్పగానే మూల్యం చెల్లించింది ఆమె గురించి తీర్పు చెప్పేటప్పుడు ఆమె దేనిని వ్యతిరేకించిందో గమనించటం మంచిది ఆమె పోరాడిన సమస్యలు హిమాలయాలను మించి పోయాయి అనటంలో అతిశయోక్తి లేదు. ఈ సమస్యలలో ప్రతిపక్షాలకు ఆమె పట్ల అయిష్టత, సాధువులాంటి జె పి సాయుధదళాలను తిరుగుబాటు చేయమని కోరటం కూడా ఉన్నాయి అయినా ఇందిరాగాంధి భారతదేశ దృశ్యంలో రెండు దశాబ్దాల పాటు చాలా ప్రముఖంగా నిలబడింది ఆమె అధికారంలో ఉందా, అధికారంలో లేదా అనే దానితో దీనికి ప్రమేయంలేదు ఆమె సమకాలీనులు, మిత్రులుకాని, శత్రువులు కాని ఎవరూ

ఈమె ఉన్నతస్థాయికి దరిదాపుల్లో కూడా లేరు

పూర్తిగా విరుద్ధమైన పక్షాలు వహించిన ఆమె దేశస్థులు ఆమెను పొగిడినా, తెగిడినా మూడవ ప్రపంచం వాళ్ళు అభిమానంతోను, ఒకటి, రెండు ప్రపంచాల వాళ్ళు గౌరవంతోను ఆమె చెప్పిన మాటలు విన్నారు ఆమె గురించి వ్యాపించిన కథనాలలో, ఆమె జీవితకాలంలోను, ఆ తర్వాత కూడా చాలా అపార్థాలున్నాయి ఉదాహరణకు, ఇదివరకు నేను వ్రాసిన ఆమె జీవిత చరిత్రలో నేను కూడా పలువురూ భావించినట్లే ఆమె చదువు సరిగా సాగలేదని, ఆమెకు పుస్తకాల పట్ల ఆసక్తి లేదని, ఇతరుల ఆలోచనలు పట్టించుకోలేదని, తనకు సరయినదని తోచినది చేసేదని వ్రాశాను నా అభిప్రాయాన్ని సరిదిద్దింది 1990లో ప్రచురితమైన టు అలోన్, టు టుగెదర్ (ఇద్దరు ఒంటరిగా, ఇద్దరు కలిసి) అనే పుస్తకం ఆమెకు, ఆమె తండ్రికి 1922 నుండి 1964 వరకు నడచిన ఉత్తరాల సంకలనమది దీనికి సోనియా గాంధి సంపాదకురాలు విద్యార్థిగా ఉన్న రోజుల నుండి ఇందిరకు పఠనాసక్తి ఎక్కువని, చివరిదాకా ఆ ఆసక్తి కొనసాగింది అని తెలిసి చాలా ఆశ్చర్యపోయాను తండ్రీకూతుళ్ళు కేవలం పుస్తకాల పేర్లు, అది చదవమని ఒకరికొకరు సిఫారసులు మాత్రమే చేసుకోలేదు ఇందిర ప్రతి పుస్తకం లోని విషయాలూ చర్చించింది తరచుగా “పాపు” అభిప్రాయాలను ఖండించింది హిట్లరు, నాజీల మూలంగా యూరప్‌లో వచ్చిన విషాదకరమైన పరిణామాల గురించి రెండోప్రపంచ యుద్ధంవరకు వ్యాఖ్యానించింది ఆమె ప్రధాన మంత్రిగా ఉన్న సుదీర్ఘ కాలంలో ప్రముఖంగా ఆమె ఉపన్యాసాలు వ్రాసిన శారదాప్రసాద్, ఇందిరా గాంధి ఉపన్యాసాలను సరిదిద్ది, తిరి/: వ్రాసి, భాషను, విషయాలను మెరుగుపరచటం గురించి ఒక పెద్ద పుస్తకమే వ్రాయగలడు ఆమె “ప్రపంచంలో కెల్లా అత్యుత్తమమైన ఉపసంపాదకురాలు” అని ఒకసారి చాలా గంభీరంగా నాకు చెప్పాడు

ఇందిరాగాంధి తాను కావాలనుకొన్నప్పుడు మౌనంగా, వేరుగా ఉండగలిగేది ఆమె “గంభీరం”గా, “కఠినం”గా, “భయం గొలిపేటట్లు” ఉంటుందనే భావం మాత్రం సరయినది కాదు ఆమె సమ్మోహనకరంగా ఉండటమేగాక, ఉల్లాసంగా,

చమత్కారంగా, కొంచెం హాస్యం మేళవించి మాట్లాడగలిగేది నాకు తెలిసిన ఆమె సరసోక్తులన్నీ చెప్పాలంటే చాలా అవుతుంది. కాబట్టి కొన్ని మాత్రమే చెపుతాను. ఇటీవలికాలం వరకు విదేశ మంత్రిగా ఉన్న కె.నట్వర్ సింగ్ మొదట వృత్తిపరంగా రాయబారి. ఇందిరాగాంధి నమ్మకాన్ని పొందినవాడు. ఆమె హత్యకు ముంధు అతను విదేశీ సేవనుండి నివృత్తి పొంది, ఆమె పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చాడు. రాజకీయాలకు తగిన దుస్తులు తయారు చేసుకోటానికి తన ఊరికి వెళ్తున్నానని అతను చెప్పినపుడు "మందమైన చర్మం మరింత ఉపయోగకరంగా ఉంటుంది" అని ఆమె జవాబిచ్చింది తన మంత్రివర్గంలో ఉన్న ఒక వ్యక్తి గురించి ఒకసారి ఆమె ఇలా అంది "కొంచెం మాట్లాడవలసినపుడు, అతను పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతాడు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడవలసినపుడు చిన్న చిన్న విషయాలు మాట్లాడుతాడు "

పాకిస్థాన్ సైనిక నియంతగా 1977 నుండి 1988 వరకు ఉన్న జనరల్ జియా-ఉల్-హక్ మొదట ఇందిరాగాంధీని ఏప్రిల్ 1980లో జింబాబ్వే స్వాతంత్ర్యోత్సవాల సందర్భంగా హరారేలో కలిశాడు. దురదృష్టవశాత్తు ఆ ఉదయం వార్తాపత్రికలు అతనిదివరకు ఇందిరాగాంధి గురించి మాట్లాడిన పరుషమైన మాటలు వ్రాశాయి చాలా మర్యాదపూర్వకంగా మాట్లాడే జియా తన సంభాషణ ఈ విధంగా ప్రారంభించాడు "మేడమ్, వార్తా పత్రికలలో మీరు చదివేదంతా నమ్మకండి " దానికి ఇందిర ఇచ్చిన గొప్ప సమాధానం, "ఉహు నమ్మను. వాళ్ళు మిమ్మల్ని ప్రజాస్వామ్యవాది అని, నన్ను నియంత అని అంటున్నారు కదా!"

అంతకు కొన్ని రోజుల క్రితం న్యూఢిల్లీలో పేరొందిన పాకిస్థానీ జర్నలిస్టు ఖాలిద్‌సన్, ఒకప్పుడు జుల్ఫికర్ ఆలీ భుట్టోకు ప్రెస్ సెక్రటరీ ఆమెనడిగాడు "మేడమ్, మీరు మళ్ళీ అధికారంలోకి అంత గొప్పగా ఎలా రాగలిగారు?" దానికి ఆమె సమాధానం : "నన్ను ఉరితీయలేదు కాబట్టి " కానీ ఆమెకు నచ్చలేదు. ప్రధాన మంత్రిగా మార్చి 1980లో మొదటిసారి ఆమె అమెరికాకు వెళ్ళినపుడు ఒక సంఘటన జరిగింది వర్జీనియాలో పురాతన నగరమైన విలియమ్స్‌బర్గ్‌లో ఆమె దిగింది. అక్కడి నుండి హెలికాప్టర్లో వైట్‌హౌస్‌కు వెళ్ళవలసి ఉంది అక్కడ

ఆమెకు సాంప్రదాయకంగా స్వాగతం చెపుతారు అప్పుడు అమెరికా రాయబారి బి కె నెహ్రూకు కొంచెం ఆలస్యంగా నిదురలేచే అలవాటుంది వైట్‌హౌస్ నుంచి అత్రుతగా ఫోను ఉదయానే వచ్చింది ప్రెసిడెంట్ జాన్‌సన్ భారతప్రధానిని ఏవిధంగా సంబోధించాలి అనేది ప్రశ్న. "మేడమ్" అనాలా? "ప్రైమ్‌మినిస్టర్" అనాలా? లేక పేరుతో పిలువవచ్చా? ఆమె నడిగి జవాబు చెపుతానని బి కె అన్నాడు. యల్ బి జె తనకు నచ్చినట్లు తనను పిలవ వచ్చని ఆమె చెప్పింది తన సోదరుడు వెళ్ళిపోబోతుండగా ఆమె అన్నది," నా మంత్రి వర్గంలో కొందరు నన్ను "సర్" అని అంటారు తనకు అలా పిలవాలని ఉంటే పిలువవచ్చు ఇందిర చనిపోయిన సంవత్సరానికి మాజీ పశ్చిమ జర్మనీ ఛాన్సెలర్ హెల్మట్ ష్మిట్ ఆమె "జూన్ పొలిటికోన్" (రాజకీయ ప్రాణి) అని వ్రాశాడు

స్త్రీల స్వాతంత్ర్యం వైపు తగినంతగా మొగ్గినా, తనేపదవిలో ఉన్నా దానిలో స్త్రీ, పురుష భావనలు మేళవించకూడదని ఆమె స్పష్టంగా చెప్పింది "నా విధి నిర్వహించవలసిన వ్యక్తిని నేను," అని జనవరి 1966లో జర్నలిస్టులు ఆమెను భారతదేశంలో మొదటి స్త్రీ ప్రధానమంత్రిగా కావటం గురించి అడిగినపుడు జవాబిచ్చింది "స్త్రీయా, పురుషుడా అనేదానికి పనికి సంబంధంలేదు" అని కూడా అంది "లాల్ బహదూర్ శాస్త్రి మంత్రి వర్గంలో ఉన్న ఏకైక పురుషుడు" అని ఆమె గురించి వ్యాఖ్యానించటం కూడా

### ఇతరుల దృష్టిలో ఆమె

ఆమె హత్య జరిగినపుడు ఇందిరాగాంధీని అందరూ వేనోళ్ళ పొగిడారు ఆమె చివరి సంవత్సరాలలో ఆమెను తీవ్రంగా విమర్శించే వారు కూడా ప్రశంసించారు ఒక సంవత్సరం తర్వాత ఆమె జ్ఞాపకార్థం ఒక చక్కటి పుస్తకం ప్రచురింపబడింది దీనిలో ప్రపంచ రాజనీతిజ్ఞులు, చరిత్రకారులు, రచయితలు, కళాకారులు, ఆమె స్నేహితులు - వీరిలో ఇందిరతో పాటు ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్న ఐరిస్ మర్డోక్ కూడా ఉంది 24 జనవరి 1966 న "మొదటి సోమర్‌వీల్ ప్రధానమంత్రి" గౌరవార్థం టోస్ట్ తాగింది తమ గౌరవాన్ని ప్రకటిస్తూ వ్యాసాలు వ్రాశారు ఇప్పటికే బాగా ప్రసిద్ధి చెందిన విషయాలు ఉదాహరించవలసిన అవసరం లేదు కాని ఆ తర్వాత

వచ్చిన కొన్ని ప్రశంసలను గుర్తించవలసి ఉంది. మొదటిది ఇంకొక మహిళా ప్రధానమంత్రిది ప్రస్తుతం ఆమె అధికారంలో లేదు వాస్తవానికి తనంతట తానుగా దేశం విడిచి పోవలసి వచ్చింది బేనజీర్ భుట్టో లేప్రాయంలోనే తన తండ్రితో పాటు షిమ్లాకు వచ్చింది. సమావేశం జరిగినంతసేపు ఇందిరాగాంధీని జాగ్రత్తగా పరిశీలించింది పదహారేండ్ల తర్వాత, "డాటర్ అఫ్ ది ఈస్ట్" (ప్రాగ్దిశపుత్రి) అని తాను వ్రాసిన ఆత్మకధలో ఇందిరను "పట్టు, ఉక్కులస్త్రీ" అని "నిరాసక్తమైన దూరత్వం", అని "చాలా చిన్నగా సన్నగా ఉన్న మనిషి. అంతగా కీర్తి చెందిన ఆమె కఠినత్వం ఎక్కడినుండి వస్తుంది?" అని వ్రాసింది మరో 17 ఏండ్ల తర్వాత ఖాలిద్ హసన్ సాయంతో ఇ-మెయిల్ ద్వారా నాకిచ్చిన ఇంటర్వ్యూలో బేనజీర్ ఇందిర గురించి విపులంగా తన భావాలు తెలియజేసింది

క్లుప్తంగా ఆమె చెప్పినదిది "(ఇందిర) చిన్నగా, సన్నగా" కనిపించినా చరిత్ర కాన్వాసులో తన నాయకత్వం గురించి వ్రాస్తూ చాలా ఉన్నతంగా కనిపించింది ఆమె పొరపాట్లు చేసింది ఎమర్జెన్సీ పాశవికమైనది చాలా బాధలకు దారి తీసింది ఆమె అధికార రహితంగా ఉన్నప్పుడు దానికి మూల్యం చెల్లించింది. అయితే తన మీద తాను జాలి పడటం గాని, తనని తాను విధ్వంసం చేసుకోటానికి గాని ఆమె పాలు పడలేదు పట్టుదల, ఓర్పు, దృఢనిశ్చయం ప్రదర్శిస్తూ ఆమె మళ్ళీ పైకి లేచింది "

బేనజీర్ ఇందిరాగాంధి గురించి ఇంకా ఈ విధంగా చెప్పింది. "భారతదేశం స్వయం సమృద్ధి దేశంగా ఆమె ఊహించుకొంది ఆ స్వప్నం కోసం ఏకాగ్ర చిత్తంతో పాటుపడింది తన వ్యక్తిగతమైన ఆనందాన్ని దేశం కోసం ఎన్నో విధాల ధారపోసింది "

1980లో ఆఫ్ఘనిస్థాన్ సమస్య గురించి ఇదివరకు ఒక అధ్యాయంలో, ఇందిర తన ప్రత్యేకమైన శైలిలో ప్రపంచంలో కెల్లా దీర్ఘకాలం విదేశవ్యవహారాల మంత్రిగా ఉన్న ఆంద్రే గ్రోమికోతో, ఆఫ్ఘనిస్థాన్ విషయమై సోవియెట్ యూనియన్ తననుండి ఎటువంటి సహాయమూ ఆశించరాదని చెప్పిందని వ్రాశాను అయినా తనజ్ఞాపకాలలో గ్రోమికో ఈ విధంగా వ్రాశాడు "సోవియెట్

ప్రజలకు ఇందిరాగాంధి మూర్తీభవించిన భారతదేశము - ఎన్నో వేల ఏండ్ల అనుభవంతో వచ్చిన జ్ఞానం, అయినా భవిష్యత్తులోకి దూసుకుపోవటం, మూర్తీభవించిన మాతృత్వం, అయినా నిత్య యౌవనం, మంచిని కోరటంలో, చెడును, అణచివేతను వ్యతిరేకించటంలో, నిలకడతనం తన దేశాన్ని బలమైన దేశంగా చేయటానికి, తన కాళ్ళమీద తాను నిలబడేటట్లు చేయటానికి ఆమె చెయ్యవలసినదంతా చేసింది భారతదేశ చరిత్రలో ఇందిర ఎప్పుడూ గౌరవప్రదమైన స్థానంలోనే ఉంటుంది " అసమానుడు, ఉన్నతుడు అయిన చార్లెస్ డి గాల్ ఎవరినీ ఎప్పుడూ ముఖస్తుతి చేయలేదు. అందుకే తాను చెప్పదలచుకొంది చెప్పేవాడు ఇందిరకు అతనంటే ఎంతో గౌరవముండేది అతను ఆమెకు ఆదర్శమని ఇతరులనటానికి ఆమె అభ్యంతరం చెప్పలేదు ఎల్సీ పాలెస్‌లో మార్చి 1966లో ఇందిరను కలిసిన ఈ ఫ్రెంచి రాజకీయవేత్త తనకు దగ్గరిగా ఉన్నవారితో ఈ విధంగా అన్నాడు "స్త్రీలు రాజకీయాలలో రాణించరు. కాని ఈమె సాఫల్యం పొందుతుంది "డి గాల్ అంతిమక్రియలకు హాజరయ్యే వరకు ఇందిర దీని గురించి ఎన్నడూ వినలేదు అప్పుడు ఫ్రాన్సుకు భారత రాయబారి అయిన డి యన్. ఛటర్జీ సమక్షంలో ఒక ఫ్రెంచి మంత్రి ఇందిరతో ఈ మాటలు చెప్పాడు. నా స్నేహితుడు, సహోద్యోగి, తర్వాత "ది టైమ్స్ ఆఫ్ ఇండియా" కు సంపాదకుడు అయిన దిలీప్ పడ్‌గావ్‌కర్ అప్పుడు పారిస్‌లో ఉంటూ యూరప్ అంతటికీ ప్రత్యేక విలేకరిగా వార్తాపత్రికకు పని చేస్తున్నాడు ఈ కధనం తెలిసిన దిలీప్ దానిని ప్రచురించటానికి ఇందిర అనుమతి కోరాడు. అయితే గట్టిగా వద్దని చెప్పింది. "అయితే మేడమ్, దీనిని నేనెప్పుడు ప్రచురించాలి?" అని అతను అడిగాడు "నేను పోయిన చాలా కాలానికి, నీ జుట్టు తెల్లబడిన తర్వాత" అని ఆమె జవాబిచ్చింది

కాని "ఫాలెన్ ఓక్స్" అనే తన పుస్తకంలో 1972లో ఆండ్రె మార్లరా, ఈ విషయం తెలియజేశాడు డి గాల్ మరణానికి ముందు మార్ల్ రా ఇందిరా గాంధిని గురించి జనరల్ ఏమనుకొంటున్నాడని అడిగాడు ఆ గొప్ప వ్యక్తి ఈ విధంగా సమాధానమిచ్చాడు "ఆ విశాల భారతదేశం అదృష్టం ఆ నాజూకైన భుజాలమీద

ఉంది కాని ఆ భారంతో ఆ భుజాలు కుంచించుకుపోవు."

**తండ్రితో పోలిక**

తన తండ్రి "రాజకీయాలలోకి దారితప్పి వచ్చిన సాధువ"ని ఇందిర చాలా సార్లు తన తండ్రి గురించి చెప్పింది అగ్రస్థానంలో ఉండటానికి శ్రమపడవలసిన అవసరం లేనందున" తన శత్రువులపట్ల కూడా ఉదారంగా" ఉండగలిగేవాడు. తన స్థితికి దానికి భిన్నమని ఆమె సూచించింది తన దారిలో "ప్రతి అంగుళమూ పోరాడవలసి వచ్చింది." తనని తాను సమర్థించుకొనే ప్రయత్నమిదని తెలుస్తూనే ఉంది. చాలామంది దీనితో అంగీకరించలేదు. కాని ఈ దేశానికున్న ప్రధానమంత్రులందరికంటె ఆమె గొప్పదని, తన తండ్రిని కూడా మించిపోయిందని నమ్మే భారతీయులు చాలామంది ఉన్నారు

సమకాలీన చరిత్రను అధ్యయనం చేసేవాళ్ళెవ్వరూ దీనిని సమర్థించరు కాని ఆండ్రె బెటితే "ఎకనామిక్ అండ్' 'పొలిటికల్ వీక్లీ" లో వ్రాసిన వ్యాసంలో కొందరు నమ్మినట్లు "భారత దేశానికున్న చివరి ప్రధానమంత్రి" ఇందిర అనే విషయాన్ని గుర్తించాడు

రెండు తరాల పాటు భారతీయులు అత్యంత నాగరికమైన నెహ్రూపాలన చూశారు ఆయన కూడా తన ప్రయత్నాలు "తిరోగమన" శక్తులు, "అభివృద్ధి నిరోధకులు" అడ్డుకొంటే తన కూతురికున్నంత ఓపిక కూడా చూపించేవాడు కాదు కాని తాత్కాలికంగానైనా ఏ లక్ష్యానికైనా ప్రజాస్వామ్యపధాన్ని తన కూతురులాగ వదలకలిగే వాడు కాదు అలహాబాదు తీర్పు తర్వాత, ఎమర్జెన్సీ ముందు జూన్ 1975 లో ఇందిర పదవినుండి తొలగటానికి నిరాకరించినపుడు నేను బొంబాయిలో యధాలాపంగా ప్రముఖుల, ఆలోచనాపరుల అభిప్రాయాన్ని సేకరించాను. "ఇటువంటి పరిస్థితులలో నెహ్రూ అయితే ఏమి చేసేవాడు?" అనేదే నా ప్రశ్న. నా ప్రశ్నకు 36 మంది ఒకే విధంగా జవాబిచ్చారు. నెహ్రూ అయితే "ముప్పయి సెకండ్లలో రాజీనామా ఇచ్చేవాడు." ఇందిర నెహ్రూ తర్వాతే రెండో స్థానం పొందటానికి ఇది ప్రముఖ కారణమనవచ్చు. అంతేగాక నెహ్రూ ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోటానికి సంస్థలు నిర్మిస్తే ఇందిర ఇవి క్షీణించటం

లాభదాయకమని ఊరుకొంది పరిస్థితిని బాగుచెయ్యటానికి ఏ ప్రయత్నమూ చెయ్యలేదు

కానీ నాణేనికి మరో వైపు కూడా ఉంది. నెహ్రూకున్న స్వప్నదృష్టి ఇందిరకు లేదనటంలో సందేహం లేదు ఆయనకు చరిత్రపట్ల ఉన్న అవగాహన, ప్రజాస్వామ్య ప్రమాణాలపట్ల గల అత్యంత గౌరవం కూడా ఈమెకు లేవు కాని అధికారానికున్న పాత్రను అర్థం చేసుకొని, దానిని వాడటానికి సిద్ధంగా ఉండటంలో, అది దేశంలోనైనా, దేశం బయట అయినా, ఆమె తన తండ్రిని ఎన్నో మైళ్ళు వెనక విడిచి పెట్టిందనవచ్చు హెన్రీ కిసింజర్ ఆమె "నిజమైన రాజకీయాలు ఆచి తూచి నడుపుతుంద"ని అనటంలో అర్థం ఇదే పి యన్ ధర్‌కు నెహ్రూ అంటే చాలా అభిమానం అయినా "ఆమె తండ్రి బంగ్లాదేశ్‌లోని క్లిష్టస్థితి, 1974లో ఆర్థిక సంక్షోభం, సిక్కిం సమస్య, అణుశక్తి విషయంలోని సందిగ్ధత వంటి పరిస్థితులలో ఆమె వ్యవహరించినంత దృఢంగా వ్యవహరించేవాడా అనేది అనుమానమే" అని అన్నాడు దీనిని శారదాప్రసాద్ చెప్పినమాటతో కలిపి చదువుకోవాలి ఇందిర అవసరమైన గట్టిదెబ్బ కొట్టినా "పదియూనిట్లతో పని జరిగేచోట్ల నూరు యూనిట్ల శక్తి వాడటం కూడా ఆమెకు అలవాటే "

### నిర్దిష్టము, శక్తిమంతము

ఈ జీవిత చరిత్ర వ్రాస్తున్న సమయంలో ఇందిరాగాంధి గురించి, ఆమె ఆదర్శాల గురించి పరిశోధన చేస్తున్న విదేశీయుల సంఖ్య చూసి ఆశ్చర్యపోయాను చాలామంది నన్ను చూడటానికి వచ్చారు వారిలో ప్రతి వ్యక్తీ "నిర్దిష్టము", "శక్తిమంతము" అనే పదాలు వాడారు ఈ నమ్మకంలో చాలా నిజముంది ఎందుకు చాలామంది ఆమె వంటి వ్యక్తి న్యూఢిల్లీలో అధికారంలో ఉండాలనుకొంటారో పై విషయం తెలియజేస్తుంది అన్ని పరిస్థితులలోనూ ఆమె బలసంపన్నంగానే ఉంది ఇక నిర్దిష్టత విషయానికి వస్తే వాస్తవికత చాలా సంక్లిష్టంగా ఉంది ఒకసారి ఆమె ఒక నిర్ణయానికి వచ్చిందంటే ఎన్ని అపాయాలున్నా ఆ నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరు కొన్ని సందర్భాలలో నిర్ణయం

తీసుకోటంలో ఆలస్యం జరిగేది. ఇక ఏ మార్గమూ లేని అనివార్య పరిస్థితులలోనే నిర్ణయం తీసుకొనేది

ఉదాహరణకు పంజాబులోని వేర్పాటువాదులతో, ఆతంకవాదులతో ముందే వ్యవహరించి ఉండవలసింది. ఆమె "చివరియుద్ధం" ఆలస్యంగా చేరినందునే అంత విధ్వంసకరంగా, విషాదంగా మారింది 1969లో కాంగ్రెసును విభజిస్తున్నప్పుడు కూడా, పార్టీ "ఐకమత్యాన్ని" కొనసాగిద్దామని చాలా సమయం వ్యర్థం చేసింది. కానీ ఇంత మాత్రంతో ఆమె సాధారణంగా నిర్దిష్టంగా పనిచేయటాన్ని కాదనలేము

చాలాకాలంగా అకాలీలు అందోళన జరుపుతున్న పంజాబీ సుబా ఏర్పాటు గురించి నిర్ణయించే కాబినెట్ కమిటీకి ఆమె అధ్యక్షురాలయినపుడు ఆమె లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో సమాచార, ప్రసార మంత్రి మాత్రమే ఆ కమిటీకి తగిన సెక్రటరీ బాగా పేరున్న ఐ ఏ యస్ అధికారి బి యస్ రాఘవన్ తగిన వ్యక్తి అని ఆమెకు సూచించటమయింది అతని నియుక్తికి ముందు అతనిని పిలిపించి పంజాబీ సుబాకోరిక విషయమై అతని అభిప్రాయం అడిగింది అతను దానిని "పూర్తిగా సమర్థిస్తున్నాన"ని తగిన కారణాలు చెప్పినపుడు ఆమె తాను కూడా ఆ నిర్ణయానికే వచ్చినట్లు సూచించింది ఆమె 20వ వర్ధంతి సందర్భంగా రాఘవన్ ఈ విధంగా వ్రాశాడు " ఆ తర్వాత కొన్ని నెలలు, సమావేశాలు, సాక్ష్యాలు నమోదు చేయటం వంటివి చేశాం. కాని ప్రారంభంలోనే కాబినెట్ కమిటీ నివేదిక నిశ్చయమై పోయింది "

రాఘవన్ వివిధ హోదాలలో ఆమె వద్ద పనిచేశాడు తన శక్తి సామర్థ్యాలతో ఆమె మెప్పును పొందాడు జనతా ప్రభుత్వం ఎమర్జెన్సీలో ఇంటలిజెన్స్ బ్యూరో, సి బి ఐ లు ఏ విధంగా పని చేశాయో విచారించేందుకు యల్ పి సింగ్ కమిటీని ఏర్పరచింది రాఘవన్ దానికి మెంబరు – సెక్రటరీ అయ్యాడు ఇది ఇందిరకు కోపం తెప్పించింది ఆమె తిరిగి అధికారంలోకి వచ్చినపుడు అతను ఆమె వద్ద పని చేశాడు ఆమె పైకి అన్ని మర్యాదలూ పాటించేది కాని అతనికి పదోన్నతితో

పెట్రోలియం సెక్రటరిగా నియమించటానికి గట్టిగా "అడ్డు" చెప్పింది "కక్ష సాధించే ఆమె నైజం" గురించి రాఘవన్ చెప్పినట్లు ఎన్నో దృష్టాంతాలలో ఇది ఒకటి.

### రెండు గొప్ప గుణాలు

ఇదివరకు నేను ఇందిరాగాంధి జీవిత కథలో ఆమె రెండు గొప్ప గుణాల గురించి వ్రాశాను అవి ఆమె జీవితంలో, వృత్తిలో అన్నిటికంటె మించినవని, స్వాతంత్ర్యం తర్వాత భారత దేశానికి నాయకత్వం వహించిన వారిలో ఆమెను ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపాయని చెప్పాను ఒకటి, పేదలపట్ల ఆమెకున్న తాదాత్మ్యం ఆమెను ఒకసారి చూడటానికి ఎంత ఎండలోనైనా, చలిలోనైనా వాళ్ళు గంటలకొద్దీ నిలబడేవారు పెద్దవేదికనుండి ఆమె మాట్లాడే మాటలు ఒకటి కూడా వాళ్ళ కర్థమయ్యేది కాదు కాని శ్రద్ధగా "వినేవారు." పేదరికాన్ని తొలగిస్తానని ఆమె చేసిన హామీకి సమానంగా ఆమె ఫలితాలు చూపించలేదని వారిలో కొందరికి తెలుసు ఆమెకు తమపట్ల శ్రద్ధ ఉందని మాత్రం నమ్మేవారు ఆమె చనిపోయిన 14 ఏండ్లకు 1998లో ఢిల్లీలో డ్రాప్సీ (ఉదరరోగము) విపరీతంగా వ్యాపించింది చాలాకుటుంబాలు వంటనూనెగా ఉపయోగించే ఆవనూనెలోఅవినీతిపరులైన కొందరు వ్యాపారస్థులవల్ల కల్తీ జరిగింది దీనితో ఎంతోమంది మృత్యువాత పడ్డారు మా ఇంట్లో పనుల్లో సాయం చేసే పేదస్త్రీలు నా భార్యతో ఎన్నోసార్లు చెప్పారు "ఇందిరమ్మ ఇలా జరగనిచ్చేది కాదు" అని

ఇంతకంటె ముఖ్యమైనది, శాశ్వతమైనది, గౌరవింపదగినది భారతదేశమన్నా, దాని సమైక్యత అన్నా, దీనిని శక్తి సంపన్నం చేయటమన్నా, మానవప్రయత్నాలున్న అన్ని దిశల్లో స్వయంశక్తిని రక్షించి, విస్తరింపజేయటమన్నా ఇందిరకున్న శ్రద్ధ అది వ్యూహసంబంధమైనా లేక వైజ్ఞానిక, ఆర్థిక, సాంస్కృతిక విషయమైనా, సాంకేతిక విషయంనుండి రాజకీయాల విషయమైనా ఆమె గాఢమైన, అచంచలమైన శ్రద్ధ కనిపిస్తుంది తన దేశ గౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని కించపరిచే

ముందు ఆమె స్వయంగా విషం తాగి మరణించగలిగేది క్లుప్తంగా చెప్పాలంటే భారతదేశమే ఆమెకు దేవుడు.

ఈ విషయం ఆమె తన విల్లులో, చివరి మరణ శాసనంలో తెలియజేసింది : "ఏ ద్వేషంకూడా నాప్రజల పట్ల,, నా దేశం పట్ల నాకున్న ప్రేమను మలినపరచలేదు; ఈ దేశాన్ని ముందుకు తీసుకుపోవాలనే నా లక్ష్యాన్ని, నా ప్రయత్నాన్ని మళ్ళించగలిగే బలం ఏ శక్తికీ లేదు. భారతీయునిగా ఉండి, ఆ విషయమై గర్వించకపోవటమనే విషయం నాకు అర్థం కాదు."

నేను కథనం ముగించిన తీరుకు రెండు భిన్నమైన ప్రతిక్రియలు కనిపించాయి ఆమె తన జీవితం అర్పించిన ఐదేండ్ల తర్వాత కూడా చాలా ఉద్రేకాలతో, వ్యక్తిగత భావాలతో విరుద్ధ భావాలు ప్రతి ఫలించాయి సమీక్షకులలో సుమారు సగంమంది నేను అనవసరంగా ఆమెను "ఎక్కువ పొగిడాన"ని ఆమె చేసిన "చెడు"కు అంత ప్రాముఖ్యమివ్వలేదని అన్నారు ఆమె దేశభక్తి గురించి కూడా కొందరు ప్రశ్నించారు మిగిలిన సగం మంది నేను ఎమర్జెన్సీని చాలా తీవ్రంగా విమర్శించానన్నారు ఇందిరాగాంధి పదవీకాలంలోని "వ్యతిరేక విషయాలను" తీవ్రంగా విమర్శించి, ఆమె దేశానికి చేసిన సేవను, మంచి పనులను పొగడటంలో చాలా "పిసినారి" గా వ్యవహరించానన్నారు. కొంతమంది భారతీయులు, భారతదేశం విషయంలో ఎక్కువ ఆసక్తిగల విదేశీయులు చాలామంది నేను నిష్పక్షపాతంగా ఉన్నానని అన్నారు ఇదివరకు భారతదేశానికి హై కమిషనరుగా పనిచేసిన సర్ జాన్ థామ్సన్ "స్కాట్స్‌మన్ ఆన్ సన్‌డే" లో ఈ విధంగా తనదైన తీరులో వ్యాఖ్యానించాడు "ఇందిరాగాంధి విషయంలో సమతుల్యంగా ఉండటం కష్టం ఇప్పటివరకు ఇందర్ మల్‌హోత్రా సాధించినంత కార్యసిద్ధి మరెవ్వరికీ లభించలేదు."

ఈరోజు, మరో పదహారేండ్ల తర్వాత ఇందిరాగాంధి విషయంలో భారతీయ దృక్పథం ఎంతో నాటకీయంగా మారింది ఇదివరకు ఆమెను విమర్శించిన వారుకూడా ఆమె తప్పులెన్ని ఉన్నప్పటికీ ఆమె ప్రశంసాపాత్రురాలని

ఒప్పుకొంటున్నారు ఇది కాల ప్రభావం కాలం గడిచేకొద్దీ అసమంజసమైన ఉద్రేకం చల్లబడి, జరిగిన విషయాలపట్ల సరయిన అవగాహన కలుగుతుంది మరింతగా జనాదరణ పొందుతున్న ఆ అపూర్వమైన నాయకురాలి గురించి నిష్పక్షపాత దృష్టితో చూడటానికి కారణం, ఆ తర్వాతి తరాలవారికి ఆమె తర్వాత వచ్చిన కనీసం పదిమంది ప్రధానమంత్రులతోనైనా పోల్చటానికి అవకాశం వచ్చింది ఆమె రెండుసార్లు పదవిలో ఉండటంలోని విరామంలో ఇద్దరు ప్రధాన మంత్రులు వచ్చారు మిగిలినవారు గడచిన రెండు దశాబ్దాలలో వచ్చారు ఏ ప్రమాణంతో చూసినా ఆమె అందరికంటే ఉన్నతంగా కనిపిస్తుంది

2005 స్వాతంత్ర్యదినం నాడు హిందుస్థాన్ టైమ్స్ ప్రజాభిప్రాయాన్ని సేకరించింది పాఠకులు ఇందిరాగాంధి భారతదేశానికున్న నాయకులందరికంటె "గొప్ప నాయకురాలు" అని తీర్పు నిచ్చారు మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ రెండో స్థానంలో ఉన్నారు ఇది తలకిందుల తీర్పు అని చెప్పక తప్పదు అభిప్రాయం తీసుకొన్న వాళ్ళలో అధిక సంఖ్యాకులు పట్టణాలలో నివసించే యువత అయితే-భారతదేశపు అంచనాలో ఇందిరాగాంధి ఎంత ఎత్తున ఉన్నదీ ఇది తెలియజేస్తుంది అదృష్టవశాత్తు ఈ దేశానికున్న మహానాయకుల పాలపుంతలో మహాత్మా, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్ ఇందిరాగాంధి కంటె ఎంతో ముందున్నారన్న మాట తథ్యం అయితే మిగిలిన వారందరికంటె ఈమె ముందుంటుంది అది చాలా కాలం కొనసాగుతుంది

సుందరయ్య గ్రంథాలయ
AC 90967
హైదరాబాద్-500 044

Printed at Shivam Offset Press, A-12/1, Naraina Indl Area Phase-I, New Delhi-110028



ఇందిరాగాంధీ గురించి ప్రజల అంచనా సమూలంగా మారినందున 1984లో ఇందిరాగాంధీ హత్య తర్వాత వెనువెంటనే వ్రాసిన ఆమె జీవితచరిత్రలు ఇప్పుడు పాతబడిపోయాయి. అప్పుడుకూడా చదువుకొన్న మధ్యతరగతి వారి ప్రతికూలమైన భావాలకు, జన బాహుళ్యానికి ఆమె పట్ల ఉన్న ఆరాధనకు మధ్య ఎంతో అగాధముండేది. భారతదేశానికున్న గొప్ప ప్రధానమంత్రులలో ఒకరయిన వారి జీవితం గురించి, ఆనాటి పరిస్థితుల గురించి ఈ పుస్తకం కొత్తవెలుగును ప్రసరింపజేస్తుంది.

భారతీయ జర్నలిస్టులలో గొప్పగా గౌరవింపబడేవారిలో ఒకరైన ఇందర్‌మల్‌హోత్రా పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తర్వాత 1949 నుండి జర్నలిజం వృత్తిలో ఉన్నారు. ముఖ్యంగా వార్తా పత్రికల జర్నలిస్టు అయినా రేడియో ప్రసారాలు, టెలివిజన్ చర్చల కార్యక్రమాలలో భారతదేశంలోను, విదేశాలలోను పాల్గొంటుంటారు. దీర్ఘకాలపు వృత్తిలో ది స్టేట్స్‌మన్ ముఖ్యమైన రాజకీయాల వ్యాఖ్యాతగా, ది టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఢిల్లీ ఎడిటరుగా ఉన్నారు. 1965 నుండి 1995 వరకు ది గార్డియన్ (లండన్, మన్‌చెస్టర్)కు వ్రాశారు. 1986-87 లో మల్‌హోత్రా నెహ్రూ ఫెలోగా ఉన్నారు. వారి ప్రచురణలో ఇదివరకు వ్రాసిన ఇందిరాగాంధీ జీవితచరిత్ర (హోడ్డర్ అండ్ స్టేటన్, 1989) డైనాస్టీస్ అఫ్ ఇండియా అండ్ బియాండ్ (హార్టర్ కోలిన్స్ ఇండియా, 2003) ఉన్నాయి.

డాక్టర్ జె. భాగ్యలక్ష్మి ఇంగ్లీషు తెలుగు భాషలలో పేరున్న రచయిత్రి. వీరి రచనలలో కథలు, కవితలు, సాహిత్యవిమర్శ, అనువాదాలు ఉన్నాయి.

రూ. 70.00 ISBN 978-81-237-5285-

నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా